# మార్క్స్
# ఎంగెల్స్
## సంకలిత రచనలు

సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!

# కార్ల్ మార్క్స్
# ఫ్రెడరిక్ ఎంగెల్స్

## సంకలిత రచనలు

### భాగం IV

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో 1982

అనువాదం: నిడమర్తి ఉమారాజేశ్వరరావు

ఏటుకూరి బలరామమూర్తి

К. Маркс, Ф. Энгельс

ИЗБРАННЫЕ ПРОИЗВЕДЕНИЯ

Часть IV

*на языке телугу*

K. Marx, F. Engels

SELECTED WORKS

part IV

*in Telugu*

వెల: రు. 3–00

© తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1982

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

МЭ $\frac{10101\text{-}048}{016(01)\text{-}82}$ 733—82

0101010000

# విషయసూచిక

ఫ్రెడరిక్ ఎంగెల్స్. లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి (అను: ఏటుకూరి బలరామమూర్తి) . . . . . . 7

ముందుమాట . . . . . . . . . . . . . . 7

లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి . 9

I. . . . . . . . . . . . . . . 9

II. . . . . . . . . . . . . . . 19

III. . . . . . . . . . . . . . . 29

IV. . . . . . . . . . . . . . . 37

ఫ్రెడరిక్ ఎంగెల్స్. ఫ్రాన్సు, జర్మనీలలో రైతు సమస్య (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) . . . . . . . . . . . . 57

ఫ్రెడరిక్ ఎంగెల్స్. "ఫ్రాన్సులో వర్గపోరాటాలు (1848–1850)" అన్న కార్ల్ మార్క్స్ రచనకు ముందుమాట (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) 83

కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్. లేఖలు (అను: నిడమర్తి ఉమా రాజేశ్వరరావు) . . . . . . . . . . . . . . 107

పి. వి. అనెంకొవ్‌కి మార్క్స్, 1846, డిసెంబరు 28 . . . 107

జె. వేడిమేయర్‌కు మార్క్స్, 1852, మార్చి 5 . . . . . . 120

ఎల్. కూగెల్‌మన్‌కి మార్క్స్, 1871, ఏప్రిల్ 12 . . . . . 121

ఎల్. కూగెల్‌మన్‌కి మార్క్స్, 1871, ఏప్రిల్ 17 . . . . . 123

ఎఫ్. బోల్టేకి మార్క్స్, 1871, నవంబరు 23 . . . . 124
ఎ. బేబెల్‌కి ఎంగెల్స్, 1873, జూన్ 20 . . . . . . . 127
డబ్లియు. బ్లోస్‌కు మార్క్స్, 1877, నవంబరు 10 . . . 131
కె. కౌట్స్కీకి ఎంగెల్స్, 1882, సెప్టెంబరు 12 . . . . 132
సి. ష్మిడ్ట్‌కి ఎంగెల్స్, 1890, ఆగస్టు 5 . . . . . . . 133
ఒట్టో ఫన్ బ్యోనిగ్క్‌కు ఎంగెల్స్, 1890, ఆగస్టు 21 . . . 136
జె. బ్లోహ్‌కి ఎంగెల్స్, 1890, సెప్టెంబరు 21 . . . . . . 138
సి. ష్మిడ్ట్‌కి ఎంగెల్స్, 1890, అక్టోబరు 27 . . . . . . 141
ఎఫ్. మేరింగ్‌కి ఎంగెల్స్, 1893, జూలై 14 . . . . . . 148
డబ్లియు. బోర్గియుస్‌కి ఎంగెల్స్, 1894, జనవరి 25 . . . 154

వివరణలు . . . . . . . . . . . . . . . . . 158
పేర్ల సూచి . . . . . . . . . . . . . . . . 178

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

# లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి

## ముందుమాట

బెర్లిన్‌లో 1895లో ప్రచురితమైన "అర్థశాస్త్ర విమర్శకు చేర్పు" అనే గ్రంథానికి తను రాసిన పీఠికలో, కార్ల్ మార్క్స్, 1845లో బ్రస్సెల్సులో "జర్మన్ తత్వశాస్త్రపు సైద్ధాంతిక దృక్పథానికి విరుద్ధమైన మా ఉమ్మడి దృక్పథాన్ని" (ప్రధానంగా మార్క్స్ చేతనే వివరింపబడిన చారిత్రక భౌతికవాద దృక్పథాన్ని) "తీర్చిదిద్దేందుకూ, నిజానికి మా పూర్వ తాత్విక చైతన్యంతో అమీతుమీ తేల్చుకొనేందుకూ" మేమిద్దరం ఎలా పూనుకొన్నదీ ప్రస్తావించి యిలా పేర్కొన్నాడు: "మా యీ నిర్ణయం హేగెల్ అనంతర తత్వశాస్త్ర విమర్శ రూపంలో సాగింది. క్రౌను సైజులో రెండు పెద్ద సంపుటాలైన ఆ రాతప్రతి, వెస్ట్‌ఫాలియాలోని ప్రచురణ స్థానాన్ని ఎప్పుడో చేరుకుంది, కాని మాకు అప్పుడు, మారిన పరిస్థితుల దృష్ట్యా దాని ముద్రణకు అంతరాయం కలిగినట్లు తెలియవచ్చింది. దానితో మేమా రాతప్రతిని – మేము మా ప్రధాన లక్ష్యాన్ని, స్వయంవిశదీకరణను సాధించిన దృష్ట్యా – ఎలుకలకు ఫలహారంగా వదిలేశాం."*

పిమ్మట నలభై ఏండ్లకు పైగా గడిచాయి. మార్క్స్ చనిపోయాడు. మాలో ఏ ఒక్కరమూ తిరిగి ఆ సమస్యపై దృష్టి మళ్లించే అవకాశం లేకపోయింది. హేగెల్‌పట్ల మా వైఖరిని గురించి అనేక సందర్భాలలో వ్యక్తంచేసి ఉన్నాము. కాని ఏ ఒక్క సందర్భంలోనూ సమగ్రంగానూ, క్రమబద్ధంగానూ వ్యక్తంచేయలేదు. హేగెలియన్ తత్వశాస్త్రానికీ, మా దృక్పథానికీ, చాలా విధాలుగా మధ్యంతర గొలుసుగా ఉన్న ఫాయెర్‌బాఖ్‌ను గురించి మేము అసలే రాయలేదు.

ఈలోగా మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథానికి, జర్మనీ సరిహద్దుల అవతల, యూరప్ సరిహద్దుల అవతల, ప్రపంచంలోని అన్ని భాషలలోనూ అనుయాయులు ఏర్పడ్డారు. మరొకవైపున సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్రం విదేశాలలో, ముఖ్యంగా ఇంగ్లండు, స్కాండినేవియాలలో ఒక రకమైన పునర్జన్మను పొందుతున్నది. జర్మనీలో సైతం కొందరు

---

* రెండవ భాగంలో పేజీలు 12–13 చూడండి. – సం.

దౌర్భాగ్యులు విశ్వవిద్యాలయాలలో, తత్వశాస్త్రం పేరుతో ప్రచారంలో పెడుతున్న అరువు తెచ్చుకున్న ధోరణుల సంకలనం అనే కషాయంతో, ప్రజలు, విసుగెత్తిపోయినట్లున్నారు.

ఈ పరిస్థితులలో హెగెలియన్ తత్వశాస్త్రంపట్ల మా వైఖరి విషయమై, ఒక క్లుప్తమైన, క్రమబద్ధమైన సంగ్రథనం — ఆ తత్వశాస్త్రంనుండి మేము ఎలా ముందుకు సాగాము, ఎలా విడివడినాము అనే విషయమై — తయారుచేయటం అవసరమని అధికాధికంగా అనిపించసాగింది. అలాగే హెగెల్ అనంతర తత్వవేత్తలందరిలో హెచ్చుగా ఫాయెర్‌బాఖ్ మా ఒడుదుడుకుల కాలంలో మాపై ఎట్టి ప్రభావం కలిగించాడో, పూర్తిగా ప్రకటించుకోవటం, మేము తప్పనిసరిగా తీర్చవలసిన గౌరవ పురస్సరమైన రుణభారమని నాకు తోచింది. కనుక "Neue Zeit"[2] సంపాదకులు ఫాయెర్‌బాఖ్‌పై ష్టార్కె రచించిన గ్రంథాన్ని సవిమర్శకంగా సమీక్షించవలసిందిగా కోరిన వెంటనే నేను ఆమోదించాను. 1886 సంవత్సరపు నాలుగు, ఐదు సంచికలలో నా రచన ప్రకటించబడ్డది. దానిని కొద్దిగా సవరించి ఈ గ్రంథ రూపంలో వెలువరిస్తున్నాను.

ఈ రచనను ప్రెస్‌కు పంపేముందు, నేను మరొకసారి రాతప్రతులకై గాలించాను. 1845–46* నాటి పాత రాతప్రతిని పరిశీలించాను. అందులో ఫాయెర్‌బాఖ్‌కు సంబంధించిన భాగం పూర్తిచేయబడలేదు. పూర్తిచేయబడిన భాగంలో, మా చారిత్రక భౌతికవాద వివరణ ఉంది. అప్పటికి అర్థశాస్త్ర చరిత్రపై మా పరిజ్ఞానం ఎంత అసమగ్రంగా ఉందో ఆ అధ్యాయం తెలియజేస్తుంది. ఫాయెర్‌బాఖ్ సిద్ధాంతంపై విమర్శ అందులో అసలు లేనే లేదు కనుక ఆ ప్రతి ప్రస్తుత ప్రచురణకు నిరుపయోగం. ఇలావుండగా, మార్క్స్ యొక్క ఒక పాత రాతప్రతిలో ఫాయెర్‌బాఖ్‌పై పదకొండు సూత్రీకరణ లున్నాయి.** వాటిని అనుబంధంగా ఈ గ్రంథంలో చేర్చాము. ఆ పిమ్మట వివరించవచ్చుననే ఉద్దేశంతో విడివిడిగా రాసుకున్న నోట్సు ఇవి. ప్రచురణకొరకు ఉద్దేశితమైనవి కానేకాదు. ఐనా నూతన ప్రపంచ దృక్పథాన్ని గురించిన ప్రతిభావంతమైన బీజప్రాయమైన ప్రథమ పత్రంగా ఇది అమూల్యమైనది.

ఫ్రెడరిక్ ఎంగెల్స్

లండన్, ఫిబ్రవరి 21, 1888

F. Engels "Ludwig Feuerbach
und der Ausgang der klassischen
deutschen Philosophie," Stuttgart,
1888లో ప్రచురింపబడింది

---

* 1845–46లో మార్క్స్, ఎంగెల్స్‌లు ఇద్దరూ రచించిన "జర్మన్ సిద్ధాంతం" అనే గ్రంథం. — సం.

** కె. మార్క్స్, "ఫాయెర్‌బాఖ్‌పై సూత్రీకరణలు" (ఈ సంకలనంలోని మొదటి భాగంలో 35–38 పేజీలు చూడండి). — సం.

# లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్,
# సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి

## I

మన ముందున్న ఈ పుస్తకం* మనలను గతకాలంలోకి తీసుకువెళ్తుంది. నిజానికి ఈ అంతరం కాలం రీత్యా ఒక తరం మాత్రమే. కాని జర్మనీలోని ప్రస్తుత తరానికి యిది అప్పుడే నూరేళ్లు పాతగిలిపోయినట్లు విజాతీయంగా కనిపిస్తోంది. 1848 విప్లవానికి జర్మనీ తయారవుతున్న కాలం ఇది. ఆ తర్వాత మన దేశంలో జరిగిన ఘటనలన్నీ 1848 ఘటనల కొనసాగింపు మాత్రమే. విప్లవంయొక్క ఆఖరు ఆదేశ పత్రాన్ని, మరణ శాసనాన్ని అమలు జరపటం మాత్రమే.

ఫ్రాన్సులో 18వ శతాబ్దిలో జరిగినట్లుగానే, జర్మనీలో 19వ శతాబ్దిలో, రాజకీయ పతనానికి ముందుగా తాత్విక విప్లవం వచ్చింది. కాని ఈ రెండూ ఎంత భిన్నంగా కనిపిస్తున్నాయి! ఫ్రెంచివారు అధికార వర్గానికి చెందిన యావత్తు శాస్త్రానికీ వ్యతిరేకంగా, చర్చికీ వ్యతిరేకంగా, తరచు రాజ్యానికి సైతం వ్యతిరేకంగా బహిరంగ పోరాటం సాగించారు. వారి రచనలు సరిహద్దులకు ఆవల, హాలండ్‌లోనో, ఇంగ్లండులోనో అచ్చువేయబడ్డాయి. తరచు వారు బాస్టీల్‌లో ఖైదు చేయబడే ప్రమాదానికి గురిఅవుతూ వచ్చారు. ఇందుకు భిన్నంగా జర్మన్లు యువజనులకు బోధచేసేందుకు ప్రభుత్వంచే నియమితులైన ప్రొఫెసర్లు; వారి రచనలు అధికారపూర్వక పాఠ్యగ్రంథాలు; ఈ పరిణామానికంతా, పరాకాష్ఠయైన — హేగెలియన్ ఆలోచన వ్యవస్థ — దాదాపు రాచరిక ప్రష్యన్ తత్వశాస్త్ర స్థాయికి, ఆరోహణ పొందింది! ఇట్టి ప్రొఫెసర్ల చాటున, పాండితీప్రకర్షకమైన అస్పష్టమైన వారి పదజాలం చాటున, విసుగు కల్గించే భారమైన వారి వాక్యాల మరుగున విప్లవం దాక్కోగలదా? ఆనాడు విప్లవ ప్రతినిధులుగా భావించబడిన ఉదారవాదులేకదా, బుర్రను గందర

---

* "లుడ్విగ్ ఫాయెర్‌భాఖ్," సి. యన్. ష్టార్కె, పిహెచ్. డి., ష్టుట్‌గార్ట్, ఫెర్డ్. ఎన్కె, 1885.

గోళపరిచే ఆ తత్వశాస్త్రాన్ని అతి తీవ్రంగా వ్యతిరేకించినది! కాని ఈ వాస్తవాన్ని ప్రభుత్వం గాని, ఉదారవాదులు గాని గుర్తించలేదు. ఈ అంశాన్ని 1833 నాటికే గుర్తించినవాడు ఒకడున్నాడు. అతడెవరోకాదు — హైన్‌రిఖ్ హైనె.[3]

ఒక ఉదాహరణను తీసుకుందాం. సంకుచితబుద్ధి కలిగిన ప్రభుత్వాల ప్రశంసలకూ, అంతే సంకుచితబుద్ధి కలిగిన ఉదారవాదుల ఇంతకన్న ఎక్కువ ఆగ్రహానికీ గురిఐన తాత్విక సూత్రీకరణ ఈకింది వాక్యం కంటె మరొకటిలేదు. హేగెల్‌యొక్క ప్రసిద్ధి చెందిన ఆ వాక్యం ఇది:

> "వాస్తవమైన ప్రతిదీ హేతుబద్ధమైనది, హేతుబద్ధమైన ప్రతిదీ వాస్తవమైనది."[4]

వాస్తవానికి ఈ వాక్యం, యథాతథ పరిస్థితికి ఒక సమర్థన అన్నట్లుంది. నిరంకుశత్వానికి, పోలీసు ప్రభుత్వానికి, స్టార్ ఛేంబరు విచారణలకు, సెన్సారు నిబంధనలకు, తాత్విక ఆశీర్వచన. మూడవ ఫ్రెడరిక్ విల్‌హెల్మ్, అతని ప్రజలు ఈ వాక్యాన్ని అలాగే అర్థం చేసుకున్నారు. కాని హేగెల్ దృష్టిలో, అస్తిత్వంలోవున్న ప్రతిదీ తప్పనిసరిగా వాస్తవం కాదు. అందుకు మరికొంత వివరణ ఇవ్వబడ్డది. హేగెల్ దృష్టిలో, ఆవశ్యకత అనే లక్షణాన్ని కూడా కలిగి ఉన్న అంశమే వాస్తవికతా నిర్వచనానికి అర్హత కలిగి ఉన్నది:

> "తన పరిణామ క్రమంలో, వాస్తవికత ఆవశ్యకతగా నిరూపణ పొందుతుంది."

ఒక నిర్దిష్టమైన ప్రభుత్వ చర్య ఎట్టి విశేషణా లేకుండా దానంతటకదే వాస్తవమైపోదు. "ఒక పన్నుల నిబంధన"ను ఈ సందర్భంలో హేగెల్ పేర్కొన్నాడు. ఏదైతే అవసరమో, అది చిట్టచివరకు హేతుబద్ధమైనది, అని కూడా నిరూపణ ఔతుంది. ఆనాటి ప్రష్యన్ రాజ్యానికి వర్తింపచేసినట్లయితే, హేగెలియన్ సూత్రీకరణకు అర్థం ఇది. ఈ రాజ్యం హేతుబద్ధమైనది. ఆవశ్యకత కలిగి ఉన్న మేరకు అది సబబైనది. ఐనప్పటికీ, అది దుష్ట స్వభావాన్ని కలిగి ఉన్నట్లు మనకు కనిపించినట్లయితే, దుష్ట స్వభావాన్ని కలిగి ఉండి కూడా, అది కొనసాగుతున్నట్లయితే, అప్పుడు ప్రభుత్వంయొక్క ఈ దుష్టత్వం కూడా సమర్థనీయమే అవుతుంది. ప్రజలలోని దుష్ట స్వభావానికి ప్రతిబింబంగా మనం దానిని అర్థం చేసుకోవాలి. ఆనాటి ప్రష్యన్ ప్రజలు, తమ యోగ్యతకు తగిన ప్రభుత్వాన్నే కలిగి ఉన్నారన్నమాట.

కాగా హేగెల్ దృష్టిలో, వాస్తవికత అనేది, ఏదో ఒక సాంఘిక, రాజకీయ వ్యవస్థకు అన్ని పరిస్థితుల్లోనూ, అన్ని కాలాల్లోనూ అనుబంధితమైన విశేషణ మేమీ కాదు. తద్వి

రుద్ధమైనది. రోమన్ రిపబ్లిక్ ఒక వాస్తవం, దానిని తొలగించి ఆ స్థానం ఆక్రమించిన రోమన్ సామ్రాజ్యమూ వాస్తవమే. 1789లో ఫ్రెంచి రాచరిక వ్యవస్థ పూర్తిగా అవాస్తవికమై పోయింది. అనగా దాని ఆవశ్యకత నశించింది. అది హేతువిరుద్ధమైపోయింది. ఫ్రెంచి మహా విప్లవం దానిని ధ్వంసం చేయవలసివచ్చింది. ఫ్రెంచి మహా విప్లవాన్ని గురించి హేగెల్ ఎల్లప్పుడూ అత్యుత్సాహంతో ప్రస్తావిస్తూవచ్చాడు. ఈ సందర్భంలో, రాచరికం అవాస్తవికమైనది, విప్లవం వాస్తవమైనది; కనుక పరిణామ క్రమంలో, అంతకుపూర్వం వాస్తవమైనది అంతా, అవాస్తవమై పోతుంది. దాని ఆవశ్యకతను పోగొట్టుకుంటుంది. అస్తిత్వ హక్కును, హేతుబద్ధతను కోల్పోతుంది. కుళ్లిపోయిన వాస్తవికత స్థానంలో, ఒక నూతనమైన, విజయావకాశం కలిగిన వాస్తవికత ఆవిర్భవిస్తుంది. ఎట్టి పెనుగులాటా లేకుండా మరణించగల విజ్ఞత పాతదానికుంటే, ఈ మార్పు శాంతియుతంగా జరుగుతుంది. ఈ ఆవశ్యకతను పాతది ప్రతిఘటించినట్లయితే, బలప్రయోగంతో ఈ మార్పు జరుగుతుంది. కనుక హేగెలియన్ గతితర్కమే, హేగెలియన్ సూత్రీకరణకు విరుద్ధం అవుతుంది. మానవ చరిత్రలో వాస్తవమైనదంతా, కాలక్రమంలో హేతువిరుద్ధమైన దౌతుంది. దాని ప్రయాణ క్రమంలోనే హేతువిరుద్ధత సంక్రమిస్తుంది. ముందుగానే హేతువిరుద్ధతతో అది పంకిలమై ఉంది. మానవుల మెదడులో హేతుబద్ధమైన ప్రతిదీ, వాస్తవమై తీరుతుంది. ఆనాటి కుండే వాస్తవికతకు అది ఎంత విరుద్ధమైనదిగా ఉన్నాసరే ఇది జరిగితీరుతుంది. హేగెలియన్ ఆలోచనా పద్ధతిలోని నిబంధన లన్నిటికీ అనుగుణంగా, వాస్తవమైన ప్రతి అంశం యొక్క హేతుబద్ధత, దాని వ్యతిరేక సూత్రీకరణగా పర్యవసిస్తుంది; అస్తిత్వంలో వున్న ప్రతిదీ నాశనం గాక తప్పదు.*

మానవ ఆలోచన, కార్యాచరణల ఫలితంగా ఏర్పడే అన్ని అంశాల శాశ్వతత్వానికీ చావు దెబ్బ కొట్టడంలోనే హేగెలియన్ తత్వశాస్త్రపు నిజమైన ప్రాధాన్యత, విప్లవ స్వభావం ఇమిడి ఉన్నది (కాంట్ తర్వాత కొనసాగిన యావత్తు ఉద్యమానికీ పరాకాష్ఠ ఐన ఈ అంశానికే మనం ఇక్కడ పరిమితమై ఉండాలి). తత్వశాస్త్ర అన్వేషణ లక్ష్యమైన సత్యం, హేగెల్ చేతులలో సిద్ధంగా వున్న పిడివాద ప్రకటనల సముదాయం కాదు. ఒకసారి ఆవిష్కరింపబడి, తర్వాత కేవలం కంఠోపాఠంగా నేర్చుకుంటూ ఉండే విషయం యిక నెంత మాత్రమూ కాదు. సత్యం, గ్రహణ క్రమంలోనే, సుదీర్ఘమైన విజ్ఞానశాస్త్ర చారిత్రకాభివృద్ధిలో ఉంది. ఈ విజ్ఞానశాస్త్రం, కింది స్థాయినుండి, పైస్థాయికి చెందిన జ్ఞానాన్ని చేరుకుంటూ వుంటుంది. కాని అది ఎక్కడికి చేరితే తాను సాధించిన అఖండ సత్యాన్ని

---

* గ్యోతే ''ఫౌస్టు''లోని మెఫిస్టోఫిలిస్ మాటల భావార్థం, 1వ భాగం, మూడవ రంగం (ఫౌస్టు అధ్యయన గది). — సం.

చూస్తూ, చేతులు ముడుచుకు కూర్చోవడం తప్ప యిక ఆపైన ముందుకు పోలేదో, ఎక్కడైతే తానిక చేయవలసిందేమీ ఉండదో, ఆ అఖండ సత్యమని చెప్పబడేదాన్ని మాత్రం ఎప్పటికీ చేరుకోదు. తాత్వికజ్ఞానం విషయంలో ఏది వర్తిస్తుందో, ఇతర అన్ని రకాల జ్ఞానం విషయంలోనూ, ప్రత్యక్ష కార్యాచరణకూ అదే వర్తిస్తుంది. లోపరహితమూ, ఆదర్శప్రాయమూ ఐన మానవ సమాజంలో, అంతిమ దశకు జ్ఞానం ఎలా చేరుకోలేదో, చరిత్ర కూడా అదేవిధంగా చేరుకోలేదు. లోపరహితమైన సమాజం, లోపరహితమైన ''రాజ్యం,'' కేవలం ఊహలో మాత్రమే ఉండగల విషయాలు. తద్విరుద్ధంగా ఒకదాని తరువాత మరొకటిగా వచ్చే చారిత్రక వ్యవస్థలన్నీ, కింది స్థాయినుండి, పై స్థాయికి మానవ సమాజపు అనంతమైన పరిణామ క్రమంలో మధ్యంతర దశలు మాత్రమే. ప్రతి దశా అవసరమే. కనుక తత్కాలానికి, దాని పుట్టుకకు సంబంధించిన పరిస్థితుల దృష్ట్యా అది సమర్థనీయమైనదే. కాని, దాని గర్భంలోనే క్రమంగా అభివృద్ధి చెందే నూతనమైన, ఉన్నతమైన పరిస్థితుల దృష్ట్యా, అది తన ఉనికియొక్క సమర్థనీయతను, అర్హతను కోల్పోతుంది. అది మరల తనవంతు వచ్చినప్పుడు ఉన్నతమైన దశకు చోటిచ్చి తప్పనిసరిగా తొలగిపోవాల్సి వుంటుంది. కాలక్రమంలో ఆ ఉన్నతదశ సైతం క్షీణించి నశించిపోతుంది. భారీ పరిశ్రమలు, పోటీ, ప్రపంచ మార్కెట్ల ద్వారా, బూర్జువావర్గం, స్థిరమైన, సాంప్రదాయకంగా గౌరవనీయమైన అన్ని వ్యవస్థలనూ ఆచరణలో నాశనం చేసినట్లే, ఈ గతితార్కిక తత్వశాస్త్రం, స్థిరమైన, అఖండ సత్యాన్ని గురించిన భావన లన్నింటినీ, వానికి సంబంధించిన మానవ సమాజంయొక్క అఖండ దశలన్నిటినీ, నాశనం చేస్తుంది. దీనికి (గతితార్కిక తత్వశాస్త్రానికి) శాశ్వతమూ, అఖండమూ, పవిత్రమూ అంటూ ఏదీ లేదు. ప్రతి దశయొక్క, ప్రతి దశలోని పరివర్తనాశీలతను అది బహిర్గతం చేస్తుంది. పాతది నశించుట, కొత్తది రూపొందుట అను నిరంతరాయమైన పరిణామక్రమం తప్ప, కింది స్థాయినుండి, పైస్థాయికి సాగే అనంతమైన ఊర్ధ్వ గమనం తప్ప, దీనిముందు ఏదీ నిలబడలేదు. గతితార్కిక తత్వశాస్త్రం అంటే, ఆలోచనాశీలమైన మెదడులో, ఈ పరిణామక్రమంయొక్క కేవల ప్రతిబింబం. అంతకంటే మరేమీకాదు. అయితే, ఇందులో ఒక ఛాందస పార్శ్వం కూడా ఉంది. సమాజంయొక్క, జ్ఞానంయొక్క నిశ్చితమైన దశలు, తత్కాలానికి, ఆ పరిస్థితులలో సమర్థనీయమైనవేనని ఇది గుర్తిస్తుంది. అయితే అంతవరకు మాత్రమే. ఈ ఆలోచనా క్రమంయొక్క ఛాందసం సాపేక్షమైనది, దాని విప్లవ స్వభావం శాశ్వతమైనది – గతితార్కిక తత్వశాస్త్రం ఆమోదించే ఏకైక శాశ్వతత్వం యిదే.

ప్రకృతి విజ్ఞానశాస్త్రాల ప్రస్తుత అభివృద్ధి దశకు, ఈ ఆలోచనా పద్ధతి పూర్తిగా అనుగుణమైనదా, కాదా అనే ప్రశ్నలోకి మన మిప్పుడు వెళ్లనక్కరలేదు. ఈ ఆలోచనా పద్ధతి, ఈ భూమికి సైతం అంతమంటూ ఉండవచ్చుననీ, దీనిపైన గల జీవకోటికి

తప్పనిసరిగా ఒక అంతముంటుందనీ కూడా తెలియజేస్తుంది. కనుక మానవ చరిత్రకు సైతం, ఆరోహణా శాఖ మాత్రమేకాక, అవరోహణా శాఖ కూడా ఉన్నదని గుర్తిస్తుంది. ఏమైనప్పటికీ, సమాజంయొక్క చారిత్రక పరిణామక్రమం అవరోహణా దశకు మార్పు చెందే స్థితికి మనం ఇంకా చాలా దూరంలో ఉన్నాము. తన కాలంలో ప్రకృతి విజ్ఞానశాస్త్రం సైతం ముందుకు తీసుకురాని అంశాన్ని హేగెలియన్ తత్వశాస్త్రం ప్రస్తావించగలదని మనం ఆశించరాదు.

కాని ఇక్కడ మనం తప్పనిసరిగా చెప్పవలసిన అంశం ఒకటి ఉంది. పైన చెప్పిన భావాలు, హేగెల్‌లో అంత ఖచ్చితంగా రూపొందలేదు. ఆయన ఆలోచనా క్రమంలోనుండి అనివార్యంగా ఉద్భవించే నిర్ణయాలు మాత్రమే అవి, అయితే ఇంతటి స్పష్టతతో ఈ నిర్ణయాలను స్వయంగా ఆయన ఎన్నడూ రాబట్టలేదు. ఇందుకు ఒక కారణం ఉంది. ఆయన ఒక ఆలోచనా వ్యవస్థను రూపొందించవలసి వచ్చింది. సాంప్రదాయిక నియమాల ననుసరించి ఒక తాత్విక వ్యవస్థ, ఏదో ఒకరకమైన అఖండ సత్యంతో ముగియక తప్పదు. కనుక, శాశ్వత సత్యమనేది తార్కిక, లేక చారిత్రక పరిణామక్రమం తప్ప మరేమీకాదు అని హేగెల్, ముఖ్యంగా "తర్కం" అనే తన పుస్తకంలో ఎంతగా నొక్కి చెప్పినప్పటికీ, ఈ పరిణామక్రమానికి ఒక ముగింపు ఇవ్వక అతనికి తప్పిందిగాదు. ఎక్కడో ఒకచోట ఈ వ్యవస్థకొక అంతాన్ని సూచించకతప్పదు కనక అలా చేయవలసి వచ్చింది. తన "తర్కం"లో ఈ ముగింపునే, ఒక కొత్త ప్రారంభంగా చేయవచ్చు. ఏమంటే ఇక్కడ తుది అంశమైన అఖండభావం అన్యథాకరణ పొందుతుంది. అనగా అది ప్రకృతిలోకి పరివర్తనచెంది, తిరిగి మనస్సులోకి, ఆలోచనలోకి, చరిత్రలోకి పునః ప్రవేశిస్తుంది. ఇది అఖండ భావ మెలా అయింది? దీని విషయమై అతను చెప్పగలిగింది ఏమాత్రమూ లేదు గనక. యావత్తు తత్వశాస్త్రం ఆఖరు దశ చేరుకున్నమీదట ఒకేఒక మార్గంలో తిరిగి మొదటికి చేరుకోవటం సాధ్యం. చరిత్ర ముగింపును ఈ కింది విధంగా భావిస్తే అది సాధ్యం. అదే అఖండ భావాన్ని గుర్తించే దశకు మానవ సమాజం చేరుకుంటుంది. అఖండ భావానికి సంబంధించిన ఈ గుర్తింపు హేగెలియన్ తత్వశాస్త్రం ద్వారా సాధ్యమైందని ప్రకటిస్తుంది. ఈ విధంగా హేగెలియన్ ఆలోచనా పద్ధతిలోని యావత్తు పిడివాదసారం అఖండ సత్యంగా ప్రకటించబడ్డది. తద్విరుద్ధంగా పిడివాదాన్నంతా రద్దుచేసే గతితర్కం విసర్జించబడ్డది. ఛాందస వాద పార్శ్వపు బరువుకింద విప్లవకర పార్శ్వం అణచివెయ్యబడింది. తాత్విక ప్రజ్ఞానానికి ఏది వర్తిస్తుందో, అదే చారిత్రక ఆచరణకూ వర్తిస్తుంది. మానవసమాజం హేగెల్ రూపంలో, అఖండ భావాన్ని గుర్తించే దశకు చేరుకున్నది. అట్టి మానవసమాజం ఈ అఖండ భావాన్ని ఆచరణసాధ్యం చేసే స్థితికి కూడా చేరుకుంటుంది కనుక, సమకాలీన పరిస్థితులపై అఖండ భావానికి సంబంధించిన ఆచరణాత్మకమైన, రాజకీయ డిమాండ్లను

మరీ అంతగా సాగదీయ నక్కరలేదు. కనుకనే, ''న్యాయశాస్త్ర తత్వం'' అనే పుస్తకం ఆఖరున, అఖండ భావం రాచరికంలోనే అమలుజరుగుతుందనే నిర్ణయం ఉంది. ఈ రాచ రికం సామాజిక శ్రేణులపై ఆధారపడి ఉంటుందని మూడవ ఫ్రెడరిక్ విల్‌హెల్మ్, తన ప్రజలకు ఎంతగానో వాగ్దానంచేశాడు. ఆనాటి పెటీబూర్జువా జర్మన్ పరిస్థితుల కనుగుణంగా, ఆస్తిపర వర్గాలయొక్క, పరిమితమైన, మితవాద స్వభావం కలిగిన, పరోక్ష పరిపాలన స్థాపిస్తాను అనేదే ఆ వాగ్దానం. ఇది నిరర్థకమైన వాగ్దానమని రుజువైంది. అంతేకాదు, కులీన ప్రభువర్గ ఆవశ్యకత మనకు సైద్ధాంతిక పద్ధతిలో నిరూపించబడ్డది.

సమగ్రమైన విప్లవ ఆలోచనా క్రమం, అత్యంత మితవాద రాజకీయ నిర్ణయాలకు ఎలా దారితీసిందో ఆ వ్యవస్థలోని అంతరంగిక ఆవశ్యకతలే సమర్థవంతంగా నిరూపిస్తు న్నాయి. నిజానికి, ఈ నిర్ణయం ఈ నిర్దిష్ట రూపంలో రావటానికి కొన్ని కారణాలున్నాయి. హెగెల్ జర్మన్ జాతీయుడు. తన సమకాలీనుడయిన గ్యోతే వలెనే, హెగెల్‌కు కూపస్థమం డూకాలవంటి వారితో కూడిన పెద్ద అనుచరవర్గం వుంది. హెగెల్, గ్యోతేలు ఉభయులూ ఒక్కొక్కరు తమ ప్రత్యేక రంగాలలో బృహస్పతిలాంటివారు. కాని వీరిలో ఏ ఒక్కరూ కూడా జర్మన్ కూపస్థమండూక స్థితినుంచి పూర్తిగా విముక్తులు కాలేదు.

ఈ పరిమితు లెన్ని ఉన్నా హెగెలియన్ తాత్విక పరిశీలనా పద్ధతి, అతఃపూర్వమున్న ఏ పద్ధతి కూడా అధ్యయనం చేయనంతటి విస్తారమైన పరిధిని ఆవరించింది. ఈ రంగంలో అపారమైన జ్ఞానసంపదను పోగుచేసింది. ఈనాటికీ ఇది సంభ్రమాశ్చర్యాలను కలిగించే విషయం. మానవ దృగ్విషయ శాస్త్రం (మానసిక దృగ్విషయ శాస్త్రాన్ని – మనస్సుకు సంబంధించిన పిండోత్పత్తి శాస్త్రంతోను, పురా జీవశాస్త్రంతోను పోల్చవచ్చు, వివిధ దశలలో వైయక్తిక చైతన్యాభివృద్ధిని ఇది వివరిస్తుంది, చరిత్ర గమనంలో మానవ చైతన్యం ఏఏ దశలను అధిగమించిందో, వాటన్నిటినీ సంక్షిప్త రూపంలో పునరావృత్తం చేసి చూపు తుంది), తర్కం, ప్రకృతి సంబంధమైన తత్వశాస్త్రం, మానసిక తత్వశాస్త్రం, అందులో తిరిగి చారిత్రక ఉప విభాగాలైన చారిత్రక హక్కుల, మత తత్వశాస్త్రాలు, తత్వశాస్త్ర చరిత్ర, సౌందర్య తత్వశాస్త్రం, ఇలా వివిధానేక విభాగాలలో హెగెల్ శ్రమచేశాడు. వీనిలోని అంతర్గత అభివృద్ధి సూత్రాన్ని కనుగొనేందుకు, నిరూపించేందుకు శ్రమించాడు. హెగెల్ కేవలం సృజనశీలుడైన మహా మేధావి మాత్రమే కాదు. అపారమైన విజ్ఞాన సర్వస్వ ప్రాయమైన పాండిత్యం కలిగిన మనిషి కనుక, ఆయన ప్రతి రంగంలోనూ యుగకర్తృక పాత్ర నిర్వర్తించాడు. ''వ్యవస్థ''యొక్క అవసరాల దృష్ట్యా ఆయన తరచు తప్పనిసరై కొన్ని సూత్రీకరణలు చేయవలసివచ్చింది. వీటిపై మరుగుజ్జులైన ఆయన ప్రత్యర్థులు ఈ నాటికీ పెద్ద హంగామాచేస్తూ వుండవచ్చుగాక. కాని ఈ సూత్రీకరణలు ఆయన మహానిర్మా ణంలోని చట్రాలు, ఊత స్తంభాలు మాత్రమే. వీటిని చూస్తూ అనవసర కాలహరణం

చేయకుండా, ఆ మహాసౌధంలోకి ముందుకు సాగితే, అపారమైన నిధులు మనకు కనిపిస్తాయి. ఈనాటికీ ఏమాత్రమూ తరగని కాంతితో అవి ప్రకాశిస్తున్నాయి. అందరి తత్వవేత్తల విషయంలోనూ జరిగేదేమంటే, వారు సృష్టించిన ఆలోచనా వ్యవస్థ తప్పనిసరిగా నశించే లక్షణాన్ని కలిగి ఉంటుంది. ఏమంటే అన్ని వైరుధ్యాలనూ అధిగమించాలనే మానవుని అవినాశమైన మానసిక ఆకాంక్షనుండి, ఈ ఆలోచనా వ్యవస్థ ఉద్భవిస్తుంది కనుక. కాని అన్ని వైరుధ్యాలూ ఒకేసారి శాశ్వతంగా పరిష్కారమైతే, మనం శాశ్వత సత్యం అనబడే స్థితికి చేరుకుంటాము. ప్రపంచ చరిత్ర ముగింపుకు వస్తుంది. కాని చేయవలసిందేమీ లేకపోయినా ప్రపంచ చరిత్ర కొనసాగుతూనే ఉండాలి కదా. కనుక, ఇదొక పరిష్కరింప వీలులేని కొత్త వైరుధ్యం. మనం ఈ విషయాన్ని గ్రహించా మనుకోండి. దూర దృష్టితో చూస్తే ఈ విషయాన్ని గ్రహించడానికి, ఏ ఇతర తత్వవేత్త కంటె హెచ్చుగా హెగెల్ కృషి చేశాడు. అప్పుడు ఏమి జరుగుతుంది? నిరంతర చారిత్రక క్రమాభివృద్ధిలో యావత్తు మానవజాతి మాత్రమే సాధించగలిగిన లక్ష్యాన్ని ఒక్క తత్వవేత్త మాత్రమే సాధించాలని కోరుకుంటున్నా మన్నమాట. ఈ స్థితికి చేరామంటే, ఇంతవరకు మనకు తెలిసిన అర్థంలో తత్వశాస్త్రం అంతమైనట్లే. కనుక "అఖండ సత్యాన్ని" మనం వదలివేయాలి. ఈ మార్గాన గాని, లేక ఏదో ఒక వ్యక్తి ద్వారా గాని దీనిని మనం చేరుకోలేము. అందుకు బదులుగా, భౌతిక విజ్ఞానశాస్త్రాల పరిశోధనా క్రమంలో, మనం సాపేక్షిక సత్యాలను సాధ్యమైన మేరకు కనుక్కుంటాము. వాటి నన్నింటినీ గతితార్కిక ఆలోచనా క్రమంలో కలగలుపుతాము. ఏమైనా, హెగెల్‌తో తత్వశాస్త్రం పరిసమాప్తికి వచ్చింది. ఇందుకు కారణమేమంటే, ఒకవైపున హెగెల్, తత్వశాస్త్రంయొక్క యావత్తు అభివృద్ధినీ, అద్భుతమైన పద్ధతిలో క్రోడీకరించాడు. మరొక వైపున, బహుశా అనుకోకుండానే, ఈ ఆలోచనా పద్ధతుల పద్మవ్యూహంనుండి ప్రపంచాన్ని గురించిన నిజమైన, నిశ్చితమైన జ్ఞాన సంపాదనా మార్గాన్ని మనకు సూచించాడు.

తత్వశాస్త్ర వాసనతో గుబాళిస్తున్న నాటి జర్మనీలో హెగెలియన్ తాత్విక వ్యవస్థ ఎంతటి గొప్ప ప్రభావాన్ని కలిగించిందో మనం ఊహించుకోగలం. అదొక విజయోత్సవం. కొన్ని దశాబ్దాలు అది సాగింది. హెగెల్ మరణానంతరం సైతం అది ముగియలేదు. పైపెచ్చు సరిగ్గా, 1830–40 సంవత్సరాలలోనే అది అత్యుచ్ఛస్థాయి నందుకుంది. తన ప్రతిస్పర్థులను సైతం ఏదో మేరకు అది ప్రభావితం చేసింది. సరిగ్గా ఈ కాలంలోనే, హెగెలియన్ భావాలు, ప్రయత్నపూర్వకంగానో, అప్రయత్నంగానో, అత్యంత భిన్నమైన విజ్ఞానశాస్త్రాలలో సైతం చొచ్చుకుపోయాయి. సగటు "విద్యావంతుల చైతన్యం" దేని నుండి తన పోషకాహారాన్ని పొందుతూ ఉంటుందో, ఆ ప్రజా సాహిత్యాన్నీ, దిన పత్రికలనూ

సైతం ప్రభావితంచేశాయి. కాని యావత్తు రంగంలోనూ అవి సాధించిన ఈ విజయం, ఒక ఆంతరంగిక పోరాటానికి భూమిక మాత్రమే.

మనం ఇంతకుముందే గమనించినట్లు, హేగెల్ సిద్ధాంతాన్ని మొత్తంగా తీసుకుంటే, అది, ఆచరణలో పరస్పర విరుద్ధమైన పార్టీ దృక్పథాలకు వర్తింపగలిగే వైశాల్యాన్ని కలిగి ఉంది. ఆకాలపు జర్మన్ సైద్ధాంతిక రంగంలో అన్నిటికంటె ఆచరణశీలమైనవి రెండు: మతము, రాజకీయాలు. ఎవరైతే హేగెలియన్ వ్యవస్థకు ముఖ్య ప్రాధాన్యత ఇస్తారో, వారు పై రెండు రంగాలలోనూ చెప్పుకోదగినంత మితవాదులుగా ఉండిపోతారు. ఎవరైతే, గతి తార్కిక పద్ధతిని ప్రధానమైనదిగా పరిగణిస్తారో, వారు రాజకీయాలలోనూ, మతంలోనూ కూడా అతి తీవ్రమైన ప్రతిపక్ష ధోరణికి చెందవచ్చు. హేగెల్ సైతం తరచు తన రచనలలో వ్యక్తంచేసే విప్లవాత్మక ఆగ్రహావేశాలెలా ఉన్నా, మొత్తంమీద, మితవాద వైఖరి వైపే మొగ్గి ఉండేవాడు. నిజానికి, ఆయన పద్ధతి కంటే, ఆయన వ్యవస్థ, ఆయనకు అత్యంత "కఠినమైన మానసిక క్షోభను" చేకూర్చింది. 30 దశకం చివరకు, హేగెల్ ధోరణిలో చీలిక అధికాధికంగా స్పష్టం కాసాగింది. వామపక్ష విభాగం, యువ హేగెలియన్లుగా వ్యవహరించబడేవారు. ఛాందస ధర్మనిష్ఠ పునరుద్ధారక,[5] ఛాందస ఫ్యూడల్ అభివృద్ధి నిరోధక శక్తులతో జరిగే పోరాటంలో వారు క్రమక్రమంగా, తక్షణ ముఖ్య సమస్యపై మర్యాదతోకూడిన, తాత్విక ఉదాసీనతను విసర్జించసాగారు. ఈ ఉదాసీనతయే అంతవరకు, హేగెల్ బోధనలకు ప్రభుత్వ సహనాన్నీ, రక్షణనూ సైతం కలిగిస్తూ వచ్చింది. చివరకు 1840లో, ఛాందస ధర్మనిష్ఠ పునరుద్ధరణ ధోరణీ, ఫ్యూడల్ నిరంకుశత్వమూ నాల్గవ ఫ్రెడరిక్ విల్‌హెల్మ్ రూపంలో సింహాసనం అధిష్ఠించటంతో, బహిరంగ పాక్షికత్వం తప్పనిసరి అయింది. అప్పటికీ పోరాటం తాత్విక ఆయుధాలతోనే కొనసాగించబడ్డది. కాని ఈ పోరాటం, అనిర్దిష్టమైన తాత్విక లక్ష్యాల కొరకు జరగలేదు. సూటిగా సాంప్రదాయిక మత వ్యవస్థనూ, ఆనాటి రాజ్యాంగ యంత్రాన్నీ ధ్వంసం చేసేందుకై అది కొనసాగింది. "Deutsche Jahrbücher"[6] పత్రికలో ప్రత్యక్ష లక్ష్యాలు అప్పటికీ హెచ్చుగా తాత్విక ముసుగులోనే ప్రదర్శితమైనప్పటికీ, 1842 నాటి "Rheinische Zeitung"[7] పత్రికలో మాత్రం, యువ హేగెలియన్ విభాగం సూటిగా, అధికారం కొరకు అర్రులు చాచే, ప్రగతిశీల బూర్జువావర్గ వాణిగా బయటపడింది. అప్పటికి ఆ సున్నితమైన తాత్విక ముసుగును ఆ విభాగం వాడుకున్నదంటే, సెన్సారు నిబంధనలను తప్పించుకునేందుకు మాత్రమే.

అయితే ఆ రోజులలో, రాజకీయాలు, పెద్ద ముళ్లపొదలాగా ఉండేవి. కనుక ప్రధాన పోరాటం మతంపై కేంద్రీకరింపబడేది. ఈ పోరాటం, ముఖ్యంగా 1840నుండి, పరోక్షంగా రాజకీయ స్వభావాన్ని కూడా కలిగి ఉంది. 1835లో ప్రచురించబడిన స్ట్రౌస్

రచించిన "జీసస్ జీవితం" ఇందుకవసరమైన ప్రథమ ప్రచోదనాన్ని సమకూర్చింది. బైబిల్ బోధలలోని కట్టుకథల ఆవిర్భావాన్ని గురించిన స్ట్రౌస్ సిద్ధాంతం ఆ పిమ్మట బ్రూనో బౌవర్‌చే ఖండించబడ్డది. పెక్కు మత సంబంధమైన కథలు సువార్త రచయితలచే ఉద్దేశపూర్వకంగా సృష్టించబడిన కల్పిత గాథలనీ, బౌవర్ సోదాహరణంగా నిరూపించాడు. ఈ ఉభయుల మధ్య వివాదం "స్వయం వ్యక్తిత్వం," "సారాంశము"ల మధ్య పోరాటమైన ట్లుగా, తాత్త్విక ముసుగులో, కొనసాగింది. అద్భుత కార్యాలకు చెందిన ఈ కట్టుకథలు, అప్రయత్నంగా సాంప్రదాయిక కల్పిత గాథా సృష్టిలో భాగంగా సమాజం లోపలనే రూపొం దాయా లేక సువార్త కర్తలు తమకు తాము ఉద్దేశపూర్వకంగా వీటిని సృష్టించారా అనేది వివాదం. ఈ వివాదం ప్రపంచ చరిత్రలో, "సారాంశమా," "స్వయం వ్యక్తిత్వమా"— ఏది నిర్ణయాత్మక శక్తి అనే పెద్ద వివాదం చేయబడ్డది. చివరకు, సమకాలీన అరాజక ధోరణికి ప్రవక్త అయిన ష్టీర్నెర్ రంగంలోకి ప్రవేశించాడు. బకూనిన్ ఇతనినుండి చాలా నేర్చుకున్నాడు. సర్వం సహాధికారం గలిగిన స్వయం వ్యక్తిత్వానికి, ష్టీర్నెర్ సర్వంసహాధి కారం గల "అహం"[8] అనే తన శిరోవేష్టనాన్ని అమర్చాడు.

హేగెలియన్ ధోరణి విఘటన క్రమాన్ని గురించి మేము ఇక ఎక్కువగా ప్రస్తావించము. ఈ కింది విషయం మనకు అంతకంటె ముఖ్యమైనది. యువ హేగెలియన్లలో అత్యంత దృఢ త్వం కలిగినవారు, సూటిగా మత వ్యవస్థతో పోరాటం సాగించే ప్రత్యక్ష అవసరాల దృష్ట్యా, ఆంగ్లో-ఫ్రెంచి భౌతికవాదం వైపు నెట్టబడ్డారు. దీంతో వారు తమ హేగెలియన్ వ్యవ స్థతో సూటిగా ఘర్షణపడక తప్పలేదు. భౌతికవాదం దృష్టిలో ప్రకృతి ఏకైక వాస్తవిక విషయం. హేగెలియన్ వ్యవస్థలో, ప్రకృతి, అఖండ భావంయొక్క అన్యథాకృత ప్రతిబింబం మాత్రమే, భావంయొక్క పతన స్వరూపం. ఏ విధంగా చూసినా, ఆలోచన, ఆలోచనా ఫలిత మైన భావం, ఇక్కడ ప్రాథమికం; ప్రకృతి ద్వితీయం. భావంయొక్క దయా ధర్మాలపై ఆధారపడి ప్రకృతి అస్తిత్వంలో వుంటుంది. ఈ వైరుధ్యంలో ఇరుక్కున్న వారు సతమత మవుతున్నారు.

పిమ్మట, ఫాయెర్‌బాఖ్ రచించిన "క్రైస్తవ మత సారాంశం" అనే గ్రంథం వెలువడ్డది. ఈ గ్రంథం ఒక్క దెబ్బతో ఈ వైరుధ్యాన్ని బద్దలు చేసింది. ఎట్టి డొంకతిరుగుడూ లేకుండా, ఈ గ్రంథం భౌతికవాదాన్ని తిరిగి సింహాసనంపై ప్రతిష్ఠించింది. తత్వశాస్త్రంతో ప్రమేయం లేకుండా, ప్రకృతి స్వతంత్రంగానే అస్తిత్వంలో వుంటుంది. అది పునాది. ఆ పునాదిపై ననే ప్రకృతిలో ఉద్భవించిన మన మానవులం పెరిగాం. ప్రకృతికీ, మానవునికీ బాహ్యంగా ఏదీలేదు. మన ఊహాలోకంలో మతపరమైన అద్భుతాల ద్వారా సృష్టించుకున్న ఉన్నతస్థాయి జీవులు మన సారాంశంయొక్క ఆశ్చర్యకరమైన ప్రతిబింబాలు మాత్రమే. దీంతో భ్రమ కాస్తా బద్దలైంది. "వ్యవస్థ" ముక్కచెక్కలై, పక్కకు విసిరివేయబడ్డది. మన ఊహా

లోకంలో మాత్రమే ఉన్నదని భావించబడిన వైరుధ్యం కాస్తా కరిగిపోయింది. ఈ పుస్తకం కలిగించిన విమోచనా ప్రభావం తెలుసుకోవాలంటే స్వయంగా ఆ పుస్తకాన్ని చదివి అనుభవించవలసిందే. ఉత్సాహం సర్వత్రా ఉరకలు వేయసాగింది. మే మందరమూ వెన్వెంటనే, ఫాయెర్‌బాఖ్ అనుచరులమైపోయాం. ఈ గ్రంథాన్ని మార్క్స్ ఎంతగా అభినందించాడో, విమర్శనాత్మకమైన మినహాయింపులు ఎన్ని ఉన్నప్పటికీ, ఈ గ్రంథం ద్వారా మార్క్స్ ఎంతగా ప్రభావితుడైనాడో, తెలుసుకోవాలంటే, మార్క్స్ "పవిత్ర కుటుంబం" గ్రంథం చదవవలసిందే.

ఈ పుస్తకంలోని బలహీనతలు సైతం, అది కలిగించిన సద్యోఫలితానికి తోడ్పడింది. దాని సాహిత్య శైలి ఒక్కొక్కప్పుడు క్లిష్ట పద గుంభనతోకూడి, పుస్తకంయొక్క పాఠకుల సంఖ్యను పెంచింది. ఏమైనా చాలాకాలం, హెగెలియన్ అనిర్దిష్ట దుర్బోధక శైలితో విసిగిపోయిన పాఠకునికి కొంత ఉపశమనం కలిగించింది. ప్రేమను అతిగా ఆరాధ్య దేవతను చేయటం విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. "అకలంక హేతువాదం"యొక్క దుస్సహమైన సర్వాధికారాన్ని చాలాకాలం అనుభవించిన తర్వాత, ఈ ప్రేమారాధనను సమర్థించకపోయినా, అర్థంచేసుకోవచ్చు. కాని, మనం మరచిపోకూడని విషయం ఒకటుంది. ఫాయెర్‌బాఖ్‌యొక్క ఈ రెండు బలహీనతలనే, 1844నుండి జర్మన్ "విద్యావంతులలో" మహా మారిలాగా వ్యాపించసాగిన "అసలైన సోషలిజం"[9] తన ప్రారంభ వాదనలుగా స్వీకరించింది. ఇలా స్వీకరించటం ద్వారా ఈ ధోరణి, శాస్త్రీయ విజ్ఞానం స్థానంలో సాహిత్య పదజాలాన్ని ప్రవేశపెట్టింది. ఉత్పత్తియొక్క ఆర్థిక పరివర్తన ద్వారా కార్మికవర్గ విముక్తిని సాధించడానికి బదులు, "ప్రేమ" ద్వారా మానవాళి విముక్తిని సాధించ యత్నించింది. సూటిగా చెప్పాలంటే, కార్ల్ గ్రూన్ ద్వారా వ్యక్తీకరింపబడిన ప్రేమావేశాలకు, వెలపరం పుట్టించేటంత చక్కని రచనలకు బలైపోయింది.

మనం మరచిపోకూడని అంశం మరొకటి ఉంది. హెగెలియన్ శాఖ విచ్ఛిన్నమైపోయింది. కాని హెగెలియన్ తత్వశాస్త్రాన్ని విమర్శ ద్వారా అధిగమించడం ఇంకా జరగలేదు. ఈ తత్వశాస్త్రపు చెరి ఒక కొసనూ, ష్ట్రాస్, బౌవర్‌లు స్వీకరించారు. ఒకదానికొకటి పోటీగా వాదోపవాదాలు సాగించారు. ఫాయెర్‌బాఖ్ హెగెలియన్ వ్యవస్థను ఛేదించి, దానిని తోసిపుచ్చాడు. కాని తప్పు అని ఒకటికి రెండుసార్లు పునశ్చరణ చేసినంతమాత్రాన ఒక తత్వశాస్త్రం ఓడించబడదు. అందునా జాతియొక్క మేధోభివృద్ధిపై మహత్తరమైన ప్రభావాన్ని కలిగించిన హెగెలియన్ తత్వశాస్త్రం వంటి శక్తివంతమైన ధోరణి, కేవలం నిర్లక్ష్యం చెయ్యడం ద్వారా ఓడింపబడజాలదు. దాని స్వంత పద్ధతిలోనే, ఆ ధోరణిని "జీర్ణంచేసుకోవలసి" వుంది. అనగా దాని రూపాన్ని విమర్శ ద్వారా నాశనం చేస్తూనే, అది సృష్టించిన నూతన సారాన్ని కాపాడుకోవాలి. ఇది ఏ రకంగా జరిగిందీ మనం ముందు చూస్తాం.

ఈలోగా ఫాయెర్‌బాఖ్, హేగెల్‌ను పక్కకు నెట్టివేసినట్లే, 1848 విప్లవం తత్వశాస్త్రాన్నంతనీ నిర్దాక్షిణ్యంగా పక్కకు నెట్టివేసింది. ఈ క్రమంలో ఫాయెర్‌బాఖ్ సైతం పక్కకు నెట్టివేయబడ్డాడు.

## II

ఆలోచనకూ, అస్తిత్వానికీగల సంబంధం ఏమిటనేది, యావత్తు తత్వశాస్త్రానికీ, ముఖ్యంగా, ఇటీవలి తత్వశాస్త్రానికి, గొప్ప మౌలిక సమస్య. అతి ప్రాచీనకాలంనుండి, మానవులు, తమ శరీర నిర్మాణాన్ని గురించిన పరిపూర్ణ అజ్ఞాన ఫలితంగా, స్వప్నాలలో కనిపించే దయ్యాల* ప్రభావంతో, తమ ఆలోచనలూ, ఇంద్రియానుభూతులూ శరీర ధర్మాలు కావనీ, శరీరంలో ఉంటూ, మరణానంతరం నిష్క్రమించే విశిష్టమైన ఆత్మ ధర్మాలనీ విశ్వసించసాగారు. ఆనాటినుండి, ఆత్మకూ, బాహ్య ప్రపంచానికీ గల సంబంధాన్ని గురించి ఆలోచించవలసిన స్థితికి మానవులు నెట్టబడ్డారు. మరణానంతరం ఇది శరీరాన్ని వదలి సెలవుతీసుకుంటుంది అనీ, జీవిస్తూనే ఉంటుందనీ భావించినట్లయితే, దీనికి వేరే మరణాన్ని కల్పించవలసిన అవసరంలేదు. అమరత్వం అనే భావం ఈ విధంగా ఏర్పడ్డది. ఆ దశలో ఈ భావం ఒక సంతృప్తి కొరకు ఏర్పడింది కాదు. అదొక విధికృతమనీ, దానికి వ్యతిరేకంగా పోరాడే నిష్ప్రయోజనమనీ భావించినందువల్ల ఏర్పడింది. తరచు, గ్రీకులలో ఏర్పడినట్లుగా, అదొక అనివార్యమైన దురదృష్టంగా భావించబడ్డది. మానసిక సంతృప్తికొరకు ఏర్పడిన మతవాంఛ కాక, ఈ ఆత్మలో, శరీరం నశించిన తర్వాత కూడా అది జీవించి ఉంటుంది అని అంగీకరించిన మీదట, సార్వత్రిక అజ్ఞాన ఫలితంగా ఏం చేయాలో తోచని ఉమ్మడి సందిగ్ధ పరిస్థితి, సాధారణ రూపంలో, విసుగుపుట్టించే వ్యక్తి అమరత్వ భావనకు తోవ తీసింది. సరిగ్గా ఇదేవిధంగా, ప్రకృతి శక్తులకు రూపకల్పన చేయటం ద్వారా మొట్టమొదటి దేవతలు ఆవిర్భవించారు. ఈ దేవతలు, మతం మరింతగా అభివృద్ధి ఐనకొద్దీ, అధికాధికంగా, భౌతికాతీత రూపం ధరించసాగారు. చివరకు, సాధారణీకరణ క్రమంలో, వడపోత

---

* కలలో కనిపించే మానవ మూర్తులు, తమ శరీరాలను తాత్కాలికంగా వదలివేసిన ఆత్మలు అనే భావం ఆటవికులలోనూ, కింది స్థాయి అనాగరిక తెగలలోనూ ఇప్పటికీ సర్వవ్యాపితంగా ఉంది. కలలో కనిపించే మానవ మూర్తి, కలలు వచ్చిన వ్యక్తికి ఏదైనా హాని చేస్తే, ఆ మానవ మూర్తికి సంబంధించిన వ్యక్తిని అందుకు బాధ్యులుగా వారు భావిస్తారు. గుయనాలోని ఇండియన్లలో 1884లో ఈ నమ్మకం ఉన్నట్లు ఇమ్ ధుర్న్ కనుగొన్నాడు. (ఎంగెల్స్ వివరణ.)

ద్వారా అని కూడా నేను చెప్పదలచుకున్నాను, మానవుని బౌద్ధికాభివృద్ధి క్రమంలో సహజ పరిణామంగా దాదాపు పరిమితమైన, పరస్పరం పరిమితం చేసుకునే అసంఖ్యాక దేవతల స్థానే, ఏకేశ్వర మతాలకు చెందిన ఒకేఒక దేవతారూపం ఆవిర్భవించింది.

కనుక, ఆలోచనకూ, అస్తిత్వానికీ గల సంబంధం, ప్రకృతికీ, భావానికీ గల సంబంధం, తత్వశాస్త్రమంతటికీ అతి ముఖ్యమైన ఈ సమస్య, అన్ని మతాలకు వలెనే, ఆటవిక వ్యక్తుల సంకుచిత మనస్తత్వంలో, అజ్ఞాన జనిత భావాలలో పునాదులను కలిగి ఉంది. కాని ఈ సమస్య, సంపూర్ణమైన తీవ్రతతో దాని పూర్తి ప్రాధాన్యంతో, మొట్టమొదటిసారిగా, మధ్యయుగాల నాటి క్రైస్తవ మతంయొక్క అర్ధనిద్రావస్థనుండి యూరప్ ప్రజానీకం మేల్కొన్న తర్వాతనే, ముందుకు వచ్చింది. అస్తిత్వానికీ, ఆలోచనకూ గల సంబంధం ఏమిటి అనే సమస్య, భావమూ, ప్రకృతీ వీటిలో ఏది ప్రాథమికం అనే సమస్య, మధ్యయుగాల శుష్కతార్కికవాద[10] వివాదాలలో ప్రముఖ స్థానం వహించిన సమస్య, చర్చికి సంబంధించినంతవరకు, ఈ కింది విధంగా ఓ కొలిక్కి వచ్చింది: ప్రపంచాన్ని దేవుడు సృష్టించాడా? లేక ప్రపంచం అనాదిగా అస్తిత్వంలో ఉన్నదా?

ఈ ప్రశ్నకు తత్వవేత్త లిచ్చిన సమాధానాల ననుసరించి, తత్వవేత్తలు రెండు శిబిరాలుగా చీలిపోయారు. ప్రకృతి కంటే భావం ప్రాథమికం అని తలచినవారు, అనగా చిట్టచివరకు ఏదో ఒక రూపంలో ప్రపంచం ఏదో ఒక బాహ్య శక్తిచే సృష్టించబడ్డది అని భావించే వారు, భావవాద శిబిరంలో చేరారు. ఇలా భావించే తత్వవేత్తలలో, ముఖ్యంగా హే లాంటివారి దృష్టిలో, ఈ సృష్టి క్రైస్తవ మతంలో కంటె కూడా జటిలమూ, అనిర్వచనీయంగా తయారైంది. వీరుగాక ఇతరులు, ప్రకృతిని ప్రాథమికంగా భావించినవారు, భౌతికవాద్మానికి చెందిన వివిధ ధోరణులకు చెంది ఉన్నారు.

భావవాదం, భౌతికవాదం అను ఈ రెండు మాటలకూ మొదట్లో యింతకు మించిన అర్థంలేదు. మరొక అర్థంలో ఈ మాటలను వాడలేదు కూడా. ఈ మాటలకు ఇంతకంటె భిన్నమైన అర్థం ఇస్తే ఎట్టి గందరగోళం ఏర్పడుతుందో యీదిగువ చూద్దాం.

కాని ఆలోచనకు, అస్తిత్వానికి సంబంధం ఏమిటి అనే సమస్యకు మరో పార్శ్వం కూడా ఉంది: మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గురించిన మన భావాలు, ఈ ప్రపంచంపట్ల ఎట్టి సంబంధాన్ని కలిగి ఉన్నాయి అనే ప్రశ్న ఉంది. వాస్తవ ప్రపంచాన్ని మన ఆలోచన గ్రహించగలదా? వాస్తవ ప్రపంచాన్ని గురించిన మన భావాలు, అనుభూతులు, వాస్తవాన్ని గురించి సరైన ప్రతిబింబాన్ని సృష్టించగలుగుతున్నాయా? తాత్విక పరిభాషలో చెప్పాలంటే ఆలోచనకు, అస్తిత్వానికి ఏకత్వమున్నదా? అత్యధికులైన తత్వవేత్తలు ఈ ప్రశ్నకు ఔను అని సమాధానం ఇస్తున్నారు. హేగెల్ విషయంలో ఈ ధృవీకరణ అతి స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. మనం ఈ ప్రపంచంలో తెలుసుకొనేది, దాని ఆలోచనా సారాన్ని. ఈ సారమే ప్రపం

చాన్ని, అఖండ భావంయొక్క క్రమానుగత వ్యక్తీకరణగా నిరూపిస్తున్నది. అఖండ భావం అనాదిగా ఎక్కడో ఉండనే ఉన్నది. ప్రపంచంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా, ప్రపంచంకంటె ముందుగానే ఉన్నది. ఏదైతే మొదటినుండీ ఆలోచనా సారంగానే ఉన్నదో, అట్టి సారాన్ని ఆలోచన గ్రహించగలదు అని తేలికగానే స్పష్టమౌతున్నది. ఏదైతే నిరూపించవలసి ఉందో అది ప్రాతిపదికలోనే అంతర్భూతంగా ఉన్నదని కూడా స్పష్టం ఔతూనే ఉంది. ఐనప్పటికీ ఈ కింది అదనపు నిర్ధారణకు రావటానికి హేగెల్ వెనకాడటంలేదు. ఆ నిర్ధారణ ఇది. ఆలోచనకూ, అస్తిత్వానికీ ఏకత్వమున్నదని రుజువైంది కనుక, తన తత్వశాస్త్రం తన ఆలోచనకు సక్రమంగా ఉన్నది కనుక, అదొక్కటే సరైనది. ఆలోచనకూ, అస్తిత్వానికీ ఏకత్వం అను సూత్రాన్ననుసరించి, తన తత్వశాస్త్రాన్ని వెంటనే ఆచరణలో పెట్టి, హేగెలియన్ సూత్రాల ద్వారా యావత్ప్రపంచాన్నీ మార్చాలి. తద్వారా తన సిద్ధాంత నిరూపణ జరగాలి – చాలమంది ఇతర తత్వవేత్తలకువలెనే హేగెల్‌కు కూడా ఈ భ్రమ ఉన్నది.

దీంతోపాటు, మరో రకమైన తత్వవేత్తల బృందం ఒకటి ఉంది. ప్రపంచాన్ని గురించిన జ్ఞానసముపార్జన, కనీసం సమగ్ర జ్ఞాన సముపార్జన సాధ్యమా, అనే అంశాన్నే వీరు ప్రశ్నిస్తారు. ఈ బృందానికి చెందిన ఆధునికులలో హ్యూమ్, కాంట్‌లున్నారు. వీరు తాత్వికాభివృద్ధిలో చాలా ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఈ వాదాన్ని నిరాకరించడంలో నిర్ణయాత్మకమైనదేదో, దానిని భావవాద దృక్కోణంనుండి ఎంతవరకు చెప్పే అవకాశముందో ఆ మేరకు ఇంతకుముందే హేగెల్ చెప్పాడు. ఇందుకు ఫాయెర్‌బాఖ్ చేసిన భౌతికవాద చేర్పులలో ప్రగాఢత్వం కంటె, తెలివితేటలు హెచ్చుగా ఉన్నాయి. ఈ ధోరణినీ తదితర తాత్విక వైరితలలన్నింటినీ చిత్తుగా ఖండించేది ఆచరణ, అనగా ప్రయోగమూ, పరిశ్రమే. ఒక ప్రకృతి పరిణామాన్ని గురించిన మన అవగాహన సరైనది అని, ఆ పరిణామాన్ని మనం స్వయంగా సృష్టించటం ద్వారా నిరూపించగలిగినట్లయితే, దాని పరిస్థితులలో నుండి దానిని సృష్టించి, తద్వారా మన ప్రయోజనాలను నెరవేర్చుకో గలిగితే, దాంతో కాంట్ "అజ్ఞేయ వస్తువు" కాస్తా అంతమైపోతుంది. మొక్కలలోను, జంతువులలోను, ఉత్పత్తి ఐన రసాయనిక పదార్థాలు చాలాకాలం ఇట్టి "అజ్ఞేయ వస్తువులుగా"నే ఉండిపోయాయి. చివరకు సేంద్రియ రసాయనశాస్త్రం ఈ వస్తువులను ఒకదాని తర్వాత మరొకదాన్ని సృష్టించ నారంభించటంతో, ఈ అజ్ఞేయ వస్తువు కాస్తా మనకుపయోగపడే వస్తువుగా మారిపోయింది – ఉదాహరణకు చాయ వేరునుండి రంగులు వేయటాని కుపయోగించే అలిజరిన్ తయారవుతుంది. వెనకటిలాగా ఈ రంగు పదార్థాన్ని చాయవేరు మొక్కలనుండి కాక, బొగ్గు తారునుండి ఇప్పుడు యింకెంతో తేలికగానూ, చౌకగానూ తయారు చేస్తున్నాము. కొపెర్నికస్ కనిపెట్టిన సౌరమండల సిద్ధాంతం 300 సంవత్సరాలపాటు, కేవలం

ఒక ప్రతిపాదన మాత్రమే. దానికి వ్యతిరేకంగా ఒకే ఒక్క అవకాశముండి, అనుకూలంగా నూరో, వెయ్యో, లేక పదివేలో అవకాశా లుండవచ్చు గాక, అయినా అది ప్రతిపాదన మాత్రమే. కాని, ఈ సిద్ధాంతం అందచేసిన సమాచారం ఆధారంగా, లెవెర్యే, ఇంతవరకూ తెలియని ఒక గ్రహం ఉనికిని ఎప్పుడైతే నిర్ధారణచేశాడో, ఈ గ్రహం అంతరిక్షంలో ఎక్కడ ఉంటుంది అనే అంశాన్ని కూడా ఎప్పుడైతే కనుగొన్నాడో, గాలే ఎప్పుడైతే ఈ గ్రహాన్నే[11] కనిపెట్టాడో, దాంతో కొపెర్నికస్ సిద్ధాంతం రుజువైంది. ఐనప్పటికీ, జర్మనీలో కాంట్ ఆలోచనను నయాకాంట్‌వాదులూ, హ్యూమ్ ఆలోచనను బ్రిటన్‌లో అజ్ఞేయతావాదులూ[12] పునరుజ్జీవింప చేయటానికి యత్నిస్తున్నారంటే (నిజానికి బ్రిటన్‌లో హ్యూమ్ ఆలోచన అసలు అంతరించనే లేదు), ఇందుకు ఒకే కారణం ఉంది. చాలాకాలం క్రితమే ఈ రెండు వాదనలూ సిద్ధాంత రీత్యా, ఆచరణ రీత్యా కూడా నిరాకృతమయ్యాయి. ఈ వాదనలు ప్రపంచం ఎదుట భౌతికవాదాన్ని నిరాకరిస్తూనే, సిగ్గువిడిచి, దొంగచాటుగా భౌతికవాదాన్ని అంగీకరిస్తున్నాయి, విజ్ఞాన శాస్త్రపరంగా ఇవి వెనకడుగు వేస్తున్నాయి.

కాగా, డెకార్ట్‌నుండి హేగెల్‌వరకు, హాబ్స్‌నుండి ఫాయెర్‌బాఖ్‌వరకు కొనసాగిన దీర్ఘకాలంలో, తత్వవేత్తలు, వారు భావించినట్లు కేవలం కళంకరహితమైన హేతువాదం చేత మాత్రమే ప్రభావితులు కాలేదు. తద్విరుద్ధంగా, వారిని నిజంగా ముందుకు తోసుకు వచ్చినది ఏమంటే, శక్తివంతంగా అంతకంతకు ఎక్కువ వేగంగా ముందుకు సాగుతున్న, ప్రకృతి విజ్ఞానశాస్త్రాలు, పరిశ్రమల అభివృద్ధి, భౌతికవాదుల విషయంలో ఇది స్పష్టంగా పైకి వ్యక్తమౌతూనే ఉంది. కాగా భావవాద ధోరణులు సైతం అధికాధికంగా, భౌతికవాద సారంతో నింపబడుతూ వచ్చాయి. భావానికీ, పదార్థానికీ గల వైరుధ్యాన్ని పాంథీయిస్టు పద్ధతిలో[13] సమన్వయ పరచటానికి ప్రయత్నించాయి. కనుక చిట్టచివరకు హేగెలియన్ ఆలోచనా పద్ధతి, సారంలోనూ, రూపంలోనూ, భావవాదపరంగా తల్లకిందులు చేయబడిన భౌతికవాదమనే చెప్పవచ్చు.

కనుక, ఫాయెర్‌బాఖ్‌ను అంచనా వేయటంలో, స్టార్కె ఆలోచనకూ అస్తిత్వానికీ గల సంబంధం ఏమిటి అనే మౌలిక సమస్యపై ఫాయెర్‌బాఖ్ వైఖరిని మొట్టమొదటగా పరిశీలించ పూనుకున్నాడంటే, మనం అర్థం చేసుకోవచ్చు. ఈ గ్రంథంయొక్క క్లుప్తమైన పీఠికలో కాంట్ తర్వాత ఆవిర్భవించిన తత్వవేత్తల భావాలు, పూర్తిగా అనవసరమైన విసుగుపుట్టించే తాత్విక పదగుంభనతో చర్చింపబడ్డాయి. ఇందులో హేగెల్‌కు, ఆయన రచనలలోని కొన్ని ఉల్లేఖనలకు ముక్కస్య ముక్కార్థం ఇవ్వటంవల్ల, జరగవలసిన న్యాయం జరగలేదు. ఆపిమ్మట ఫాయెర్‌బాఖ్ "అధిభౌతికవాదం" ఎలా అభివృద్ధి చెందిందీ సవివరంగా చర్చించబడ్డది. ఈ పరిణామం ఎలా వ్యక్తమైందీ ఇందుకు సంబంధించిన ఫాయెర్‌బాఖ్ రచనలలో వరుసక్రమంలో చర్చించబడ్డది. ఈ వర్ణన ఎంతో శ్రమతో, తేటతెల్లంగా

వివరించబడ్డది. కాగా, స్టార్కె పుస్తకం మొత్తంలోలాగే ఇందులో కూడా తాత్విక పదగుంభన చాలా జాస్తిగా ఉంది. నిజానికిది అనివార్యమేమీ కాదు. ఇది మరింత బాధాకరంగా తయారు కావటానికి కారణ మేమంటే, ఒకే ధోరణికి చెందిన, లేక ఫొయెర్‌బాఖ్‌కు మాత్రమే చెందిన, పద జాలానికి రచయిత చాలా తక్కువగా కట్టుబడి, చాలా విభిన్న ధోరణులకు చెందిన మాటలతో, మధ్య మధ్య జోక్యం చేసుకుంటాడు. ముఖ్యంగా తాత్విక ధోరణులుగా నేడు చలామణీ కావటానికి ప్రయత్నిస్తున్న ధోరణుల పదజాలాన్ని ఇతడు చాలా ఎక్కువగా వాడుకున్నాడు.

హేగెలియన్ ధోరణినుండి మొదలై భౌతికవాదిగా మారటం ఫొయెర్‌బాఖ్ పరిణామ క్రమం. అయితే అతడు ఎప్పుడూ పూర్తి సాంప్రదాయిక హేగెలియన్ కాదు. ఈ పరిణామంలోని ఒక నిర్దిష్ట దశలో అతడు, తన పూర్వీకుని భావవాద వ్యవస్థతో పూర్తిగా తెగతెం పులు చేసుకోక తప్పలేదు. అప్రతిహతమైన ఊపుతో అతడు ఈ కింది నిర్ణయానికి వచ్చాడు. "అఖండ భావం"యొక్క భౌతికాతీత ఉనికిని గురించి హేగెల్ భావం ప్రపంచాని కంటె ముందే, "తార్కిక భావాభివర్గాలు పూర్వాస్తిత్వం కలిగి ఉన్నవనే" భావం, భౌతికా తీత సృష్టికర్తపట్ల విశ్వాసానికి సంబంధించిన, హేతువిరుద్ధమైన అవశేషం కంటె మరేమీ కాదు. భౌతికమూ, ఇంద్రియ గ్రాహ్యమూ, మన నివాస కేంద్రమూ అయిన ప్రపంచం ఒక్కటే నిజమైన వాస్తవం. మన చైతన్యము, ఆలోచన — అవి ఎంత ఇంద్రి యాతీతంగా కనిపించినా, భౌతికమూ, శరీరంలోని అవయవమూ అయిన మెదడు సృష్టిం చినవి మాత్రమే. పదార్థం, మనస్సునుండి ఉద్భవించలేదు. తద్వ్యతిరేకంగా, మనస్సే పదార్థంయొక్క అత్యున్నత సృష్టి. ఇది నిస్సందేహంగా పూర్తి భౌతికవాదం. కాగా, అంత దూరం పోయిన ఫొయెర్‌బాఖ్ అంతటితో ఆగిపోతాడు. భౌతికవాదం అనే మాటపట్ల, అందులోని సారంపట్ల కాదు, సాంప్రదాయికంగా వస్తున్న దురభిప్రాయాన్ని అతడు అధి గమించలేక పోయాడు. అతడు ఇలా అంటాడు:

> "నా దృష్టిలో భౌతికవాదం మానవసారం, విజ్ఞానం, అను సౌధానికి పునాది. అయితే, మానవ శరీర శాస్త్రవేత్తకు, సంకుచితార్థంలో ఉదాహరణకు ప్రకృతి శాస్త్రజ్ఞుడైన మొలెషోట్‌కు, దాని అర్థం వేరు; నా అర్థం వేరు. వారి దృష్టి రీత్యా, ఉద్ఘాటించి చెప్పినదాని రీత్యా కూడా భౌతికవాదమే సౌధం. గతానికి సంబంధించి నేను భౌతికవాదులతో ఆమోదిస్తాను, భవిష్యత్తు విష యంలో ఆమోదించలేను."

ఇక్కడ ఫొయెర్‌బాఖ్ రెండు విషయాలను కలగాపులగం చేస్తున్నాడు. పదార్థానికీ, మనస్సుకీ గల సంబంధాన్ని గురించి ఒక నిశ్చిత భావాన్ని వెలిబుచ్చే, భౌతికవాదం అనే సాధా

రణ ప్రపంచ దృక్పథం ఒకటి; ఒక నిర్ణీత చారిత్రక దశలో, 18వ శతాబ్దిలో, ఈ ప్రాపంచిక దృక్పథం ఏ ప్రత్యేక రూపంలో వ్యక్తమైంది అనే విషయం మరొకటి. అంతే కాదు, 18వ శతాబ్దపు భౌతికవాదం ఈనాడు, ప్రకృతి శాస్త్రవేత్తల, వైద్యుల బుర్రలలో ఎంతటి చౌకబారు అపభ్రంశ రూపంలో కొనసాగుతున్నదో, బ్యూఖ్నర్, ఫోగ్ట్, మోలెషోట్ 50 దశకంలో తమ సంచారాలలో దేనిని బోధించారో, దానితో భౌతికవాద ప్రాపంచిక దృక్పథాన్ని కలగాపులగం చేస్తున్నాడు. కాని భావవాదం ఎలా అనేక దశలలో పరిణామం చెందిందో, భౌతికవాదం కూడా అలాగే పరిణామం చెందింది. ప్రకృతి శాస్త్రరంగంలో యుగ ప్రాధాన్యం కలిగిన ఆవిష్కరణ జరిగినప్పుడల్లా, దాని రూపాన్ని అది మార్చుకోవలసి వచ్చింది. చరిత్ర భౌతికవాదపరంగా వ్యాఖ్యానించబడిన మీదట, ఇక్కడ కూడా దానికొక నూతన అభివృద్ధి మార్గం తెరవబడింది.

గత శతాబ్దికి[14] చెందిన భౌతికవాదం ప్రధానంగా యాంత్రికమైనది. ఏమంటే అప్పటికి అన్ని ప్రకృతి శాస్త్రాలలోకీ, యంత్రశాస్త్రం ఒక్కటే, అందులోనూ ఖగోళ, భూగోళ ఘన పదార్థాలకు చెందిన యంత్రశాస్త్ర మొక్కటే, క్లుప్తంగా చెప్పాలంటే గురుత్వాకర్షణ యంత్రశాస్త్రం మాత్రమే ఎంతో కొంత నిర్దిష్టమైన సమగ్రతకు చేరు కుంది. రసాయన శాస్త్రం అప్పటికి ప్రాథమికమైన, ఫ్లోజిస్టాన్ రూపంలోనే[15] ఉంది. జీవశాస్త్రం ఇంకా పొత్తిగుడ్డలలోనే ఉంది. వృక్ష, జంతు శరీరాలు స్థూలంగా మాత్రమే పరిశీలింపబడ్డాయి. కేవలం యాంత్రిక కారణాలతో మాత్రమే వ్యాఖ్యానించబడ్డాయి. డెకార్ట్ దృష్టిలో జంతువూ, 18వ శతాబ్దపు భౌతికవాదుల దృష్టిలో మానవుడూ ఒక యంత్రం మాత్రమే. రసాయనిక, జీవశాస్త్రాలకు, యంత్రశాస్త్ర నియమాలను ఇంత అతిగా వర్తింప చేయటం ఆనాటి సాంప్రదాయిక ఫ్రెంచి భౌతికవాదంయొక్క నిర్దిష్టమయిన, అదే సమయంలో అనివార్యమైన పరిమితి. ఈ శాస్త్రాలలో యంత్రశాస్త్ర నియమాలు వర్తిస్తాయి. కాని అంతకంటె ఉన్నతమైన నియమాలకు చోటిచ్చి, అవి వెనుకకు నెట్టివేయబడతాయి.

ఈ భౌతికవాదంయొక్క విశిష్టమైన రెండవ పరిమితి, విశ్వాన్ని ఒక క్రమంగా, నిరంతర చారిత్రక అభివృద్ధిని పొందుతున్న పదార్థంగా గుర్తించటంలో విఫలం కావటం. ఆనాటి ప్రకృతి శాస్త్రాల స్థాయికీ, దాంతోపాటే ఏర్పడిన గతితర్క వ్యతిరేక, అధిభౌతిక తాత్విక సరళికీ అనుగుణంగానే ఈ పరిమితి ఏర్పడ్డది. ప్రకృతి శాశ్వత చలనంలో ఉంటుం దని ఆనాడు గ్రహించారు. కాని ఆనాటి భావాల కనుగుణంగా, ఈ చలనం నిరంతరం చక్రాకారంగా పరిభ్రమిస్తూ ఉంటుంది. కాగా అదే స్థానంలో నిలిచిపోతుంది. అది మరల మరల అవే ఫలితాలను కలిగిస్తుంది. ఈ దృష్టి ఆనాడు అనివార్యం. అప్పటికి కొద్దికాలం క్రితమే సూర్యమండలానికి సంబంధించిన కాంట్ సిద్ధాంతం ప్రతిపాదితమైంది. ఐతే దాని నింకా ఒక విచిత్రమైన వాదనగా మాత్రమే చూసేవారు. భూమియొక్క అభి

వృద్ధి చరిత్ర, భూగర్భశాస్త్రం, ఆనాటి కనలు లేనేలేదు. చలనం కలిగిన నేటి జీవరాసులు సూక్ష్మరూపంనుండి జటిలరూపానికి జరిగిన దీర్ఘ పరిణామ క్రమంలో ఏర్పడ్డాయనే భావం, శాస్త్రబద్ధంగా ఆనాడు అసలు ప్రతిపాదితమే కాలేదు. కనుక ప్రకృతిని గురించిన చరిత్ర విరుద్ధ దృష్టి అనివార్యం. 18వ శతాబ్దపు తత్వవేత్తలను మనం ఈ విషయంలో నిందించవలసిన కారణంలేదు. ఏమంటే హేగెల్‌కు ఇదే భావం ఉండేది. అతని దృష్టిలో, ప్రకృతి, భావంయొక్క "అన్యథాకరింపబడిన" రూపం. కాలగమనంతోపాటు దానికి అభివృద్ధిలేదు. తన విస్తృత రూపాన్ని స్థలరీత్యా మాత్రమే అది విస్తరించగలదు. దానిలో ఇమిడి ఉన్న అన్ని అభివృద్ధి దశలనూ, ఒకదాని పక్కన మరొక దానిని, ఒకేసమయంలో అది వ్యక్తం చేయగలదు. ఒకే పరిణామక్రమంలో నిరంతరం పరిభ్రమించటం దాని విధి. కాలంతో ప్రమేయం లేకుండా స్థలంలో మాత్రమే అభివృద్ధి అనే ఈ అసందర్భ వాదన, హేగెల్ దృష్టిలో అభివృద్ధికి ప్రధానమైన షరతు. ఈ వాదనను హేగెల్ ప్రకృతిపై అధ్యారోపం చేసిన సమయంలోనే భూగర్భశాస్త్రం, పిండాభివృద్ధి శాస్త్రం, వృక్ష, జంతు శరీర శాస్త్రం అభివృద్ధి కాసాగినవి. సేంద్రియ రసాయన శాస్త్రం నిర్మాణంలో ఉంది. అద్భుతమైన ఈ శాస్త్ర జ్ఞానాల ప్రాతిపదికపై ప్రతిచోటా, ఆతర్వాత వెల్వడిన పరిణామవాద ఛాయలు వ్యక్తం కాసాగినవి (గ్యోతే, లామార్క్). కాగా హేగెలియన్ తాత్విక వ్యవస్థకు పై అసందర్భ వాదన అవసరమైంది. వ్యవస్థ కొరకు పరిశీలనా పద్ధతి ఆత్మవంచనకు గురి కావలసి వచ్చింది.

చారిత్రక రంగంలోనూ, ఇదే విధమైన చరిత్ర విరుద్ధ దృక్పథం కొనసాగింది. మధ్య యుగాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం, ఇక్కడ దృష్టి మాంద్యానికి కారణమైంది. చరిత్ర పరిమాణంలో అంతరాయంగా ఒక వేయి సంవత్సరాలపాటు సాగిన సార్వత్రిక ఆటవిక దశగా మాత్రమే మధ్య యుగాలు భావించబడ్డాయి. మధ్య యుగాలలో జరిగిన గొప్ప పురోగతి, యూరపియన్ సంస్కృతీ విస్తరణ, ఒకదానిపక్క మరొకటిగా గొప్ప సమగ్ర జాతులు ఆవిర్భవించటం, అఖరుగా 14, 15 శతాబ్దాలలో సాంకేతిక రంగంలో జరిగిన అపార పురోగతి – ఇదంతా విస్మరించబడ్డది. ఈవిధంగా, చారిత్రక పరస్పర సంబంధాలను గురించి హేతువాద పూర్వక అంతర్దృష్టి లోపించింది. చరిత్ర మహా అయితే తత్వవేత్తలకు ఉదాహరణలు, దృష్టాంతాలు చెప్పడానికి ఒక సంకలనంగా మాత్రమే ఉపయోగపడ్డది.

50 దశకంలో జర్మనీలో భౌతికవాదంలో వేలుపెట్టిన అపభ్రంశ ప్రచారకులు, వారి ఉపాధ్యాయులు ఏర్పరచిన పై పరిమితులను ఏ విధంగానూ అధిగమించలేకపోయారు. ఈమధ్యలో ప్రకృతిశాస్త్రాలలో జరిగిన అభివృద్ధి యావత్తూ సృష్టికర్త లేడు అని నిరూపించేందుకు కొత్త సాక్ష్యాలుగా మాత్రమే వారికి ఉపకరించింది. నిజానికి తమ సిద్ధాంతాన్ని అంతకంటె ముందుకు తీసుకువెళ్లటానికి వారు కించిత్ ప్రయత్నమూ చేయలేదు:

భావవాదం అప్పటికే ఆఖరి దశకు చేరుకుంది. 1848 విప్లవం దానికి చావుదెబ్బ కొట్టింది. అయితే తత్కాలానికి భౌతికవాదం అంతకంటే తక్కువదశకు దిగజారింది. భావవాదానికి అదే సంతృప్తి. ఇలాంటి భౌతికవాదానికి బాధ్యత వహించను అని ఫాయెర్‌బాఖ్ చెప్పటం నిస్సందేహంగా సరైనదే. కాగా ఈ సంచారక ప్రచారకుల బోధలను, సాధారణంగా భౌతికవాదంతో అతడు గందరగోళ పరచకుండా ఉండవలసింది.

అయితే, ఇక్కడ రెండు అంశాలను ప్రస్తావించవలసి ఉంది. ఫాయెర్‌బాఖ్ జీవిత కాలంలో సైతం ప్రకృతి విజ్ఞానశాస్త్రం తీవ్రమైన మధనానికి లోనౌతూనే ఉంది. మొదటి విషయం ఏమిటంటే, గత 15 సంవత్సరాలలోనే ఇది సాపేక్షమూ, స్పష్టమూ అయిన నిర్ణయానికి రాగలిగింది. ఇంతవరకు ఎన్నడూ ఊహించని పరిమాణంలో కొత్త శాస్త్రీయ సమాచారం లభించింది. కాని పరస్పర సంబంధాలను ఏర్పరచటం, తద్వారా ఒకదాని వెంబడే మరొకటిగా వెలువడిన ఆవిష్కార పరంపరల అరాచకత్వంలో ఒక క్రమ బద్ధత ఏర్పరచటం, ఇటీవలి కాలంలో మాత్రమే సాధ్యమైంది. జీవకణం, శక్తి రూపాంతరీక రణ, డార్విన్ పేరుతో పిలవబడిన పరిణామ సిద్ధాంతం – అను మూడు నిర్ణయాత్మక ఆవిష్కరణలు ఫాయెర్‌బాఖ్ జీవితకాలంలోనే వెలువడిన మాట నిజం. కాని గ్రామసీమలో ఏకాంతంగా నివసించే ఒంటరిగాడైన ఈ తత్వవేత్త, ఈ శాస్త్రీయ ఆవిష్కరణల పూర్తి ప్రాధాన్యాన్ని ఎలా అర్థం చేసుకోగలడు? ప్రకృతి శాస్త్రవేత్తలే ఆనాటికి, ఈ పరిశోధనలను నిరాకరించటమో, లేక వాటిని తగినంతగా ఉపయోగించుకోలేకపోవటమో జరుగుతూ ఉండేది. ఇందుకు పూర్తి బాధ్యత జర్మనీలోని నాటి దుర్భర పరిస్థితులపైననే ఉంది. తత్ఫలి తంగా తత్వశాస్త్ర పీఠాలపైన ఛాందస మిడిమిడి జ్ఞానం కలిగిన కోతలరాయుళ్లు ఆసీనులై ఉండేవారు. వారందరికంటే శిఖరాయమానుడైన ఫాయెర్‌బాఖ్ ఒక గ్రామంలో గోళ్లు గిల్లుకుంటూ ఘూర్ణిల్లుతూ కూచోవలసివచ్చింది. కనుక ఈనాడు సాధ్యమైన ప్రకృతికి సంబంధించిన భౌతికవాద దృక్పథం, ఫ్రెంచి భౌతికవాదంలోని పాక్షికతనంతటినీ తొలగించిన దృక్పథం, ఆనాడు అతనికి అందరానిదిగా ఉండిపోయిందంటే అది ఫాయెర్‌బాఖ్ తప్పుకాదు.

ఇక రెండవ అంశం: "ప్రకృతి విజ్ఞానశాస్త్రాలపై పూర్తిగా ఆధారపడిన భౌతికవాదం, మానవ విజ్ఞాన సౌధానికి పునాదేకాని, అదే సౌధం కాదు" అని ఫాయెర్‌బాఖ్ చెప్పటం సరైనదే. ఏమంటే మనం ప్రకృతిలోనే కాదు, సమాజంలో కూడా జీవిస్తున్నాము. సమాజానికి కూడా, ప్రకృతికంటె ఏమాత్రం తక్కువ కాకుండా పరిణామ చరిత్ర, విజ్ఞానశాస్త్రం ఉన్నాయి. కనుక సమాజ శాస్త్రాన్ని, అనగా చారిత్రక తాత్విక శాస్త్రాలు అనబడేవాని సమా హారాన్ని భౌతికవాద పునాదితో సమన్వయపరచి, దానిపై పునర్నిర్మించటం అనేది సమస్య. ఈ కర్తవ్యం నెరవేర్చే అవకాశం ఫాయెర్‌బాఖ్‌కు దక్కలేదు. "పునాది" ఏర్పడినప్పటికీ, ఆయన సంప్రదాయపరమైన భావవాద సంకెళ్లచే బంధితుడై ఉండిపోయాడు. ఈ విష

యాన్ని ఈ కింది మాటలలో ఆయనే అంగీకరించాడు: "గతానికి సంబంధించి నేను భౌతిక వాదులతో ఆమోదిస్తాను. భవిష్యత్తు విషయంలో ఆమోదించలేను!" నిజానికి ఇక్కడ సామాజికరంగంలో ముందుకుపోకుండా నిలచింది ఫాయెర్‌బాఖ్. 1840, 1844లోని తన వైఖరిని దాటి అతడు ముందుకు పోలేదు. ఇందుకు కూడా ప్రధాన కారణం అతని ఒంటరితనమే. తత్వవేత్త లందరిలోకీ, సామాజిక సంబంధాలపట్ల హెచ్చు మొగ్గు కలిగిన ఫాయెర్‌బాఖ్, తనతో సమాన స్థాయిగల ఇతర వ్యక్తులతో సమరసమూ, వివాదగ్రస్తమూ అయిన వాదవివాదాల ఫలితంగా ఆలోచనలను సృష్టించవలసిన వ్యక్తి, ఒంటరిగా తన బుర్రలోనుంచి ఆలోచనలను సృష్టించవలసి వచ్చింది. ఈ రంగంలో అతను ఎంతగా భావవాదిగానే మిగిలిపోయాడో, మున్ముందు చూడగలం.

ఇక్కడ ఒక మాట చెప్పాలి. ఫాయెర్‌బాఖ్ భావవాదాన్ని, ష్టార్కె, అది లేనిచోట చూస్తున్నాడు.

> "ఫాయెర్‌బాఖ్ భావవాది, అతను మానవ సమాజ పురోగతిపై విశ్వాసం కలవాడు." (19 పేజి.) "అయితే, పునాది, మొత్తంయొక్క ఆంతరంగిక నిర్మాణం, భావవాదంగానే ఉండిపోయింది. మనం మన ఆదర్శ ధోరణులను అనుసరిస్తూ ఉంటే, ఏర్పడే వ్యతిక్రమాలకు వ్యతిరేకంగా రక్షణే వాస్తవిక వాదం. అంతకంటే మరేమీ కాదు. జాలి, ప్రేమ, సత్యం, న్యాయంపట్ల ఉత్సాహం ఆదర్శ శక్తులు కావా?" (VIIIవ పేజి.)

మొదటి విషయం, భావవాదం (idealism) అంటే ఇక్కడ అర్థం, కొన్ని ఆదర్శాలను (ideals) అనుసరించడం అని మాత్రమే. మహా అయితే ఈ ఆదర్శాలు, కాంటియన్ భావవాదం, దాని "నిశ్చిత ఆజ్ఞార్థకానికి"[16] మాత్రమే సంబంధించినవి. కాగా, తన తత్వశాస్త్రాన్ని, కాంట్ "అతీత భావవాదం" అని పిలిచాడు. అందులో సామాజిక నైతిక ఆదర్శాలను చర్చించినందువల్లకాక, వేరే కారణాలవల్ల యిలా పిలిచాడు. ష్టార్కెకు ఇది జ్ఞాపకం ఉండే ఉంటుంది. తాత్విక భావవాదం, నైతిక ఆదర్శాలచుట్టూ, సాంఘిక ఆదర్శాలచుట్టూ కేంద్రీకృతమై ఉంటుందనేది ఒక దురభిప్రాయం. ఈ దురభిప్రాయం, తత్వశాస్త్రానికి వెలుపల, జర్మన్ కూపస్థమండూకాలలో ఉద్భవించింది. వీరికి కావలసిన కొద్దిపాటి తాత్విక సాంస్కృతిక శకలాలను షిల్లర్ గేయాలను కంఠస్థం చేయటం ద్వారా సేకరించారు. కాంట్‌యొక్క "నిశ్చిత ఆజ్ఞార్థకాన్నీ" అసాధ్యమైన ఆదర్శాలపట్ల చౌకబారు, భావుకతతో కూడిన షిల్లర్ ఉత్సాహాన్నీ, సంపూర్ణ భావవాది ఐన హెగెల్ కంటె నిశితంగా ఎవ్వరూ విమర్శించలేదు (ఉదాహరణకు "ఫినామినాలజీ" అను ఆయన గ్రంథం చూడండి). కాంట్

భావాలు ఎందుకు నిర్వీర్యమైనవంటే అసాధ్యమైనవాని కోసం అవి అర్రులు చాస్తాయి. కనుక ఏ రకమైన వాస్తవానికీ చేరుకోలేవు.

ఇక రెండవ విషయం మానవుని కార్యాచరణకు ప్రేరేపించే ప్రతి అంశమూ అతని మెదడు ద్వారానే వ్యక్తం కావాలి. ఈ వాస్తవాన్నుండి మనం తప్పించుకోలేము. ఆకలి, దప్పికవంటి ఇంద్రియ జ్ఞానాలు సైతం, మెదడు ద్వారా బైటికి రావలసిందే. ఈ వాంఛా పరిపూర్తి సైతం మెదడు ద్వారానే తిరిగి గ్రహింపబడుతుంది. మానవునిపై భౌతిక ప్రపంచంయొక్క ప్రభావాలన్నీ, మెదడు పైననే ప్రతిఫలిస్తాయి. అందులోనే భావాలు, ఆలోచనలు, ఉద్రేకాలు, వ్యక్తీకరణల రూపంలో ప్రతిబింబిత మౌతాయి. క్లుప్తంగా చెప్పాలంటే ఆదర్శ ధోరణులుగా, ప్రతిబింబిస్తాయి. ఈ రూపంలో అవి "ఆదర్శ శక్తులు" ఔతాయి. కనుక ఒక వ్యక్తి "ఆదర్శ ధోరణులను" అనుసరిస్తున్నాడు కనుక, "ఆదర్శ శక్తులను" తనపై ప్రభావం కలిగిస్తున్నాయని అంగీకరిస్తున్నాడు కనుక, అతను భావవాది అని అంటే, మామూలుగా అభివృద్ధి చెందిన ప్రతి వ్యక్తీ భావవాది ఔతాడు. ఇక అప్పుడు, భౌతికవాదులనే వారంటూ ఎవరైనా ఉండటం సాధ్యమా?

ఇక మూడవ విషయం: మానవ సమాజం, కనీసం ప్రస్తుత కాలంలో మొత్తంమీద అభివృద్ధికర మార్గంలో పయనిస్తున్నది అనే విశ్వాసానికీ, భౌతికవాద, భావవాదాల మధ్య సంఘర్షణకూ ఎట్టి సంబంధంలేదు. ఫ్రెంచి భౌతికవాదులు, వోల్టేర్, రూసో అంతటి డేయిస్టులతో[17] సహా, ఈ విశ్వాసాన్ని దాదాపు మూఢ భక్తిలాగా కలిగి ఉండేవారు. తరచు ఆ విశ్వాస నిరూపణకై చాలా తీవ్రమైన వ్యక్తిగత త్యాగాలు చేశారు. తన జీవితాన్నంతా "న్యాయం, సత్యాలపట్ల ఉత్సాహానికి" అంకితం చేసిన వాడెవడైనా ఉంటే — ఆ మాటను మంచి అర్థంలో వాడుతున్నాను — అతడు డిడ్రో. కనుక ఇదంతా కూడా భావవాదం అని స్టార్కె ప్రకటిస్తే భౌతికవాదం అనేమాట, రెండు ధోరణులకూ మధ్య ఘర్షణ, ఆయనకు ఏమీ అర్థంకావటం లేదనే చెప్పాలి.

వాస్తవ మేమంటే స్టార్కె, బహుశా తనకు తెలియకుండానే, ఈ విషయంలో, భౌతికవాదం అనే మాటపట్ల సాంప్రదాయికంగా కొనసాగుతున్న కూపస్థమండూక యోగ్యమైన దురభిప్రాయాలకు — దీర్ఘకాలంగా మతగురువులు సాగించిన దుష్ప్రచారం కారణంగా ఏర్పడిన దురభిప్రాయాలకూ — క్షమించ వీలులేని లొంగుబాటు ప్రదర్శిస్తున్నాడు. భౌతికవాదం అనేమాటకు, ఈ కూపస్థమండూకప్రాయుడైన ప్రచారకుడు, తిండిపోతుతనం, తాగుబోతుతనం, కండ్లతీట, కండకావరం, అహంభావం, లైంగిక తృష్ణ, అసూయ, దురాశ, లాభాపేక్ష, చట్టా వ్యాపారంలో మోసం — క్లుప్తంగా చెప్పాలంటే తాను చాటుమాటుగా ఏ అసహ్యకరమైన వ్యసనాలకు బానిసో, ఆ వ్యసనాలన్నీ — అంటగడుతున్నాడు. భావవాదానికి నీతి, విశ్వవ్యాపిత దయాభావం, సాధారణ రూపంలో "ఆదర్శ

ప్రపంచం'' కొరకు ఆరాటం, అంటగడుతున్నాడు. ఈ ఆదర్శాలను అతడు ఇతరుల ముందర డంబాచారంగా చెప్పుకుంటాడు. కాని అతడికి మాత్రం వాటిలో, మహా అయితే, తను చిక్కుల్లో ఉన్నప్పుడు, సహజసిద్ధమైన, తన ''భౌతికవాద'' అతిశయ చర్యల ద్వారా ఏర్పడిన దివాళాకోరుతనంలో ఉన్నప్పుడు మాత్రమే, విశ్వాసం ఉంటుంది. అప్పుడతడు ''మానవుడు సగం జంతువు, సగం దేవత,'' అనే తన అభిమాన కీర్తనను ఆలాపిస్తాడు.

ఇక మిగతా విషయాలకొస్తే, జర్మనీలో తత్వవేత్తల పేరుతో చలామణీ అవుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఫాయెర్‌బాఖ్‌పై చేసే దారుణమైన దాడులను, దూషణలను నిరాకరించి ఫాయెర్‌బాఖ్‌ను సమర్థించటానికి, ష్టార్కె చాలా కష్టపడతాడు.... సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్రం పునర్జన్మలో ఆసక్తి గలవారికి, ఇది సహజంగానే ప్రధాన విషయం, ష్టార్కెకి బహుశా ఇది చాలా అవసరంగా కనిపించి ఉండవచ్చు. మేము మాత్రం పాఠకుణ్ని, దాంతో, విసిగించదలచలేదు.

## III

మతము, నీతిశాస్త్రాలకు చెందిన తత్వశాస్త్రానికి చేరుకునేసరికి ఫాయెర్‌బాఖ్ యొక్క నిజమైన భావవాదం స్పష్టపడుతుంది. ఏ విధంగా కూడా మతాన్ని రద్దుచేయడం అతని ఉద్దేశం కాదు. దానిని లోపరహితం చేయాలనేది అతని కృషి. తత్వశాస్త్రం మతంలో జీర్ణంకావాలి.

> ''మానవ చరిత్రలోని దశలు, మత మార్పులతోనే గుర్తించదగి ఉన్నాయి. మానవుని హృదయాలలో వేళ్లూని ఉంటేనే, చారిత్రకోద్యమం మౌలిక స్వరూపాన్ని సంతరించుకుంటుంది. హృదయం తనలో మతం కూడా ఉండటానికి తగిన రూపం మాత్రమే కాదు, హృదయమే మతంయొక్క సారం.'' (ష్టార్కె ఉదహరించినది, 168వ పేజి.)

ఫాయెర్‌బాఖ్ భావాన్ననుసరించి, మతం మానవుల మధ్య హార్దిక సంబంధాలపై ఆధారపడినది. ఈ సంబంధం ఇంతవరకు, వాస్తవికతయొక్క విపరీతమైన ప్రతిబింబంలో, తన సత్యాన్ని వ్యక్తీకరించుకుంటున్నది. ఒకరు లేక పెక్కుమంది దేవతల్లో, మానవ లక్షణాల విపరీత ప్రతిబింబాల ధ్యానంలో ఇమిడి ఉంది. కాని ఇది ఇప్పుడు సూటిగా ఎట్టి ధ్యానం లేకుండా, ''నేను'' ''నీవు''ల ప్రేమరూపంలో వ్యక్తమౌతున్నది. కనుక, చిట్టచివరకు, ఫాయెర్‌బాఖ్ దృష్టిలో లైంగిక ప్రేమ, నూతన మతాన్ని ఆచరించుటలో ఒక అత్యున్నత రూపంగా, ఏకైక అత్యున్నత రూపం కాకపోయినా, రూపొందింది.

అనురాగంపై ఆధారపడిన మానవుల సంబంధాలు, ముఖ్యంగా స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు మానవాళి ఏర్పడినప్పటినుండే ఉన్నాయి. ముఖ్యంగా లైంగిక ప్రేమ గత 800 సంవత్సరాలలో, ఎంతటి అభివృద్ధిని సాధించి, ఎలాంటి స్థానాన్ని సంపాదించుకున్నదంటే, ఈ కాలంలో కవిత్వాని కంతటికీ అది అనివార్యమైన కేంద్ర బిందువైంది. రాజ్యపు అనుమతి పొందిన లైంగిక ప్రేమకు అనగా వివాహ నియమాలకు, ఉన్నత గౌరవ స్థానాన్ని కట్టబెట్టటంతో, ప్రస్తుతమున్న ప్రసిద్ధ మతాలన్నీ తమను తాము పరిమితం చేసుకున్నాయి. కాగా ఈ నియమాలన్నీ రేపు అంతర్ధానం కావచ్చు. అయినాకూడా, ఆచరణలో ప్రేమ స్నేహాలు మాత్రం ఏమీ మారవు. ఉదాహరణకు, 1793–98లో ఫ్రాన్సులో క్రైస్తవ మతం పూర్తిగా అంతర్ధానమైంది. నెపోలియన్ సైతం తిరిగి దానిని ఎంతో కష్టంమీద, వ్యతిరేకతను ఎదుర్కొన్నమీదటనే పునఃస్థాపించ గలిగాడు. ఆ మధ్య కాలంలో ఫొయెర్ బాఖ్ భావించినట్లు ఒక ప్రత్యామ్నాయం ఉండవలసిన అవసరమే కలగలేదు.

ఈ విషయంలో ఫొయెర్‌బాఖ్ భావవాదం, ఈ కింది అంశంలో ఉంది. మానవుల మధ్య గల పరస్పర సంబంధాలను, లైంగిక ప్రేమ, స్నేహం, దయ, స్వార్థత్యాగం మొదలైనవాటిని ఉన్నవి ఉన్నట్లుగా ఫొయెర్‌బాఖ్ స్వీకరించడు. ఏదో ఒక మతంతో వాటిని ముడిపెడతాడు. ఆయన దృష్టిలో ఈ మతం కూడా గతానికి చెందినదే. కాగా ఏదో మతం పేరుతో పవిత్రం చేయబడితే తప్ప, అవి వాటి పూర్తి విలువను పొందలేవని అతను వాదిస్తాడు. మానవ సహజమైన ఈ సంబంధాలు ఉన్నాయి అనేది ఆయనకు ప్రధాన విషయం కాదు. వాటిని, నిజమైన కొత్త మతంగా, భావించాలి. ఒక మతపరమైన ముద్ర వేస్తే కాని వానికి పూర్తి విలువ రాదు. మతం అనేమాట religare* అనే మాటనుండి పుట్టింది. ప్రారంభంలో అది ఒక అనుబంధాన్ని సూచించింది. కనుక ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడే ప్రతి అనుబంధమూ మతమే. భాషాపరమైన ఈ తమాషాలు, భావవాద తత్వశాస్త్రం యొక్క చివరి ప్రయత్నం. ఆ మాట వాడుకలో, చారిత్రక అభివృద్ధిలో ఏ అర్థం సంతరించుకున్నది అని కాక, దాని ధాత్వర్థాన్ని బట్టి ఆమాటకు ఏ అర్థం యివ్వాలి అనేదే వారికి ముఖ్యం. కనుక, లైంగిక ప్రేమ, స్త్రీ పురుషుల మధ్య సంభోగం, "మతం" స్థాయికి పవిత్రం చేయబడ్డది. భావవాదుల స్మృతులకు అతి ప్రీతిపాత్రమైన, మతం అనే మాట భాషలోనుండి అదృశ్యం కాకుండా ఉండేందుకే ఇలా చేయబడ్డది. పారిస్‌కు చెందిన లూయీ బ్లాంక్ వంటి సంస్కర్తలు, 40 దశకంలో సరిగ్గా ఇలాగే వాదించారు. మతంలేని మానవుణ్ణి రాక్షసుడుగా వారు భావించేవారు. వారు ఇలా అనేవారు: "Donc, l'athéisme c'est votre religion!"** ప్రకృతికి సంబంధించిన నిజమైన భౌతికవాదం

* Religare — బంధనం. — సం.

** "నాస్తికత్వం మీ మతం అన్నమాట!" — సం.

ప్రాతిపదికపై నిజమైన మతాన్ని సృష్టించాలని ఫాయెర్‌బాఖ్ వాంఛించినట్లయితే, అది ఆధునిక రసాయన శాస్త్రాన్ని నిజమైన రసవాదంగా పరిగణించడంతో సమానం అవుతుంది. దేవుడు లేకుండానే మతం ఉండగలిగితే, రసవాదం పరుసవేది లేకుండానే ఉండగలదు. ఆ మాటకొస్తే, రసవాదానికీ, మతానికీ మధ్య చాలా దగ్గర సంబంధ మున్నది. పరుసవేదికి చాలా దేవతా లక్షణాలున్నాయి. మన యుగంలోని మొదటి రెండు శతాబ్దాలలో జీవించిన ఈజిప్షియన్, గ్రీక్ రసవాదులు క్రైస్తవ మత సిద్ధాంతాన్ని పెంపు చేయటంలో కొంత పాత్ర వహించారు. కొప్, బెర్తెలోలు ఈ విషయాన్ని నిరూపించారు.

"మానవ సమాజంలోని దశలు, మత మార్పులతోనే గమనించతగి ఉన్నాయి" అన్న ఫాయెర్‌బాఖ్ ఉద్ఘాటన ఖచ్చితంగా అసత్యం. గొప్ప చారిత్రక మలుపులు, కొన్ని మతమార్పులతో కలిసి ఉన్నమాట నిజమే. ఇంతవరకూ ఉన్న మూడు ప్రపంచ మతాలకు – భౌద్ధం, క్రైస్తవ మతం, ఇస్లాంలకు – సంబంధించినంత వరకు మాత్రమే ఈ సూత్రం వర్తిస్తుంది. ప్రాచీనమైన తెగలకు చెందిన, జాతీయ మతాలు, వాటంతటకవే ఉద్భవించాయి. అవి మారలేదు. ఆ తెగ లేక ఆ ప్రజలు స్వతంత్రాన్ని కోల్పోయిన వెంటనే ఆ మతాలు నశించాయి. జర్మన్లకు సంబంధించినంతవరకు క్షీణించిపోతున్న రోమన్ ప్రపంచ సామ్రాజ్యంతోను, కొత్తగా రూపుదాల్చిన క్రైస్తవ ప్రపంచ మతంతోను కొద్దిపాటి సంబంధం ఏర్పరచుకోవటం దాని ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక అవసరాలకు సరిపోయింది. దాదాపు కృత్రిమంగా ఉద్భవించిన ప్రపంచ మతాలకు సంబంధించినంతవరకు, ముఖ్యంగా క్రైస్తవ మతం, ఇస్లాంలకు సంబంధించినంతవరకు, సాధారణ చారిత్రక ఉద్యమాలు, ఒక మత ముద్రను సంపాదించుకోడాన్ని మనం చూస్తాం. క్రైస్తవ మతానికి సంబంధించి కూడా, నిజంగా విశ్వవ్యాపిత ప్రాధాన్యం గల విప్లవాలకు మత ముద్ర వేయటం, విమోచన కొరకు బూర్జువావర్గం పోరాడిన మొదటి దశలకు మాత్రమే పరిమితమైంది. 13వ శతాబ్ది నుండి 17వ శతాబ్దివరకు ఇది వర్తిస్తుంది. ఇందుకు కారణం, ఫాయెర్‌బాఖ్ అనుకుంటున్నట్లు మానవుల హృదయాలూ, వారి మత అవసరాలూ కావు. యావత్తు మధ్య యుగాల చరిత్ర ఇందుకు కారణం. ఆ యుగాలకు, మతము, మత సిద్ధాంతం మినహా, మరో భావజాలం ఏదీ తెలియదు. కాగా, 18వ శతాబ్దిలో బూర్జువావర్గం తగినంతగా బలపడ్డది. తన స్వంత వర్గ ప్రయోజనాలకు తగిన స్వంత భావజాలాన్ని ఏర్పరచుకోసాగింది. అప్పుడది నిర్ణయాత్మకమైన మహా విప్లవాన్ని, ఫ్రెంచి విప్లవాన్ని నిర్వహించింది. కేవలం, న్యాయశాస్త్ర, రాజకీయపరమైన భావాలకు మాత్రమే అది విజ్ఞప్తి చేసింది. మతం తన మార్గానికి అడ్డువచ్చినంత మేరకే మతాన్ని గురించి అది పట్టించుకుంది. పాత మతం

స్థానే, కొత్త మతం స్థాపించాలనే భావమే బూర్జువావర్గానికి రాలేదు. ఈ ప్రయత్నంలో రోబెస్‌ప్యేర్ ఎలా విఫలమైనాడో అందరికీ తెలుసు.*

మనం నివసించవలసివచ్చిన ఈ సమాజం, వర్గవైరుధ్యాలపైన, వర్గపాలనపైన ఆధారపడి ఉంది. కనుక ఇతర మానవులతో కేవలం మానవ భావావేగాల ప్రాతిపదికపై సంబంధాలు ఏర్పరచుకోగల అవకాశం చాలావరకు తగ్గిపోయింది. ఈ మానవ భావావేగాలను, మతం పేరుతో పైకెత్తి ఈ సంబంధాలను మరింతగా తెంచివేసుకోవలసిన అవసరం లేదు. అదే విధంగా, గొప్ప చారిత్రక వర్గపోరాటాలను గురించిన అవగాహన, ముఖ్యంగా జర్మనీలో, ఇప్పటికీ అమలులో వున్న చరిత్ర రచన ద్వారా చాలావరకు మరుగునపడ్డది. ఈ పోరాటాల చరిత్రను, మత చరిత్రకు కేవల అనుబంధంగా మార్చి, ఈ అవగాహనను పూర్తిగా అసాధ్యం చేయవలసిన అవసరమూ మనకు లేదు. ఫాయెర్‌బాఖ్‌కంటె మనం ఎంత ముందుకు సాగామో, ఇక్కడనే, ఈ పాటికే మనకు అర్థమౌతున్నది. తన నూతన ప్రేమ మతాన్ని శ్లాఘిస్తూ ఫాయెర్‌బాఖ్ రాసిన అతి శ్రేష్ఠమైన భాగాలు మనకు ఏ మాత్రం పఠన యోగ్యాలుగా లేవు.

ఫాయెర్‌బాఖ్ శ్రద్ధతో పరిశీలించే ఒకేఒక మతం — క్రైస్తవ మతం. ఏకేశ్వరోపాసనపై ఆధారపడిన పశ్చిమార్ధగోళపు ప్రపంచమతం. క్రైస్తవుల దేవుడు మానవుని ముకుర ప్రతిబింబమనీ, విచిత్ర ఊహ అనీ అతడు నిరూపిస్తాడు. నిజానికి ఈ దేవుడు సైతం, సుదీర్ఘ సాధారణీకరణ క్రమ ఫలితం, అతః పూర్వపు తెగల, జాతుల పెక్కు దేవతల రాశీభూత సారము. ఈ దేవుడు ఎవని ప్రతిబింబమో, ఆ మానవుడు కూడా నిజమైన మానవుడు కాడు. అనేకులైన నిజమైన మానవుల, సాధారణీకృత సారాంశం. అతడు కూడా ఒక ఊహా చిత్రమే. ప్రతి పేజిలోనూ, ఇంద్రియానుభూతిని బోధిస్తూ, వాస్తవంలో, నిర్దిష్టంలో లీనమైపోవాలనే ఫాయెర్‌బాఖ్ మానవుల మధ్య లైంగిక సంబంధాలు మినహాయించి ఏ ఇతర విషయాన్ని ప్రస్తావించసాగినా, పూర్తిగా ఊహాలోకంలోకి పయనిస్తాడు.

ఈ సంబంధాలలో ఒక్కటి మాత్రమే అతని హృదయానికి నచ్చినది. అదే నీతి. ఇందులో కూడా, హేగెల్‌తో పోల్చిచూస్తే ఫాయెర్‌బాఖ్ దుర్భర దారిద్ర్యం మనకు బోధపడుతుంది. హేగెల్ నీతిశాస్త్రం, లేక నైతిక ప్రవర్తనా నియమాలు అన్నవి న్యాయశాస్త్రతత్వం దానిలో యీ కిందివి యిమిడివున్నాయి: (1) అనిర్దిష్ట న్యాయశాస్త్రం, (2) నీతిశాస్త్రం, (3) సాంఘిక నడవడిక నియమావళి, వీటికి సంబంధించినవే: కుటుంబం, పౌర సమాజం, రాజ్యం. ఇక్కడ వస్తువు ఎంత వాస్తవమైనదో, రూపం అంత

---

* "పరబ్రహ్మ"కు చెందిన మతాన్ని స్థాపించాలనే రోబెస్‌ప్యేర్ ప్రయత్నానికిది ప్రస్తావన. — సం.

గానూ ఆదర్శవంతమైనది. నీతిశాస్త్రంతో పాటు, న్యాయశాస్త్రం, అర్థశాస్త్రం, రాజకీయాల యావత్తు ఆవరణా ఇందులో ఇమిడి ఉంది. ఫాయెర్‌బాఖ్ విషయంలో ఇది పూర్తిగా తలకిందులైంది. రూపంలో అతను వాస్తవవాది. ఏమంటే అతడు మానవుడితో ప్రారంభిస్తాడు కనుక. కాని ఈ మానవుడు నివసించే ప్రపంచాన్ని గురించిన ప్రస్తావన ఏమాత్రమూ లేదు. కాగా ఈ మానవుడు ఎల్లప్పుడూ ఊహాత్మక మానవుడుగానే ఉంటాడు. మతతత్వ శాస్త్రంలో మాత్రమే ఇతడు జీవిస్తూ ఉంటాడు. ఇతడు, స్త్రీకి పుట్టినవాడు కాదు. ఏకేశ్వరోపాసక మతాల దేవునినుండి, పట్టునుండి గొంగళి పురుగువలె అయోనిజుడుగా ఆవిర్భవించాడు. అందుకని చారిత్రకంగా ఆవిర్భవించి, చారిత్రకంగా నిర్ణయించబడిన వాస్తవ ప్రపంచంలో ఇతడు జీవించడు. ఇతడు ఇతర మనుషులతో సంబంధం కలిగి ఉంటాడు నిజమే, కాని వారు కూడా ఇతనివలెనే ఊహాత్మక జీవులు. అతని మతతత్వశాస్త్రంలో, ఇంకా స్త్రీలు, పురుషులూ కొంతవరకు ఉంటారు. కాని అతని నీతిశాస్త్రంలో ఈ విభజన కూడా రద్దవుతుంది. దీర్ఘ విరామాల తర్వాత, ఫాయెర్‌బాఖ్ ఈకింది ప్రకటనలవంటివి చేస్తూ ఉంటాడు.

> "ప్రాసాదంలో మనిషి ఒక రకంగా, పూరిగుడిసెలో మనిషి మరో రకంగా ఆలోచిస్తాడు." "ఆకలి కారణంగా, దౌర్భాగ్యం కారణంగా, నీ శరీరంలో సత్తువ లేకపోతే, నీ బుర్రలో, మెదడులో, హృదయంలో నైతిక సత్తువ కూడా ఏమీ ఉండదు." "రాజకీయాలు మన మతం కావాలి" మొదలైనవి.

కాని ఈ సూక్తుల ద్వారా ఫాయెర్‌బాఖ్ సాధించగలిగిందేమీ లేదు. ఇవి కేవలం కొన్ని మాటలుగానే ఉండిపోయాయి. ఫాయెర్‌బాఖ్‌కు రాజకీయాలు అధిగమించలేని సరిహద్దుగా ఉన్నవని ష్టార్కె సైతం అంగీకరిస్తున్నాడు:

> "సమాజ చరిత్ర, సమాజ శాస్త్రం అతనికి అజ్ఞాత విషయం."

మంచి, చెడుల వైరుధ్యాన్ని చర్చించుటలో కూడా, హేగెల్‌తో పోల్చితే, ఫాయెర్‌బాఖ్ అతి పేలవంగా కనిపిస్తాడు.

> "'మానవుడు సహజంగా మంచివాడు' అని ఎవరైనా అంటే, ఎంతో గొప్ప విషయాన్ని తను చెప్పినట్లు అతడు భావిస్తాడు. కాని 'మానవుడు సహజంగా చెడ్డవాడు' అని చెపితే, అంతకంటె గొప్ప విషయం చెప్పినట్లు అవుతుంది అనే సంగతి అతడు మరచిపోతున్నాడు" అని హేగెల్ వ్యాఖ్యానించాడు.

హేగెల్ దృష్టిలో, చారిత్రకాభివృద్ధి చోదకశక్తి వ్యక్తమయ్యే రూపం, చెడుగు. ఇందులో రెండర్థా లున్నాయి. ప్రతి కొత్త ముందడుగూ, ఎంతో పవిత్రంగా భావించబడే భావాలకు ద్రోహం, సంప్రదాయ పరిరక్షితములైన శిథిలమూ, పురాతనమూ ఐన పరిస్థితులపై తిరుగుబాటు; ఇది మొదటి అర్థం. మరో అర్థం ఏమంటే, సరిగ్గా ఈ దుష్ట భావననే — అత్యాశ, అధికార కాంక్ష — వర్గ వైరుధ్యాలు ఏర్పడినప్పటినుండి చారిత్రక పురోగతికి చోదక శక్తులుగా పనిచేస్తున్నాయి. ఫ్యూడల్, బూర్జువా వ్యవస్థల చరిత్ర ఇందుకు, ఏకైక, నిరంతర తార్కాణం. కాగా నైతిక దుష్ప్రవర్తనయొక్క చారిత్రక పాత్రను పరిశీలించాలనే ఆలోచనే ఫాయెర్‌బాఖ్‌కు తట్టదు. చరిత్ర అతని దృష్టిలో నిగూఢమైన కార్యరంగం. అందులో అడుగుపెట్టటానికి అతడు జంకుతాడు.

> "మొట్టమొదట ప్రకృతిలో నుండి ఉద్భవించినప్పుడు మనిషి కేవలం ఒక ప్రకృతిజీవి, మానవుడు కాదు. మానవుడు — మానవుని, సంస్కృతి, చరిత్రల సృష్టి."

తన యీ ప్రవచనం సైతం, ఫాయెర్‌బాఖ్ విషయంలో కొత్త ఊహలను కలిగించక, నిష్ఫలంగానే ఉండిపోయింది.

కనుక నైతిక సూత్రాలను గురించి మనకు ఫాయెర్‌బాఖ్ చెప్పగలిగింది అతి స్వల్పం. సుఖజీవన కాంక్ష మానవుని స్వాభావిక లక్షణం. కనుక యావత్తు నీతి సూత్రాలకూ అదే ప్రాతిపదిక. కాని, సుఖాపేక్ష, రెండు విధాల సవరణను అపేక్షిస్తుంది. మన పనుల సహజ ఫలితం ఒకటి, అతి తాగుడు ఫలితం నిస్త్రాణ. మితిమీరిన అలవాట్లు అనారోగ్యానికి తోవ తీస్తాయి. ఇక రెండవది సామాజిక ఫలితం.... సుఖాపేక్షకై ఇతర వ్యక్తుల ఆకాంక్షను మనం గుర్తించకపోతే వారు ఆత్మరక్షణకు తలపడతారు. మన సుఖాపేక్షకు అడ్డు వస్తారు. కనుక మన సుఖాపేక్షను మనం నిర్వర్తించుకోవాలంటే, మన ప్రవర్తన ఫలితాలేవో మనం సక్రమంగా ఊహించగలిగి ఉండాలి. సుఖాపేక్షకై ఇతరుల హక్కును కూడా గుర్తించగలిగి ఉండాలి. మన విషయంలో హేతుపూర్వకమైన ఆత్మ నిగ్రహం, ఇతరులతో సంబంధాల విషయంలో ప్రేమ, తిరిగి, తిరిగి ప్రేమ — ఇవి ఫాయెర్‌బాఖ్ నైతిక సూత్రాలకు ప్రాతిపదిక. వీనినుండే ఇతర అన్ని న్యాయాలూ ఉత్పన్నమవుతాయి. ఫాయెర్‌బాఖ్ అతి ఆవేశంతో చేసే యీ కొద్ది ఉద్ఘాటనలు గానీ, ష్టార్కె గొంతు చించుకుని చేసే ప్రశంసలు గానీ, ఈ సూత్రీకరణల పలుచతనాన్నీ, అల్పత్వాన్నీ కప్పిపుచ్చలేవు.

చాలా అరుదుగా మాత్రమే, ఒక వ్యక్తి, పూర్తిగా తనలోతాను అంతర్ముఖుడై ఉంటూ, తన లాభతృష్ణను, ఇతరుల లాభతృష్ణను, తీర్చుకోగలడు. నిజానికి, ఇతర ప్రపంచంతో అతను ఎక్కువ సంబంధం పెట్టుకోవాలి. తన అవసరాలను, అనగా ఆహారం,

భిన్నలింగానికి చెందిన వ్యక్తి, పుస్తకాలు, సంభాషణ, వాదం, కార్యకలాపాలు, వాడుకోటానికీ, పనిచెయ్యడానికీ వస్తువులు — వీటన్నిటినీ అప్పుడే సాధించుకోగలడు. ఈ వస్తువులు, సాధనాలు మొదటినుంచీ సహజంగానే ప్రతి వ్యక్తిదగ్గరా ఉంటాయనైనా ఫాయెర్‌బాఖ్ నీతిసూత్రాలు భావిస్తాయి. లేకపోతే అవి నిరుపయోగమైన ఉచిత సలహా అయినా యిస్తాయి, అందుచేత, ఈ అవకాశాలు లేని వ్యక్తులకు ఆ సలహా దమ్మిడీకి కొరగాదు. ఈ విషయాన్ని ఫాయెర్‌బాఖ్ స్వయంగానే చాల సూటిగా ఈ కింది మాటలలో చెపుతున్నాడు:

> "ప్రాసాదంలో మనిషి ఒక రకంగా, పూరిగుడిసెలో మనిషి మరో రకంగా ఆలోచిస్తాడు." "ఆకలి కారణంగా, దౌర్భాగ్యం కారణంగా నీ శరీరంలో సత్తువ లేకపోతే, నీ బుర్రలో, మెదడులో, హృదయంలో నైతిక సత్తువ కూడా ఏమీ ఉండదు."

తమ సుఖాకాంక్షలను తృప్తిపరచుకొనే సమాన హక్కు ఇతరులకు కూడా ఉన్నది అనే సూత్రం ఏమైనా ముందుకు సాగిందా? అన్ని కాలాలలో, అన్ని పరిస్థితులలో ఈ సూత్రం నిర్నిబంధంగా ఆమోదించబడినట్లుగా ఫాయెర్‌బాఖ్ వాదిస్తున్నాడు. కాని ఎప్పటినుండి ఇంతటి రూఢత వచ్చింది? పూర్వకాలంలో ఏనాడైనా, బానిసలకు, యజమానులకు, మధ్య యుగాలలో భూదాసులకు, భూస్వాములకు, సుఖ సంపాదనకు సమాన హక్కు ఉన్నదనే విషయం గుర్తించబడిందా? పీడిత ప్రజల సుఖాపేక్ష నిర్దాక్షిణ్యంగా, "చట్టబద్ధంగా" పాలకవర్గపు సుఖాపేక్షకు ఆహుతి చెయ్యబడలేదా? నిజమే, అదంతా అవినీతికరమైనది. అయిత, ఈనాడు హక్కుల సమానత్వం గుర్తించబడింది. నిజమే, చాలా కాలంగా మాటలలో అది గుర్తించబడింది. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే సందర్భంలోనూ, పెట్టుబడిదారీ ఉత్పత్తిని పెంపుచేసే ఉద్దేశంలో బూర్జువావర్గం, తరగతుల అన్ని ప్రత్యేక హక్కులనూ, అనగా వ్యక్తిగత ప్రత్యేక హక్కులనూ రద్దుచేయక తప్పలేదు. మొదట్లో వ్యక్తిగత న్యాయం విషయంలోను, తరవాత రాజ్య న్యాయ విషయంలోను, వ్యక్తుల మధ్య సమానత్వం స్థాపించక దానికి తప్పలేదు. కాని వ్యక్తుల సుఖాపేక్ష, ఊహాత్మక హక్కులపై చాలా కొద్దిగా మాత్రమే ఆధారపడి ఉంది. అన్నిటికంటె హెచ్చుగా, అది భౌతిక సాధనాలపై ఆధారపడివుంది. సమాన హక్కులు అనుభవించే అత్యధిక సంఖ్యాక ప్రజలు, తమ జీవితానికి అవసరమైన కనీస అవసరాలను మాత్రమే పొందే విధంగా, పెట్టుబడిదారీ వ్యవస్థ జాగ్రత్త తీసుకుంటుంది. కనుక అత్యధిక ప్రజల సుఖాపేక్ష హక్కుకు పెట్టుబడిదారీ వ్యవస్థ, బానిస, ఫ్యూడల్ వ్యవస్థల కంటె హెచ్చు గౌరవం ఏమీ ఇవ్వదు. మానసికంగా సమానత్వం సాధించే విషయంలో, విద్యా సౌకర్యాల విషయంలో, మనం ఏమైనా అభివృద్ధి సాధించామా? "సడోవా ఉపాధ్యాయుడు"[18] సైతం ఊహాజనిత వ్యక్తి మాత్రమే కదా?

అంతేకాదు. ఫాయెర్‌బాఖ్ నీతిసూత్రాల ప్రకారం స్టాక్ ఎక్స్‌చేంజి – ఒకడు ఎప్పుడూ కూడా సరిగా గుణించుకొని అంచనా వేసుకుంటే చాలు – అత్యున్నత నైతిక ప్రమాణ దేవాలయం. నాకు గల సుఖాపేక్ష, నన్ను స్టాక్ ఎక్స్‌చేంజికి నడిపిస్తే, అక్కడ నా కార్యాచరణ ఫలితాలను చక్కగా గ్రహించగలిగి, నష్టాలు రాకుండా, ఎప్పుడూ లాభాలే వచ్చేటట్లు ప్రవర్తిస్తే, అనగా జూదంలో గెలుపు ఎప్పుడూ నాదే అయితే, నేను ఫాయెర్‌బాఖ్ సూత్రాలకు కట్టుబడి ఉన్నట్లే. నా కార్యాచరణ, సుఖ సాధనకై ఇతరులు చేసే కార్యాచరణకు అడ్డు రావటంలేదు గదా? ఇతర వ్యక్తి కూడా నా వలెనే, ఐచ్ఛికంగా స్టాక్ ఎక్స్‌చేంజిలో ప్రవేశించాడు. నాతో జూదం ఆడటంలో, అతని సుఖాపేక్షను అతను సాధించుకోటానికి యత్నించాడు. అతడు డబ్బు నష్టపోతే, దాని అర్థం, అతడు అవినీతిగా ప్రవర్తించాడన్నమాట. అతని తప్పుడు అంచనాలు అతని ఓటమికి కారణం. అతనికి తగిన గుణపాఠాన్ని నేర్పాను. అందుకు నన్ను నేను ఆధునిక రాడమంథస్* వలె అభినందించుకున్నా దోషం లేదు. స్టాక్ ఎక్స్‌చేంజిలో ప్రేమ కూడా రాజ్యం చేస్తుంది. ఏమంటే, ఏదో మానసిక సంతృప్తి అనే అర్థం మాత్రమే ఆ మాటకు ఇవ్వకుండా ఉంటే, ప్రతి వ్యక్తీ ఇతర వ్యక్తిలో, స్వసుఖాపేక్ష పరిపూర్తిని చూస్తున్నాడు. ప్రేమ సాధించవలసింది, ఆచరణలో అమలు జరగవలసిన తీరు ఇదే కదా! నా చర్యల ఫలితాలను గురించిన సరియైన అంచనాతో నేను జూదం ఆడినట్లయితే, తద్వారా జయం గెలుచుకొంటే, నేను, నైతిక ప్రవర్తనకు సంబంధించి ఫాయెర్‌బాఖ్ విధించిన నియమాలన్నిటినీ అమలు జరిపినట్లే. దీనికి తోడు నేను ధనవంతుణ్ణి కావచ్చు. మరోమాటలో చెప్పాలంటే ఫాయెర్‌బాఖ్ నైతిక సూత్రాలు, సరిగా, ఆధునిక పెట్టుబడిదారీ సమాజ అవసరాలకు తగినట్లుగా రూపొందాయి. బహుశా ఫాయెర్‌బాఖ్ ఇలా ఆశించక పోవచ్చు, అనుకోక పోవచ్చు.

ఇక ప్రేమ! – అవును ఫాయెర్‌బాఖ్ దృష్టిలో, ప్రేమ ప్రతిచోటా ఉంది, అన్ని వేళలా ఉంది. నిత్యజీవితంలోని ఆటంకాలన్నిటినీ అధిగమించడానికి అదే దివ్యౌషధం. అందునా పరస్పర విభిన్న ప్రయోజనాలు గల వర్గాలుగా చీలి ఉన్న సమాజం విషయంలో ఇది మరీ నిజం. ఇక్కడికి వచ్చేటప్పటికి, అతని తత్వశాస్త్రంలోని ఆఖరు విప్లవాంశం కాస్తా అంతర్ధానమై పోతుంది. పాత చెత్త మాత్రమే మిగులుతుంది. ఒకరి నొకరు ప్రేమించుకోండి. తరగతుల భేదం, లింగభేదం లేకుండా ఒకరి నొకరు ఆలింగనం చేసుకోండి. విశ్వవ్యాపిత పునః సమ్మేళన క్రతువు నిర్వహించండి!

క్లుప్తంగా చెప్పాలంటే, ఫాయెర్‌బాఖ్ నైతిక సూత్రాల సిద్ధాంతం, అదే విధమైన ఇతర సిద్ధాంతాలవలెనే తయారైంది. అన్ని దశలను, అందరి ప్రజలను, అన్ని పరిస్థితులను

---

* రాడమంథస్ (గ్రీక్ పౌరాణికం) – వివేకవంతుడైన, న్యాయవంతుడైన జడ్జి. – సం.

సంతృప్తి పరచటానికి అది ఉద్దేశితమైంది. కనుకనే, అది ఎక్కడా, ఏ సందర్భంలోనూ ఆచరణయోగ్యం కాకుండా పోయింది. వాస్తవ ప్రపంచానికి సంబంధించినంతవరకు, కాంట్, అనివార్య భావఖండం వలె నిరుపయోగమై పోయింది. ఆచరణలో ప్రతి వర్గమూ, ప్రతి వృత్తీ తన స్వంత నైతిక సూత్రాలను కలిగి ఉంది. దీనిని సైతం అవసరం కలిగిన ప్పుడల్లా శిక్షాభయం లేకుండా అది ఉల్లంఘిస్తూనే ఉంటుంది. అందరినీ ఐక్యం చేయ వలసిన ప్రేమ, యుద్ధాలలోను, తగాదాలలోను, కోర్టు వ్యాజ్యాలలోను, గృహ కల్లోలాలలోను, విడాకులలోను, ఒకరి నొకరు దోపిడీ చేసుకునే ఇతర అన్ని సందర్భాలలోను వ్యక్తమౌతూ ఉంటుంది.

ఫాయెర్‌బాఖ్ కలిగించిన ఈ శక్తివంతమైన ఊపు, అతనికి సైతం నిరుపయోగం గావడానికి కారణమేమిటి? అందుకొక సూటి సమాధాన ముంది. ఊహా ప్రపంచంలోనుండి బైటపడి, వాస్తవ ప్రపంచంలో అడుగు పెట్టటానికి అతడు ప్రయత్నమే చేయడు. అలా బయటపడడమంటే అతనికి మహా రోత. ప్రకృతికి, మనిషికి అతడు దృఢంగా అంటి పెట్టుకుంటాడు. కాని ఈ రెండూ అతని దృష్టిలో మాటలు మాత్రమే. నిజమైన ప్రకృతిని గురించి, నిజమైన మనిషిని గురించి ఏమి చెప్పటానికి కూడా అతడు అసమర్థుడు. ఫాయెర్ బాఖ్ ఊహా ప్రపంచంలోని మానవునినుండి నిజమైన మానవుడి దగ్గరకు రావాలంటే, మానవులను చరిత్రలో భాగస్వాములుగా చూడాలి. అలా చూడటానికే ఫాయెర్‌బాఖ్ నిరాకరిస్తున్నాడు. కనుకనే 1848వ సంవత్సరం,[19] అంటే అతని దృష్టిలో వాస్తవ ప్రపంచంనుండి పూర్తిగా తెగతెంపులు చేసుకుని, ఏకాంతవాసానికి తిరోగమించడం. ఆ ఘటనను ఫాయెర్‌బాఖ్ ఎన్నడూ గ్రహించలేదు. ఇందుకు ప్రధానంగా నిందించవలసింది ఆనాటి జర్మనీలోని పరిస్థితులనే. ఏదో ఒక మూల నిర్జీవంగా కాలం గడపవలసిన దౌర్భాగ్యాన్ని, ఆ పరిస్థితులు అతనికి కలిగించాయి.

ఫాయెర్‌బాఖ్ ఏ అడుగు వేయలేక పోయినాడో, ఆ అడుగు వేసితీరాలి. ఫాయెర్‌బాఖ్ కొత్త మతానికి కేంద్ర బిందువైన ఊహాత్మక మానవుని తొలగించి, ఆ స్థానంలో నిజ మైన మానవుల, వారి చారిత్రకాభివృద్ధికి సంబంధించిన విజ్ఞాన శాస్త్రాన్ని పెంపుచేయాలి. ఫాయెర్‌బాఖ్ దృక్పథాన్ని, ఫాయెర్‌బాఖ్ కంటె ముందుకు తీసుకుపోయే ఈ కర్తవ్యాన్ని 1845లో మార్క్స్ తన "పవిత్ర కుటుంబం" గ్రంథంలో ప్రారంభించాడు.

## IV

స్ట్రౌస్, బౌవర్, స్టిర్నెర్, ఫాయెర్‌బాఖ్ – వీరు తాత్విక రంగాన్ని వదలిపెట్టనంత వరకూ, హెగెలియన్ తత్వశాస్త్రంనుండి ఉద్భవించినవాళ్లు. "జీసస్ జీవితం," "పిడివాదం"

గ్రంథాల తర్వాత క్రౌస్, రెనాన్ మాదిరిగా తత్వశాస్త్రంలోనూ, మత చరిత్రలోనూ, సాహిత్య పరిశోధనా గ్రంథాలు మాత్రమే రాశాడు. క్రైస్తవ మతావిర్భావ చరిత్ర రంగంలో బౌవర్ చేసిన కృషి ముఖ్యమైనదే అయినప్పటికీ, అతను ఏ కొంచెమో సాధించినది యీ రంగంలో మాత్రమే. ప్రూడన్‌తో కలిపి ష్టీర్నెర్‌నీ, అతని ధోరణినీ "అరాజకవాదం" అని బకూనిన్ నామకరణం చేసిన తర్వాత కూడా, ష్టీర్నెరు ఒక విచిత్ర వ్యక్తిగానే మిగిలి పోయాడు. తత్వవేత్తగా ఫాయెర్‌బాఖ్ ఒక్కడే గణనీయుడు. కాని అన్ని ప్రత్యేక శాస్త్రా లకూ అతీతంగా విహరిస్తూ, అన్ని శాస్త్రాలనూ అనుసంధానం చేసే శాస్త్రంగా పరిగణించ బడిన తత్వశాస్త్రం అతనికి అధిగమించరాని అవరోధంగానే మిగిలిపోయింది. అతిక్రమించ వీలులేని పవిత్ర వస్తువుగానే ఉండిపోయింది. తత్వవేత్తగా కూడా అతడు సగం త్రోవలోనే ఆగిపోయాడు. కింది భాగంలో భౌతికవాది, పై భాగంలో భావవాదిగా ఉండిపోయాడు. హేగెల్‌ను విమర్శద్వారా ఏమి చెయ్యాలో తేల్చుకోగల శక్తి అతనికి లేకపోయింది. హేగెల్ ఎందుకూ పనికిరాని వాడు అంటూ పక్కకు తోసివేశాడు. నిజానికి హేగెలియన్ ఆలోచనా వ్యవస్థలోని విజ్ఞాన సర్వస్వప్రాయమైన సంపదతో పోలిస్తే, పద గుంభనతో కూడిన ప్రేమ మతాన్నీ, చేవలేని నిర్జీవమయిన నైతిక సూత్రాలనూ రూపొందించటం మినహా ఫాయెర్‌బాఖ్ సాధించిందేమీ లేదు.

హేగెలియన్ ధోరణి విచ్ఛిత్తి చెందిన మీదట, మరో ధోరణి ఆవిర్భవించింది. ఇది ఒక్కటే నిజమైన ఫలితాల నిచ్చింది. ఈ ధోరణి ప్రధానంగా మార్క్స్ పేరుతో పెన వేసుకుని ఉంది.*

---

* ఇక్కడ నేను ఒక వ్యక్తిగతమైన వివరణ ఇవ్వటానికి అనుమతించ గోరుతున్నాను. ఈ సిద్ధాంత రూపకల్పనలో నా పాత్రను గురించి ఇటీవల పదేపదే ప్రస్తావన చేయబడు తున్నది. ఈ అంశాన్ని స్పష్టం చేయటానికి నేను కొన్ని మాటలు యిక్కడ చెప్పక తప్పదు. నలభై సంవత్సరాలుగా మార్క్స్‌తో కృషిచేసిన కాలంలోనూ, అంతకు ముందూ, ఈ సిద్ధాంతానికి పునాదులు నిర్మించడంలోనూ, ముఖ్యంగా దానిని వివరించడంలోనూ నాకు కొంత స్వతంత్రమైన పాత్ర ఉన్న సంగతి నేను కాదనను. కాని ఈ సిద్ధాంతంయొక్క మౌలికమైన ముఖ్య సూత్రాలలోని ఎక్కువ భాగం, ముఖ్యంగా చరిత్ర, అర్థశాస్త్ర రంగాల లోను, అంతకంటె ఎక్కువగా వాటిని పదునైన అంతిమ రూపంలో సూత్రీకరించటంలోను, ప్రధాన పాత్ర మార్క్స్‌కే చెందుతుంది. ఏవో కొన్ని ప్రత్యేక రంగాలలో నా కృషిని మినహా యిస్తే, నేను చేసిన కృషిని, నేను లేకపోయినా మార్క్స్ చేయగలిగేవాడు. కాగా మార్క్స్ సాధించింది మాత్రం నేను చేయగలిగేవాడిని కాను. మార్క్స్ మా అందరికంటె ఉన్న తుడు, దూరదృష్టి గలవాడు. మా అందరికంటె త్వరగా, విస్తృతమైన ఆలోచన చేయ

ఇక్కడకూడా భౌతికవాద దృక్పథం చేపట్టిన మీదటనే హెగెలియన్ తత్వశాస్త్రం నుండి విడివడటం సాధ్యమయింది. అనగా వాస్తవ ప్రపంచాన్ని — ప్రకృతిని, చరిత్రను — ఉన్నదున్నట్లుగా, భావవాద దురభిప్రాయాలు ముందుగా ఏర్పరచుకొనని వారికి కనబడే విధంగా, అర్థం చేసుకోవాలని నిర్ణయించబడ్డది. వాస్తవ ఘటనల మధ్య ఊహాజనిత అంతః సంబంధాన్నీ, ఘటనల నిజస్వభావానికి అనుగుణం కాని భావవాద దురభిప్రాయాలన్నిటినీ నిర్దాక్షిణ్యంగా తోసిపుచ్చాలని నిశ్చయించబడ్డది. నిజానికి భౌతికవాదం అంటే ఇంతకంటే వేరేమీ కాదు. మొట్టమొదటి సారిగా యిక్కడ భౌతికవాద దృక్పథాన్ని చిత్తశుద్ధితో, కనీసం దాని మౌలిక మినహాయింపులు లేకుండా వర్తింపచేయటం జరిగింది.

హెగెల్‌ను కేవలం పక్కకు నెట్టలేదు. పైపెచ్చు, అతని సిద్ధాంతంలోని విప్లవ విభాగాన్ని, పైన వివరించినట్లు ఆయన గతితార్కిక విభాగాన్ని పునాదిగా తీసుకుని మనం ముందుకు సాగుతాము. కాని దాని హెగెలియన్ రూపంలో ఈ పద్ధతి ప్రయోజనకారి కాదు. హెగెల్ దృష్టిలో గతితర్కం అంటే, భావనయొక్క స్వీయాభివృద్ధి. అఖండ భావం అనేది అనాదిగా అస్తిత్వంలో ఉన్నది. ఎక్కడ ఉన్నదో మాత్రం తెలియదు. యావత్తు వాస్తవ ప్రపంచానికీ అదే నిజమైన సజీవమయిన ఆత్మ. అది అన్ని ప్రాథమిక దశలగుండా అభివృద్ధి చెందుతుంది. ఈ దశలన్నీ "తర్కం" అనే గ్రంథంలో ఉన్నాయి. వాటిని గురించి సుదీర్ఘమైన వివరణకూడా ఉంది. పిమ్మట ఈ అఖండ భావం, ప్రకృతిగా మారిపోవడంద్వారా తనను తాను అన్యథాకరించుకొంటుంది. అక్కడ, తనను గురించిన ఆత్మజ్ఞానం లేక, ప్రకృతి అవశ్యకత పేరుతో ఈ అఖండ భావం, ఒక నూతన పరిణామాన్ని చెందుతుంది. చివరకు తిరిగి, మానవుని ఆత్మచైతన్యంగా పునరావిర్భవిస్తుంది. ఈ ఆత్మచైతన్యం తిరిగి చరిత్రలో ప్రాథమిక రూపంనుండి విస్తరిస్తుంది. చివరకు ఈ అఖండ భావం తిరిగి హెగెలియన్ తత్వశాస్త్రంలో తన పూర్వపు స్థానాన్ని పొందుతుంది. అందుకని హెగెల్ దృష్టిలో, ప్రకృతిలోనూ, చరిత్రలోనూ వ్యక్తమయ్యే గతితార్కిక అభివృద్ధి అనగా కింది స్థాయినుండి పైస్థాయికి జరిగే అభ్యుదయకర చలనంలోని కార్యకారణ అంతస్సంబంధం, తాత్కాలిక ఓటములను చెందినప్పటికీ, వంకరటింకర మార్గాలన్నిటినీ అధిగమించి చివరకు నిలదొక్కుకుంటుంది. ఈ అభివృద్ధి అఖండ భావం అనాదిగా అనుక్రమించే అంతర్గత అభివృద్ధికి ప్రతిబింబం మాత్రమే. ఈ పరిణామం ఎక్కడ జరుగుతున్నదో ఎవరికీ తెలియదు. కాని ఆలోచించే మానవ మేధస్సుకు వెలుపల ఈ పరిణామం జరుగుతు

---

గలిగేవాడు. మార్క్స్ మహా మేధావి. మేము మహా అయితే ప్రతిభావంతులం. ఆయన లేకపోతే, మొత్తంమీద ఈ సిద్ధాంతం యీనాడున్న మాదిరిగా రూపొందేది కాదు. కనుకనే ఈ సిద్ధాంతం సహజంగా ఆయన పేరుతో ముడివడి ఉంది. (ఎంగెల్స్ వివరణ.)

న్పదనటం మాత్రం తథ్యం. హేగెల్ ప్రతిపాదించిన ఈ సైద్ధాంతిక వక్రీకరణను మొదట నిర్మూలించాలి. మేము తిరిగి భావాలను, భౌతికవాద పరంగా, మా మెదడులో ఊహించ సాగాము. ఈ భావాలు వాస్తవ విషయాలకు ప్రతిబింబాలు. వాస్తవ విషయాలు, వివిధ దశల లోని అఖండ భావనకు ప్రతిబింబాలనే మాటను తోసిపుచ్చాము. ఈ విధంగా గతితర్కం సాధారణ చలన సూత్రాల శాస్త్రంగా, భౌతిక ప్రపంచం, మానవ మేధస్సుకు సంబంధిం చిన చలన సూత్రాల శాస్త్రంగా, రూపు దాల్చింది. ఈ రెండు రకాల చలన సూత్రాలూ మూలంలో అభేద్యమయినవి. కాని వాటి వ్యక్తీకరణలో తేడా వుంది. ఏమంటే, మానవ మేధస్సు ఈ సూత్రాలను చైతన్య సహితంగా అమలుచేస్తుంది. కాగా ప్రకృతిలోనూ, ఇంతవరకు చాలావరకు చరిత్రలోనూ ఈ సూత్రాలు చైతన్యరహితంగా, హెచ్చుభాగం ఆవశ్యకత రూపంలో, యాదృచ్ఛిక ఘటనలుగా పైకి కనబడే అసంఖ్యాకమయిన ఘటనల సముదాయ రూపంలో వ్యక్తమవుతూ వచ్చాయి. కనుక భావాల గతితర్కం, వాస్తవ ప్రపంచంలోని గతితర్కంయొక్క ప్రతిబింబం మాత్రమే. ఈవిధంగా హేగెల్ గతితర్కం సరిగా నిల బెట్టబడ్డది, లేక అంతవరకూ తలకిందుగా వున్నదల్లా, దాని కాళ్లమీద నిలబెట్టబడ్డది. ఈ భౌతికవాద గతితర్కం, అనేక సంవత్సరాలపాటు మా అత్యుత్తమమైన పనిముట్టుగా, అతి నిశితమైన ఆయుధంగా ఉపయోగపడుతున్నది. ఇలాంటి గతితర్కం, మాతోనూ, హేగెల్‌తోనూ సంబంధం లేకుండా ఒక జర్మన్ కార్మికుడు యోసెఫ్ డీట్స్‌గెన్‌చేత కూడా కనుగొనబడ్డది.*

ఈ విధంగా చిట్టచివరకు, హేగెలియన్ తత్వశాస్త్రంలోని విప్లవ విభాగం పునరుద్ధ రించబడ్డది. అదే సమయంలో ఈ విప్లవ విభాగం ఆసాంతం కొనసాగకుండా, హేగెల్ తగి లించిన భావవాద సంకెళ్ళ తొలగించబడ్డాయి. ప్రపంచాన్ని ముందుగా నిర్మితమైన వస్తువుల సముదాయంగా భావించరాదు. నిరంతర పరిణామ క్రమాల సముదాయంగా గ్రహించాలి. పైకి స్థిరంగా కనిపించే వస్తువులు, వాటి మానసిక ప్రతిబింబాలైన భావాలతో సహా, నిరంతర మార్పుకు లోనవుతూ ఉంటాయి. ఆవిర్భవిస్తూ, అంతరిస్తూ ఉంటాయి. స్థూల దృష్టికి యాదృచ్ఛికతా, తాత్కాలిక తిరోగతీ కనిపించినా అభ్యుదయకరమైన పురోగతి చిట్టచివరకు పైచేయి సంపాదిస్తూనే ఉంటుంది. ఈ గొప్ప మౌలిక భావన, మూలాధార మైన భావన, ముఖ్యంగా హేగెల్ తదనంతరం, సామాన్య చైతన్యంలో పూర్తిగా అంతర్భూత మైంది. సాధారణ రూపంలో ఈ సూత్రాన్ని కాదనేవారే ఈనాడు లేరు. కాగా మాటల్లో ఈ సూత్రాన్ని ఆమోదించటం, వాస్తవ ఆచరణలో వివిధ విజ్ఞాన విభాగాలకు దీనిని

---

* డీట్స్‌గెన్ అను కార్మికుడు రాసిన "మానవ మేధోకృషి స్వభావం — ఒక శ్రమజీవి వర్ణన" ఈ గ్రంథం హాంబుర్గ్‌లో మైస్నెర్‌చేత ప్రచురించబడింది. (ఎంగెల్స్ వివరణ.)

వర్తింపచేయటం, ఈ రెండూ వేర్వేరు విషయాలు. కాగా ఈ దృక్పథంనుండే ఎల్లప్పుడూ పరిశోధన సాగినట్లయితే, శాశ్వత పరిష్కారాలు, శాశ్వత సత్యాల కొరకు వెదకులాట పూర్తిగా నిలిచిపోతుంది. మానవ సంపాదిత జ్ఞానానికి అనివార్యంగా కొన్ని పరిమితులున్నాయనీ, ఏ పరిస్థితులలో జ్ఞానాన్ని సంపాదించామో, ఆ పరిస్థితుల ప్రభావం తప్పనిసరిగా ఉంటుం దనీ పరిశోధకుడు గ్రహించి తీరుతాడు. అంతేకాదు, సత్యం, అసత్యం, మంచి, చెడు, అభిన్నమూ, విభిన్నమూ, ఆవశ్యకత, యాదృచ్ఛికత అను భావాల మధ్య అధిగమించ వీలులేని వైరుధ్యాలున్నాయనే పాత అధిభౌతిక దృష్టికి బానిస కాబోడు. ఈ వైరుధ్యాలు, పాక్షిక రూఢత్వం మాత్రమే కలిగి ఉన్నాయనీ, ఈరోజు సత్యంగా గుర్తించబడినదానికి అసత్య పార్శ్వం కూడా ఒకటి ఉన్నదనీ, అది మున్ముందు వ్యక్తమౌతుందనీ గుర్తిస్తాడు. అదే విధంగా ఈనాడు అసత్యంగా గుర్తించబడిన దానికి సత్యపార్శ్వం కూడా ఒకటున్నదనీ, ఆ కారణంగా, ఇంతకుముందు అది సత్యంగా గుర్తించబడి ఉండవచ్చుననీ గ్రహిస్తాడు. అనివార్యతగా ఏది పరిగణించబడుతున్నదో, అది కేవలం కొన్ని యాదృచ్ఛికతల సముదాయ మేననీ, యాదృచ్ఛిక ఘటనలుగా పైకి కనబడేవాటి వెనుక ఆవశ్యకత అదృశ్యంగా ఉండే ఉంటుందనీ — ఈ క్రమాన్ని గుర్తిస్తాడు.

పూర్వకాలపు ఆలోచనా, పరిశీలనా పద్ధతిని హేగెల్ "అధిభౌతికం" అని పిలిచాడు. వస్తువులు ముందుగా నిర్మితమైనవి, స్థిరమైనవి, మార్పులేనివి అని ఈ ఆలోచనా పద్ధతి భావిస్తుంది. ఈ ఆలోచనా పద్ధతి అవశేషాలు ఇంకా ప్రజల మనస్సులను వేధిస్తూనే ఉన్నాయి. ఇలా ఉండటానికి ఆనాడు బలమైన చారిత్రక సమర్థన ఉన్నది. పరిణామక్రమా లను పరిశీలించే ముందు, వస్తువులను పరిశీలించటం అవసరం. ఒక వస్తువు ఏదో ముం దుగా తెలుసుకోవాలి. ఆ పిమ్మటనే అందులో వచ్చే మార్పు లేవో తెలుసుకోవటం సాధ్యం. ప్రకృతి విజ్ఞానశాస్త్రం విషయంలో ఇదే సూత్రం వర్తిస్తుంది. వస్తువులను పరిపూర్తి చెందిన మూర్తులుగా పాత అధిభౌతికవాదం పరిశీలించింది. సజీవ నిర్జీవ వస్తువులను సంపూర్ణ మూర్తులుగా భావించిన ప్రకృతి విజ్ఞానశాస్త్రంనుండి ఈ ఆలోచనా పద్ధతి ఆవిర్భవించింది. ఈ పరిశోధన పురోగమించే కొద్దీ కొంతదూరం సాగిన పిమ్మట, నిర్ణ యాత్మకమైన ముందడుగు అసాధ్యమైంది. ప్రకృతిలోని వస్తువులు పొందే మార్పులను క్రమబద్ధంగా పరిశీలించ వలసిన సమయం ఆసన్నమైంది. దాంతో తత్వశాస్త్ర రంగంలో కూడా, పాత అధిభౌతికవాదానికి మృత్యునాదం వినిపించింది. నిజానికి, గత శతాబ్దం ఆఖరు దాకా, ప్రకృతిశాస్త్రం ముఖ్యంగా సమాచార సేకరణ శాస్త్రంగానే వుండగా, పరిపూర్ణ వస్తువులను గురించిన శాస్త్రంగానే వుండగా, మన శతాబ్దంలో శాస్త్రం ప్రధానంగా క్రమవ్యవస్థీకరణ విజ్ఞానశాస్త్రమైంది. పరిణామ క్రమాల శాస్త్రం, వస్తువుల పుట్టుక, పెరుగుదలల శాస్త్రం, ప్రకృతి పరిణామాలన్నిటినీ మహా సముదాయంగా అనుబంధించే

శా(స్త్రం అయింది. వృక్ష, జంతు జాలాలలో జరిగే మార్పులను పరిశీలించే శరీరశా(స్త్రం, జీవకణంనుండి పరిపక్వతవరకు అంగ నిర్మాణం పొందే మార్పులను అధ్యయనం చేసే పిండాభివృద్ధి శా(స్త్రం, భూమి పొరలు (క్రమబద్ధంగా ఎలా ఏర్పడ్డవో పరిశోధించే భూవిజ్ఞాన శా(స్త్రం — ఇవన్నీ మన శతాబ్దంలో ఆవిర్భవించినవే.

కాని వీటన్నిటికీ మించి మూడు గొప్ప ఆవిష్కరణలు జరిగాయి. (ప్రకృతి పరిణామాల అంతస్సంబంధాలను గురించిన మన పరిజ్ఞానాన్ని, హద్దులు, అవధులు దాటించిన ఆవిష్కరణలు అవి. ఇందులో మొదటిది జీవకణాన్ని కనుక్కోవడం. ఈ జీవకణం యొక్క గుణింపు విభజనల ద్వారా యావత్తు వృక్ష, జంతు శరీరం అభివృద్ధి చెందుతున్నది. అన్ని ఉన్నత జీవరాసుల అభివృద్ధి, పెరుగుదల ఒకే సామాన్య సూ(త్రాన్ని అనుసరిస్తుందని వెల్లడైంది. అంతేకాదు, జీవకణంయొక్క మార్పు చెందే సామర్థ్యం తెలుసుకున్న మీదట అంగనిర్మాణం కేవలం వ్యక్తిగత పరిణామానికి మా(త్రమే గాక, జీవరాసుల మార్పిడికి కూడా తోవతీయగలదనే అంశం నిరూపణ అయింది. రెండవది శక్తి రూపాంతరీకరణ. నిర్జీవ (ప్రకృతిలో (ప్రధానంగా వ్యక్తమయ్యే అన్ని శక్తులు, యాం(త్రిక శక్తి, ఉష్ణం, ధార్మికశక్తి (కాంతి, ధార్మికోష్ణత), విద్యుచ్ఛక్తి, అయస్కాంత శక్తి, రసాయనికశక్తి — ఇవన్నీ విశ్వవ్యాపిత చలనశక్తియొక్క విభిన్న వ్యక్తీకరణలు మా(త్రమే. నిశ్చితమైన నిష్పత్తులలో ఇవి ఒకరూపంలోనుంచి మరొక రూపానికి మారుతాయి. ఒక రూపంలో నిశ్చిత పరిమాణం అంతరిస్తే, మరో రూపంలో ఒక నిశ్చిత పరిమాణం ఆవిర్భవిస్తుంది. ఈ విధంగా యావత్ (ప్రకృతి చలనం, ఒక రూపంనుండి మరొక రూపంలోకి మార్పు చెందే నిరంతర (క్రమంగా నిరూపణ అయింది. చివరి విషయం డార్విన్ ఆవిష్కరణ. (ప్రకృతిలో నేడు అగుపించే జీవరాసులన్నీ, మానవుడితో సహా, కొన్ని (ప్రాథమిక ఏకకణ జీవుల పరిణామ (క్రమంలో ఆవిర్భవించినవనీ, తిరిగి ఈ ఏకకణ జీవులు, (ప్రోటోప్లాజం లేక ఆల్బుమిన్ (శ్వేతధాతువు)నుండి ఏర్పడ్డాయనీ, ఇవి రసాయనిక మార్పుల ఫలితంగా ఏర్పడ్డాయనీ — దీనినంతటినీ ఒక (క్రమబద్ధమైన రూపంలో డార్విన్ నిరూపించాడు.

ఈ మూడు ఆవిష్కరణల మూలంగానూ, (ప్రకృతి విజ్ఞానశా(స్త్రంలోని ఇతర అపార పురోగతి ఫలితంగానూ, కొన్ని నిర్దిష్ట రంగాలలో (ప్రకృతి పరిణామాల అంతస్సంబంధాన్నేకాక, ఈ నిర్దిష్ట రంగాల మొత్తం అంతస్సంబంధాన్ని కూడ మనం ఇప్పుడు నిరూపించగలిగే స్థితికి చేరుకున్నాం. (ప్రకృతి విజ్ఞానశా(స్త్రం సమకూర్చిన సమాచారం, అనుభవాల (ప్రాతిపదికపైననే (ప్రకృతిలోని యావత్తు అంతస్సంబంధాలనూ దాదాపు సమ(గ్రంగా (క్రమబద్ధంగా మనం యిప్పుడు నిరూపించగలం. ఇట్టి సమ(గ్ర సమన్వయం, పూర్వం (ప్రకృతి తత్వశా(స్త్రమనబడేదాని బాధ్యతగా ఉండేది. వాస్తవమైన, కాగా అజ్ఞాతమైన అంతస్సంబంధాల స్థానంలో, ఊహాజనిత సంబంధాలను పెట్టి, ఘటనలు

దొరకనప్పుడల్లా స్వంత ఊహలను పొదిగి ఊహాజనిత భావ శకలాలతో ఖాళీలను భర్తీచేసి, ప్రకృతి తత్వశాస్త్రం తన బాధ్యతను నెరవేర్చింది. ఈ వరుసక్రమంలో అది కొన్ని గొప్ప ఆలోచనలను వెల్లడించింది. అనేక గొప్ప ఆవిష్కరణలను ముందుగా ఊహించింది. కాగా అదే సమయంలో నిరర్థకమైన చాల చెత్తను కూడా చెప్పింది. నిజానికిది అనివార్యం. ఈనాడు, ప్రకృతి విజ్ఞానశాస్త్ర పరిశోధనా ఫలితాలను గతితార్కిక దృష్ట్యా అర్థం చేసుకోవలసిన సమయంలో, అనగా వాటి పరస్పర అంతస్సంబంధాలను గ్రహించవలసిన సమయంలో, మన కాలానికి తగిన "ప్రకృతి వ్యవస్థను" రూపొందించుకోవలసిన సమయంలో, ఈ అంత స్సంబంధాల గతితార్కిక స్వభావం, వారి ఇష్టానికి వ్యతిరేకంగానే, ప్రకృతి శాస్త్రజ్ఞుల, అధిభౌతిక మేధోతలాలపై, తోసుకు వస్తున్నది. ఈనాడు, ప్రకృతి తత్వశాస్త్రానికి పరిసమాప్తి జరిగింది. దానిని పునరుజ్జీవింప చేయాలనే ప్రతి ప్రయత్నమూ, కేవలం నిరర్థకం మాత్రమే కాదు, వెనక అడుగు కూడా.

ప్రకృతి విషయంలో — ప్రకృతికి కూడా చారిత్రకాభివృద్ధి క్రమం ఉన్నదని ఇప్పుడు గుర్తించబడుతున్నది — ఏది వర్తిస్తుందో సమాజ చరిత్రలోని అన్ని శాఖలకూ, అన్ని శాస్త్రాల సముదాయానికీ, అదే సూత్రం వర్తిస్తుంది, విజ్ఞానశాస్త్రాలన్నీ మానవ సమస్యలనే చర్చిస్తాయి (దైవిక సమస్యలూనూ). ఇక్కడ కూడా చరిత్ర, మానవ హక్కులు, మనం మొదలైనవాటికి సంబంధించిన తత్వశాస్త్రం, వాస్తవ విషయాల్లో ప్రదర్శింపబడే వాస్తవ అంతస్సంబంధం స్థానంలో తత్వవేత్త మనస్సులో కల్పింపబడిన ఒక అంతస్సంబంధంలో యిమిడి వుంది; మొత్తంగానూ, దాని విడి భాగాలలోనూ చరిత్రను భావాల క్రమానుగత అభివృద్ధి ఫలితంగా గ్రహించడంలో — ఈ భావాలు అనివార్యంగా, తత్వవేత్త స్వంత భావాలే అయి ఉంటాయి — యిది యిమిడి వుంది. అతని దృష్టిలో, ముందుగా నిర్ణయమైన ఒక లక్ష్యం దిశగా చరిత్ర పురోగమిస్తున్నది. ఈ నడక ఉద్దేశపూర్వకంగా జరిగేదికాదు, ఐనా అనివార్యమైనది. ఉదాహరణకు, హెగెల్ దృష్టిలో అఖండ భావ ఆవిష్కరణ ఈ పురోగతి లక్ష్యం. అఖండ భావం దిశగా జరిగే అప్రతిహతమైన ఈ నడక, చరిత్ర ఘటనల మధ్యగల అంతస్సంబంధాన్ని వివరిస్తుంది. ఇదొక కొత్తతరహా నిగూఢమైన విధికృతం. దీనికి చైతన్యం లేదు, లేక క్రమంగా చైతన్యం ఏర్పడుతుంది. వాస్తవమైన, ఐతే అప్పటికి ఇంకా అగోచరంగా ఉన్న అంతస్సంబంధాల స్థానంలో ఈ విధి నిర్ణయం ప్రతిష్ఠించబడ్డది. కనుక ఇక్కడకూడా, ప్రకృతి రంగంలో వలెనే, ఊహాకల్పిత కృత్రిమ అంతస్సంబంధాలన్నిటినీ పక్కకు నెట్టివేయవలసి ఉంది. వాస్తవ అంతస్సంబంధాలను పరిశోధించవలసి ఉంది. మానవ సమాజ చరిత్రలో నిర్ణయాత్మకంగా నిరూపితమయ్యే సాధారణ చలన సూత్రాలను పరిశోధించటమనే కర్తవ్యంగా చిట్టచివరకు ఇది తేలుతుంది.

ఒక విషయంలో మాత్రం సమాజాభివృద్ధి చరిత్ర, ప్రకృతి చరిత్రకంటే పూర్తిగా

భిన్నంగా ఉంటుంది. ప్రకృతిలో, ప్రకృతిపై మానవ ప్రభావాన్ని వదిలేసిన మేరకు, చైతన్య రహితమైన శక్తులు, గుడ్డిగా ఒకదానిపై ఒకటి ప్రతిచర్యలు జరుపుతూ ఉంటాయి. వీటి మొత్తం కార్యాచరణ ఫలితంగా, సాధారణ నియమం అమలులోకి వస్తూ ఉంటుంది. జరిగేదానిలో ఏ ఒక్కటీ కూడా, పైపైన వ్యక్తమయ్యే అసంఖ్యాక యాదృచ్ఛిక ఘటనలలోగాని, ఈ యాదృచ్ఛిక ఘటనలలో అంతర్గర్భితంగా వ్యక్తమయ్యే నియమబద్ధమైన అంతిమ ఫలితాల విషయంలోగాని – ముందుగా ఆశించిన లక్ష్యం మాదిరిగా సంభవించదు. తద్విరుద్ధంగా, సమాజ చరిత్రలో, అందరూ చైతన్యం కలిగిన పాత్రధారులుగా, ఆలోచనతోనూ, ఆవేశంతోనూ పనిచేసే వారుగా, నిర్దిష్ట లక్ష్యాలకొరకు పనిచేసే మనుషులుగా ఉంటారు. చైతన్యపూరిత ప్రయోజనం లేకుండా, ఉద్దేశిత లక్ష్యం లేకుండా, ఏ ఒక్క పనీ జరగదు. చరిత్ర పరిశోధనకు, ముఖ్యంగా విడివడిన ఘటనలకు, కాలాలకు సంబంధించిన పరిశోధనకు ఈ వ్యత్యాసం ఎంతో విలువైనది. కాని, చరిత్రగతి, ఆంతరంగిక సూత్రాలపై ఆధారపడి నిర్ణయించబడుతుందనే వాస్తవాన్ని మాత్రం ఈ వ్యత్యాసం మార్చలేదు. ఏమంటే ఈ రంగంలో కూడా, వ్యక్తుల చైతన్య సహితమైన అభీష్టాలెన్ని ఉన్నా, ఉపరితలం పైన, దాదాపు యాదృచ్ఛికతే రాజ్యం చేస్తూ ఉంటుంది. ఆశించినది అరుదుగా మాత్రమే జరుగుతుంది. అత్యధిక సందర్భాలలో, అసంఖ్యాకమైన అభీప్సితాలు పరస్పరం ఘర్షణ పడతాయి. వ్యతిరేకంగా పనిచేస్తూ ఉంటాయి. లేక ఈ లక్ష్యాలు అసలు మొదటి నుండీ ఆచరణ దుస్సాధ్యాలుగానే ఉంటాయి లేక వాటిని అమలు జరపటానికి తగిన సాధనాలు కొరవడుతూ ఉంటాయి. ఈవిధంగా అసంఖ్యాకమైన వ్యక్తుల అభీష్టాలు, కార్యాచరణల ఘర్షణ, చరిత్ర రంగంలో కూడా, చైతన్యరహిత ప్రకృతిరంగంతో పూర్తిగా తుల్యమైన పరిస్థితులనే కలిగిస్తాయి. కార్యాచరణ లక్ష్యాలు ముందుగా ఊహించబడతాయి. వాస్తవ ఆచరణలో మాత్రం ముందుగా ఊహించని ఫలితాలు సంభవిస్తూ ఉంటాయి. లేక లక్ష్యాలకు అనుగుణమైనవిగా ఫలితాలు పైకి కనిపించినా, ఉత్తరోత్తరా సంభవించే పరిణామాలు ఏమాత్రం ఊహించనివిగా ఉంటాయి. ఈ విధంగా మొత్తంమీద, చారిత్రక ఘటనలను కూడా యాదృచ్ఛికతే నిర్ణయించేటట్లు కనిపిస్తుంది. కాని ఉపరితలంపై యాదృచ్ఛికత రాజ్యం చేస్తున్నట్లు కనపడినా, నిజానికి ఎల్లప్పుడూ అంతర్గర్భిత, అంతరంగిక నియమాల ప్రకారమే అంతా జరుగుతూ ఉంటుంది, ఈ నియమాలను కనుగొనడమే ఇక సమస్య.

మానవులు తమ చరిత్రను తామే నిర్మించుకుంటారు. వారి కృషి ఫలితం ఏమైనప్పటికీ ప్రతి వ్యక్తీ తన స్వంత, ఉద్దేశపూర్వక అభీష్టసిద్ధికై కృషిచేస్తాడు అని ఈ మాటకు అర్థం. వేర్వేరు మార్గాలలో పనిచేసే ఈ అసంఖ్యాక అభీష్టాల తుదిఫలితం, బాహ్య ప్రపంచంపై ఇవి కలిగించే అనేక పర్యవసానాలు, ఇవే చరిత్రగా రూపొందుతాయి.

కనుక అనేకులైన వ్యక్తులు ఏమి కోరుకుంటారు అనేది కూడా ఒక సమస్యే. అభీష్టం, ఆలోచన లేక ఆవేశంచేత నిర్ణయించబడుతుంది. కాని ఆవేశాన్ని లేక ఆలోచనను ప్రభావితం చేసే తక్షణ కారణాలు అనేక రకాలుగా ఉంటాయి. పాక్షికంగా ఇవి బాహ్యవస్తువులు కావచ్చు, పాక్షికంగా ఆదర్శ లక్ష్యాలు, ఆకాంక్ష, "సత్య, ధర్మాలకై దీక్ష," వ్యక్తిగత ద్వేషం లేక కేవలం వ్యక్తిగతమైన రకరకాల చాపల్యాలు కావచ్చు. కాగా, చరిత్రలో క్రియాశీల పాత్ర వహించే అసంఖ్యాక వ్యక్తుల అభీష్టాలు తరచు ఆశించినవాటికంటే భిన్నమైన ఫలితాలను, తరచు వ్యతిరేకమైన ఫలితాలను కలిగిస్తాయని మనం చూశాం. కనుక అంతిమ ఫలితం దృష్ట్యా చూస్తే వ్యక్తుల ఉద్దేశాలకు కేవలం ద్వితీయస్థానం మాత్రమే ఉంది. మరొకవైపున ఒక కొత్త ప్రశ్న ఆవిర్భవిస్తుంది. ఈ ఉద్దేశాల వెనుకనున్న చోదకశక్తులు ఏమిటి? పాత్రధారుల మనస్సులలో ఉద్దేశాల రూపంలో పరివర్తన చెందే, చారిత్రక కారణాలు ఏవి?

పాత భౌతికవాదం, ఈ ప్రశ్నను అసలు వేసుకోనేలేదు. చరిత్ర గురించి దాని దృక్పథం, దృక్పథం అంటూ ఒకటి ఉంటే, ప్రధానంగా, కార్యసిద్ధి దృష్టి. ప్రతి చర్యనూ పాత్రధారుల ఉద్దేశాలను బట్టి అది నిర్ణయిస్తుంది. చారిత్రక కార్యరంగంలోని వ్యక్తులు నిస్వార్థపరులు, స్వార్థపరులు అని ఈ దృష్ట్యానూ విభజింపబడ్డారు. ప్రతి సందర్భంలోనూ నిస్వార్థపరులు మోసపోవటం, స్వార్థపరులు విజయం పొందటం జరుగుతూ ఉంటుంది. కనుక, పాత భౌతికవాదం దృష్ట్యా, చరిత్ర అధ్యయనంనుండి, ఆశావహమైన దేమీ లభించే అవకాశం లేదు. కనుకనే మా దృష్టిలో పాత భౌతికవాదం, చారిత్రక రంగంలో తన సూత్రాలకు తానే ద్రోహం చేసుకుంటున్నది. ఏమంటే ఆదర్శాలు అనబడే చోదకశక్తుల వెనుక ఉండే అసలు చోదకశక్తు లేవో పరిశోధించక, ఈ ధోరణి ఆదర్శాలనే, చోదకశక్తులనే అంతిమ నిర్ణేతలుగా పరిగణిస్తుంది. ఆదర్శాలను చోదకశక్తులుగా గుర్తించటంలో అసంగతం ఏమీలేదు. ఈ ఆదర్శాల వెనుకనున్న చోదకశక్తులేవి, అని తన పరిశోధనను మరింత ముందుకు తీసుకుపోక పోవటంలోనే అసంగతం ఉంది. తద్విరుద్ధంగా, చారిత్రక తత్వశాస్త్రం, ముఖ్యంగా హేగెల్ ప్రాతినిధ్యం వహించే చారిత్రక తత్వశాస్త్రం, చరిత్రలో క్రియాశీలురైన వ్యక్తుల అభీష్టాలు చారిత్రక ఘటనలకు అంతిమ కారణాలు కావనీ, ఈ ఉద్దేశాల వెనుక, ఇతర చోదక శక్తులున్నవనీ, వాటిని పరిశోధించాలనీ గుర్తిస్తుంది. అయితే చరిత్ర తత్వశాస్త్రం ఈ శక్తులను చరిత్రలో వెతకదు. బైటనుండి, తత్వశాస్త్ర సిద్ధాంతంనుండి చరిత్రలోకి వీటిని దిగుమతి చేస్తుంది. ఉదాహరణకు గ్రీస్ ప్రాచీన చరిత్రను, దాని ఆంతరంగిక సంబంధాల దృష్ట్యా హేగెల్ వివరించడు. ఆ చరిత్ర అంతా "సుందర వ్యక్తిత్వ రూపాల" వ్యక్తీకరణ, "సౌందర్య కళారూప" వాస్తవీకరణ మాత్రమే అని వ్యాఖ్యానిస్తాడు. ఈ సందర్భంలో హేగెల్ ప్రాచీన గ్రీకులను గురించి చక్కని, ప్రగాఢమైన మాటలు

చాలా చెప్పాడు. అయితే అంతమాత్రాన ఆయన ఇచ్చిన వ్యాఖ్యానాన్ని మనం ఈనాడు ఆమోదించలేము. అది కేవలం ఒక మాటలపోగు మాత్రమే.

కనుక, చరిత్రలో క్రియాశీలురైన వ్యక్తుల ఉద్దేశాల వెనుక — చైతన్య సహితంగానో లేక చైతన్య రహితంగానో, నిజానికి చాలా తరచుగా చైతన్య రహితంగానే — వుండే చోదక శక్తులను — అంతిమంగా చరిత్రయొక్క వాస్తవ చోదక శక్తులు యివే — పరిశీలించే సమస్యకు వచ్చినప్పుడు, వ్యక్తుల ఉద్దేశాలు (వారు ప్రముఖ వ్యక్తులే కావచ్చు) ఏమిటి అనేది ముఖ్య విషయం కాదు. మహా ప్రజానీకాన్ని, యావత్తు ప్రజలను, ఆ ప్రజలలోని కొన్ని వర్గాలను మొత్తంగా, కదిలించే శక్తు లేవి అనేది ప్రశ్న. ఈ కదలిక కూడా, ఏదో భగ్గున మండి చల్లారే తాత్కాలిక అగ్నిజ్వాల కాక, మహా చారిత్రక ఫలితం కలిగించే చిర స్థాయి కార్యాచరణ అయినప్పుడు, అందుకు కారణమైన శక్తు లేవి అనేది ప్రశ్న. కార్య రంగంలోకి ఉరికే ప్రజల మనస్సులలో, లేక గొప్పవారుగా చెప్పబడే వారి నాయకుల మనస్సులలో, చైతన్య సహిత లక్ష్యాలుగా, స్పష్టంగానో, అస్పష్టంగానో, సూటిగానో లేక సిద్ధాంత పరమైన మహా ఆదర్శాలుగానో ప్రతిబింబించే ఈ చోదకశక్తులను పరిశోధించి, అంచనా వేయవలసి ఉంటుంది. ఈ పరిశోధనా మార్గం ఒక్కటే, చరిత్ర మొత్తంపైన, లేక అందులోని కొన్ని దేశాలలో కొన్ని దశల పైన, ప్రాబల్యంగల నియమాలను గ్రహించే మార్గంలో మనలను పెట్టగలదు. మానవులను కదిలించే ప్రతి శక్తీ వారి మనస్సులలో ప్రవేశించడం ద్వారానే ప్రభావం కలిగిస్తుంది. కాని మనస్సులలో అది ఏ రూపం ధరిస్తుంది అనేది, పరిస్థితులపై చాలావరకు ఆధారపడి ఉంటుంది. 1848లో రైన్ నదీ తీరంలో వలె కార్మికులు ఈనాడు యంత్రాలను ముక్కలు ముక్కలు చేయకపోవచ్చు. కాని దాని అర్థం పెట్టుబడిదారీ యంత్రాలతో వారు రాజీపడ్డారని అర్థం కాదు.

ఈ చరిత్ర చోదక కారణాలు, వాటి ఫలితాల మధ్య అంతస్సంబంధాలు జటిలంగానూ, గోప్యంగానూ ఉన్నందున, గత చారిత్రక దశలన్నింటిలోనూ ఈ అన్వేషణ దాదాపు అసాధ్యమయ్యేది. కాని మన కాలం ఈ అంతస్సంబంధాలను చాలా తేలికపరిచింది. కనుక ఈ చిక్కును విడదీయటం ఇప్పుడు సాధ్యమౌతున్నది. భారీ పరిశ్రమల స్థాపన జరిగినప్పటినుండి, కనీసం 1815 యూరపియన్ శాంతి సంధికాలంనుండి,[20] ఇంగ్లండులోని యావత్తు రాజకీయ పోరాటం, భూస్వామ్య ప్రభువులు, బూర్జువావర్గం (మధ్య తరగతి) అను రెండు వర్గాల మధ్య ఆధిక్యత కొరకై జరుగుతున్న పోరాటమని, ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారు. ఇందులో గోప్యం ఏమీలేదు. ఫ్రాన్సులో బూర్బన్ల పునరాగమనంతో ఇదే పరిణామం గుర్తించబడ్డది. త్యెరీనుంచి గిజో, మిన్యే, త్యేర్‌ల దాకా గల పునరుద్ధరణ దశకు[21] చెందిన చరిత్రకారు లందరూ ఈ విషయం గుర్తించారు. మధ్యయుగాల తదుపరి యావత్తు ఫ్రెంచి చరిత్రనూ అర్థం చేసుకోటానికి, ఇదే కీలకం అని కూడా పేర్కొన్నారు. 1830

నుండి, పై రెండు దేశాలలోనూ కార్మికవర్గం నిరాస్తిపరులైన శ్రమజీవివర్గం, అధికారం కొరకు పోటీపడే మూడో వర్గంగా గుర్తించబడ్డది. పరిస్థితులు ఎంత సూక్ష్మతరం అయినవంటే ఈ మూడు మహా వర్గాల పోరాటంలో, వాటి ప్రయోజనాల ఘర్షణలో, ఆధునిక చరిత్ర చోదకశక్తులను గుర్తించక పోవటం, కనీసం అభివృద్ధి చెందిన పై రెండు పెద్ద దేశాలలోనైనా గుర్తించక పోవటం, ఉద్దేశపూర్వకంగా కళ్లు మూసుకోవటం అవుతుంది.

అయితే ఈ వర్గాలు ఎలా ఆవిర్భవించాయి? మాజీ భూస్వామ్య ప్రభువుల భూ సంబంధమైన ఆస్తి, కనీసం ప్రారంభంలో, రాజకీయ కారణాలవలన, అనగా బలవంతపు ఆక్రమణ ద్వారా ఆవిర్భవించిందని చూడగానే చెప్పవచ్చు. బూర్జువా, కార్మికవర్గాల విషయమై ఇలా చెప్పలేము గదా! ఇక్కడ, ఈ రెండు మహా వర్గాల ఆవిర్భావం, పెరుగుదల, స్పష్టంగా, సూటిగా ఆర్థిక కారణాలలో కనిపిస్తుంది. భూస్వాములకీ, బూర్జువావర్గానికీ జరిగిన పోరాటంలోను, బూర్జువావర్గానికీ, కార్మికవర్గానికీ జరిగిన పోరాటంలో సైతం, ఆర్థిక ప్రయోజనాలే, అన్నిటికంటె ప్రథమ గణ్యంగా ఉన్నవనీ, ఆ ప్రయోజనాల రక్షణకు రాజకీయ అధికారం ఒక సాధనగా మాత్రమే ఉద్దేశితమైందనీ సుస్పష్టం. బూర్జువా, కార్మికవర్గాలు రెండూ, ఆర్థిక పరిస్థితుల పరిణామ ఫలితంగా ఆవిర్భవించాయి. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే, ఉత్పత్తి విధానంలోని మార్పు ఫలితంగా ఆవిర్భవించాయి. వృత్తి సంఘాల చేతిపనులనుండి కార్ఖానా దశకు, పిమ్మట కార్ఖానా దశనుండి ఆవిరిశక్తి, యాంత్రిక శక్తితో భారీ ఉత్పత్తి దశకు జరిగిన ఈ పరిణామం, ఈ రెండు వర్గాలూ ఆవిర్భవించటానికి కారణమైంది. ఒక నిర్దిష్ట దశలో, బూర్జువావర్గం ప్రవేశపెట్టిన ఈ నూతన ఉత్పాదక శక్తులు — అనగా ప్రధానంగా శ్రమవిభజన, వేర్వేరు పనులు చేసే కార్మికులను ఒకే పరిశ్రమలో జత చేయటం — ఈ నూతన ఉత్పాదక శక్తులు పెంపు చేసిన మారకం పరిస్థితులు, అవసరాలు, ఆనాటి ఉత్పత్తి సంబంధాలతో, చరిత్ర అందచేసిన చట్టం ధ్రువీకరించిన సంబంధాలతో, ఘర్షణ పడసాగాయి. అనగా ఫ్యూడల్ సామాజిక వ్యవస్థలోని వృత్తి సంఘాల ప్రత్యేక సౌకర్యాలకూ, తదితర అసంఖ్యాకమైన వ్యక్తుల, స్థానికుల ప్రత్యేక సౌకర్యాలకూ ఆటంకంగా తయారయ్యాయి. (ఈ ప్రత్యేక సౌకర్యాలు, సౌకర్యాలులేని విభాగాలకు సంకెళ్లుగా తయారయ్యాయి.) బూర్జువావర్గం ప్రాతినిధ్యం వహించే ఉత్పాదక శక్తులు, భూస్వామ్య ప్రభువులు, వృత్తిసంఘ యజమానులూ ప్రాతినిధ్యం వహించే ఉత్పత్తి విధానంపై తిరుగుబాటు చేశాయి. దీని ఫలితం తెలిసిందే. ఫ్యూడల్ శృంఖలాలు బద్దలైనాయి. ఇంగ్లండులో క్రమక్రమంగానూ, ఫ్రాన్సులో ఒక్క దెబ్బతోను ఇవి బద్దలైనాయి. జర్మనీలో ఈ పరిణామం ఇంకా పూర్తి కాలేదు. కాని ఒక నిర్దిష్ట దశలో, కార్ఖానా పరిశ్రమ ఫ్యూడల్ ఉత్పత్తి విధానంతో ఘర్షణ పడినట్లే, ఈనాడు భారీ పరిశ్రమ,

ఆ స్థానంలో ఆవిర్భవించిన బూర్జువా ఉత్పత్తి విధానంతో ఘర్షణ పడుతున్నది. ఈ వ్యవస్థ చేత, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు సంకెళ్లచేత బంధించబడిన ఈ భారీ పరిశ్రమ, ఒక వైపున అత్యధిక ప్రజానీకాన్ని నిరాస్తిపరులను చేస్తున్నది. మరొక వైపున అమ్మకంకాని సరకులను అంతకంతకు పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేస్తున్నది. అధికోత్పత్తి, ప్రజాదారిద్ర్యం, ఈ రెండూ ఒకదాని కొకటి కారణమౌతున్నాయి. తత్ఫలితంగా అర్థరహితమైన ఈ వైరుధ్యం ఏర్పడుతున్నది. ఇందువలన, ఉత్పత్తి విధానంలో మార్పు జరిగి, ఉత్పత్తి శక్తులు విమోచన పొందటం తప్పనిసరిగా అవసరమౌతున్నది.

కనుక, కనీసం ఆధునిక చరిత్రకు సంబంధించినంత వరకైనా, అన్ని రాజకీయ పోరాటాలూ వర్గపోరాటాలనీ, విమోచన కొరకు జరిగే అన్ని వర్గపోరాటాలూ చిట్టచివరకు ఆర్థిక విమోచన కొరకే ఉద్దేశితమైనాయనీ నిరూపితమైంది. ప్రతి వర్గపోరాటమూ రాజకీయ పోరాటమే కనుక, ఈ పోరాటాలన్నీ రాజకీయ రూపం అనివార్యంగా ధరించి తీరతాయి. కనుక, కనీసం ఈ రంగానికి సంబంధించినంతవరకు, రాజ్యం — రాజకీయ వ్యవస్థ — ద్వితీయ స్థానంలోనూ, ఆర్థిక సంబంధాలకు చెందిన పౌరసమాజం — నిర్ణయాత్మక స్థానంలోనూ ఉంది. హేగెల్ కూడా ఆమోదిత సాంప్రదాయిక అభిప్రాయం ప్రకారం, రాజ్యం నిర్ణాయక శక్తి, పౌరసమాజం దానిచేత నిర్ణయింపబడే శక్తి అనే భావించాడు. పైకి చూస్తే అలాగే కనిపిస్తుంది. ఒక వ్యక్తి చర్యలకు కారణభూతమైన చోదక శక్తులన్నీ అతని మెదడులో మొదట ప్రవేశించాలి. లక్ష్యాలుగా పరివర్తన చెందాలి. అప్పుడే అవి కార్యాచరణకు అతనిని ప్రేరేపించ గలవు. అదేవిధంగా, పౌర జీవితంయొక్క అన్ని అవసరాలూ, పరిపాలక వర్గం ఏ వర్గ మైనప్పటికీ, రాజ్యపు అభీష్టంలోకి ప్రవేశించాలి. పిమ్మటనే అవి చట్టాలుగా సాధారణ ధృవీకరణ పొందగలవు. ఇది పైకి కనిపించే అంశం. ఇది తేలికగానే గ్రహించవచ్చు. కాగా అసలు ప్రశ్న ఏమంటే, లాంఛనప్రాయమైన ఈ అభీష్టంయొక్క — వ్యక్తియొక్క, ప్రభుత్వంయొక్క — అభీష్టంలోని సారాంశం ఏమిటి, ఈ సారాంశం ఎక్కడ నుండి ఆవిర్భవిస్తున్నది, కేవలం ఈ అభీష్టమే ఎందుకు కలిగింది? మరొకటి ఎందుకు కలగలేదు? ఈ అంశాన్ని మనం పరిశోధించినట్లయితే, ఆధునిక చరిత్రలో రాజ్యంయొక్క అభీష్టం, మొత్తంమీద పౌర సమాజంయొక్క మారుతున్న అవసరాల దృష్ట్యా నిర్ణయించబడుతుందనీ, అంతిమ పరిశీలనలో ఉత్పాదక శక్తుల, మారకపు సంబంధాల అభివృద్ధి దృష్ట్యా, ఏ వర్గం ఆధిపత్యంలో ఉన్నది అనే దృష్ట్యా, నిర్ణయించబడుతుందనీ మనం గ్రహించగలం.

ఉత్పత్తి, రవాణా శక్తులు బ్రహ్మాండంగా అభివృద్ధి ఐన ఆధునిక యుగంలో సైతం రాజ్యం, స్వతంత్రాభివృద్ధి కలిగిన స్వతంత్ర రంగం కానట్లయితే, దాని ఉనికీ, అభివృద్ధీ చిట్టచివరకు సమాజ జీవితంలోని ఆర్థిక పరిస్థితుల ద్వారా నిర్ణయించబడవలసి ఉంటే,

ఇంతకు ముందు యుగాలలో ఇది మరింత వాస్తవమై ఉండాలి. ఆనాడు మానవ జీవితావసరాల ఉత్పత్తి అపారమైన సాధన సంపత్తి ద్వారా జరగలేదు. కనుక అట్టి ఉత్పత్తి ఆవశ్యకత మానవులపై మరింత ఎక్కువ ఆధిపత్యాన్ని కలిగి ఉండాలి. భారీ పరిశ్రమలు, రైల్వేలు ఏర్పడిన ఈ రోజులలో సైతం రాజ్యం, మొత్తంమీద ఉత్పత్తిపై ఆధిపత్యం కలిగిన వర్గం యొక్క ఆర్థికావసరాల సాంద్రీకృత రూపపు ప్రతిబింబం ఐనట్లయితే, పూర్వకాలంలో ఇది మరింత వాస్తవమై ఉండాలి. ప్రతి ఒక్క తరమూ, ఆనాడు తన మొత్తం జీవిత కాలంలో అత్యధిక భాగాన్ని భౌతిక అవసరాలను తీర్చుకునేందుకే వినియోగించవలసి ఉండేది. కనుక భౌతికావసరాలపై మనకంటె ఎక్కువ ఆధారపడవలసి ఉండేది. ప్రాచీనయుగాల చరిత్ర పరిశీలనను ఈ దృష్టితో చిత్తశుద్ధితో కొనసాగించిన వెన్వెంటనే, ఈ సత్యం పుష్కలంగా ధ్రువీకరింపబడుతుంది. అయితే ఆ పరిశీలనకు ఇప్పుడు పూనుకోవడం సాధ్యంకాదు.

రాజ్యమూ, రాజ్య న్యాయశాస్త్రమూ, ఆర్థికసంబంధాల ద్వారా నిర్ణయించబడినట్లయితే, పౌర న్యాయశాస్త్రం కూడా వాని ద్వారానే నిర్ణయించబడుతుంది, అది సహజం. ఏమంటే అప్పటి పరిస్థితులలో వ్యక్తుల మధ్య సహజంగా ఏర్పడే ఆర్థిక సంబంధాలపై, పౌర న్యాయశాస్త్రం ఆమోదముద్ర వేస్తుంది. అదే దాని సారాంశం. ఇది ఏ రూపంలో జరిగేదీ, పరిస్థితుల ననుసరించి గణనీయంగా మారవచ్చు. ఇంగ్లండులో వలె, మొత్తం పారిశ్రామికాభివృద్ధికి అనుగుణంగా, పాత ఫ్యూడల్ న్యాయశాస్త్రాన్ని అలాగే ఉంచుతూ, ఆ న్యాయశాస్త్రానికి బూర్జువా సారాన్ని కల్పించవచ్చు. ఫ్యూడల్ పేరుకు సూటిగా బూర్జువా అర్థాన్నే యివ్వవచ్చు. లేక పశ్చిమ యూరపు ఖండంలో జరిగినట్లుగా, రోమన్ న్యాయశాస్త్రం ప్రాతిపదికగా రూపొందవచ్చు. ఈ రోమన్ న్యాయశాస్త్రం సరుకులు ఉత్పాదన చేసే సమాజం యొక్క మొదటి ప్రపంచ వ్యాపిత న్యాయం – చిన్న సరుకు యజమానుల అత్యవసరమైన న్యాయ వ్యవస్థ సంబంధాలన్నిటినీ, అత్యుత్కృష్టమైన నాజూకుతనంతో ఈ శాస్త్రం వివరిస్తుంది. (కొనుగోలుదారులు, అమ్మకందారులు, రుణగ్రస్తులు, రుణదాతలు, ఒప్పందాలు, కట్టడులు మొదలైనవి.) ఇట్టి సందర్భంలో, ఇంకా పెటీబూర్జువా, అర్ధఫ్యూడల్ స్వభావం కలిగిన సమాజ ప్రయోజనం కొరకు, ఈ న్యాయశాస్త్రం, కేవలం న్యాయస్థానాల ఆచరణ ద్వారా ఆ సమాజ స్థాయికి కుదించబడవచ్చు. లేక నీతి సూత్రాలు వల్లించే, ఉదార న్యాయవాదులనబడేవారి సహాయంతో అట్టి సాంఘిక స్థాయికి తగినట్లు ఒక ప్రత్యేక న్యాయవ్యవస్థ రూపొందించబడవచ్చు. అట్టి పరిస్థితులలో ఈ వ్యవస్థ, న్యాయశాస్త్ర దృష్ట్యా చాలా చెడ్డదిగా ఉండితీరుతుంది (ఉదాహరణకు ప్రష్యన్ న్యాయవ్యవస్థ). అయితే అలాంటి సందర్భంలో, ఒక గొప్ప బూర్జువా విప్లవం జరిగిన తర్వాత, అదే రోమన్ న్యాయవ్యవస్థ పునాదిగా, ఫ్రెంచి సివిల్ కోడ్[22] వంటి సాంప్రదాయిక బూర్జువా సమాజ న్యాయశాస్త్రం

రూపొందనూవచ్చు. కనుక బూర్జువా న్యాయ నిబంధనలు, సమాజ ఆర్థిక జీవన పరిస్థితులకు న్యాయవ్యవస్థ ప్రతిబింబాలు మాత్రమే అయితే అవి, పరిస్థితుల ననుసరించి తమ పాత్రను మంచిగానో, చెడుగానో వ్యక్తంచేయవచ్చు.

మానవునిపై మొట్టమొదటి సైద్ధాంతిక శక్తిగా రాజ్యం మనకు దర్శనమిస్తుంది. ఆంతరంగిక, బాహ్య దాడులనుండి తనను రక్షించుకోటానికిగాను, సమాజం ఒక సాధనాన్ని తానే సృష్టించుకుంటుంది. ఈ సాధనమే రాజ్యాధికారం. అధికారంలోకి వచ్చీ రాగానే, ఈ సాధనం, సమాజం కంటె భిన్నమైన స్వతంత్ర ప్రతిపత్తిని సాధించుకుంటుంది. ఇట్టి స్వాతంత్ర్యాన్ని అది ఎంతగా సాధించుకుంటుందో, అంతగా అది ఒక ప్రత్యేక వర్గ ప్రాబల్యానికి సాధనగా మారుతుంది. ఆ వర్గ పెత్తనాన్ని అంత సూటిగానూ అమలు జరుపుతుంది. పాలకవర్గంపై పీడిత వర్గం జరిపే పోరాటం తప్పనిసరిగా ఒక రాజకీయ పోరాటం అవుతుంది. ప్రధానంగా, ఆ వర్గంయొక్క రాజకీయ పెత్తనానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం అవుతుంది. ఈ రాజకీయ పోరాటానికీ, దాని ఆర్థిక పునాదికీ గల అంతస్సంబంధం మరుగున పడిపోతుంది. ఒక్కొక్కసారి యిది మొత్తం అదృశ్యం కావచ్చు కూడా. భాగస్వాముల విషయంలో యిది పూర్తిగా నిజం కాకపోయినా చరిత్రకారుల విషయంలో మాత్రం యిది దాదాపు పూర్తిగా నిజం. రోమన్ రిపబ్లిక్‌లో జరిగిన పోరాటాలకు సంబంధించిన ప్రాచీన గ్రంథాలలో, అసలు వివాదగ్రస్తమైన మూల సమస్య, భూమి ఆస్తి సమస్య – అని ఒక్క అప్పియన్ అనే చరిత్రకారుడు మాత్రమే పేర్కొన్నాడు.

అయితే సమాజాని కంటె భిన్నమైన స్వతంత్ర శక్తిగా రాజ్యం రూపొందిన పిమ్మట, అది వెన్వెంటనే కొత్త భావజాలాన్ని రూపొందించుకుంటుంది. నిజానికి వృత్తిరీత్యా రాజకీయవేత్తలూ, రాజ్య న్యాయశాస్త్ర సిద్ధాంతకారులూ, పౌర న్యాయశాస్త్ర నిపుణులే ఆర్థిక వాస్తవాలతో సంబంధాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు ఏమంటే పైన పేర్కొన్న ప్రతి సందర్భంలోనూ న్యాయసంబంధమైన ఆమోదముద్ర పొందాలంటే, ఆర్థికవాస్తవాలు మొట్టమొదటగా న్యాయశాస్త్ర పరిభాష రూపాన్ని స్వీకరించాలి, అలా రూపాంతరం చెందేటప్పటికి, అంతకు ముందున్న మొత్తం న్యాయశాస్త్రం పరిగణనలోకి వస్తుంది, ఫలితంగా న్యాయశాస్త్ర పరిభాషే సర్వస్వం ఔతుంది, ఆర్థికసారం ఎందుకూ కానిదవుతుంది. రాజ్య న్యాయశాస్త్రం, పౌర న్యాయశాస్త్రం ప్రత్యేక రంగాలుగా పరిగణించబడతాయి. ప్రతిఒక్కదానికీ ప్రత్యేక చారిత్రకాభివృద్ధి ఉంటుంది. ప్రతి న్యాయశాస్త్రాన్నీ, అన్ని ఆంతరంగిక వైరుధ్యాలనూ పరిహరించి క్రమబద్ధమైనదాన్నిగా ప్రతిపాదించవలసిన ఆవశ్యకత, అలా చేయగల సామర్థ్యం ఏర్పడతాయి.

ఇంకా ఉన్నతమయిన సిద్ధాంతాలు, అనగా భౌతిక, ఆర్థిక పునాదికి మరింత దూరంగా ఉండేవి, మత, తత్వశాస్త్ర రూపాలను ధరిస్తాయి. ఇక్కడ భావాలకూ, వాటి ఉనికికి అవసర

మైన భౌతిక పరిస్థితులకూ గల అంతస్సంబంధాలు అధికాధికంగా జటిల రూపం ధరిస్తాయి. మధ్యంతర లంకెల ఫలితంగా మరింత దుర్గ్రాహ్యమౌతాయి. కాని అంతస్సంబంధం ఉండితీరుతుంది. యావత్తు పునర్వికాస కాలం[23] 15వ శతాబ్ది మధ్య కాలంనుండి ప్రధానంగా పట్టణాలలో రూపొందింది. కనుక అది పట్టణవాసుల సృష్టి. అదేవిధంగా ఆ పిమ్మట రూపొందిన తత్వశాస్త్రం కూడా పట్టణాలలో, పట్టణవాసుల్లో పెంపొందింది. దాని సారం, మౌలికంగా చిన్న, మధ్య తరహా పట్టణవాసులు, బడా బూర్జువావర్గంగా రూపొందే క్రమానికి అనుగుణమైన ఆలోచనల తాత్విక వ్యక్తీకరణ. గత శతాబ్దపు ఆంగ్లేయులలోనూ, ఫ్రెంచివారిలోనూ ఇది చాలా స్పష్టంగా కనిపిస్తుంది. వీరు పెక్కు సందర్భాలలో ఎంతగా తత్వవేత్తలో, అంతగా ఆర్థికవేత్తలు కూడా. హెగెలియన్ ఆలోచనా ధోరణికి సంబంధించి ఈ వాస్తవాన్ని పైన నిరూపించాము.

ఇక ఇప్పుడు క్లుప్తంగా మాత్రమే మతాన్ని గురించి ప్రస్తావిస్తాము. ఏమంటే ఇది భౌతిక జీవితానికి అత్యంత దూరంగా ఉంటుంది. కనుక దాదాపు దానితో పూర్తిగా వేరు పడినదిగా కనిపిస్తుంది. అతి ప్రాచీన కాలంలో తమ సొంత స్వభావాన్ని గురించి, తమను ఆవరించి ఉండే బాహ్య ప్రకృతిని గురించి, అపభ్రంశ రూపకమయిన మానవుని మొరటు భావాలనుండి మత విశ్వాసం ఆవిర్భవించింది. కాగా, ప్రతి భావజాలమూ, ఒకసారి ఆవిర్భవించిన మీదట ఆనాటి భావసముచ్చయ ప్రాతిపదికపై అభివృద్ధిచెందుతుంది. ఆ సముచ్చయాన్ని మరింత పెంపు చేస్తుంది. కాని పక్షంలో అది భావజాలం అని అనిపించుకోదు. అనగా, స్వతంత్ర శకలాలవలె భావాల విషయం ఆలోచించటం, స్వతంత్రంగా, తన స్వంత సూత్రాల కనుగుణంగా మాత్రమే వృద్ధిచెందడం, ఎవరి బుర్రలలో ఈ ఆలోచనా స్రవంతి ప్రవహిస్తూ ఉంటుందో, వారి భౌతిక జీవిత పరిస్థితులు అంతిమంగా ఈ స్రవంతి మార్గాన్ని నిర్ణయిస్తాయనే అంశం ఈ వ్యక్తులకు అగ్రాహ్యంగానే ఉంటుంది. అలా కాకపోతే, భావజాలం అనేదే అంతమౌతుంది. కనుక ఈ మొట్టమొదటి మత భావాలు, ప్రధానంగా బంధుత్వ సంబంధాలు కలిగిన ప్రతి ఒక గ్రూపులోనూ ఒకేరకంగా ఉండేవి. ఆ గుంపు చీలిపోయిన మీదట, ఆయా విభాగాల జీవన పరిస్థితుల కనుగుణంగా ఆయా ప్రజల ప్రత్యేకతల కనుగుణంగా, ఈ భావాలు అభివృద్ధి చెందుతాయి. చాలా గుంపుల విషయంలో, ముఖ్యంగా ఆర్యుల విషయంలో (ఇండో యూరపియన్లు అని పిలవబడేవారు) ఈ క్రమాభివృద్ధి, తులనాత్మక పురాణ సాహిత్యంలో కూలంకషంగా పరిశీలింపబడింది. ఈ విధంగా ప్రతి ఒక్క ప్రజ రూపొందించిన దేవతలూ, వారి జాతీయ దేవతలైనారు. వీరి అధికారం వారి జాతీయ సరిహద్దుల అవతలకు వెళ్లదు. ఆ భూభాగాన్ని కాపాడటం వారి కర్తవ్యం. సరిహద్దు కవతల ఇతర దేవతలు అప్రతిహతంగా రాజ్యం చేస్తూ ఉంటారు. ఆ జాతి ఉన్నంతవరకే ఆ దేవతల ఉనికి, ఆ జాతి పడిపోతే దేవతలూ పడిపోతారు. రోమన్

ప్రపంచ సామ్రాజ్యం — దాని ఉనికికి మూలమయిన ఆర్థిక పరిస్థితులను మేమిక్కడ వివరించనక్కరలేదు — పాత జాతుల యీ పతనానికి కారణభూతమైంది. రోమ్‌నగర సంకుచిత సరిహద్దులకు మాత్రమే పరిమితమయిన విధంగా రూపొందిన రోమన్ దేవతలు కూడా శిథిలమయినారు. ప్రపంచ సామ్రాజ్యాని కనుగుణంగా ప్రపంచ మతాన్నొకదానిని రూపొందించవలసి వచ్చింది. రోమ్‌నగరంలో స్థానిక దేవతల సరసనే, దాదాపు అదే గౌరవ మర్యాదలతో అన్ని విదేశీ దేవతలకూ ఆలయాలు, ఆరాధన ఏర్పరచే ప్రయత్నంలోనే ఇది వ్యక్తమయింది. కాని సామ్రాజ్యపాలకుల హుకుం ద్వారా నూతన ప్రపంచ మతం ఏర్పడదు. నూతన ప్రపంచ మతమయిన క్రైస్తవ మతం అప్పటికే నెమ్మదిగా ఆవిర్భవించింది. సాధారణ రూపంలో ప్రాచ్య మతశాస్త్రం, ప్రత్యేక రూపంలో యూదు మతశాస్త్రం కల గలుపు అయ్యాయి. అపభ్రంశమయిన గ్రీక్ తత్వశాస్త్రం, ప్రత్యేకించి స్టోయిక్ తత్వశాస్త్రం[24] ఇందులో చోటు చేసుకున్నది. దీని మొదటి రూపం ఏదో తెలుసుకోవాలంటే సుదీర్ఘ పరి శోధన అవసరం. ఏమంటే మనకు లభించిన రూపంలో, దాని అధికార రూపం, అది ఒక అధికార మతంగా రూపొందిన తర్వాతది. నికే సమితి,[25] ఈ రూపంలో దీనిని ధ్రువపర చింది. 250 సంవత్సరాలయ్యేటప్పటికి క్రైస్తవ మతం, అధికార మతం అయింది అంటేనే, ఆనాటి పరిస్థితులకు ఆ మతం అనుగుణంగా ఉన్నది అని అర్థమౌతుంది. మధ్య యుగాలలో ఫ్యూడలిజంతోపాటు, పక్కపక్కనే క్రైస్తవ మతం దాని మత పార్శ్వంగా వృద్ధిచెందింది. అందుకవసరమయిన ఫ్యూడల్ దొంతరలను ఏర్పరచుకొన్నది. పిమ్మట బూర్జువాలు బల పడటంతో, ఫ్యూడల్ కాథలిక్ మతానికి వ్యతిరేకంగా ప్రొటెస్టెంటు సాంప్రదాయిక మత నిరసనవాదం మొట్టమొదట దక్షిణ ఫ్రాన్సులోని ఆల్బిగెన్‌స్‌లలో[26] రూపొందింది. ఆ కాలంలో దక్షిణ ఫ్రాన్సులోని పట్టణాలు అత్యున్నత సౌభాగ్యం అనుభవిస్తూ ఉండేవి. మధ్యయుగాలు, మత శాస్త్రానికి ఇతర అన్ని సిద్ధాంత రూపాలనూ — తత్వశాస్త్రం, రాజకీయాలు, న్యాయ శాస్త్రం — జతచేసి లోను చేశాయి. కనుక ప్రతి సాంఘిక, రాజకీయ ఉద్యమం తప్పనిసరిగా మత రూపాన్ని స్వీకరించవలసి వచ్చింది. ప్రజల మనోభావాలను, మిగతా అన్నిటినీ వదలి వేసి, మత బోధనతో సంతృప్తి పరచసాగారు. కనుక ఒక ఉద్యమాన్ని ప్రేరేపించాలంటే, వారు తమ ప్రయోజనాలను ఒక మత రూపంలో రూపొందించవలసి వచ్చింది. పట్టణవాసులు (బర్గర్లు) మొదటినుండి తమకు అనుబంధంగా నిరాస్తిపరులైన పట్టణవాస సామాన్య వర్గాన్ని, రోజు కూలీలను, అన్ని తరహాల నౌకర్లనూ — వారు గుర్తింపబడిన ఏ సాంఘిక వర్గానికీ చెందినవారు కారు, వారు ఆ తరువాత రూపొందిన కార్మికవర్గానికి ముందు తరంవారు — సృష్టించుకున్నట్లుగానే, సాంప్రదాయిక మత నిరసన త్వరలోనే బర్గర్ల పరిమిత సాంప్రదాయిక మత నిరసనగానూ, సామాన్యుల విప్లవ సాంప్రదాయిక మత

నిరసనగానూ చీలిపోయి, ఆ విప్లవ సాం(ప్రదాయిక మత నిరసన, బర్గర్ సాం(ప్రదాయిక మత నిరసనవాదులకు దుస్సహమయిన కంటగింపు ఐంది.

(ప్రొటెస్టెంటు సాం(ప్రదాయిక మత నిరసన అవినాశత్వం శక్తి. పుంజుకుంటున్న బర్గర్ల అజేయత్వానికి అనుగుణంగా జరిగింది. ఈ బర్గర్లు తగినంత బలం సంపాదించుకున్న మీదట, భూస్వామ్య (ప్రభువులపై వారు జరిపే పోరాటం, అంత వరకూ (ప్రధానంగా స్థానికంగా జరిగింది కాస్తా, జాతీయ స్థాయినందుకున్నది. ఇందుకు సంబంధించిన మొట్టమొదటి ఉద్యమం — రిఫర్మేషన్ పేరుతో, జర్మనీలో ఆవిర్భవించింది. కాగా ఇతర విప్లవ విభాగాలను, పట్టణాలలోని సామాన్యులను, (గ్రామాలలోని కింది (శ్రేణి (ప్రభువులను, రైతులను తమ పతాకం కింద సమీకరించ గలిగినంత శక్తి బర్గర్లకు లేదు. ఆ స్థాయికి వారు అభివృద్ధి కాలేదు. భూస్వామ్య (ప్రభువులైతే ఓడిపోయారు. పిమ్మట రైతులు తిరుగుబాటు చేశారు. ఆ తిరుగుబాటు మొత్తం విప్లవ పోరాటపు పతాకస్థాయి నందుకున్నది. కాని పట్టణాలు రైతాంగాన్ని వారి మానాన వారిని వదలివేశాయి. ఆ విధంగా విప్లవం లౌకిక రాజరిక సైన్యాల తాకిడికి లొంగిపోయింది. యావత్తు లాభం, లౌకిక రాజరికం సంపాదించింది. ఆ పిమ్మట మూడు శతాబ్దాల వరకు, చరిత్రలో స్వతంత్ర పాత్ర నిర్వర్తించిన దేశాల జాబితానుండి జర్మనీ అదృశ్యమైంది. కాని జర్మనీలోని లూతర్‌తో పాటు (ఫాన్సులో కాల్విన్ తల ఎత్తాడు. (ఫెంచివారికి సహజమైన తీక్ష్ణతతో, అతడు రిఫర్మేషన్‌యొక్క బూర్జువా స్వభావాన్ని ముందుకు తెచ్చాడు. చర్చికి (ప్రజాతం(త రిపబ్లికన్ స్వభావాన్ని కల్పించాడు. జర్మనీలో లూతర్ రిఫర్మేషన్ పతనమై, దేశాన్ని ఛిన్నాభిన్నం చేసింది. కాల్విన్ రిఫర్మేషన్, జెనీవా, హాలండ్, స్కాట్లండులలో రిపబ్లికన్‌లకు తిరుగుబాటు పతాకంగా ఉపకరించింది. హాలండును స్పెయిన్ దాస్యంనుండి, జర్మన్ సామ్రాజ్య బానిసత్వంనుండి విముక్తి చేసింది.[27] ఇంగ్లండులో జరుగుతున్న బూర్జువా విప్లవంయొక్క ద్వితీయాంకానికి సైద్ధాంతిక రూపంగా ఉపయోగపడ్డది. బూర్జువా (ప్రయోజనాలకు మత కవచం తొడిగిన నిజమైన ముసుగుగా కాల్వినిజం, ఇక్కడ తన ఉనికిని సార్థకం చేసుకున్నది. కనుకనే 1689లో విప్లవం ముగిసి, భూస్వామ్య (ప్రభువులలో ఒక విభాగం, బూర్జువావర్గము రాజీ చేసుకున్నప్పుడు[28] పూర్తి గుర్తింపు పొందలేక పోయింది. ఇంగ్లీషు అధికార చర్చి పునః స్థాపితమైంది. అయితే, రాజునే, పోపుగా స్వీకరించిన పాత కాథలిక్ పద్ధతిలో కాదు. బలమైన కాల్వినిస్టు ధోరణులు చర్చిలో (ప్రవేశించాయి. పాత అధికార చర్చి, నిర్జీవమైన కాల్వినిస్టు పద్ధతిని విడనాడి ఆదివారం ఉత్సవాలను కాథలిక్ సరదాలు, వేడుకలతో జరుపుకోసాగింది. కొత్త బూర్జువాకృత చర్చి, తిరిగి కాల్వినిస్టు పద్ధతులను (ప్రవేశపెట్టింది. ఈనాటికీ ఇంగ్లండులో ఈ పద్ధతే ఉంది.

(ఫాన్సులో కాల్వినిస్టు అల్పసంఖ్యాకవర్గం 1685లో అణచివేయబడ్డది. వారిని కాథ

లిక్‌లుగా బలవంతాన మార్చటమో, దేశంనుండి బహిష్కరించటమో జరిగింది.[29] కాని ఏమి ప్రయోజనం సాధించారు? అప్పటికే స్వేచ్ఛావాది ప్యేర్ బేయిల్ తన కార్యక్రమాలను ముమ్మరంగా సాగిస్తున్నాడు. 1694లో వోల్టేర్ జన్మించాడు. పద్నాల్గవ లూయీ నిర్బంధ చర్యల కారణంగా ఫ్రెంచి బూర్జువావర్గం, తన విప్లవాన్ని మతరహితమైన పూర్తి రాజకీయ రూపంలో జరపటం తేలికైంది. అభివృద్ధి చెందిన బూర్జువావర్గానికి తగిన రూపం అదే. జాతీయ శాసనసభలలో ప్రొటెస్టెంటులకు బదులు, స్వేచ్ఛావాదులు స్థానాలు ఆక్రమించుకున్నారు. ఈ విధంగా క్రైస్తవ మతం తన అంతిమ దశను చేరుకుంది. అభ్యుదయకరమైన ఏ వర్గంయొక్క ఆశయాలకూ, సిద్ధాంత ఆచ్ఛాదనగా భవిష్యత్తులో ఉపయోగపడే అవకాశాన్ని అది పోగొట్టుకున్నది. అధికాధికంగా అది పాలకవర్గాల ప్రత్యేక సొత్తు అయింది. ఈ వర్గాలు ఆ సొత్తును, కేవలం పరిపాలనా సాధనగాను, కింది వర్గాలను వారి హద్దులలో ఉంచే సాధనగాను వాడుకోసాగారు. పైగా వివిధ వర్గాలలో ప్రతి వర్గమూ, తనకు అనుగుణమైన మతాన్ని వాడుకోసాగింది. భూస్వామ్య ప్రభువులు కాథలిక్ జెస్యూటిజంను లేక సాంప్రదాయ ప్రొటెస్టెంటు మతాన్నీ, ఉదార, అతివాద బూర్జువావర్గం, హేతువాదాన్నీ[30] వాడుకోసాగారు. ఈ పెద్దమనుషులకు ఆయా మతాలలో విశ్వాసమున్నదా లేదా అన్న అంశానికి ఎట్టి ప్రాధాన్యం లేదు.

కనుక, మనం ఒక విషయాన్ని గ్రహించగలం. అన్ని సిద్ధాంతరంగాలలో మాదిరిగా సంప్రదాయం గొప్ప యథాస్థితివాద శక్తిగా పనిచేసినట్లే, మతం, ఒకసారి రూపుదాల్చిన మీదట, దానిలో కూడా ఎప్పుడూ సాంప్రదాయిక ధోరణులు ఉండనే ఉంటాయి. అయితే ఈ సాంప్రదాయిక ధోరణి చెందే పరివర్తనలు, వర్గ సంబంధాల ఫలితంగా జరుగుతూ ఉంటాయి. అనగా, ఈ పరివర్తనలను అమలు జరిపే ప్రజల ఆర్థిక సంబంధాల ఫలితంగా జరుగుతూంటాయి. ప్రస్తుతానికి ఇంతవరకు చాలు.

చరిత్రను గురించిన మార్క్సిస్టు అవగాహనను, స్థూలంగా, మహా అయితే కొన్ని ఉదాహరణలతో, పైన వివరించటానికి ప్రయత్నించాను. ఇందుకు నిదర్శన చరిత్రనుండే గ్రహించాల్సి వుంటుంది. ఈ విషయమై మా ఇతర రచనల్లో తగినంత సమాచార మున్నదని చెప్పటానికి అనుమతించండి. కాగా ప్రకృతిని గురించిన గతితార్కిక దృక్పథం ప్రకృతి తత్వశాస్త్రాన్ని అనవసరమూ, అసాధ్యమూ చేసినట్లే, ఈ దృక్పథం చారిత్రక రంగంలో తత్వశాస్త్రాన్ని అంతం చేస్తుంది. మన మెదళ్లలోనుండి అంతస్సంబంధాలను ఊహించటమనేది యికనెంత మాత్రమూ ప్రశ్న కాదు. వాస్తవ ఘటనలలో వాటిని పరిశోధించటమనేదే ప్రశ్న. ప్రకృతినుండి, చరిత్రనుండి బహిష్కరించబడిన తత్వశాస్త్రానికి ఇక మిగిలిందల్లా ఏమైనా మిగిలితే శుద్ధ ఆలోచనే. ఆలోచనా క్రమంయొక్క సూత్రాల సిద్ధాంతం, తర్కం, గతితర్కం ఇవే ఇక మిగిలినవి.

* * *

1848 విప్లవంతో, ''విద్యాధిక'' జర్మనీ సిద్ధాంతానికి తిలోదకాలిచ్చి ఆచరణ రంగంలో ప్రవేశించింది. చేతి శ్రమపై ఆధారపడిన చిన్నతరహా ఉత్పత్తి, కార్ఖానాదశ రద్దై, నిజమైన భారీపరిశ్రమ రంగంలో ప్రవేశించింది. జర్మనీ తిరిగి ప్రపంచ మార్కెట్‌లో అడుగు పెట్టింది. నూతనమైన చిన్న జర్మన్ సామ్రాజ్యం[31] ఈ పరిణామానికి తీవ్ర ఆటంకంగా ఉన్న కనీస అడ్డంకులను అనగా, చిన్నరాజ్యాల వ్యవస్థ, భూస్వామ్య అవశేషాలు, నిరంకుశ పరిపాలనా వ్యవస్థ – వీటిని రద్దుచేసింది. కాగా అదేమేరకు తత్వవేత్తల అధ్యయన శాలలను విడిచి, ఆలోచనారంగం, చట్టావ్యాపారంలో ప్రవేశించింది. విద్యాధిక జర్మనీ, సిద్ధాంతంపట్ల గల అభిరుచిని పోగొట్టుకున్నది. జర్మనీ అత్యంత అవమానకర పరిస్థితులలో ఉన్నప్పుడు కూడా ఈ అభిరుచి జర్మనీకి ఘనతను చేకూర్చింది. నిర్మలమైన శాస్త్రీయ పరిశోధనపట్ల ఈ అభిరుచి – పరిశోధనా ఫలితం ఆచరణసాధ్యమైనా కాకపోయినా, పోలీసు అధికారులకు ఇది ఆగ్రహం కలిగించినా, లేకపోయినా, జర్మనీకి ఆనాడు ఘనతను చేకూర్చింది. నిజమే, అధికారపూర్వక జర్మన్ ప్రకృతిశాస్త్రం, అగ్రశ్రేణిలో, ప్రత్యేక పరిశోధనా రంగంలో, తన స్థానాన్ని కాపాడుకుంటూనే ఉన్నది. కాగా, నిర్దిష్ట ఘటనల మధ్య సమగ్ర అంతస్సంబంధాలను కనుగొని, సూత్రీకరించే రంగంలో, నిర్ణయాత్మక పురోగతి, ఇదివరకటివలె జర్మనీలో గాక, ఇంగ్లండులో జరుగుతున్నదని, అమెరికన్ పత్రిక "Science" సైతం, సరియైన వ్యాఖ్యానమే చేస్తున్నది. తత్వశాస్త్రంతోపాటు, చారిత్రక శాస్త్రాల రంగంలో, సిద్ధాంతంపట్ల గల నిర్భీతితో కూడిన దీక్ష, సాంప్రదాయిక తత్వశాస్త్రంతో పాటు ఇప్పుడు జర్మనీలో పూర్తిగా అదృశ్యమైంది. ఆ స్థానాన్ని నిర్జీవమైన, పృథఃశకల వాదం (eclecticism), పదవి కొరకు, ధనం కొరకు ఆందోళనతో కూడిన ఆరాటం, అతి నీచమైన స్థాయికి దిగజారిన ఉద్యోగాన్వేషణ ఆక్రమించాయి. ఈ శాస్త్రాల అధికార ప్రతినిధులు, నిస్సంకోచమైన బూర్జువావర్గ సిద్ధాంతవేత్తలుగా, రాజ్యపు సిద్ధాంతవేత్తలుగా రూపొందారు. కాని బూర్జువావర్గమూ, రాజ్యమూ కార్మికవర్గంతో బహిరంగ శత్రుత్వం ఏర్పరచుకున్న కాలంలో ఇది జరిగింది.

సిద్ధాంతంపట్ల జర్మనీకి గల అభిరుచి ఒక్క కార్మికవర్గంలో మాత్రమే చెక్కుచెదర కుండా నిలచి ఉంది. దీనిని ఇక్కడినుండి నిర్మూలించటం సాధ్యం కాదు. ఇక్కడ పదవి కోసం, లాభార్జనకోసం, పైవర్గాలవారి ఆదరణ కొరకూ ఆరాటం లేదు. తద్విరుద్ధంగా, శాస్త్రం ఎంత నిష్కర్షగా, నిర్భీతిగా ముందుకు సాగుతుందో, అంతగా అది, కార్మికవర్గ ఆశయాలకూ, ప్రయోజనాలకూ అనుగుణంగా రూపొందుతుంది. యావత్తు మానవ సమాజ చరిత్రనూ అర్థంచేసుకోవటంలో కీలకం, శ్రమ అభివృద్ధి చరిత్రలో ఉన్నదనే

నూతన ఆలోచనా ధోరణి, మొదటినుండీ కార్మికవర్గం వైపే మొగ్గుచూపుతూ వచ్చింది. అక్కడనే ఆదరణ పొందింది. అధికార గుర్తింపు కలిగిన శాస్త్రజ్ఞానంనుండి ఆదరణను కోరనూ లేదు, ఆశించనూ లేదు. జర్మన్ కార్మికోద్యమమే జర్మన్ సాంప్రదాయిక తత్వ శాస్త్రానికి వారసురాలు.

1886 ఆరంభంలో రచించబడినది

1886లో, "Die Neue Zeit" పత్రిక 4, 5 సంచిక
లలోనూ, 1888లో ష్టుట్‌గార్ట్‌లో ప్రత్యేక
ప్రచురణగానూ వెలువడింది

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

# ఫ్రాన్సు, జర్మనీలలో రైతు సమస్య[32]

సర్వత్రా యిప్పుడొక్కసారి అకస్మాత్తుగా సోషలిస్టులు రైతు సమస్యకు తక్షణ ప్రాధాన్యం ఎందుకు ఇస్తున్నారబ్బా అని బూర్జువా, అభివృద్ధి నిరోధక పార్టీలు అబ్బురపడుతున్నాయి. న్యాయానికి యీ పని యింతకుముందే ఎన్నడో ఎందుకు జరగలేదా అని అవి ఆశ్చర్యం చెందియుండాల్సింది. ఐర్లండు మొదలుకొని సిసిలీదాకా, అండలూసియానుండి రష్యా, బల్గేరియాల దాకా జనాభాలో, ఉత్పత్తిలో, రాజకీయ శక్తిలో రైతు చాలా ముఖ్యమైన అంశమై వున్నాడు. పశ్చిమ యూరపులో కేవలం రెండు ప్రాంతాలు మాత్రమే యిందుకు మినహాయింపుగా వున్నాయి. నేరుగా గ్రేట్ బ్రిటన్‌లో బడా వ్యావసాయిక ఎస్టేట్లూ, భారీస్థాయి వ్యవసాయమూ స్వయం పోషక రైతును పూర్తిగా నెట్టేశాయి. ప్రష్యాలో ఎల్బ్ నదికి తూర్పు భాగాన యిదే క్రమం కొన్ని శతాబ్దాలుగా జరుగుతూవస్తోంది. ఇక్కడ కూడా రైతులు అంతకంతకు అధికంగా "వెళ్లగొట్టబడుతున్నారు"* లేక అధమపక్షం ఆర్థికంగాను, రాజకీయంగాను వెనక్కి నెట్టబడుతూనైనా వున్నారు.

రైతు యింతదాకా ఎక్కువగా తన ఉదాసీనత ద్వారా మాత్రమే తనను తానొక రాజకీయ శక్తిగా వ్యక్తీకరించుకున్నాడు. దీనికి మూలం అతని గ్రామీణ జీవితపు వేర్పాటులో మనకి కనిపిస్తుంది. జనాభాలోని అత్యధికభాగంలో వున్న యీ ఉదాసీనతయే పారిస్, రోములలోని పార్లమెంటరీ అవినీతికే కాకుండా, రష్యన్ నిరంకుశాధికారానికి కూడా అత్యంత బలీయమైన ఆధార పీఠం. అయితే అదెంతమాత్రమూ అధిగమింపరానిది కాదు. పశ్చిమ యూరపులో, ప్రత్యేకించి చిన్న రైతు కమతాలు ప్రాబల్యంలో వున్న ప్రాంతాల్లో కార్మిక

---

* Wird "gelegt." Bauernlegen – జర్మన్ చరిత్రనుంచి పరిగ్రహించబడిన యీ సాంకేతిక పదానికి రైతుల బేదఖలు, ఆస్తిహరణ అని అర్థం. (ఎంగెల్స్ రచన ఆరంభ భాగానికి తను చేసిన అనువాదానికి లెనిన్ యిచ్చిన వివరణ.)

వర్గోద్యమం ఉద్భవించిననాటినుండీ సోషలిస్టు కార్మికులను partageuxగా, ఆస్తులను "పంపిణీ చేసివేయ" కోరేవారుగా, రైతుల ఆస్తిపైన కన్నువేసిన సోమరిపోతు, దురాశాపర నగరవాసులుగా చిత్రించి వారిపట్ల రైతుల మనసుల్లో అనుమానాన్నీ, అసహ్యాన్నీ రేకెత్తించడంలో బూర్జువావర్గానికి ప్రత్యేకించి ఏమంత కష్టం లేకపోయింది. 1848 ఫిబ్రవరి విప్లవంయొక్క అస్పష్టమైన సోషలిస్టు ఆకాంక్షలకు ఫ్రెంచి రైతాంగం అభివృద్ధినిరోధకమైన తమ ఓట్లద్వారా త్వరితంగా స్వస్తిచెప్పింది. మనశ్శాంతిని కోరుకున్న ఆ ఫ్రెంచి రైతు, నెపోలియన్ రైతుల చక్రవర్తి అని తన మనస్సులో చిరకాలంగా భద్రపరచుకున్న అద్భుత కట్టుకథా చిత్రణను తవ్విపైకితీసి, రెండవ సామ్రాజ్యాన్ని సృష్టించాడు.[33] రైతులయొక్క యీ ఒక్క వీరకృత్యం ఫ్రెంచి ప్రజలకు ఎంత నష్టం కలిగించిందో మనందరికీ తెలిసిన సంగతే; దాని దుష్పర్యవసానాలను ఫ్రాన్సు యీనాటికీ అనుభవిస్తూనే వుంది.

కాని, దరిమిలా చాలా మార్పులు సంభవించాయి. వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపాభివృద్ధి సన్నకారు ఉత్పత్తియొక్క జీవనాడులను తెంచివేసింది. సన్నకారు ఉత్పత్తి మళ్లీ తేరుకోకుండా క్షీణిస్తోంది. ఉత్తర, దక్షిణ అమెరికాలకు, భారతదేశానికి కూడా చెందిన పోటీదారులు తమ చౌక ధాన్యంతో యూరపియన్ మార్కెట్లను ముంచెత్తేశారు. ధాన్యాన్ని వారెంత చౌకగా అమ్మారంటే, స్థానిక ఉత్పత్తిదారులెవరూ కూడా వారితో పోటీచెయ్యలేకపోయారు. పెద్ద భూస్వాములూ, చిన్న రైతులూ కూడా ఒకే మాదిరిగా తమ కళ్లెదుట వినాశాన్ని చూడసాగారు. వారిద్దరూ కూడా భూముల సొంతదారులూ, గ్రామవాసులూ కనుక, పెద్ద భూస్వాములు చిన్న రైతుల ప్రయోజనాల పరిరక్షకుల పాత్రను వహించడం, దరహంమీద చిన్న రైతులు వారిని ఆవిధంగానే స్వీకరించడం జరిగింది.

ఈలోగా పాశ్చాత్య దేశాల్లో బలీయమైన సోషలిస్టు కార్మిక పార్టీ ఆవిర్భవించి పెంపొందింది. ఫిబ్రవరి విప్లవంనాటి అస్పష్ట దుర్నిమిత్తాలూ, భావాలూ స్పష్టతను పొంది, సకల శాస్త్రీయావసరాలనూ తృప్తిపరచే, కచ్చితమైన, స్పష్టమైన డిమాండ్లను కలిగియున్న మరింత విస్తృతమూ, మరింత ప్రగాఢమూ అయిన కార్యక్రమ పరిధిని సంతరించుకున్నాయి. జర్మన్, ఫ్రెంచి, బెల్జియన్ పార్లమెంట్లలో నానాటికీ ఎక్కువ సంఖ్యలో సోషలిస్టు సభ్యులు యీ డిమాండ్లకోసం పోరాడుతున్నారు. సోషలిస్టు పార్టీ రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకోవడమన్నది సుదూర భవిష్యత్తుకి సంబంధించిన విషయం కాకుండాపోయింది. కాని, రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకొనేందుకుగాను, యీ పార్టీ మొట్టమొదట పట్టణాలనుండి గ్రామసీమకు పోవలసి వుంటుంది, గ్రామసీమలో ఒక శక్తిగా తయారవవలసి వుంటుంది. ఈ పార్టీ ఆర్థిక కారణాలకూ రాజకీయ పర్యవసానా

లకూ మధ్యగల పరస్పర సంబంధాల విస్పష్ట పరిజ్ఞానాన్ని కలిగిన కారణంగా మిగిలిన అన్ని పార్టీలకన్న అనుకూల పరిస్థితిలో వుంది; గోముఖాన్ని దాల్చిన వ్యాఘ్రంవంటి బడా భూస్వామిని, రైతుయొక్క యిబ్బందికర పీడక మిత్రుని ఎన్నడో బయటపెట్టింది. అటువంటి యీ పార్టీ దౌర్భాగ్యుడైన రైతును, పారిశ్రామిక కార్మికులయొక్క ఉదాసీన ప్రత్యర్థి దశ నుంచి క్రియాశీల ప్రత్యర్థి దశకు మారేదాకా అతన్ని అతని కపట రక్షకుల చేతుల్లో చల్లగా వదిలిపెట్టెయ్యవలసిందేనా? ఈ ప్రశ్న మనల్ని నేరుగా రైతుసమస్యలోకి తీసుకెళ్తుంది.

I

ఏ గ్రామీణ జనాభాను ఉద్దేశించి అయితే మనం మాట్లాడగలమో, అది పూర్తిగా భిన్నమైన భాగాలతో కూడివుంది, వేర్వేరు ప్రాంతాల్లో ఆ భాగాలమధ్య విశేషమైన వైవిధ్యం వుంది.

ఫ్రాన్సు, బెల్జియంలలో మాదిరిగానే జర్మనీ పశ్చిమ భాగంలో చిన్న కమతందారీ రైతుల సన్నకారు వ్యవసాయం వ్యాప్తిలో వుంది. వీరిలో అధిక సంఖ్యాకులకు సొంత పొలాలున్నాయి, అల్ప సంఖ్యాకులు తమ భూఖండాలను కౌలుకు తీసుకుంటారు.

వాయవ్య భాగంలో, అంటే దిగువ సాక్సనీ, ష్లెస్విగ్-హోల్‌ష్టైన్‌లలో మగ, ఆడ పాలేళ్ళూ, రోజు కూలీలూ లేనిదే పనులు గడవని పెద్ద రైతుల, మధ్య రైతుల ప్రాబల్యం మనకి కనిపిస్తుంది. బవేరియాలో కొంత భాగానికి కూడా యిదే వర్తిస్తుంది.

ప్రష్యాలో ఎల్బ్ నదికి తూర్పునా, మెక్లెన్‌బుర్గ్‌లోనూ పెద్ద ఎస్టేట్లతోకూడి, పాలేళ్లతో, దాసదాసీలతో, రోజు కూలీలతో భారీ ఎత్తున వ్యవసాయం జరుగుతున్న ప్రాంతాన్ని మనం చూస్తాం. వీటి మధ్య చిన్నరైతులూ, మధ్య తరగతి రైతులూ సాపేక్షంగా అముఖ్యమైన, క్రమంగా దిగనాసిల్లుతున్న నిష్పత్తిలో ఉండటాన్ని కూడా మనం చూస్తాం.

మధ్య జర్మనీలో యీ అన్ని ఉత్పత్తి రూపాలూ, భూస్వామ్య రూపాలూ – ఆయా ప్రాంతాలనుబట్టి, ఏ ఒక్క పెద్ద ప్రాంతంలోనూ ఏ ప్రత్యేక రూపానికీ కచ్చితమైన ప్రాబల్యం లేకుండా – వివిధ నిష్పత్తుల్లో కనిపిస్తాయి.

వీటికితోడు పరిమితి వైవిధ్యం కలిగిన యితర ప్రాంతాలున్నాయి. వాటిలో సొంత స్వామ్యంలోవున్న, లేక కౌలుకు తీసుకున్న సాగుకు లాయకైన భూమి, ఆ కుటుంబపు పోషణకు సరిపడే ఫలసాయాన్నివ్వదు. కాని, ఒక గృహ పరిశ్రమ నిర్వహణకు ప్రాతిపదికగా మాత్రం పనికివస్తుంది. తద్వారా, ఆ పరిశ్రమ యితరత్రా సాధ్యం కానంత తక్కువ వేతనాలు చెల్లించగలగడాన్నీ, విదేశీ పోటీ అంతటినీ తట్టుకొని, దాని ఉత్పాదితాలను ఒడిదుడుకుల్లేకుండా అమ్ముకోగలగడాన్నీ సాధ్యంచేస్తుంది.

గ్రామీణ జనాభాలోని యీ అంతర్భాగాలలో దేన్ని సోషల్-డెమోక్రటిక్ పార్టీ తన వంకకు ఆకర్షించుకోగలుగుతుంది? అయితే మేమిక్కడ యీ సమస్యను స్థూలంగా మాత్రమే పరిశీలిస్తాం. సుస్పష్టమైన రూపాలను మాత్రమే మేమిక్కడ ఎన్నుకుంటాం. మధ్యంతర దశలనూ, సమ్మిశ్ర గ్రామీణ జనాభాలనూ పరిగణనలోకి తీసుకోడానికి మాకిక్కడ స్థలం సరిపోదు.

చిన్న రైతుతో మనం మన పరిశీలనను ప్రారంభిద్దాం. మొత్తంమీద పశ్చిమ యూరప్‌కు సంబంధించినంతవరకు రైతులందరిలోనూ చిన్న రైతు చాలా ముఖ్యమైనవాడు మాత్రమే కాక, అతనే యావత్తు సమస్యనూ నిర్ధరించే కీలక పరిశీలనాంశం కూడా. చిన్న రైతుపట్ల ఎప్పుడైతే మనం మన మనసుల్లో మన వైఖరిని స్పష్టంచేసుకుంటామో, అప్పుడిక గ్రామీణ జనాభాలోని యితర అంతర్భాగాలపట్ల మన దృక్పథాన్ని నిర్ణయించుకోడానికి అవసరమైన సమాచారమంతా మనకి వున్నట్లే.

ఇక్కడ చిన్నరైతు అని మనం అన్నప్పుడు సాధారణంగా అతనూ, అతని కుటుంబమూ దున్నుకోగలిగినదానికన్న పెద్దదీ, ఆ కుటుంబ పోషణకు సరిపడేదానికన్న చిన్నదీ కాని సొంత కమతాన్ని కలిగిన రైతు లేక కౌలుదారు అని మన ఉద్దేశం. అందుచేత సరిగా చిన్న చేతివృత్తి పనివాని మాదిరిగానే యీ చిన్నరైతు ఒక శ్రమజీవి. ఇతనికీ ఆధునిక శ్రామికునికీ తేడా ఏమిటంటే, యితనింకా తన శ్రమ పరికరాలను కలిగియున్నాడు. కాగా, గతించిపోయిన ఉత్పత్తి విధానానికి యితనొక అవశేషం. అతనికీ అతని పూర్వికుడైన భూదాసునికీ, కట్టుబానిసకూ, లేక, అతి అరుదుగా, కౌలు చెల్లించవలసిన, ఫ్యూడల్ సేవలు చెయ్యవలసిన స్వేచ్ఛాయుతుడైన రైతుకూ మూడు విధాల తేడా వుంది. మొదటిది, ఫ్రెంచి విప్లవం అతన్ని ఫ్యూడల్ సేవలనుంచీ, భూస్వామికి అతను చెల్లించాల్సిన రుణాలనుంచీ విముక్తుణ్ణి చేసింది. అధికాంశ సందర్భాల్లో, కనీసం రైన్ నదికి ఎడమ గట్టున, అతని వ్యవసాయ క్షేత్రాన్ని అతని సొంత స్వతంత్ర ఆస్తిగా కేటాయించింది. రెండవది, స్వయం పరిపాలక మార్క్ సంఘపు* రక్షణనూ, దానిలో పాల్గొనే హక్కునూ, కాగా పూర్వపు ఉమ్మడి భూమియొక్క ప్రతిఫలంలో తన భాగాన్నీ అతను కోల్పోయాడు. ఉమ్మడి భూమి పాక్షికంగా పూర్వపు ఫ్యూడల్ ప్రభువుచేతా, పాక్షికంగా రోమన్ న్యాయవ్యవస్థ నమూనాలో తయారుచెయ్యబడిన తెలివైన బ్యూరాక్రటిక్ చట్టాలచేతా నిర్మూలింపబడింది. దీనితో ఆధునిక కాలపు చిన్నరైతులు పశువుల మేతను కొంటేగాని తమ దుక్కి పశువులను మేపుకునే అవకాశాన్ని కోల్పోయారు. ఆర్థికంగా చూస్తే మాత్రం ఉమ్మడి భూమి ద్వారా లభించే ప్రతిఫలం ఫ్యూడల్ సేవల రద్దు ద్వారా సమకూరే ప్రయోజనాలకన్న చాలా

---

* మార్క్ సంఘం (mark community) — ఉమ్మడి భూమిగల సంఘం. — సం.

అధికం. తమ సొంత దుక్కి పశువులను పోషించుకోలేని రైతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మూడవది, యీనాటి రైతు తన వెనుకటి ఉత్పాదక కార్యకలాపంలో సగాన్ని కోల్పోయాడు. పూర్వం చిన్నరైతు తన కుటుంబ సభ్యుల సహాయంతో, తనే తయారు చేసుకున్న ముడి పదార్థంతో, తనకు అవసరమైన పారిశ్రామికోత్పాదితాలలో ఎక్కువ భాగాన్ని తయారుచేసుకునేవాడు. అతనికి అవసరమైన మిగిలిన వస్తువులు గ్రామంలో వ్యవసాయంతోబాటు ఏదో ఒక చేతివృత్తి చేసుకునే అతని పొరుగువారు సరఫరా చేసేవారు. ఆ వస్తువులకు బదులుగా వారికి వేరే వస్తువులు చెల్లింపబడుతూండేవి, లేక అందుకు ప్రతిఫలం మారుపనుల రూపంలో చెల్లింపబడేది. ఆ కుటుంబం, అంతకన్న ఎక్కువగా ఆ గ్రామం స్వయంపోషకంగా ఉండి, తనకు కావలసిన ప్రతి వస్తువునూ తయారుచేసుకునేది. అది దాదాపుగా స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ, ఆ వ్యవస్థలో దాదాపుగా డబ్బు అవసరమే లేకపోయింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి తన ధన ఆర్థిక వ్యవస్థ ద్వారా, తన భారీ పరిశ్రమల ద్వారా స్వయంపోషక ఆర్థిక వ్యవస్థకు స్వస్తిచెప్పింది. కాని, ఉమ్మడి భూమి ద్వారా లభించే ప్రతిఫలాలు చిన్నరైతు అస్తిత్వానికి అవసరమైన ప్రధాన షరతుల్లో ఒకటై ఉండగా, అతని పారిశ్రామిక ఉపవృత్తి మరొకటైంది. ఈ విధంగా రైతుపని నానాటికీ తీసికట్టుగా తయారవుతుంది. పన్నులు, పంటలు పాడవడం, వారసత్వంగా వచ్చే ఆస్తి పంపిణీలు, వ్యాజ్యాలతో ఒకరితర్వాత మరొకరుగా రైతులు వడ్డీ వ్యాపారి కబంధ హస్తాల్లో యిరుక్కుంటారు. రుణభారం అంతకంతకు ఎక్కువ సర్వసామాన్యమవుతుంది, ప్రతి ఒక్కని విషయంలోనూ రుణం మొత్తం క్రమంగా పెరుగుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, కాలంచెల్లిపోయిన యితర ఉత్పత్తి విధానావశేషాలన్నింటి మాదిరిగానే, మన చిన్నరైతు తప్పనిసరి వినాశానికి గురి అవుతాడు. భవిష్యత్తులో అతనొక నిరాస్తిపరుడు, శ్రామికుడు.

ఈ కారణంగా, అతను సోషలిస్టు ప్రచారానికి యిష్టంగా చెవియొగ్గాలి. కాని ఆస్తికి సంబంధించి గాఢంగా అతనిలో నాటుకొనివున్న భావాలు అతను ఆవిధంగా చెయ్యడానికి తాత్కాలికంగా ఆటంకమవుతాయి. అతని కమతం ప్రమాదంలోపడి, అతను దాన్ని కాపాడుకోవడం కష్టతరమైనకొద్దీ, దాన్ని అతను మరింత గట్టిగా పట్టుకు వేలాడుతాడు. వడ్డీ వ్యాపారస్తుడినీ, వకీలునీ ఎంత ప్రమాదకర శత్రువులుగా పరిగణిస్తాడో భూమి ఆస్తిని యావత్తు సమాజానికీ బదలాయించాలని చెప్పే సోషల్-డెమోక్రట్లను కూడా అంత ప్రమాదకర శత్రువులుగానూ పరిగణిస్తాడు. చిన్న రైతుల్లో వున్న యీ దురభిప్రాయాన్ని సోషల్-డెమోక్రట్లు ఏవిధంగా అధిగమించగలుగుతారు? తన సిద్ధాంతాలకు భంగం కలుగకుండా సోషల్-డెమోక్రసీ, వినాశపుటంచున వున్న చిన్న రైతులకు ఏమి యివ్వగలుగుతుంది?

ఈ సందర్భంగా, మార్క్సిస్టు ధోరణికి చెందిన ఫ్రెంచి సోషలిస్టుల వ్యావసాయిక

కార్యక్రమంలో మనకు యీ ప్రశ్నకు ఆచరణాత్మకమైన జవాబు లభిస్తుంది. సాంప్రదాయికంగా చిన్న రైతు ఆర్థిక వ్యవస్థకు నిలయమైన దేశంనుంచి వచ్చిన కారణంగా యీ కార్యక్రమం మరింత గమనార్హమైనది.

1892 నాటి మార్సేల్స్ మహాసభ[34] పార్టీయొక్క ప్రథమ వ్యవసాయ కార్యక్రమాన్ని ఆమోదించింది. భూమిలేని వ్యవసాయ కార్మికులకు (అంటే, రోజుకూలీలకు, దాసదాసీలకు) అది యీకింది వాటిని డిమాండ్ చేసింది. ట్రేడ్ యూనియన్లూ, కమ్యూనిటీ సమితులూ నిర్ణయించిన కనీస వేతనాలు; సగంమంది కార్మికులను కలిగిన గ్రామీణ వృత్తి కోర్టులు; ఉమ్మడి భూమి అమ్మకంపై నిషేధం; ఊరి ఉమ్మడి పొలాన్ని గ్రామ సంఘాలకు కౌలుకివ్వాలి, ఆ గ్రామసంఘాలు యీ భూమి అంతటినీ — అది తమకు చెందినదైనా, కౌలుకు తీసుకున్నదైనా — ఆస్తిహీన వ్యవసాయ కార్మిక కుటుంబాల సంఘాలకు ఉమ్మడి సాగుకోసం కౌలుకివ్వాలి; అలా యిచ్చేటప్పుడు వేతన కార్మికులను పనిలో పెట్టుకోరాదు, గ్రామసంఘాలే అదుపు చెయ్యాలి అన్న షరతుపై కౌలుకివ్వాలి; వృద్ధాప్య, అంగ వైకల్య భృతులివ్వాలి, ఆ మొత్తాన్ని పెద్దపెద్ద ఎస్టేట్లపై ప్రత్యేక పన్ను ద్వారా రాబట్టాలి.

చిన్న రైతుల తరఫున, ప్రత్యేకించి కౌలుదారులను, మక్తా రైతుల (métayers)ను దృష్టిలో పెట్టుకొని, కొన్నధరకు రైతులకు కౌలుకిచ్చేందుకుగాను కమ్యూనిటీ యంత్రాలను సమకూర్చుకోవాలి; ఎరువులు, నీటి తూరలు, విత్తనాలు మొదలైన వాటిని కొనుగోలు చేసేందుకూ, ఉత్పాదిత వస్తువుల అమ్మకాలకూ గాను రైతుల సహకార సంఘాలను ఏర్పాటు చెయ్యాలి; భూమియొక్క విలువ 5,000 ఫ్రాంకులను మించకపోయినట్లయితే భూమి బదలాయింపు పన్నును రద్దుచెయ్యాలి; మిక్కిలి అధికమైన కౌలు మొత్తాలను తగ్గించేందుకూ, భూములనుండి వైదొలగే కౌలుదార్లకూ, మక్తా రైతులకూ — వారికి చెందవలసిన పొలానికి మించు వలె — నష్ట పరిహారాన్ని యిప్పించేందుకూ ఐరిష్ నమూనాలో మధ్యవర్తిత్వ సంఘాలు ఏర్పాటుచెయ్యబడాలి; భూస్వామి రైతు పంటను కబ్జాచేసుకోడాన్నీ, రుణదాతలు పెరిగిన పంటను జప్తు చేయించడాన్నీ అనుమతించే సివిల్ కోడ్‌యొక్క 2102వ నిబంధనను రద్దుచెయ్యాలి; లేవీనుంచి వ్యవసాయదారుల మినహాయింపు, ఒక నిర్ణీత మొత్తంలో వ్యవసాయ పనిముట్లను, పంటను, విత్తనాలను, ఎరువును, దుక్కి పశువులను, క్లుప్తంగా చెప్పాలంటే రైతు తన వ్యవసాయ కార్యకలాపాలను కొనసాగించుకొనేందుకు విధిగా కావలసినవాటన్నింటినీ జప్తునుంచి మినహాయించాలి; ఎన్నడో కాలదోషం పట్టిపోయిన సాధారణ స్థిరాస్తి రిజిస్టరును — ప్రతి ఒక గ్రామ సమాజంలోనూ స్థానికంగా పొలాల జాబితాలు సవరింపబడేలోగా — సవరించాలి; క్షేత్ర, వ్యావసాయిక ప్రాయోగిక కేంద్రాలలో ఉచిత శిక్షణ గరపాలి.

మనకిక్కడ ఒక విషయం కనిపిస్తుంది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టు కొని చెయ్యబడిన డిమాండ్లు — ప్రస్తుతానికిక్కడ మనకు కార్మికుల ప్రయోజనాలతో ప్రసక్తిలేదు — అంత మరీ ఎక్కువ ప్రభావశీలమైనవేమీ కావు. వీటిలో కొన్ని యితరచోట్ల యిప్పటికే సాధింపబడ్డాయి. కౌలుదారుల మధ్యవర్తిత్వ న్యాయస్థానాలు ఐరిష్ నమూనాను బాహాటంగానే అనుసరిస్తున్నాయి. రైన్ రాష్ట్రాల్లో రైతుల సహకార సంఘాలు యిప్ప టికే అమల్లో వున్నాయి. స్థిరాస్తి రిజిస్టరు (cadastre) సవరణ అన్నది ఉదార వాదులందరి శుభకామనే కాకుండా, పశ్చిమ యూరప్ అంతటా బ్యూరాక్రట్లు సైతం కావాలని కోరుతున్న అంశం. పై కార్యక్రమంలోని మిగతా అంశాలు సైతం ప్రస్తుతమున్న పెట్టుబడిదారీ వ్యవస్థకు ఏమంత గణనీయంగా భంగం కలిగించకుండా అమలుజరుపదగినవే. ఈ కార్యక్రమ స్వభావాన్ని గురించి సూక్ష్మంగా మేమిక్కడ చెప్పదలుచుకున్నది యింత మాత్రమే. నిందారోపణ చెయ్యడం మా సంకల్పం ఎంతమాత్రం కాదు, పైగా తద్వ్య తిరేకం.

ఫ్రాన్సులోని అత్యంత మారుమూలల్లో సైతం పార్టీ యీ కార్యక్రమాన్ని ఎంత విరివిగా ప్రచారం చేసిందంటే — తినడం మొదలెట్టడంతో ఆకలి పుట్టినట్లు రైతుల అభిరుచికి దీన్ని మరింత అనుగుణంగా మలచాల్సిన అవసరం మరింతగా అనుభూతమైంది. కాని, అలా చెయ్యడం ప్రమాదకరమైన తావులో అడుగుపెట్టడమన్నట్లు కూడా అను భూతమైంది. సాధారణ సోషలిస్టు కార్యక్రమం మౌలిక సూత్రాలకు భంగం కలిగించకుండా, రైతుకు — భవిష్యత్తులో నిరాస్తిపర శ్రామికుడుగా (proletarian) కాక ప్రస్తుత ఆస్తిపరుడైన రైతుకు — తోడ్పడటమెలాగ? ఈ అభ్యంతరాన్ని అధిగమించేందుకుగాను ఆ కొత్త ఆచరణాత్మక ప్రతిపాదనల సైద్ధాంతిక అవతారిక ముందు చేర్చబడింది. ఈ అవ తారికలో, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంచేత వినాశంనుండి చిన్న రైతు ఆస్తిని కాపాడట మన్నది — ఈ వినాశం తప్పనిసరైనదన్న సంగతి అందరికీ తెలిసినదే అయినప్పటికీ — సోష లిస్టు సూత్రాలకు అనుగుణమైనదేనని రుజువుచెయ్యడానికి ప్రయత్నింపబడింది. అందుకని యీ అవతారికనే కాకుండా, ఈ ఏడాది సెప్టెంబరులో నాంట్ మహాసభలో ఆమోదింప బడిన డిమాండ్లను సైతం యిప్పుడిక్కడ మనం మరింత సూక్ష్మంగా పరిశీలిద్దాం.

ఆ అవతారికలో ఇలా వుంది:

> "ఈ దృష్ట్యా, పార్టీయొక్క సాధారణ కార్యక్రమ నిబంధనల ప్రకారం ఉత్పత్తిదారులు ఉత్పత్తి సాధనాలను కలిగివున్న పక్షంలో మాత్రమే వారు స్వతంత్రులుగా ఉండగలరు;
>
> "ఈ దృష్ట్యా, పారిశ్రామిక రంగంలో యీ ఉత్పత్తి సాధనాలు యిప్పటికే

ఎంత ఉన్నతస్థాయి పెట్టుబడిదారీ కేంద్రీకరణకు చేరుకున్నాయంటే, వాటిని ఉత్పత్తిదారులకు తిరిగి యివ్వడం సమష్టి, లేక సామాజిక రూపంలో మాత్రమే సాధ్యం. కాని వ్యవసాయ రంగంలో — కనీసం యీనాటి ఫ్రాన్సులో — ఉత్పత్తి సాధనాలు, అక్షరాలా భూమి, పలు ప్రాంతాల్లో వ్యక్తిగత ఉత్పత్తిదారుల చేతుల్లోనే, వారి వ్యక్తిగత స్వాధీనంలోనే యింకా ఉన్నందున — యీ పరిస్థితి ఎంతమాత్రం లేదు;

"ఈ దృష్ట్యా, చిన్న కమతపు స్వామ్యానికి స్వభావసిద్ధమైన యీ పరిస్థితి తిరుగులేని విధంగా వినాశపుటంచున వున్నప్పటికీ (est fatalement appelé a disparaître), యీ వినాశాన్ని త్వరితంచేసేది సోషలిజం కాదు. సోషలిజంయొక్క కర్తవ్యం ఆస్తిని శ్రమనుండి వేరుచెయ్యడం కాదు, అందుకు విరుద్ధంగా, యావత్తు ఉత్పత్తికీ సంబంధించిన యీ రెండు అంశాలనూ ఒకే చేతుల్లో పెట్టడం ద్వారా, ఐక్యం చెయ్యడమే దాని కర్తవ్యం; ఈ అంశాల వేర్పాటు నిరాస్తిపరులైన స్థితికి దిగజార్చబడిన కార్మికులను దాస్యానికీ పేదతనానికీ వంశపారంపర్యంగా గురిచేస్తుంది.

"ఈ దృష్ట్యా, ఒకవంక, విస్తారమైన భూప్రాంతాలనుండి వాటి ప్రస్తుత సోమరి సొంతదారులను తొలగించి, వ్యవసాయ కార్మికులకు వాటిపై స్వామ్యాన్ని — సమష్టి రూపంలో లేక సామాజిక రూపంలో — కల్పించడం సోషలిజం విధి. మరోవంక, తమకు తాముగా తమ చిన్న భూఖండాలను దున్నుకొంటూ, ప్రభుత్వ ఖజానా (fisk), వడ్డీ వ్యాపారస్తుడు, కొత్తగా ఉద్భవించిన బడా భూస్వాముల తాకిడికి వ్యతిరేకంగా ఆ భూఖండాలను కలిగియున్న రైతులు కొనసాగేట్లు చూడటంసైతం సోషలిజంయొక్క తప్పనిసరి బాధ్యతల్లో తక్కువ విధాయకమైనదేమీ కాదు;

"ఈ దృష్ట్యా, కౌలు రైతులుగా, లేక మక్తా రైతులుగా యితరుల స్వామ్యంలో వున్న భూమిని సాగుచేసే ఉత్పత్తిదారులకు కూడా యీ రక్షణను విస్తరింపజెయ్యడం సముచితం; వారు రోజు కూలీలను దోచుకుంటున్నారంటే, కొంతమేరకు తామే దోపిడికి గురి అవుతున్న కారణంగానే వారు అలా చెయ్యవలసిన తప్పనిసరి పరిస్థితిలో పడుతున్నారు.

"ఈ దృష్ట్యా, కార్మిక పార్టీ — ఏదైతే అరాజకవాదుల మాదిరిగా సామాజిక వ్యవస్థలో మార్పుకోసం పేదరికపు పెరుగుదలపైనా, వ్యాప్తిపైనా ఆధారపడదో, ఏదైతే శ్రమయొక్క, మొత్తంగా సమాజంయొక్క విముక్తిని గ్రామీణ, పట్టణ ప్రాంత కార్మికుల నిర్మాణ, సమీకృత కృషుల ద్వారా, ప్రభుత్వాన్నీ,

చట్టనిర్మాణాన్నీ హస్తగతం చేసుకోవడం ద్వారా మాత్రమే జరుగుతుందని తెలుస్తుందో ఆ కార్మిక పార్టీ – గ్రామీణ ఉత్పత్తికి సంబంధించిన అన్ని శక్తులనూ కూడగట్టేందుకూ, వివిధ హక్కుల ద్వారా, దస్తావేజుల ద్వారా దేశపు నేలను వినియోగించే అన్ని వృత్తులనూ కూడగట్టేందుకూ, ఉమ్మడి శత్రువైన భూస్వామ్యంపైన, ఫ్యూడల్ వ్యవస్థపైన సమైక్య పోరాటాన్ని సాగించేందుకూ గాను యీ కింది వ్యవసాయ కార్యక్రమాన్ని ఆమోదించింది."

ఇప్పుడిక యీ "ఈ దృష్ట్యా"లను మరింత సూక్ష్మంగా పరిశీలిద్దాం.

మొదటి సంగతి, ఉత్పత్తిదారులు స్వాతంత్ర్యం కలిగివుండాలంటే ముందు వారు ఉత్పత్తి సాధనాలను కలిగివుండాలి అని ఫ్రెంచి కార్యక్రమంలో వున్న పదాలకు, ఆ వెంటనే వున్న పదాలను చేర్చాల్సివుంటుంది – ఉత్పత్తి సాధనాలపై స్వామ్యం రెండు రూపాల్లో మాత్రమే సాధ్యం: వ్యక్తిగత స్వామ్యం రూపంలోగాని – దరహంమీద ఉత్పత్తిదారులకు సంబంధించి యీ రూపం ఎన్నడూ, ఎక్కడా అస్తిత్వంలో లేదు, పైగా పారిశ్రామిక పురోగతి కారణంగా నానాటికీ యిది మరింత అసాధ్యంచెయ్యబడుతోంది; లేక ఉమ్మడి స్వామ్యంగా గాని – పెట్టుబడిదారీ సమాజాభివృద్ధి కారణంగానే యీ రూపంయొక్క పాదార్థిక, బౌద్ధిక పూర్వషరతులు స్థిరపరచబడ్డాయి; అందువల్ల ఉత్పత్తి సాధనాలను ఉమ్మడి స్వామ్యంలోకి తీసుకోడం కోసం శ్రామికవర్గం తనకున్న అన్ని సాధనాలతోనూ పోరాడాలి.

ఉత్పత్తి సాధనాలపై ఉమ్మడి స్వామ్యం అన్నది కృషిచేసి సాధించవలసిన ఏకైక ప్రధాన లక్ష్యంగా యిక్కడ యీవిధంగా ముందుంచబడింది. ఒక్క పారిశ్రామిక రంగంలోనే కాకుండా – యీ రంగంలో భూమిక యిప్పటికే సంసిద్ధం చెయ్యబడింది – మొత్తంమీదా, కాగా వ్యవసాయ రంగంలో కూడా యిదే ప్రధాన లక్ష్యం. ఆ కార్యక్రమాన్నిబట్టి వ్యక్తిగత స్వామ్యం మొత్తంగా ఉత్పత్తిదారులందరికీ ఎన్నడూ, ఎక్కడా సాధింపబడలేదు; సరిగా అదే కారణంగానూ, పారిశ్రామిక ప్రగతి దాన్ని ఎటుతిరిగీ తొలగిస్తుంది కనుకనూ, యీ వ్యక్తిగత స్వామ్యాన్ని కొనసాగించడంలో కాక, అందుకు భిన్నంగా దాన్ని తొలగించడంలోనే సోషలిజం ఆసక్తి కలిగివుంది. వ్యక్తిగత స్వామ్యం ఉన్న చోట, ఉన్నడం కారణంగా ఉమ్మడి స్వామ్యాన్ని అది అసాధ్యం చేస్తుంది. ఆ కార్యక్రమాన్ని మన వాదానికి తోడ్పాటుగా ఎప్పుడైతే ఒకసారి ఉల్లేఖిస్తామో అప్పుడిక, ఆ కార్యక్రమమంతటినీ ఉదహరించాల్సి వుంటుంది. అది నాంట్‌లో ఉదహరింపబడిన ప్రతిపాదనను గణనీయంగా మారుస్తుంది. దానిలో వ్యక్తంచెయ్యబడిన సాధారణ చారిత్రక సత్యాన్ని అది, యీనాడు పశ్చిమ యూరపు, ఉత్తర అమెరికాలలో ఏ పరిస్థితుల్లోనైతే మాత్రమే అది సత్యంగా మిగలగలదో ఆ పరిస్థితులపై ఆధారపడేలా చేస్తుంది.

విడివిడి ఉత్పత్తిదారులు ఉత్పత్తి సాధనాలను కలిగియుండటమన్నది యీరోజుల్లో యికనెంతమాత్రమూ యీ ఉత్పత్తిదారులకు నిజమైన స్వాతంత్ర్యాన్ని ఇవ్వడం లేదు. నగరాల్లో చేతిపనులు యింతకుముందే నాశనం చెయ్యబడ్డాయి. లండనువంటి పెద్ద నగరాల్లో చేతిపనులు యిప్పటికే పూర్తిగా అంతరించిపోయాయి. భారీ పరిశ్రమలూ, అనారోగ్యకర వాతావరణంలో గంటల లెక్కలేకుండా దారుణమైన చాకిరీచేయించుకునే పద్ధతీ, దివాళాకోరుతనంపై వృద్ధిపొందే శుద్ధ చేతకానివాళ్ళా చేతిపనుల స్థానాన్ని ఆక్రమించిన కారణంగానే అవి అదృశ్యమైపోయాయి. స్వయం పోషకుడైన చిన్నరైతు తన చిన్న కమతపు సురక్షిత స్వామ్యాన్నీ కలిగి లేడు, స్వతంత్రుడుగానూ లేడు. అతనూ, అతని యిల్లూ, అతని వ్యవసాయ క్షేత్రమూ, అతనికి గల కొద్దిపాటి పొలాలూ వడ్డీవ్యాపారికి చెందుతాయి. కనీసం అడపాదడపానైనా ప్రశాంతమైన రోజులు గడిపే శ్రామికుని జీవికకన్న అతని జీవిక మరింత అస్థిరమైనది. నిత్యం హింసింపబడే రుణగ్రస్త బానిస జీవితంలో స్థిరత్వమన్నది ఎన్నడూ వుండదు. సివిల్‌కోడ్‌లోని 2102వ నిబంధనను కొట్టేయ్యండి, రైతుయొక్క వ్యవసాయ పరికరాల్లో నిర్ణీతమైన ఒక మొత్తాన్ని, పశువులు వగైరాలను లేవీనుండీ, జప్తుల నుండీ మినహాయిస్తూ శాసనం చెయ్యండి; అప్పటికీ అతనికి మీరొక అత్యవసర పరిస్థితినుంచి రక్షణ కల్పించలేరు. ఆ అత్యవసర పరిస్థితిలో అతను తన పశువులను "ఇచ్చికంగా" అమ్ముకోక తప్పదు; శరీరంతోబాటు అంతరాత్మను సైతం వడ్డీవ్యాపారికి తాకట్టు పెట్టుకొని, వినాశంనుంచి తాత్కాలిక వాయిదా పొందినందుకు సంతోషించక గత్యంతరం వుండదు. చిన్నరైతును అతని ఆస్తితోబాటు కాపాడాలని మీరు చేసే ప్రయత్నం అతని స్వేచ్ఛను కాపాడదు, అతని దాస్యానికి సంబంధించిన ఆ ప్రత్యేక రూపాన్ని మాత్రమే కాపాడుతుంది; ఏ పరిస్థితిలోనైతే అతను జీవించనూలేడు, చావనూలేడో అటువంటి పరిస్థితిని అది పొడిగిస్తుంది. అందుకని, మీ వాదానికి ప్రమాణంగా మీ కార్యక్రమంలోని మొదటి పేరా ప్రస్తావన యిక్కడ పూర్తిగా సందర్భరహితం.

ఈనాటి ఫ్రాన్సులో ఉత్పత్తి సాధనాలు, అంటే భూమి, అత్యధిక ప్రాంతాల్లో యిప్పటికీ విడి ఉత్పత్తిదారుల చేతుల్లో, వారి వ్యక్తిగత ఆస్తిగానే వుందనీ; అయితే, ఆస్తిని శ్రమనుండి వేరుచెయ్యడం కాక, తద్విరుద్ధంగా సమస్త ఉత్పత్తికీ సంబంధించిన యీ రెండు అంశాలనూ, వాటిని ఒక్కరి చేతుల్లోనే పెట్టడం ద్వారా ఏకంచెయ్యడమే సోషలిజంయొక్క కర్తవ్యమనీ కార్యక్రమ అవతారిక పేర్కొంటోంది. ఇంతకుముందే పేర్కొన్నట్లు, యీ సాధారణ రూపంలో రెండవ అంశం సోషలిజంయొక్క కర్తవ్యం ఎంత మాత్రమూ కాదు. పైగా ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తిదారుల ఉమ్మడి స్వామ్యానికి బదలాయించడం మాత్రమే సోషలిజంయొక్క కర్తవ్యం. ఈ విషయాన్ని ఎప్పుడైతే గుర్తుపెట్టుకోమో అప్పుడిక పై మాటలు నేరుగా తప్పుదారి పట్టించేవవుతాయి, చిన్నరైతుకు

అతని పొలాలపైన ప్రస్తుతమున్న కుహనా ఆస్తి స్వామ్యాన్ని నిజమైన ఆస్తిస్వామ్యంగా మార్చడం, అంటే, చిన్న కౌలుదారును భూమి సొంతదారుగానూ, రుణగ్రస్త సొంతదారును రుణరహిత సొంతదారుగానూ మార్చడమే సోషలిజం కర్తవ్యమన్నట్లవుతుంది. రైతు ఆస్తియొక్క కృత్రిమ రూపం అంతరించేలా చూడటంలో నిస్సందేహంగా సోషలిజానికి ఆసక్తి వుంది, కాని యీ పద్ధతిలో కాదు.

ఏదేమైనప్పటికీ, మనం యిప్పుడెంత దూరం పోయామంటే, సోషలిజంయొక్క బాధ్యత, అందునా

"తమకు తాముగా తమ చిన్న భూఖండాలను దున్నుకొంటూ, ప్రభుత్వ ఖజానా (fisk), వడ్డీ వ్యాపారస్తుడు, కొత్తగా ఉద్భవించిన బడా భూస్వాముల తాకిడికి వ్యతిరేకంగా ఆ భూఖండాలను కలిగియున్న రైతులు కొనసాగేటట్లు చూడటం"

తప్పనిసరి బాధ్యత అని అవతారిక స్పష్టంగా ప్రకటించేదాకా చేరుకున్నాం.

ఈవిధంగా ఆ అవతారిక అంతకు ముందు పేరాలో దేన్నైతే అసాధ్యమని తనే చెప్పిందో దాన్నే అమలుజరపడం తప్పనిసరి బాధ్యత అంటూ సోషలిజంపై రుద్దుతోంది. చిన్న కమతందారీ పద్ధతి రైతుస్వామ్యం "తిరుగులేని విధంగా వినాశపుటంచున వుంది" అని తనే చెప్పింది. అటువంటిది, దాన్నే "కొనసాగేలా చూడాలని" సోషలిజానికి పురమాయిస్తోంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి వేటి ద్వారా అయితే యీ తప్పనిసరి వినాశాన్ని తెస్తుందో ఆ పరికరాలు ప్రభుత్వ ఖజానా (fisk), వడ్డీ వ్యాపారస్తుడు, కొత్తగా ఉద్భవించిన బడా భూస్వాములు కాక మరేమిటి? ఈ త్రయానికి వ్యతిరేకంగా రైతును కాపాడటానికి "సోషలిజం" వినియోగించాల్సిన సాధనాలేమిటో యీ కింద చూద్దాం.

కాని, కాపాడవలసినది ఒక్క చిన్న రైతు ఆస్తిని మాత్రమే కాదు. అలాగే

"కౌలు రైతులుగా, లేక మక్తా రైతులుగా (métayers) యితరుల స్వామ్యంలోవున్న భూమిని సాగుచేసే ఉత్పత్తిదారులకు కూడా—వారు రోజు కూలీలను దోచుకుంటున్నారంటే, కొంతమేరకు తామే దోపిడికి గురిఅవుతున్న కారణంగానే వారు అలా చెయ్యవలసిన తప్పనిసరి పరిస్థితిలో పడుతున్నారు—యీ రక్షణను విస్తరింపజెయ్యడం సముచితం."

ఇదిగో సరిగా యీ ఘట్టంలో మనం అపరిచితమైన తావులో అడుగుపెడుతున్నాం. వేతన శ్రమ దోపిడికి సోషలిజం ప్రత్యేకించి వ్యతిరేకం. కాని యిక్కడ, యీ కార్యక్రమంలో ఫ్రెంచి కౌలురైతులు "రోజువారీ శ్రామికులను దోపిడీ చేసినప్పుడు" వారిని కాపాడటం

సోషలిజంయొక్క తప్పనిసరి బాధ్యత అని ప్రకటింపబడింది; కార్యక్రమ పాఠం అక్షరాలా యీ విషయాన్ని స్పష్టంగా పేర్కొంది! "తామే దోపిడికి గురిఅవుతున్న కారణంగానే!" కొంతమేరకు వారు అలా చెయ్యవలసిన తప్పనిసరి పరిస్థితిలో పడుతున్నారట!

ఎవరైనా కొండ ఎక్కిన తర్వాత అక్కడినుంచి స్లెడ్జిమీద కిందకి దిగజారుతూ వుండటం ఎంత సులభంగా, సరదాగా వుంటుంది! ఒకవేళ జర్మనీలోని పెద్ద రైతులూ, మధ్య తరగతి రైతులూ ఫ్రెంచి సోషలిస్టుల దగ్గరకు వచ్చి, తమ వాదానికి బలంగా వడ్డీ వ్యాపారస్తుల చేత, పన్ను వసూలుదార్లచేత, ధాన్యపు చట్టా వ్యాపారస్తులచేత, పశువుల వ్యాపారస్తులచేత "తామే దోపిడికి గురిఅవుతున్న కారణంగా" అన్న మాటలను ఉటంకించి తమ మగ, ఆడ పాలేళ్లను తాము దోచుకోవడంలో జర్మన్ సోషల్-డెమోక్రటిక్ పార్టీ తమకు వత్తాసు యిచ్చే విధంగా జర్మన్ పార్టీ కార్యవర్గాన్ని మాట సాయం చెయ్యమని అడిగితే వారు ఏమి జవాబుచెప్తారు? మన వ్యావసాయిక బడా భూస్వాములు కౌంట్ కానిట్జ్ (అతను కూడా తమ మాదిరిగానే ధాన్యపు దిగుమతులపై ప్రభుత్వ గుత్తాధికారం ఉండాలని ప్రతిపాదించాడు) బాపతును తమవద్దకు పంపి, చట్టావ్యాపారస్తులచేత, వడ్డీ వ్యాపారస్తులచేత, ధాన్యపు చట్టా వ్యాపారస్తులచేత "తామే దోపిడికి గురి అవుతున్న కారణంగా" అనే మాటలను తమ వాదానికి వత్తాసుగా ప్రస్తావించి, గ్రామీణ కార్మికులను తాము దోచుకోడానికి సోషలిస్టుల మాటసాయాన్ని అడగరని హామీ ఏమిటి?

మమ్మల్నిక్కడ ఆదిలోనే ఒక విషయం చెప్పనివ్వండి, మన ఫ్రెంచి మిత్రుల సంకల్పాలు అనుకున్నంత చెడ్డవేమీకావు. పై వాక్యం, ఒకానొక ప్రత్యేక సందర్భాన్ని మరుగు పరచేందుకు మాత్రమే ఉద్దేశింపబడిందని మాకు చెప్తున్నారు. ఇదీ ఆ సందర్భం: ఉత్తర ఫ్రాన్సులో, పంచదార బీటుదుంపలు పండించే మన జిల్లాల్లో మాదిరిగానే, అత్యంత భారమైన షరతులపై, పొలాల్లో బీటురూటు వేసితీరాలన్న ఒప్పందంపై రైతులకు భూమి కౌలుకివ్వబడుతుంది. ఆ రైతులు తాము పండించిన బీటుదుంపను నిర్దిష్టంగా పేర్కొన బడిన ఫ్యాక్టరీకి, అది నిర్ణయించిన ధరకు అమ్మితీరాలి, నిర్ణీతమైన విత్తనాన్ని కొనాలి, నిర్ణీతమైన ఎరువును నిర్ణయింపబడిన మొత్తంలో రైతులు కొనాలి. అలా వారు పంటను అప్పగించే క్రమంలో దారుణంగా మోసగింపబడుతూండేవారు. జర్మనీలో కూడా మనకీ వ్యవహారమంతా తెలుసు. కాని యీ మాదిరి రైతును ఎవరైనా తమ రక్షణలోకి తీసుకోవాలన్నప్పుడు ఆ విషయాన్ని బాహాటంగా స్పష్టంగా చెప్పాలి. ఆ వాక్యం యిప్పుడున్న పద్ధతిలో, అపరిమితమైన దాని సాధారణ రూపంలో, ఒక్క ఫ్రెంచి కార్యక్రమానికి మాత్రమే కాకుండా, మొత్తంగా సోషలిజంయొక్క మౌలిక సూత్రానికే పూర్తిగా భిన్నమైనది. ఈ వాక్య రచయితల అజాగ్రత్తతో కూడిన సంపాదకత్వం, వారి సంకల్పానికి విరుద్ధంగా, వివిధ

సందర్భాల్లో వారికి వ్యతిరేకంగా వినియోగింపబడినట్లయితే, వారు గోలపెట్టి ప్రయోజన ముండదు.

అవతారిక ముగింపు మాటలు కూడ అదే విధంగా తప్పుగా అర్థం చేసుకోబడే అవకాశముంది. వాటి ప్రకారం

> "గ్రామీణ ఉత్పత్తికి సంబంధించిన అన్ని శక్తులనూ వివిధ హక్కుల ద్వారా, దస్తావేజుల ద్వారా దేశపు నేలను వినియోగించే అన్ని వృత్తులనూ కూడగట్టేందుకూ, ఉమ్మడి శత్రువైన భూస్వామ్యంపైన, ఫ్యూడల్ వ్యవస్థపైన సమైక్యమైన పోరాటాన్ని సాగించేందుకూ"

కృషిచెయ్యడం సోషలిస్టు కార్మిక పార్టీ కర్తవ్యం.

ఏ దేశపు సోషలిస్టు కార్మిక పార్టీ అయినా, గ్రామీణ శ్రామికులకు, చిన్నరైతులకు తోడు మధ్యతరగతి రైతులను, పెద్ద రైతులను, మరి బహుశా పెద్ద ఎస్టేట్ల కౌలు దార్లను, పెట్టుబడిదారీ పశుపోషకులను, దేశపు నేలను సొంతానికి వినియోగించుకునే యితర పెట్టుబడిదారీ దోపిడిదారులను సైతం తన శ్రేణుల్లోకి తీసుకోవడం దాని కర్తవ్యమని ఎవరైనా అంటే నేను దాన్ని పూర్తిగా తిరస్కరిస్తాను. వారందరికీ ఫ్యూడల్ భూస్వామ్యం ఒక ఉమ్మడి శత్రువుగా ఉండాలి. కొన్ని సమస్యలపై మనం వారితో కలిసి పనిచెయ్య వచ్చు. నిర్ణీతమైన లక్ష్యాల సాధనకోసం వారితో భుజంభుజం కలిపి పోరాడగలగవచ్చు. మన పార్టీలో సమాజంలోని ప్రతి ఒక వర్గంనుంచీ విడి వ్యక్తులను మనం వినియోగించుకో గలం, కాని పెట్టుబడిదారీ, మధ్య తరగతి బూర్జువా, లేక మధ్య తరగతి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే ఏ గ్రూపులూ మనకెందుకూ ఎంతమాత్రం పనికిరావు. అయితే యీ సందర్భంలో కూడా వారి ఉద్దేశం, పైకి కనిపించేటంత చెడ్డదేమీ కాదు. ఈ కార్యక్రమ రచయితలు దీనంతటిని గురించీ ఎన్నడూ ఆలోచించైనా వుండరనడం స్పష్టం. కాని దురదృష్టవశాత్తూ, వారు సాధారణీకరించడంపట్ల తమకుగల విశేషోత్సాహం కారణంగా సంయమనాన్ని కోల్పోయారు. మరి వాళ్ల మాటలను ఎవరైనా అక్షరాలా పరిగణనలోకి తీసుకుంటే వాళ్లు ఆశ్చర్యపడకూడదు.

అవతారిక తర్వాత కార్యక్రమానికే కొత్తగా ఆమోదింపబడిన చేర్పులు వస్తాయి. అవతారిక మాదిరిగానే వాటి సంపాదకత్వం కూడా ఆదరాబాదరాగా పైపైననే జరిగింది.

గ్రామ సంఘాలు వ్యవసాయ యంత్రాలను సేకరించి, అసలు ధరకు రైతు లకు అద్దెకివ్వాలని చెప్పే నిబంధన, యిందుకుగాను గ్రామ సంఘాలు మొట్ట మొదట ప్రభుత్వ సబ్సిడీలను పొందాలనీ, తర్వాత, ఆ యంత్రాలు చిన్నరైతుల వద్దీలో ఉచితంగా ఉంచాలనీ చెప్పే విధంగా సవరింపబడింది. చిన్నరైతుల పొలాలూ, ఉత్పత్తి

పద్ధతులూ యంత్రోపయోగానికి అంత ఎక్కువ అనుకూలం కావు, కాగా యీ కొత్త రాయితీ చిన్నరైతులకు ఏమంత ఎక్కువ ఉపయోగకరం కాదు.

అంతే కాకుండా,

> ప్రస్తుతం అమల్లోవున్న ప్రత్యక్ష, పరోక్ష పన్నులన్నింటి స్థానంలో 3000 ఫ్రాంకులకు మించిన అన్ని ఆదాయాలపైనా ఒకేఒక వృద్ధిక్రమానుగతమైన పన్నును అమలు జరపాలి.

అనేక సంవత్సరాలుగా ప్రతి ఒక సోషల్-డెమోక్రటిక్ కార్యక్రమంలోనూ యిటువంటి డిమాండే చేర్చబడుతూవచ్చింది. కాని యీ డిమాండు చిన్నరైతుల ప్రత్యేక ప్రయోజనాల దృష్ట్యా ముందుకు తేబడిందనడం మాత్రం కొత్తదే మరి, దాని వాస్తవ పరిధి ఎంత తక్కువగా అంచనావెయ్యబడిందన్నది మాత్రమే దీనివల్ల తెలియవస్తుంది. గ్రేట్ బ్రిటన్ సంగతి తీసుకోండి. అక్కడ ప్రభుత్వ బడ్జెట్ మొత్తం 9 కోట్ల స్టెర్లింగ్ పౌనులు. వాటిలో 1 కోటీ, 35 లక్షలనుండి 1 కోటీ, 40 లక్షల పౌనులదాకా ఆదాయపు పన్ను ద్వారా లభిస్తాయి. మిగిలిన 7 కోట్ల, 60 లక్షల స్టెర్లింగ్ పౌనులలోనూ ఒక చిన్న భాగం వర్తకంపై పన్ను విధించడం ద్వారా (తంతి, తపాలా చార్జీలు, స్టాంపు డ్యూటీ) లభిస్తుంది. కాని దానిలో అత్యధికభాగం వినియోగ వస్తువులపై విధింపబడే పన్నుల ద్వారాను, జనాభాలోని పౌరులందరియొక్క, ప్రత్యేకించి పేదవిభాగాలయొక్క ఆదాయాలనుండీ, నిరంతరాయంగా చిల్లరమల్లర చిలక్కొట్ల మాదిరిగా, పైకి కనిపించని పద్ధతిలో గుంజే చిన్నమొత్తాల ద్వారానే లభిస్తుంది. సమకాలీన సమాజంలో ప్రభుత్వ ఖర్చులను భర్తీచెయ్యడం మరోవిధంగా సాధ్యంకాదు. వృద్ధిక్రమానుగతమైన ప్రత్యక్ష పన్ను విధింపు ద్వారా గ్రేట్ బ్రిటన్‌లో మొత్తం 9 కోట్ల స్టెర్లింగ్ పౌనులూ 120 స్టెర్లింగ్ పౌనుల=3000 ఫ్రాంకుల ఆదాయాలపైనా, అంతకు పైబడిన ఆదాయాలపైనా విధింపబడిందనుకోండి. జిఫెన్ లెక్కల ప్రకారం, 1865–1875 మధ్యకాలంలో, సగటు సాలుసరి సంచయనం, మొత్తం జాతీయ సంపద యొక్క సాలుసరి పెరుగుదల 24 కోట్ల స్టెర్లింగ్ పౌనులు. ఇప్పుడది సాలీనా 30 కోట్లు ఉంటుందనుకుందాం. 9 కోట్ల పన్నుల భారం మొత్తం సంచయనంలో దాదాపు మూడోవంతును మింగేస్తుంది. వేరే మాటల్లో చెప్పాలంటే, సోషలిస్టు ప్రభుత్వం తప్ప మరే యితర ప్రభుత్వమూ అటువంటిదాన్ని దేన్నీ చేపట్టలేదు. సోషలిస్టులు అధికారంలో వున్నప్పుడు యీ పన్నుల సంస్కరణతోబాటు వారు నిర్వహించాల్సిన అనేక యితర పనులుంటాయి. వాటి పక్కన యీ పన్నుల సంస్కరణ కేవలం, అత్యంత అపరిగణనీయమైన, తాత్కాలిక అంశమవుతుంది. అదే సమయంలో చిన్న రైతులముందు యిందుకు పూర్తిగా భిన్నమైన అవకాశాలు ఆవిష్కృతమవుతాయి.

ఈ పన్నుల సంస్కరణకోసం రైతులు దీర్ఘకాలమే వేచియుండాలని వారు గ్రహించిన ట్లున్నారు, అందుకని "యీలోగా" (en attendant) యీ కింది అవకాశం వారి ముందుంచబడింది:

> "తమ సొంత శ్రమపై జీవించే రైతులందరికీ వారి భూములపైన పన్నుల రద్దు, తనఖా పెట్టబడిన భూములన్నింటిపైనా యీ పన్నుల తగ్గింపు."

ఈ డిమాండులోని ద్వితీయార్ధ భాగం కుటుంబంచేత నిర్వహింపబడేవాటికన్న చాలాపెద్ద రైతు క్షేత్రాలకు మాత్రమే వర్తింపచెయ్యబడగలదు; కాగా అది మరల "రోజు వారీ కూలీలను దోచుకొనే" రైతులకు అనుకూలమైన నిబంధనే అవుతోంది.

అంతే కాకుండా,

> "వేట జంతువుల, చేపల నిలవకూ, పెరిగే పంటల పరిరక్షణకూ అవసరం కాగలవాటిని మినహాయించి, జంతువులను వేటాడేందుకూ, చేపలను పట్టుకొనేందుకూ నిర్బంధాలు లేని హక్కులు ఉండాలి."

ఇది అత్యంత ప్రజానురంజకమైనదిగా కనిపిస్తుంది, కాని యీ వాక్యంలోని తొలి భాగం చివరి భాగపు ప్రయోజనాన్ని తుడిచివేస్తోంది. గ్రామీణ ప్రాంతాలన్నింటిలోనూ యీనాటికి సైతం ఒక్కొక్క రైతు కుటుంబానికి ఎన్ని కుందేళ్ళు, ఎన్ని కౌజులు, ఎన్ని మంచినీటి చేపలు, ఎన్ని గండుమీనులు లభిస్తున్నాయి? ఒక్కొక్క రైతుకు ఏడాదిలో కేవలం ఒక్క రోజు స్వేచ్ఛగా వేటాడితే, చేపలను పడితే దొరికేటన్ని లభిస్తున్నాయని మీరు చెప్పగలరా?

> "చట్టబద్ధమైన, సాంప్రదాయికమైన వడ్డీరేటును తగ్గించడం" —

అందుకని కొత్త వడ్డీ చట్టాలు, గత రెండువేల సంవత్సరాలుగా సర్వదా సర్వత్రా విఫలమైన పోలీసు చర్యను ప్రవేశపెట్టేందుకు కొత్త ప్రయత్నం. ఎవరైనా ఒక చిన్నరైతు, తను వడ్డీవ్యాపారి దగ్గరకు పోవడమే తక్కువ చెడుగు అనుకునే పరిస్థితిలో పడితే, వడ్డీ చట్టాలకు భంగం కలిగించకుండానే వడ్డీవ్యాపారికి అతని మూల్గులను పీల్చేసేందుకు అనువైన పద్ధతులూ, సాధనాలూ ఎప్పుడూ దొరుకుతూనే వుంటాయి. ఈ చట్టం మహా అయితే చిన్నరైతుకు మానసిక ఉపశమనం కలిగించేదిగా పనికిరావచ్చునేమోగాని, దాన్నుంచి అతనికి ప్రయోజనమేమీ కలగదు; తద్విరుద్ధంగా, దీనివల్ల అతనికి అప్పు అత్యవసరంగా ఎప్పుడైతే కావలసి వుంటుందో సరిగా అప్పుడు, అది అతనికి దొరకడాన్ని కష్టతరంచేస్తుంది.

"ఉచిత వైద్య సౌకర్యం, అసలు ధరకు మందుల సరఫరా" —

ఏదేమైనా యిది మాత్రం రైతుల ప్రత్యేక రక్షణ చర్య కాదు. జర్మన్ కార్యక్రమం యింత కంటె ముందుకుపోయి, మందులు సైతం ఉచితంగా లభించాలని డిమాండు చేస్తోంది.

"రిజర్వు సైనికులు సైనిక డ్యూటీలో చేర్చవలసిందిగా ఆదేశింపబడినప్పుడు, వారు సర్వీసులో వున్న కాలానికి వాళ్ల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లింప బడాలి" —

ఇది, అత్యంత అరకొరగానే అయినప్పటికీ, జర్మనీ — ఆస్ట్రియాల్లో యింతకుముందే అమల్లోవుంది, కాగా యిది కూడా పైవాటిలాగే ప్రత్యేకమైన రైతు డిమాండేమీ కాదు.

"ఎరువుల, వ్యవసాయ యంత్రాల, వ్యవసాయోత్పాదితాల రవాణా ఛార్జీల తగ్గింపు" —

ఇది మొత్తంమీద జర్మనీలో అమల్లోవుంది, అయితే ప్రధానంగా పెద్ద భూస్వాముల ప్రయోజనాలకు అనుకూలంగా వుంది.

"భూసార పునరుద్ధరణ కోసం, వ్యవసాయోత్పత్తి అభివృద్ధి కోసం ప్రజాహిత చర్యల పథక రచనకు తక్షణ సన్నాహ కృషి" —

ఇది ఈ డిమాండు లన్నింటినీ అనిశ్చిత స్థితిలోనూ, చక్కని వాగ్దానాలుగానూ వదిలే స్తుంది. అన్నింటికన్న అధికంగా యిది కూడా పెద్ద ఎస్టేట్ల ప్రయోజనానికే వినియోగ పడుతుంది.

క్లుప్తంగా చెప్పాలంటే, అవతారికలో ప్రదర్శింపబడిన అద్భుతమైన సైద్ధాంతిక కృషి అనంతరం, యీ కొత్త వ్యవసాయ కార్యక్రమంలోని ఆచరణాత్మక ప్రతిపాదనలు చిన్నరైతుల స్వామ్యంలోవున్న చిన్న కమతాలు — అవి తిరుగులేని పద్ధతిలో వినాశపుటంచున వున్నాయని అదే పేర్కొంది — చిన్నరైతుల వద్దీలో ఉండేలా ఫ్రెంచి కార్మిక పార్టీ ఎలా చూడగలుగుతుందో అన్న విషయం మరింత అస్పష్టంగా వుందని చెప్పాల్సివుంటుంది.

## II

ఒక అంశంలో మాత్రం మన ఫ్రెంచి కామ్రేడ్లు నూటికి నూరుపాళ్లూ నిజం. ఫ్రాన్సులో చిన్నరైతుల యిష్టానికి వ్యతిరేకంగా ఏ స్థిరమైన విప్లవాత్మక పరివర్తనా సాధ్యం

కాదు. నాకు అనిపించేదల్లా ఏమిటంటే, రైతులను తమ ప్రభావం కిందకు తీసుకురావాలనుకుంటే, అందుకు సరైన కార్యసాధన శక్తి వారికి లేదు.

వారు చిన్నరైతును వెంటనే, సాధ్యమైతే రాబోయే సాధారణ ఎన్నికలకే, తమ వైపుకు తిప్పుకునే విషయంలో పట్టుదలగా ఉన్నట్లు అనిపిస్తోంది. దీన్ని వారు మిక్కిలి సాధ్యాతీతమైన సాధారణ వాగ్దానాలు చెయ్యడం ద్వారా మాత్రమే సాధించగలమని ఆశిస్తున్నారు, వాటిని బలపరచుకునేందుకుగాను వారు మరింత హానికరమైన సైద్ధాంతిక కారణాలను చూపవలసిన పరిస్థితిలో పడుతున్నారు. అయితే, మరింత సూక్ష్మంగా పరిశీలించిన మీదట, యీ సాధారణ వాగ్దానాలు స్వవచో వ్యాఘాతాలుగా కనిపిస్తాయి (ఏ పరిస్థితి అయితే తిరుగులేని పద్ధతిలో వినాశపుటంచున ఉందని తామే చెప్పారో, దాన్నే కొనసాగేలా చూస్తామని వాగ్దానం చెయ్యడం), వివిధ చర్యలు పూర్తిగా పసలేనివనీ (వడ్డీ వ్యాపారానికి సంబంధించిన చట్టాలు), లేక కార్మికులయొక్క సాధారణ డిమాండ్లనీ, లేక పెద్ద భూస్వాములకు కూడా ప్రయోజనకరమైనవనీ, లేక చివరకు చిన్నరైతుల ప్రయోజనాలను సాధించేందుకు తోడ్పడటంలో ఏ విధంగానూ గొప్ప ప్రాముఖ్యం కలిగినటువంటివి కావనీ తేలుతుంది. తత్పర్యవసానంగా, కార్యక్రమంయొక్క ప్రత్యక్ష ఆచరణాత్మక భాగం తనకు తానుగా లోపభూయిష్ఠమైన తొలిభాగాన్ని సరిచేసి, అవతారికయొక్క పైకి అభేద్యంగా కనిపించే వాగాడంబరాన్ని వాస్తవంలో ప్రమాదరహిత స్థాయికి దిగజార్చింది.

దీన్ని మర్మంలేకుండా చెప్పుకుందాం: వారి ఆర్థిక పరిస్థితి అంతటినుంచీ ఉత్పన్నమయ్యే దురభిప్రాయాల దృష్ట్యా, వారి పెంపకం, ఒంటరిపాటు జీవిత విధానాల దృష్ట్యా, బూర్జువా పత్రికలూ, బడా భూస్వాములూ పెంచిపోషించిన దురభిప్రాయాల దృష్ట్యా, చిన్నరైతు జనసామాన్యాన్ని వెంటనే మన వంకకు తిప్పుకోవాలంటే, ఏ వాగ్దానాన్ని అయితే మనం నిలబెట్టుకోలేమని మనకి స్వయంగా తెలుసునో అటువంటి వాగ్దానాన్ని చేస్తేనే అది సాధ్యం. అంటే, వారిపై విరుచుకు పడుతున్న ఆర్థిక శక్తులన్నింటికీ వ్యతిరేకంగా, ఏదేమైనా సరే, వారి ఆస్తిని కాపాడుతామనే కాకుండా, యింతకుముందే వారిని అణచివేస్తున్న భారాలనుండి వారిని బయటకూడా పడెయ్యాలి. అంటే, కౌలుదారును భూమికి సొంతదారుగా మార్చాలి, తనఖా బాకీల భారంతో కృంగిపోయే భూమి సొంతదారు రుణాలను చెల్లించాలి. ఈ పని చెయ్యగలిగితే, అప్పుడు మనం ఒక ఘట్టం దగ్గరకు చేరుకుంటాం; ఆ ఘట్టంనుంచి ప్రస్తుతమున్న పరిస్థితి తిరిగి కొత్తగా అభివృద్ధి చెందుతుందన్నమాట. తద్వారా మనం రైతు విముక్తిని సాధించం, ఊపిరి తీసుకొనేందుకు అతనికి కొంత విరామాన్ని మాత్రమే యిస్తాం.

కాని, ఘనం మన వాగ్దానాన్ని చెల్లించలేక, రైతును మరుసటి రోజుననే దూరం చేసుకునే పరిస్థితుల్లో అతన్ని హడావిడిగా మనవైపుకు తిప్పుకొన్నందువల్ల, మనకు ప్రయోజ

నమేమీ ఉండబోదు. వృత్తిసంఘ యజమాని కావాలని కోరుకునే వృత్తి పనివాని వలన ప్రయోజనం లేనట్లే, తన చిన్న కమతపుటాస్తి కొనసాగాలని కోరుకునే రైతు, పార్టీ సభ్యుడైనందువల్ల కూడా మనకి ప్రయోజనమేమీ ఉండబోదు. వీళ్ల యూదు వ్యతిరేకు లకు (anti semites) చెందిన వాళ్లు. వీళ్లను వాళ్ల దగ్గరకు పోనివ్వండి. వీళ్ల సన్నకారు క్షేత్రాలను కాపాడుతామని వాళ్లను హామీలివ్వనివ్వండి. ముచ్చిబంగారంలా మెరిసే యీ వాగ్దానాల పస ఏమిటో, యూదు వ్యతిరేక స్వర్గాలనుండి ఎంత తియ్యని వాగ్దానాలు కురిపించబడుతాయో అనుభవంలోకి వచ్చినప్పుడు, మితంగా వాగ్దానాలు చేసి, సమస్యా పరిష్కారం కోసం పూర్తిగా వేరేచోట వెతికే మనమే నిజానికి మరింత విశ్వసనీయులమన్న సంగతిని అంతకంతకు అధికంగా వాళ్లు తెలుసుకోగలుగుతారు. ఫ్రెంచివాళ్లకే కనుక మనకున్నంత యూదు వ్యతిరేక వాగాడంబరం ఉన్నట్లయితే, నాంట్‌లో మనం చేసిన పొరపాటును వాళ్లు ఎంతమాత్రం చేసివుండేవాళ్లు కారు.

మరైతే, సన్నకారు రైతాంగంపట్ల మన వైఖరి ఏమిటి? మనం అధికారంలోకి వచ్చిన నాడు దానితో మనం ఏవిధంగా వ్యవహరించాలి?

మొదటి సంగతి, సన్నకారు రైతాంగం తిరుగులేని వినాశపుటంచున వుందనీ, మనం జోక్యం చేసుకోవడం ద్వారా ఆ వినాశాన్ని మనం ఏవిధంగానూ త్వరితం చెయ్యకూడ దనీ ఫ్రెంచి కార్యక్రమం పేర్కొనడం పూర్తిగా సరైనది.

రెండవ సంగతి, ప్రభుత్వాధికారం మన చేతుల్లో వున్నప్పుడు, పెద్ద భూస్వాముల విషయంలో చేసితీరవలసివున్నట్లు, చిన్న రైతులనుండి (నష్టపరిహారం యిచ్చిగాని, యివ్వకుండా గాని) బలవంతంగా ఆస్తిని గుంజుకోవాలని ఆలోచించనైనా ఆలోచించం. చిన్నరైతుకు సంబంధించినంతవరకు మన కర్తవ్యాల్లో మొట్టమొదటిది, అతని సొంత సేద్యాన్ని, సొంత భూమిని సహకార సేద్యంగా, సహకార క్షేత్రంగా — బలప్రయోగంతో కాకుండా ఆదర్శం నెలకొల్పడం ద్వారా, యిందుకుగాను సామాజిక తోడ్పాటును యివ్వ జూపడం ద్వారా — మార్చడం. తర్వాత అంటారా, చిన్న రైతుకు కలగబోయే లాభాలేమిటో— అవేమిటో అతనికి యీనాటికే స్పష్టమైయుండాలి — అతనికి చూపడానికి మనకు దండిగా సాధనాలుంటాయి.

తమ దేశంలో నిజమైన ఒకే ఒక్క నగరాన్ని — కోపెన్‌హాగెన్‌ని — కలిగివున్న కారణంగా, దాని వెలుపల దాదాపు పూర్తిగా రైతుల్లోనే ప్రచారం చేయవలసి వచ్చిన డేనిష్ సోష లిస్టులు సుమారు 20 ఏళ్ల క్రితమే యిటువంటి పథకాలు వేస్తూవచ్చారు. ఆ పథకాల ప్రకారం ఒకానొక గ్రామానికి, లేక పారిష్‌కి చెందిన రైతులు — డెన్మార్కులో పెద్ద విడి క్షేత్రాలు చాలా వున్నాయి — తమ భూములను ఒకేఒక పెద్ద క్షేత్రంగా ఏర్పాటుచేసుకొనేం దుకు జతచెయ్యాల్సివుంటుంది. ఉమ్మడి ప్రయోజనార్థం సాగుచేసి ఫలసాయాన్ని

తమతమ భూముల విస్తీర్ణం, పెట్టిన సొమ్ము, చేసిన శ్రమల నిష్పత్తిలో పంచుకోవలసి వుంటుంది. డెన్మార్కులో చిన్న కమతాలు అప్రధానమైన పాత్రను మాత్రమే వహిస్తు న్నాయి. కాని, యీ పథకాన్ని మనం చిన్న కమతాల ప్రాంతానికి అన్వయించినట్లయితే, యీ చిన్న కమతాలు జతచెయ్యబడి, మొత్తం భూమిలో భారీ ఎత్తున వ్యవసాయం చెయ్యబడిన ట్లయితే, యింతవరకూ వినియోగింపబడుతూ వచ్చిన శ్రమశక్తిలో కొంతభాగం అనవ సరమవుతుంది. భారీ వ్యవసాయం వల్ల కలిగే ముఖ్య ప్రయోజనాల్లో సరిగా యీ శ్రమశక్తి పొదుపు ఒకటి. ఈ శ్రమశక్తికి రెండు పద్ధతుల్లో పనులను కల్పించవచ్చు. ఇరుగు పొరుగు ప్రాంతాల్లో వున్న పెద్ద ఎస్టేట్లనుండి తీసుకున్న అదనపు భూమిని రైతుల సహకార వ్యవసాయ క్షేత్రానికి అప్పగించడం ఒక పద్ధతి, లేకుంటే ఆ రైతులకు అను బంధ వృత్తిగా, ప్రధానంగానూ, సాధ్యమైనంత మేరకూ వారి సొంత ఉపయోగార్థం పరిశ్రమను నిర్వహించుకొనే సాధనాలనూ, అవకాశాన్నీ కల్పించడం రెండవది. ఈ రెండు సందర్భాల్లోనూ కూడా వాళ్ల ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. అదే సమయంలో రైతుల సహకార వ్యవసాయ క్షేత్రాన్ని మరింత ఉన్నత రూపంలోకి మార్చేందుకూ, మొత్తంగా సహకార క్షేత్రంయొక్క, దానితోబాటు దాని విడి సభ్యులయొక్క హక్కులనూ, విధులనూ యావత్సమాజపు యితర శాఖల హక్కులతోనూ, విధులతోనూ సమానంచేసేందుకూ అవ సరమైన పలుకుబడి సాధారణ సామాజిక మార్గదర్శక వ్యవస్థకు ఒనగూడుతుంది. ప్రతి ఒక ప్రత్యేక సందర్భంలోనూ దీన్ని ఆచరణలో ఏవిధంగా అమల్లో పెట్టాలి అన్నది, ఆ ప్రత్యేక సందర్భంలో పరిస్థితులేమిటన్న దానిపైనా, ఏ పరిస్థితుల్లో మనం రాజకీయాధి కారాన్ని హస్తగతం చేసుకున్నామన్న దానిపైనా ఆధారపడివుంటుంది. బహుశా మనమీ విధంగా, యీ సహకార క్షేత్రాలకు యింకా కొన్ని లాభాలను సమకూర్చే స్థితిలో వుంటాం: వాటి మొత్తం తనఖా బాకీ అంతటికీ బాధ్యతను జాతీయ బ్యాంకు స్వీకరించడం, దానితో పాటుగానే వడ్డీరేటు బాగా తగ్గించడం; భారీస్థాయి ఉత్పత్తిచేసే సంస్థల స్థాపనకు ప్రభుత్వ నిధులనుంచి రుణాలివ్వడం (ఈ రుణాలను విధిగా, ప్రధానంగా డబ్బు రూపంలోనే యివ్వనక్కర్లేదు, యంత్రాలు, రసాయనిక ఎరువులు వగైరాలవంటి అవసర వస్తువుల రూపంలోను, తదితర రాయితీల రూపంలోను కూడా యివ్వవచ్చు).

సహకార ఆస్తిగా మార్చడం ద్వారాను, సహకార పద్ధతిలో నిర్వహించడం ద్వారాను మాత్రమే రైతుల యిళ్లనూ, పొలాలనూ మనం కాపాడగలమనీ, భద్రంగా ఉంచగలమనీ రైతులు అర్థంచేసుకునేలా చెయ్యడమే ప్రధానాంశం. రైతులను వినాశానికి నెట్టేది సరిగా వ్యక్తిగత స్వామ్యపు పర్యవసానమైన వ్యక్తిగత సేద్యమే. వ్యష్టి వ్యవసాయమే కావాలని వారు పట్టుబట్టినట్లయితే తప్పనిసరిగా వారు కొంపనుండీ, గోడునుండీ తరిమివెయ్యబడుతారు. కాలం చెల్లిపోయిన వారి ఉత్పత్తి విధానం స్థానాన్ని భారీస్థాయి పెట్టుబడిదారీ ఉత్పత్తి

విధానం ఆక్రమిస్తుంది. పరిస్థితి అదీ. సరే, మనం యిప్పుడొచ్చి, రైతులకు వారే స్వయంగా భారీ ఎత్తున వ్యవసాయాన్ని ప్రవేశపెట్టే అవకాశాన్ని — పెట్టుబడిదారులకోసం కాక, తమ సొంత, ఉమ్మడి ప్రయోజనం కోసం — కల్పిస్తామని చెప్తాం. ఇది తమ సొంత ప్రయోజనానికి అనుగుణమైనదనీ, తమ ముక్తికి యిదే ఏకైక సాధనమనీ రైతులకు బోధపడేలా చెప్పడం నిజంగానే అసాధ్యమా?

పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క ఉధృతశక్తికి వ్యతిరేకంగా చిన్న కమతందార్ల సొంత ఆస్తినీ, సొంత పరిశ్రమనూ కాపాడగలమని యిప్పుడుగాని, భవిష్యత్తులో మరెప్పుడైనాగాని మనం హామీ యివ్వలేము. మనం వారికి హామీ యివ్వగలిగినదల్లా, వారి ఆస్తి సంబంధాలలో వారి యిష్టానికి వ్యతిరేకంగా బలప్రయోగంతో జోక్యంచేసుకోబోమని మాత్రమే. అంతే కాకుండా, చిన్న రైతులకు వ్యతిరేకంగా పెట్టుబడిదారులూ, బడా భూస్వాముల పోరాటం యికమీదట కనీసమైన అన్యాయ పద్ధతుల్లో మాత్రమే జరగాలనీ, అతి తరచుగా సాగుతున్న దోపిడి దగాలు సాధ్యమైనంతగా నివారింపబడాలనీ మనం వాదించగలం. అయితే యిందులో మనం బహు సకృత్తుగా మాత్రమే విజయం పొందుతాం. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో నిజాయితీ ఎక్కడ ముగుస్తుందో, దగా ఎక్కడ మొదలవుతుందో ఎవరూ చెప్పలేరు. కాని, రాజకీయాధికారం మోసగాని పక్షాన వుందా లేక మోసగింపబడినవారి పక్షాన వుందా అన్నదానికెప్పుడూ గణనీయమైన పాత్ర వుంటుంది. మనమంటారా, మనం కచ్చితంగా చిన్నరైతు పక్షాననే వుంటాం. కష్టభూయిష్టమైన అతని బ్రతుకును మరింత సహించగలిగినదిగా చేసేందుకూ, అతను నిర్ణయించుకున్న పక్షంలో సహకార వ్యవసాయానికి అతని పరివర్తనకు సౌలభ్యం కల్పించడానికీ, ఒకవేళ యింకా యిలా అతను ఒక నిర్ణయానికి రాలేకపోయినట్లయితే, అతనీ విషయాన్ని తేల్చుకునేందుకు తన చిన్న కమతాన్ని దీర్ఘకాలం పాటు కలిగివుండే అవకాశం కల్పించేందుకు సైతం మనకు సాధ్యమైనదంతా మనం చేస్తాం. తన సొంత శ్రమపై బ్రతికే చిన్నరైతును మనకు చెందబోయేవాడుగా మనం పరిగణిస్తాం గనుకనే కాకుండా, పార్టీ ప్రత్యక్ష ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని కూడా మనం యిలా చేస్తాం. నిరాస్తిపరుల శ్రామికవర్గ శ్రేణులలోకి యథార్థంగా తోసివెయ్యబడేందుకు ముందు, రైతులలో ఎంత ఎక్కువమందిని మనం కాపాడగలుగుతామో, వారింకా రైతులుగానే వుండగా మన పక్షానికి తిప్పుకోగలుగుతామో, అంత త్వరగానూ, అంత తేలికగానూ సామాజిక పరివర్తన సాధింపబడుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి సర్వత్రా తన పూర్తి ప్రమాణానికి పెరిగేదాకా, చిట్టచివరి చేతివృత్తి పనివాడూ, చిట్టచివరి చిన్నరైతూ పెట్టుబడిదారీ భారీ ఉత్పత్తికి బలి అయిపోయేదాకా యీ పరివర్తనతోనే వేచియుండినందువల్ల మనకేమీ ప్రయోజనం ఉండబోదు. రైతుల ప్రయోజనం దృష్ట్యా యిందుకోసం చెయ్యవలసిన పదార్థిక త్యాగం — సామాజిక నిధులనుంచి యీ మొత్తాలను ఖర్చుపెట్టాల్సి

వుంటుంది — పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ దృష్ట్యా ఏట్లో పోసిన సొమ్ముగా మాత్రమే పరిగణింపబడగలుగుతుంది. కాని మొత్తంగా సామాజిక పునర్నిర్మాణ వ్యయంలో బహుశా అందుకు పదిరెట్ల మొత్తం పొదుపవుతుంది గనుక, యిది చాలా మంచి మదుపే అవుతుంది. అందుకని, ఈ దృష్ట్యా, మనం రైతుల విషయంలో చాలా ఉదారంగా వ్యవహరించగలుగుతాం. ఆ లక్ష్యసాధన కోసం కచ్చితమైన ప్రతిపాదనలు చేసేందుకూ, వివరాల్లోకి పోయేందుకూ యిది స్థలం కాదు; సాధారణ సూత్రాలను మాత్రమే మనమిక్కడ చర్చించగలం.

దీని ప్రకారం, చిన్న కమతాలను శాశ్వతంగా అట్టేపెట్టాలని మనం ఉద్దేశిస్తున్నామన్న అభిప్రాయాన్ని మాత్రమే కల్పించే వాగ్దానాలు చెయ్యడంకన్న పార్టీకీ, అలాగే చిన్న రైతులకూ మనం చెయ్యగలిగిన పెద్ద అపకారం మరొకటుండబోదు. అలా చెయ్యడమంటే దాని అర్థం రైతుల విముక్తికి మార్గాన్ని నేరుగా మూసివేయడం, పార్టీని రౌడీ యూదు వ్యతిరేకత స్థాయికి దిగజార్చడమే అవుతుంది. అందుకు భిన్నంగా, పెట్టుబడిదారీ వ్యవస్థ పెత్తనంలో వున్నంతకాలం వారి పరిస్థితి పరమ నికృష్టంగానే వుంటుందనీ, చిన్న కమతాలను అదే రూపంలో వారికి కాపాడిపెట్టడం పూర్తిగా అసాధ్యమనీ, రైలుబండి తోపుడు బండిని వెనక్కి నెట్టివేసినట్లే, పెట్టుబడిదారీ భారీ ఉత్పత్తి నిర్వీర్యమైపోయిన, కాలం చెల్లిపోయిన చిన్నతరహా ఉత్పత్తి విధానాన్ని వెనక్కి నెట్టివెయ్యడం తథ్యమనీ రైతులకు పదేపదే స్పష్టంచెయ్యడం మన పార్టీ విధి. మనం యీ పని చేసినట్లయితే తప్పనిసరి ఆర్థికాభివృద్ధి ధోరణికి అనుగుణంగా మనం వ్యవహరించినవాళ్లం అవుతాం. మన మాటలను చిన్నరైతులు అవగాహన చేసుకోవడానికి ఈ అభివృద్ధి తోడ్పడకమానదు.

అన్నట్లు, నాంట్ కార్యక్రమాన్ని రూపొందించినవారు సైతం, ప్రధానంగా నా యీ అభిప్రాయాన్నే కలిగివున్నారన్న నా విశ్వాసాన్ని వ్యక్తంచెయ్యకుండా నేనీ విషయాన్ని ముగించజాలను. వారి నిశితదృష్టి ప్రస్తుతం చిన్న కమతాలుగా విభజితమైయున్న ప్రాంతాలు సైతం ఉమ్మడి ఆస్తి కాకతప్పదని తెలుసుకోజాలనంతటి బొత్తిగా తక్కువేమీ కాదు. చిన్న కమతాల స్వామ్యం అంతరించిపోకతీరదని స్వయంగా వారే అంగీకరిస్తున్నారు. లాఫార్గ్ చేత రూపొందించబడి, నాంట్ మహాసభకు సమర్పింపబడిన జాతీయ సమితి నివేదిక కూడా యీ అభిప్రాయాన్ని పూర్తిగా బలపరుస్తోంది. ఈ సంవత్సరం అక్టోబరు 18వ తేదీ నాటి "Sozialdemokrat"లో[35] జర్మన్ భాషలో అది ప్రచురింపబడింది. నాంట్ కార్యక్రమంలో వాడబడిన పదబంధాల పరస్పర విరుద్ధ స్వభావాన్నిబట్టే దాని కర్తలు వాస్తవంలో చెప్తున్నది వారు చెప్పదలుచుకున్నది కాదన్న సంగతి బయటపడుతోంది. వారు అర్థంచేసుకోబడలేదన్నా, వారి మాటలు దుర్వినియోగం చెయ్యబడ్డాయన్నా — వాస్తవానికి యిప్పటికే యిది జరిగింది — మరి ఆ పొరపాటు వాళ్లదే. ఏదేమైనా వాళ్ళు తమ కార్య

క్రమాన్ని విశదీకరించాల్సివుంటుంది, రాబోయే ఫ్రెంచి మహాసభ దాన్ని కూలంకషంగా సవారించాల్సివుంటుంది.

మనం యిప్పుడిక కొంచెం పెద్ద రైతుల సంగతి పరిశీలిద్దాం. ఈ సందర్భంలో వారసత్వంగా సంక్రమించిన ఆస్తిపంపిణీల ఫలితంగాను, ఋణగ్రస్తత, భూముల బలవంతపు అమ్మకోళ్ల కారణంగా కూడా యీ పెద్ద రైతుల్లో రకరకాల దశల్లో వున్నవాళ్ల — చిన్న కమతందారునుంచి తండ్రితాతలనుంచి తనకు సంక్రమించిన ఆస్తిని చెక్కుచెదరకుండా నిలుపుకున్న, లేక దానికింకా చేర్చిన పెద్ద రైతుదాకా వున్నట్లు మనం చూస్తాం. మధ్యతరగతి రైతు చిన్న కమతందార్ల మధ్య నివసించినచోట అతని ప్రయోజనాలూ, అభిప్రాయాలూ చిన్నరైతు ప్రయోజనాలతోనూ, అభిప్రాయాలతోనూ ఎక్కువగా విభేదించవు. తన స్వీయానుభవంనుంచే తనవంటివాళ్ళ ఎంతమంది యింతకుముందే చిన్నరైతుల స్థాయికి దిగజారారో అతను తెలుసుకుంటాడు. కాని మధ్యతరగతి రైతులూ, పెద్దరైతులూ ప్రబలంగా ఉన్నచోట్లా, వ్యవసాయ క్షేత్రాల పనులకు, సాధారణంగా, మగ, ఆడ పాలేళ్ల అవసరం ఉన్నచోట్లా పరిస్థితి యిందుకు భిన్నంగా వుంటుంది. కార్మిక పార్టీ ప్రప్రథమంగా, రోజుకూలీల తరపున, అంటే, మగ, ఆడ పాలేళ్ల తరపున పోరాడవలసివుంటుంది. కార్మికుల వేతన బానిసత్వం కొనసాగాలని కోరుకునే రైతులకు ఏ విధమైన వాగ్దానాలు చెయ్యడమూ కూడా అసందిగ్ధంగా నిషిద్ధం. కాని పెద్ద రైతులూ, మధ్యతరగతి రైతులూ అదేవిధంగా కొనసాగినంతకాలమూ వేతన కార్మికులు లేకుండా వాళ్ళ తమ పనులను నిర్వహించుకోలేరు. అందుకని, చిన్న కమతందార్లకు, వాళ్ళ అదే మాదిరిగా శాశ్వతంగా కొనసాగుతారని మనం వాగ్దానం చెయ్యడం మూర్ఖత్వమైతే, యిదే వాగ్దానాన్ని పెద్ద రైతులకూ, మధ్యతరగతి రైతులకూ చెయ్యడం దాదాపు మహా ద్రోహమే అవుతుంది.

ఇక్కడ మళ్లీ మనకీ సందర్భానికి తుల్యమైనది నగరాల్లో చేతివృత్తి పనివాళ్లలో కనిపిస్తుంది. వాళ్ల రైతులకంటె ఎక్కువ చితికిపోయినమాట నిజమే, కాని, అభ్యాసకులతోబాటు వృత్తి నిపుణులను పనిలో పెట్టుకొనేవారూ, లేక అభ్యాసకులచేతనే వృత్తి నిపుణుల పనిని చేయించుకునేవారూ వాళ్లలో యింకా కొందరున్నారు. ఈ చిన్న వృత్తి యజమానులలో తమ అస్తిత్వాన్ని యథాతథంగా కొనసాగించుకోవాలని కోరుకునేవాళ్లను, అక్కడ సైతం తమకు సహాయమేమీ లభించదని స్వానుభవం ద్వారా తెలుసుకునేదాకా, యీదు వ్యతిరేకులతోనే తమ అదృష్టాన్ని ముడివేసుకోనివ్వండి. తమ ఉత్పత్తి విధానం తప్పనిసరిగా అంతరిస్తుందని గ్రహించిన మిగిలినవాళ్ళ మన పక్షాన చేరుతున్నారు, అంతే కాకుండా, భవిష్యత్తులో యితర కార్మికులందరి అదృష్టంలో పాలుపంచుకొనేందుకు సిద్ధపడుతున్నారు. పెద్ద రైతులకూ, మధ్యతరగతి రైతులకూ కూడా యిదే వర్తిస్తుంది. వారుగా వారిలోకన్న వాళ్ల ఆడ, మగ పాలేళ్లలోనూ, రోజుకూలీలలోనే మనకు ఆసక్తి ఎక్కువన్న సంగతి ప్రత్యే

కించి వేరే చెప్పనక్కరలేదు. ఈ రైతులు తమ వృత్తుల అస్తిత్వపు కొనసాగింపుకు హామీ కోరేమాటైతే, ఆ విషయంలో వారికి హామీయిచ్చే పరిస్థితిలో మనం లేము. అప్పుడిక వాళ్ళ యూదు వ్యతిరేకులతోనూ, రైతు లీగర్లతోనూ, సమస్తం వాగ్దానంచేసి, ఏ ఒక్కటీ నిలుపుకోకపోవడంలో సంతోషం పొందే అటువంటివే యితర పార్టీలతోనూ కలవవలసి వుంటుంది. పెద్ద రైతులూ, మధ్యతరగతి రైతులూ కూడా యిదేమాదిరిగా పెట్టుబడిదారీ ఉత్పత్తిపోటీకీ, విదేశాలనుండి చౌకగా దిగుమతి అయ్యే ధాన్యపు పోటీకీ తప్పనిసరిగా లొంగిపోవలసిందేనన్న సంగతి ఆర్థిక దృష్ట్యా మనకి స్పష్టమే. — ఈ రైతుల రుణభారం నానాటికీ పెరుగుతూ వుండడాన్నిబట్టీ, సర్వత్రా వీరు క్షీణించిపోతూవుండడాన్నిబట్టీ యిది రుజువవుతూనేవుంది. ఈ సందర్భంలో కూడా, వీరి క్షేత్రాలనుసైతం ఒకటిగా చేర్చి సహకార సంస్థలుగా ఏర్పడమనీ — వీటిలో వేతన శ్రమ దోపిడి అంతకంతకు అధికంగా తొలగింపబడుతుంది, జాతీయ ఉత్పత్తిదారుల బృహత్ సహకార సంఘంలో శాఖలుగా యివి క్రమ పరిణామం చెందుతాయి — ప్రతి ఒక శాఖకూ సమానమైన హక్కులూ, విధులూ ఉండేవిధంగా వాటిని ఏర్పాటు చేసుకోవచ్చుననీ వారికి సలహా చెప్పడమే తప్ప, యీ క్షయాన్ని నిరోధించడానికి మనం చెయ్యగలిగిందేమీ లేదు. ఈ రైతులు తమ ప్రస్తుత ఉత్పత్తి విధానపు వినాశం తప్పనిసరి అన్న సంగతిని గుర్తించి, సరైన నిర్ణయాలకు రాగలిగినట్లయితే, వారు మనతో చేరుతారు. మారిన ఉత్పత్తి విధానానికి వారి పరివర్తనకుసైతం మనకు చేతనైనంతవరకు సౌలభ్యాన్ని కల్పించే బాధ్యత అప్పుడిక మనమీద వుంటుంది. అలాకాకుంటే, మనం వాళ్ళని వాళ్ల కర్మానికి వదిలేసి, వేతన కార్మికుల కోసం పనిచెయ్యాల్సి వుంటుంది. వారిలో మనపట్ల సానుభూతికి కొదవ వుండదు. బహుశా యీ సందర్భంలో కూడా మనం బలప్రయోగంతో ఆస్తులనుండి వారిని దూరంచెయ్యకుండా తమాయించుకోగలగవచ్చు. పోతే మిగిలినవారి విషయంలో — గిడసబారిపోయిన వీరి బుర్రలలో కూడా హేతుజ్ఞానం కలిగించే — భవిష్యదార్థిక పరిణామాలపై మనం ఆధారపడవచ్చు.

పెద్ద జమీందారీ ఎస్టేట్ల విషయం ఒక్కటి మాత్రమే పూర్తిగా సరళమైనది. వీటిలో మనకి ముసుగులేని పెట్టుబడిదారీ ఉత్పత్తి ఎదురవుతుంది. వీటి విషయంలో న్యాయాన్యాయాలకు సంబంధించిన ఎటువంటి శంకలూ మనం పెట్టుకోనవసరం లేదు. ఇక్కడ మన ముందున్నది బహుళసంఖ్యాకులైన గ్రామీణ నిరాస్తిపరులు, కనుక మన కర్తవ్యం సుస్పష్టం. మన పార్టీకి రాజకీయాధికారం చేజిక్కగానే, అది పారిశ్రామిక యజమానుల ఆస్తిని స్వాధీనం చేసుకున్నట్లే బడా భూస్వాముల ఆస్తిని స్వాధీనం చేసుకోవాలి. ఈ ఆస్తిహరణం జరిగినప్పుడు నష్టపరిహారం యివ్వాలా, యివ్వనక్కర్లేదా అన్నది మనపైన కాక, మనం ఎటువంటి పరిస్థితుల్లో అధికారం పొందామన్న దానిపైనా, ప్రత్యేకించి యీ ఫ్యూడల్ ప్రభువులూ, బడా భూస్వాములూ స్వయంగా ఎటువంటి వైఖరి వహించారన్న

దానిపైననే చాలవరకు ఆధారపడుతుంది. ఏ సందర్భంలోనూ కూడా నష్టపరిహారం పనికి రాదని మనం చెప్పం. తన అభిప్రాయంలో, వీళ్లందరికి నష్టపరిహారం చెల్లించెయ్య గలిగితే మిక్కిలి చౌకగా బయటపడిన వాళ్లమవుతాం అని మార్క్స్ నాతో (ఎన్ని సార్లో!) అన్నాడు. కాని యీ విషయం మనకిక్కడ అప్రస్తుతం. ఈ విధంగా సమాజానికి దఖలుపరచ బడిన పెద్ద ఎస్టేట్లను, వాటిని యింతకు ముందే సాగుచేస్తున్న వ్యవసాయ కార్మికులకు మనం అప్పగించి, వాటిని సహకార క్షేత్రాలుగా సంఘటితం చెయ్యాల్సివుంటుంది. సమాజపు అదుపుకింద, వారి ఉపయోగార్థం, ప్రయోజనార్థం అవి వారికి కేటాయింపబడాలి. రైతులతో చేసుకునే ఒప్పందపు కౌలు షరతుల విషయం యిప్పుడే చెప్పడం సాధ్యంకాదు. ఏదేమైనా, యిక్కడ పెట్టుబడిదారీ నిర్వహణను సామాజిక నిర్వహణలోకి మార్చేందుకు పూర్తి సన్నాహం జరిగింది. దాన్ని సరిగా క్రుప్, ఫన్ ష్టుమ్ ప్రభృతుల ఫ్యాక్టరీల్లో మాదిరిగానే తెల్లవారేసరికల్లా అమలుజరపవచ్చు. ఈ సహకార వ్యవసాయ క్షేత్రాల ఉదాహరణను చూసినమీదట యింకా విముఖులుగా వున్న చిన్న కమతందార్లకూ, పలువురు పెద్ద రైతులకూ కూడా సహకార సంస్థలయొక్క, భారీ ఉత్పత్తియొక్క ప్రయోజనాలపట్ల నమ్మకం కుదురుతుంది.

ఈవిధంగా, మనం యిక్కడ వ్యవసాయ కార్మికుల ముందు పారిశ్రామిక కార్మికుల ముందున్న అద్భుతమైన అవకాశాలను ఆవిష్కరించవచ్చు. ఎల్బ నదికి తూర్పున వున్న ప్రష్యన్ గ్రామీణ కార్మికులను మన పక్షానికి తిప్పుకోవడమన్నది అప్పుడిక కాలానికి మాత్రమే, అందునా చాలా స్వల్ప కాలానికి మాత్రమే సంబంధించిన సమస్య అవుతుంది. కాని ఎప్పుడైతే తూర్పు ఎల్బ గ్రామీణ కార్మికులు మన పక్షానికి తిరుగుతారో అప్పుడిక వెంటనే జర్మనీ అంతటా వేరే రకమైన గాలి వీస్తుంది. వాస్తవానికి తూర్పు ఎల్బ వ్యవసాయ కార్మికుల అర్ధ బానిసత్వమే ప్రష్యన్ యుంకర్ల[36] పెత్తనానికీ, తద్వారా జర్మనీలో ప్రష్యా ప్రత్యేక అధినాయకత్వానికీ పునాది. బ్యూరాక్రసీయొక్క, అలాగే మొత్తంగా సైనిక ఆఫీసర్ల — యుంకర్ల — విశిష్ట ప్రష్యన్ స్వభావాన్ని నిలబెట్టుతున్నది ఎల్బకి తూర్పునగల యుంకర్లే. ఈ యుంకర్లు తమ రుణగ్రస్తత కారణంగాను, నానాటికీ పేదతనానికి గురిఅవుతున్న కారణంగాను, ప్రభుత్వ, ప్రైవేటు పరభాగ్యోప జీవనం కారణంగాను నానాటికీ వినాశం దిశగా నెట్టబడుతున్నారు. సరిగా అదే కారణంగా వారు తాము చలాయిస్తున్న పెత్తనాన్ని మరింత గట్టిగా పట్టుకొని వేలాడుతున్నారు. ఏ యుంకర్ల అహంకారమూ, సంకుచిత దురభిమానమూ, అతిశయమూ అయితే ప్రష్యన్ జాతియొక్క జర్మన్ సామ్రాజ్యాన్ని[37] దేశ ప్రజల విశేష విద్వేషానికి గురిచేశాయో — ప్రస్తుతం యీ సామ్రాజ్యమే జాతీయైక్యతను సాధించగల ఏకైక రూపమన్న వాస్తవాన్ని పూర్తిగా అంగీకరించినప్పటికీ — అది ఎన్ని ఉజ్వల విజయాలను సాధించినప్పటికీ విదేశాల్లో దాని గౌరవాన్ని కొంచె

పరచినవి కూడా అవే. ఒకదానికి మరొకటి సన్నిహితంగా చేరియున్న ఏడు పాత ప్రష్యన్ రాష్ట్రలలో అంటే, సామ్రాజ్యపు మొత్తం భూభాగంలో దాదాపు మూడోవంతులో — సామాజికాధికారాన్నీ, రాజకీయాధికారాన్నీ చేకూర్చే భూమి ఆస్తి యుంకర్ల స్వాధీనంలో వుంది. ఈ యుంకర్ల అధికారానికి మూలం అదే. వారి పెత్తనానికి ఒక్క భూమి ఆస్తే కాకుండా వారికి గల బీటు పంచదార శుద్ధి కర్మాగారాలూ, సారాబట్టీలూ, యీ ప్రాంతంలోని మిక్కిలి ముఖ్యమైన పరిశ్రమలూ కూడా కారణం. జర్మనీలోని మిగిలిన ప్రాంతాల పెద్ద భూస్వాములుగాని, బడా పారిశ్రామికవేత్తలుగాని యింతటి సానుకూల పరిస్థితిలో లేరు. వారిలో ఏ ఒక్కరి స్వాధీనంలో కూడా మట్టసమైన ఏలుబడి ప్రాంతం లేదు. ఇద్దరూ కూడా విస్తృతమైన భూభాగంలో చెదిరిపోయి వున్నారు, ఆర్థిక, రాజకీయ ప్రాబల్యం కోసం ఒకరు మరొకరితోనూ, తమ చుట్టూవున్న సామాజిక శక్తులతోనూ పోటీపడుతున్నారు. కాని ప్రష్యన్ యుంకర్ల యీ ఆర్థిక పెత్తనంయొక్క ఆర్థిక పునాది క్రమంగా బలహీనపడుతోంది. ప్రభుత్వ సహాయం ఎంత అధికంగా లభిస్తున్నప్పటికీ (రెండవ ఫ్రెడరిక్ పాలన కాలంనుంచీ ప్రతి ఒక్క యుంకర్ బడ్జెట్టులోనూ ఈ అంశం వుంటూనే వుంది) వీరిలో కూడా రుణగ్రస్తతా, పేదరికమూ అప్రతిహతంగా విస్తరిస్తూనే వున్నాయి. చట్టంచేతా, ఆచారంచేతా ఆమోదింపబడి ఆచరణలో కొనసాగుతున్న అర్ధ బానిసత్వమూ, తత్ఫలితంగా వ్యవసాయ కార్మికులను అపరిమితంగా దోచుకొనేందుకు కలిగిన అవకాశమే మునిగిపోతున్న యుంకర్లనింకా పైకి తేల్చివుంచింది. ఈ కార్మికులలో సోషల్-డెమోక్రసీ బీజాలను నాటండి, వారు తమ హక్కులకోసం గట్టిగా పట్టుబట్టే ధైర్యాన్నీ, వారిమధ్య ఐకమత్యాన్నీ కలిగించండి — దానితో యుంకర్ల ఘనతకు స్వస్తి జరుగుతుంది. యావత్తు యూరప్‌కూ రష్యన్ జారుల అధికారం మాదిరిగానే, జర్మనీలో అదేమాదిరి ఆటవిక, దోపిడిదారీ శక్తికి ప్రాతినిధ్యం వహించే ఆ అత్యంత అభివృద్ధి నిరోధక యుంకర్ అధికారం చిల్లిపడిన గాలిబుడగలాగా కుప్పకూలిపోతోంది. ప్రష్యన్ సైన్యపు “మేలిమి దళాలు” సోషల్-డెమోక్రటిక్ దళాలుగా మారుతాయి, దానితో ఓ మొత్తం తిరుగుబాటుతో గర్భితమైయున్న అధికారం చేతులు మారుతుంది. ఈ కారణంగా కాకపోతే, పశ్చిమ జర్మనీలోని చిన్న రైతులనుగాని, దక్షిణ జర్మనీలో యింకా మధ్యతరగతి రైతులుగా ఉన్న వారినిగాని కాకుండా ఎల్బ్‌కి తూర్పునగల వ్యవసాయ కార్మికులను మన పక్షానికి తిప్పుకోడానికి ఎంతో అధికతర ప్రాధాన్యం వుంది. సరిగా యిక్కడే, తూర్పు ఎల్బ ప్రష్యాలోనే మన లక్ష్య సాధనకుగాను చెయ్యవలసిన నిర్ణయాత్మక పోరాటాన్ని మనం సాగించవలసివుంది. సరిగా యీ కారణంగానే ప్రభుత్వమూ, యుంకర్ శక్తీ — రెండూ కూడా యీ ప్రాంతంలో మనం కాలూనకుండా నివారించేందుకు తమ శాయశక్తులా కృషిచేస్తాయి. వాళ్ల బెదిరిస్తున్నట్లు, మన పార్టీ విస్తరించకుండా అవరోధాలు కల్పించేందుకుగాను కొత్త హింసాత్మక

చర్యలు గైకొనబడ్డాయంటే, అందుకు తూర్పు ఎల్బ్ ప్రాంతపు వ్యవసాయ కార్మికులను మన ప్రచారంనుంచి దక్కించుకోవడమే వాళ్ల ప్రధాన లక్ష్యం అయ్యుంటుంది. అయితేనేం, వాళ్లెంత గింజుకున్నా వ్యవసాయ కార్మికులను మనం మన పక్షానికి తిప్పుకొని తీరుతాం.

1894 నవంబరు 15–22
తేదీలమధ్య రచింపబడింది

"Die Neue Zeit" పత్రిక 1వ సంపుటి,
10వ సంచికలో, 1894–1895లో
ప్రచురించబడింది

సంతకం: ఫ్రెడరిక్ ఎంగెల్స్

## ఫ్రెడరిక్ ఎంగెల్స్

# “ఫ్రాన్సులో వర్గపోరాటాలు (1848–1850)” అన్న కార్ల్ మార్క్స్ రచనకు ముందుమాట[38]

ఇప్పుడిక్కడ తిరిగి ప్రచురింపబడుతున్న యీ రచన, తన చారిత్రక భౌతికవాద దృక్పథం ద్వారా సమకాలిక చరిత్రలో ఒక విభాగాన్ని, అప్పుడున్న ఆర్థిక పరిస్థితి ప్రాతిపదికపై వివరించడానికి మార్క్స్ చేసిన తొలియత్నం. చారిత్రక భౌతికవాద సిద్ధాంతం “కమ్యూనిస్టు ప్రణాళిక”లో రేఖామాత్రంగా మొత్తం ఆధునిక చరిత్ర అంతటికీ అన్వయింపబడగా, “Neue Rheinische Zeitung”[39]లో మార్క్సూ, నేనూ రచించిన వ్యాసాల్లో సమకాలీన రాజకీయ ఘటనల వ్యాఖ్యానంలో పొడుగునా వినియోగింపబడింది. అందుకు భిన్నంగా, కొన్ని సంవత్సరాల కాలానికి విస్తరించిన అభివృద్ధి క్రమంలో యావత్తు యూరప్‌కూ ఎంతటి నమూనాప్రాయమైనదో అంతటి కీలకమైన అభివృద్ధి క్రమంలోని ఆంతరిక సంబంధాన్ని వెల్లడించడం; కాగా, రచయిత దృక్పథంమేరకు రాజకీయ ఘటనల కారణాలను – చివరకివి ఆర్థిక కారణాలే – వెతుక్కుంటూ పోవడమే ఇక్కడ కర్తవ్యం.

ఘటనలూ, ఘటనాక్రమాలూ సమకాలీన చరిత్ర చేతనే వివేచింపబడే మాట్లైతే మూల ఆర్థిక కారణాలను వెతకడం ఎన్నడూ సాధ్యం కాదు. ఆర్థిక విషయాలకు సంబంధించిన ప్రత్యేక పత్రికలు బోలెడంత సమాచారాన్ని యిస్తున్న యీనాడు సైతం, అందునా ఇంగ్లండులో సైతం, పరిశ్రమయొక్క రోజువారీ గమనాన్నీ, ప్రపంచ మార్కెట్లో వ్యాపార గమనాన్నీ, ఉత్పత్తి విధానాల్లో సంభవించే మార్పులనూ ఎప్పటికప్పుడు మారిపోయే యీ బహుముఖమైన, సంక్లిష్టమైన అంశాలనుండి అవగతం చేసుకోవడం యిప్పటికీ యింకా అసాధ్యంగానే వుంది. వీటిలో అతి ముఖ్యమైనవి ఆకస్మికంగా ప్రబలంగా బయటపడేందుకు ముందు, వెనక మాటున సర్వసాధారణంగా చాలా కాలం పనిచేస్తాయి. నిర్దిష్టమైన ఒకానొక దశయొక్క ఆర్థిక చరిత్రను చిత్రించడం ఘటనలు జరుగుతున్న కాలంలో ఎన్నడూ సాధ్యం కాదు. దరిమిలా సమాచారం పోగుచెయ్యబడి, వింగడించబడిన తర్వాత

మాత్రమే అది సాధ్యం. ఈ విషయంలో ఆవశ్యక సహాయక సాధనాలైన గణాంక లెక్కలు ఎప్పుడూ కూడా వెనకబడుతూనే వుంటాయి. ఈ కారణంగా, సమకాలీన చరిత్రలో అత్యంత నిర్ణయాత్మకమైన యీ అంశాన్ని స్థిరమైనదిగానూ, సంబంధిత దశారంభంలో ఉన్న ఆర్థిక పరిస్థితిని ఆ మొత్తం దశ అంతటికీ మార్చరాని ఆమోదిత అంశంగానూ పరిగణించడం అవసరం. లేకుంటే యీ పరిస్థితిలో కొట్టవచ్చినట్లు కనిపించే ఘటనలనుండే ఉత్పన్నమైన – ఆ కారణంగా అదే విధంగా కొట్టవచ్చినట్లు కనిపించే – మార్పులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. అందుకని, యిక్కడ యీ భౌతికవాద పద్ధతి తనను తాను, ఆర్థికాభివృద్ధిచేత సృష్టింపబడి, అస్తిత్వంలో వున్న సామాజికవర్గాల, వర్గభాగాల ప్రయోజనాలమధ్య వెనక జరిగిన రాజకీయ ఘర్షణల జాడతియ్యడానికీ, ఆ ప్రత్యేక రాజకీయ పార్టీలు కొద్దిగొప్పల్లో యివే రాజకీయ వర్గాలయొక్క, వర్గ భాగాలయొక్క రాజకీయ సమర్థ అభివ్యక్తీకరణకూ పరిమితం చేసుకోవలసి వుంటుంది.

పరిశీలించవలసిన సమస్త క్రమాలకూ పునాది అయిన ఆర్థిక పరిస్థితిలోని యీ సమకాలీనమైన మార్పులకు సంబంధించిన అనివార్యమైన అశ్రద్ధ పొరపాటుకు మూలమైయుండి తీరాలన్నది స్వయంవిదితమైన విషయం. కాని సమకాలీన చరిత్రను సమగ్రమైన పద్ధతిలో చిత్రించడానికి సంబంధించిన పరిస్థితులన్నింటిలోనూ అనివార్యంగా పొరపాట్లకు మూలాలుంటాయి. కాని దీనిమూలంగా సమకాలీన చరిత్ర రచనకు పూనుకోకుండా యిది ఎవరినీ నిరోధించడం లేదు.

మార్క్స్ యీ రచనా కృషిని చేపట్టినప్పుడు పైన పేర్కొనబడిన పొరపాటు మూలం మరింత అనివార్యంగా వుంది. 1848–49 విప్లవదశలో, అదే కాలంలో సంభవిస్తున్న ఆర్థిక మార్పుల పరిశీలనను కొనసాగించడంగాని, కనీసం వాటిని దృష్టిలో ఉంచుకోవడంగాని పరమ అసంభవం. లండన్‌లో మార్క్స్ ప్రవాసజీవితపు తొలి మాసాల్లోనూ, 1849–50 ఆకురాలు, శీతకాలాల్లోనూ కూడా యిది దుస్సాధ్యమే. కాని, మార్క్స్ సరిగా అదే కాలంలో యీ రచనను ప్రారంభించాడు. మరి యీ అననుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ కూడా, అటు ఫ్రాన్సులో అంతకుముందున్న ఆర్థిక పరిస్థితికీ, ఫిబ్రవరి విప్లవానంతరం ఆ దేశపు రాజకీయ పరిస్థితికీ సంబంధించి ఆయనకు గల ఖచ్చితమైన పరిజ్ఞానం మూలంగా, ఘటనల అంతస్సంబంధాలను కళ్లకు కట్టినట్లు అంతవరకు ఎన్నడూ సాధ్యం కానంత విస్పష్టంగా చిత్రించగలిగాడు. ఈ చిత్రణ మార్క్స్ స్వయంగా తనే పెట్టుకున్న రెండు పరీక్షలను అద్భుతంగా తట్టుకుంది.

1850 వసంతం తర్వాత ఆర్థిక విషయాల అధ్యయనానికి మార్క్స్‌కు మరల తీరిక చిక్కింది. మొట్టమొదటగా ఆయన గత పది సంవత్సరాల ఆర్థిక చరిత్ర అధ్యయనాన్ని చేబట్టాడు. మొదటి పరీక్ష దీనికి పర్యవసానంగా సంభవించింది. అందువల్ల ముందే

ఊహించి, అరకొర సమాచారంనుండి ఆయన యింతవరకు చేస్తూవచ్చిన నిర్ధారణలు అప్పుడిక వాస్తవాలనుండే ఆయనకు అత్యంత విస్పష్టంగా వ్యక్తమయ్యాయి. అంటే, 1847 నాటి ప్రపంచ వ్యాపార సంక్షోభమే ఫిబ్రవరి, మార్చి విప్లవాలకు నిజమైన మాతృక, 1848 మధ్యనుండి క్రమంగా కోలుకుంటూ, 1848, 1850 సంవత్సరాల్లో పూర్తి వికాసాన్ని అందుకున్న పారిశ్రామిక సమృద్ధే కొత్తగా బలపడిన యూరపియన్ అభివృద్ధి నిరోధక శక్తులకు తిరిగి ప్రాణం పోసిన శక్తి. అదే నిర్ణయాత్మక అంశం అన్న సంగతి ఆయనకు స్పష్టపడింది. మొదటి మూడు వ్యాసాలలోనూ* ("Neue Rheinische Zeitung. Politisch-ökonomische Revue,"[40] హాంబుర్గ్, 1850లో జనవరి, ఫిబ్రవరి, మార్చి సంచికలలో యివి ప్రచురింపబడ్డాయి) త్వరలోనే విప్లవశక్తియొక్క కొత్త వెల్లువ రావచ్చునన్న ఆశాభావం యింకా తొంగిచూస్తూ వుండగా, చివరి సంచికకోసం (మే, అక్టోబరు మాసాల సంయుక్త సంచిక కోసం) మార్క్సు, నేనూ రాసిన చారిత్రక సమీక్షలో (యిది 1850 ఆకురాలు కాలంలో ప్రచురింపబడింది) యీ భ్రమలనుండి మేము పూర్తిగా దూరమయ్యాం. "కొత్త సంక్షోభానంతరమే కొత్త విప్లవం రావడం సాధ్యం. అయితే, యీ సంక్షోభమెంత తప్పనిసరో ఆ విప్లవమూ అంతే తప్పనిసరి."** కాని, చెయ్యవలసిన ముఖ్యమైన మార్పల్లా అదొక్కటి మాత్రమే. తొలి ప్రకరణాల్లో ఘటనలను గురించి యివ్వబడిన భాష్యంలోగాని, వాటిలో కారణ పర్యవసానాలను గురించి రూఢిపరచబడిన సంబంధాలలో గాని – మనం పరామర్శిస్తున్న సమీక్షలో 1850 మార్చి 10నుండి ఆకురాలు కాలందాకా ఘటనా క్రమానికి సంబంధించిన వర్ణన యీ విషయాన్ని నిరూపిస్తున్నట్లు – చెయ్యవలసిన మార్పు ఏమీ లేదు. అందుకని నేనీ తరువాయి వ్యాసాన్ని ప్రస్తుతపు కొత్త కూర్పులో నాలుగో వ్యాసంగా చేర్చాను.

రెండవ పరీక్ష యింతకంటె కూడా కఠినమైనది. లూయీ బోనపార్ట్‌యొక్క 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్ర[41] అనంతరం వెన్వెంటనే, 1848 ఫిబ్రవరినుండి విప్లవదశపై తాత్కాలికంగా తెరదించిన యీ ఘటనవరకు ఫ్రాన్సు చరిత్రను మార్క్సు సరికొత్తగా విశదీకరించాడు. ("లూయీ బోనపార్ట్ బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ." మూడవ ముద్రణ, హాంబుర్గ్, మైస్నెర్, 1885.***) ఈ చిన్నపుస్తకంలో మన ప్రస్తుత ప్రచుర

---

* K. Marx, *The Class Struggles in France, 1848 to 1850* ("ఫ్రాన్సులో వర్గపోరాటాలు (1848–1850)"). (Marx and Engels, *Selected Works*, Vol. I, Moscow, 1962, పేజీలు 139–227 చూడండి.) – సం.

** అదే పుస్తకం, 231వ పేజి. – సం.

*** ఈ సంకలనం మొదటి భాగంలో 121–237 పేజీలు చూడండి. – సం.

ణలో చిత్రింపబడిన దశ, మరింత క్లుప్తంగానే అయినప్పటికీ, మరోమారు పరిశీలింపబడింది. ఒక ఏడాది అనంతరం జరిగిన నిర్ణయాత్మకమైన ఘటన వెలుగులో రచింపబడిన యీ రెండవ చిత్రణను మా రచనతో సరిపోల్చి చూడండి, రచయితకు దానిలో మార్చవలసినది బహుకొద్దిగా మాత్రమే వున్న సంగతిని మీరు గమనిస్తారు.

మా రచనకు ప్రత్యేక ప్రాధాన్యాన్ని కల్పించే పరిస్థితి ఒకటుంది. అన్ని దేశాల కార్మిక పార్టీలూ ఆర్థిక పరివర్తన కావాలన్న తమ ఏకగ్రీవ డిమాండును – ఉత్పత్తి సాధనాలను సమాజం స్వాధీనం చేసుకోవాలి – అన్న మాటల్లో క్లుప్తంగా వ్యక్తంచేశాయి. ఈ సూత్రాన్ని మొట్టమొదటి సారిగా రూపొందించడమే మా రచన ప్రత్యేకత. "శ్రామికవర్గపు విప్లవాత్మక డిమాండ్ల సారాంశరూపంలో చెప్పబడిన మొట్టమొదటి స్థూల సూత్రీకరణ"గా అభివర్ణింపబడిన "పనిచేసే హక్కు"ను గురించిన రెండవ ప్రకరణంలో యిలా పేర్కొనబడింది: "కాని, పనిచేసే హక్కుకి మూలంలో పెట్టుబడిపై అధికారం వుంటుంది; పెట్టుబడిపై అధికారానికి మూలంలో ఉత్పత్తి సాధనాలను స్వాధీనం చేసుకోవడమూ, సంబంధిత కార్మికవర్గపు అదుపులో వాటిని ఉంచడమూ, ఆ కారణంగా వేతన శ్రమనూ, పెట్టుబడినీ, వాటి పరస్పర సంబంధాలనూ రద్దుచేయడమూ వుంటుంది."* ఈవిధంగా యిక్కడ, మొట్టమొదటిసారిగా ఒక సూత్రీకరణ ప్రతిపాదింపబడింది. దాని ప్రకారం ఫ్యూడల్, బూర్జువా, పెటీబూర్జువా వగైరా రకాల సోషలిజంనుంచీ, అలాగే ఊహాజనితమైన సరుకుల అస్పష్టమైన ఉమ్మడి స్వామ్యంనుంచీ, సద్యోజనిత కార్మిక కమ్యూనిజంనుంచీ ఆధునిక కార్మిక సోషలిజం నిశితంగా వేరుచెయ్యబడింది. మార్క్స్ యీ సూత్రాన్ని తర్వాత విస్తరింపజేసి మారకపు సాధనాల స్వాధీనాన్ని అందులో చేర్చాడంటే, యీ విస్తరణ – "కమ్యూనిస్టు ప్రణాళిక" తర్వాత యిది ఎటూ స్వయంవిదితమే – ప్రధాన సూత్రానికి ఒక అనుబంధం మాత్రమే. ఇంగ్లండులోని కొందరు పండితమ్మన్యులు యిటీవల "పంపిణీ సాధనాలు" కూడా సమాజపరం చెయ్యబడాలన్న ప్రతిపాదనను జతచేశారు. రాజకీయ పంపిణీ సాధనాలంటే అర్థం పన్నులు, పక్సెన్‌వాల్డ్[42] తోబాటు పేదలకు సహాయం, తదితర దానాలూ కాకపోతే, ఉత్పత్తి, మార్పిడి సాధనాలకు వేరుగా పంపిణీకి సంబంధించిన యీ ఆర్థిక సాధనాలేమిటో చెప్పడం యీ పెద్దమనుషులకు కష్టమే. కాని, మొదటి సంగతి, యివి యింతకుముందే మొత్తంగా సమాజం చేతుల్లో, సమాజం స్వాధీనంలోగాని, సంఘం స్వాధీనంలోగాని ఉన్న పంపిణీ సాధనాలు, రెండవ సంగతి మనం కోరుతున్నది సరిగా వీటి రద్దునే.

---

* K. Marx, *The Class Struggles in France, 1848 to 1850* (చూ: Marx and Engels, *Selected Works,* Vol. I, Moscow, 1962, పేజి 171). – సం.

* * *

ఫిబ్రవరి విప్లవం ప్రారంభమైనప్పుడు, మేమందరం, విప్లవోద్యమాల పరిస్థితులను, క్రమాలను గూర్చిన మా భావాలకు సంబంధించినంతవరకు, గత చరిత్రయొక్క, ప్రత్యేకించి ఫ్రాన్సు చరిత్రయొక్క సమ్మోహక ప్రభావంకింద ఉన్నాం. 1789నుండి యావత్తు యూరప్ చరిత్రపైనా ప్రాబల్యం వహించినది నిజానికి ఫ్రాన్సు చరిత్రే. ఇప్పుడు సాధారణ విప్లవ పరివర్తనకు మళ్ళీ సంకేతం ప్రసరితమైనది కూడ తిరిగి దానినుండే. అందుచేత, 1848 ఫిబ్రవరిలో పారిస్‌లో ప్రకటితమైన "సామాజిక" విప్లవంయొక్క, శ్రామికవర్గ విప్లవంయొక్క స్వభావ క్రమాలను గూర్చిన మా భావాలు 1789, 1830 నాటి నమూనా విప్లవాల స్మృతులచేత గట్టిగా ప్రభావితం కావడం సహజమే కాకుండా అనివార్యం కూడా. అంతేకాదు, విజయవంతమైన వియన్నా, మిలాన్, బెర్లిన్ తిరుగుబాట్లలో పారిస్ తిరుగుబాటు ప్రతిధ్వనించినప్పుడు; యావత్తు యూరపూ నేరుగా రష్యన్ సరిహద్దుదాకా యీ ఉద్యమంలోకి నెట్టుకు రాబడినప్పుడు; దానిమీదట పారిస్‌లో, జూన్‌లో, అధికారంకోసం శ్రామికవర్గానికీ బూర్జువావర్గానికీ మధ్య తొట్టతొలి మహా పోరాటం జరిగినప్పుడు; శ్రామిక వర్గపు ఆ విజయమే సకల దేశాల బూర్జువావర్గాన్నీ క్కక్కదలించివేయగా, అది పలాయనంచేసి అప్పుడే కూలదొయ్యబడిన రాజరిక-ఫ్యూడల్ అభివృద్ధి నిరోధక శక్తుల బాహువుల్లోకి తిరిగి చేరినప్పుడు – నిర్ణయాత్మకమైన మహా యుద్ధం ప్రారంభమైందనీ, అది ఒకేఒక, సుదీర్ఘమైన, విప్లవోత్పతనాల కాలంలో సాగింపబడాలనీ, కాని అది శ్రామిక వర్గపు అంతిమ విజయంలో మాత్రమే ముగియగలదన్న విషయంలో, ఆనాడున్న పరిస్థితుల్లో మనకి ఎటువంటి సందేహమూ ఉండజాలదు.

1849 పరాజయాల అనంతరం, భవిష్యత్తులో ఏర్పడబోయే in partibus[43] ప్రవాస ప్రభుత్వాల చుట్టూ చేరిన అపభ్రంశ ప్రజాస్వామ్యవాదుల భ్రమలలో మేమే విధంగానూ పాలుపంచుకోలేదు. అపభ్రంశ ప్రజాస్వామ్యవాదులు "నిరంకుశుల" పైన "ప్రజలు" త్వరితగతిన నిర్ణయాత్మకమైన అంతిమ విజయాన్ని సాధిస్తారని అంచనాలు వేసుకున్నారు. అందుకు భిన్నంగా మేము, యీ "నిరంకుశులు" తొలగింపబడ్డాక, యీ "ప్రజల"లోనే మరుగుపడివున్న శత్రు వైరుధ్యపూరిత శక్తులమధ్య దీర్ఘకాల పోరాటం జరుగుతుందని తలిచాం. అపభ్రంశ ప్రజాస్వామ్యవాదులు ఏ రోజున అయినా కొత్తగా విప్లవం ప్రారంభం కావచ్చునని ఆశించగా, మేము అందుకు భిన్నంగా కనీసం విప్లవదశ యొక్క తొలి ప్రకరణం ముగిసిందనీ, ప్రపంచ ఆర్థిక సంక్షోభం తిరిగి విరుచుకుపడేదాకా మనమేమీ ఆశించేందుకు అవకాశం లేదనీ 1850 ఆకురాలుకాలం నాటికే స్పష్టంగా చెప్పాం. ఈ కారణంగా, మమ్మల్ని విప్లవానికి విద్రోహులనుగా ఎవళ్లైతే వెలివేశారో,

సరిగా వాళ్లే, దాదాపు మినహాయింపుల్లేకుండా, దరిమిలా బిస్మార్కు కటాక్షం సంపాదించి, అతనితో రాజీపడ్డారు.

కాని మేము సైతం పొరపడ్డామనీ, ఆనాటి మా దృక్పథం ఒక భ్రమ అనీ చరిత్ర నిరూపించింది. అంతటితోనే అది ఆగలేదు. ఆనాడు మాకున్న పొరపాటు అభిప్రాయాలను అది కేవలం తొలగించడమే కాకుండా, శ్రామికవర్గం ఏ పరిస్థితుల్లో పోరాడాలో ఆ పరిస్థితులను సైతం అది పూర్తిగా మార్చివేసింది. 1848 నాటి పోరాట పద్ధతికి యీనాడు అన్నివిధాలా కాలదోషం పట్టింది. ప్రస్తుత సందర్భంలో మరింత సునిశితంగా పరిశీలించ దగిన అంశమిది.

ఈనాటివరకు జరిగిన విప్లవాలన్నింటి ఫలితంగానూ ఒక నిర్దిష్ట వర్గపాలన స్థానాన్ని మరో నిర్దిష్ట వర్గపాలన ఆక్రమిస్తూ వచ్చింది. కాని యీనాటివరకు పాలకవర్గాలన్నీ కూడా పాలిత విస్తృత ప్రజానీకంతో పోల్చినప్పుడు చిన్న అల్పసంఖ్యాక వర్గాలు మాత్రమే అయి వున్నాయి. ఒక పాలక అల్పసంఖ్యాక వర్గం కూలదొయ్యబడి, దాని స్థానంలో మరో అల్పసంఖ్యాకవర్గం రాజ్య కర్ణధారిత్వాన్ని హస్తగతంచేసుకుని, రాజ్య సంస్థలను తన స్వప్రయోజనార్థం మలుచుకునేది. ప్రతి ఒక సందర్భంలోనూ కూడా, యీ అల్పసంఖ్యాకవర్గమే ఆయా ప్రత్యేక ఆర్థికాభివృద్ధి దశచేత యోగ్యమైనదగా ఎన్నుకోబడి, పాలనకు ఆదేశించబడుతుంది. సరిగా ఆ కారణంగానే, ఆ ఒక్క కారణంగా మాత్రమే, అధిక సంఖ్యాకులైన పాలితులు, పాలకులైన అల్పసంఖ్యాకుల ప్రయోజనార్థం విప్లవంలో పాల్గొననైనా పాల్గొన్నారు, లేక కిమన్నాస్తిగా వారు అధికారంలోకి రావడాన్ని సమ్మతించారు. కాని, ప్రతిఒక సందర్భంలోనూ ఆ విప్లవపు కచ్చితమైన సారాంశాన్ని పక్కన పెట్టినట్లయితే, అవన్నీ అల్పసంఖ్యాకవర్గాల విప్లవాలు కావడమే యీ విప్లవాలన్నింటి సామాన్య లక్షణం. అధికసంఖ్యాకులు పాల్గొన్నప్పుడు సైతం, తెలిసిగాని, తెలియకుండాగాని అల్పసంఖ్యాకుల ప్రయోజనార్థమే వారు అలా చేశారు. అయితే దీనిమూలంగా గాని, లేక కేవలం అధికసంఖ్యాకుల ఉదాసీన, ప్రతిఘటనా రహిత ధోరణి మూలంగా గాని, యీ అల్పసంఖ్యాకులు మొత్తం ప్రజల ప్రతినిధులు తామే అన్నట్లు పోజుపెట్టగలిగారు.

మామూలుగా జరిగే మాదిరిగానే ఘనమైన తొలి విజయానంతరం, విజేతలైన అల్పసంఖ్యాకులు చీలిపోయారు. వారిలో సగంమంది సాధింపబడినదానితో తృప్తిచెందారు, మిగిలిన సగంమందీ మరింత ముందుకెళ్లాలని కోరారు, తీవ్రమైన కొత్త డిమాండ్లను ముందుకు తెచ్చారు. అవి పాక్షికంగానైనా విస్తృత ప్రజానీకంయొక్క నిజప్రయోజనాలకు, లేక నిజమైనవాటిలా కనిపించే ప్రయోజనాలకు అనుగుణమైన డిమాండ్లు. కొన్ని విడి సందర్భాలలో మరింత తీవ్రమైన డిమాండ్లు వాస్తవంగానే సాధింపబడ్డాయి కూడా, అయితే అలా జరిగినది తాత్కాలికంగా మాత్రమే. మరింత మితవాద పార్టీ మళ్లీ పైచెయ్యి సంపా

దించుకోవడం, దానితో అంతకుముందు సాధించుకోబడినది పూర్తిగా గాని, పాక్షికంగా గాని కోల్పోవడం సంభవించేది. అప్పుడిక ఓడిపోయినవాళ్లు మోసం జరిగిందని గగ్గోలుపెడతారు, లేకుంటే తమ అపజయానికి యాదృచ్ఛికత కారణమని చెప్పుకుంటారు. కాని నిజానికి ఆ వ్యవహారానికి సంబంధించిన వాస్తవం యిదీ: తొలి విజయం సాధించిన వాటిని పరిరక్షించినది మరింత తీవ్రవాద పార్టీయొక్క రెండవ విజయం మాత్రమే. ఈ రెండో విజయం సాధింపబడిన తర్వాతా, దానితోనూ – తాత్కాలికంగా అవసరమైన దానితోనూ – యీ తీవ్రవాదులు, వీరు సాధించిన విజయాలతోబాటు మరోమారు తెరమరుగవుతారు.

17వ శతాబ్దంనాటి ఆంగ్ల మహా విప్లవం మొదలుకొని ఆధునిక కాలపు విప్లవాలన్నింటిలో కూడా యీ లక్షణాలు ప్రదర్శితమయ్యాయి. ప్రతి ఒక్క విప్లవ పోరాటం నుండీ యీ లక్షణాలు విడదీయరానివిగా కనిపిస్తాయి. శ్రామికవర్గం తన విముక్తికోసం చేసే పోరాటానికి కూడా అవి అన్వయిస్తాయన్నట్లు కనిపించాయి. సరిగా 1848లో యీ విముక్తికోసం ఏ దిశగా కృషిచెయ్యాలో తెలిసినవారు బహుకొద్దిమంది మాత్రమే ఉన్న కారణంగా యిది మరింతగా వర్తింపజెయ్యదగివుంది. శ్రామిక ప్రజాసామాన్యమే, పారిస్‌లో సైతం, అందునా విప్లవానంతరం, ఏ పంథాను చేబట్టాలన్న విషయంలో పూర్తి అంధకారంలో వుంది. అయితేనేం, అక్కడ ఉద్యమం – సహజప్రవృత్తి మేరకు, సద్యోజనితంగా, అణచశక్యము కానిదిగా వచ్చింది. అల్పసంఖ్యాకుల చేతనే నడిపింపబడిన మాటా, అయితే యీసారి అల్పసంఖ్యాకుల ప్రయోజనార్థం కాక, అధికసంఖ్యాకుల సిసలైన ప్రయోజనార్థమే సాగింపబడిన మాటా నిజమే అయినప్పటికీ ఏ విప్లవమైనా విజయవంతం కావలసిన పరిస్థితి సరిగా యిదే కాదా? దీర్ఘతర విప్లవదశలన్నింటిలోనూ చొరవగల అల్పసంఖ్యాకవర్గాలు కేవలం పైకి యుక్తమైనవిగా కనిపించే కుహనా వాగ్దానాల ద్వారానే విస్తృత ప్రజానీకాన్ని తమవంకకు తిప్పుకోవడం అతి తేలిక అయినప్పుడు, వారి ఆర్థిక పరిస్థితిని అత్యంత వాస్తవికంగా చిత్రించే భావాలు, వాళ్ల అవసరాలను స్పష్టంగా, హేతుబద్ధంగా చిత్రించేవే తప్ప వేరేమీకాని భావాలు, అప్పటికింకా వారిచేత అర్థంచేసుకోబడకపోయినా కేవలం అస్పష్టంగా మాత్రమే వారికి అనుభూతమవుతున్న భావాలు వారిని తక్కువగా ఎందుకు ఆకర్షిస్తాయి? భ్రమ తొలగిపోయి నైరాశ్యం ప్రవేశించగానే ప్రజానీకపు యీ విప్లవానురక్తి దాదాపు ఎప్పుడూ కూడానూ, సామాన్యంగా అతివేగంగానూ నిస్త్రాణకూ, చివరకు విరక్తికీ కూడా చోటిస్తూవచ్చింది. కాని యిక్కడ సమస్య కుహనా వాగ్దానాలుగాక, అత్యధిక సంఖ్యాకులయొక్క అత్యున్నతమైన ప్రత్యేక ప్రయోజనాలను – ఆనాటికింకా యీ అత్యధికసంఖ్యాక ప్రజలకు స్పష్టంకాని ప్రయోజనాలు, వాటిని ప్రత్యక్షంగా అమలుజరిపే క్రమంలో తమ తిరుగులేని సులభ గ్రాహ్యతద్వారా త్వరలోనే వారికి స్పష్టం కావలసివున్న ప్రయోజనాలు – అమలుజరపడమే యిక్కడ సమస్య. మార్క్స్ తన మూడవ వ్యాసంలో

నిరూపించినట్లు, 1850 వసంత కాలంలో, 1848 నాటి "సామాజిక" విప్లవంనుండి ఉద్భవించిన బూర్జువా రిపబ్లిక్‌యొక్క అభివృద్ధి, వాస్తవమైన అధికారాన్ని బడా బూర్జువా వర్గపు – అన్నిటికన్నా ముఖ్యంగా రాజరికంపట్ల మోజు కలిగిన బూర్జువావర్గపు – చేతుల్లో కేంద్రీకరింపజెయ్యడంతోబాటు, మరోవంక, మిగిలిన అన్ని సామాజిక వర్గాలనూ, రైతాంగాన్నే కాకుండా పెటీబూర్జువా వర్గాన్ని సైతం శ్రామికవర్గం చుట్టూ కూడ గట్టింది. తన్మూలంగా ఉమ్మడి విజయకాలంలోనూ, అటు తర్వాతా వారుగాక అనుభవ రీత్యా వివేకవంతులైన శ్రామికవర్గమే నిర్ణయాత్మక అంశం కావలసివచ్చింది – మరి అలాంటప్పుడు అల్పసంఖ్యాకుల విప్లవాన్ని అధికసంఖ్యాకుల విప్లవంగా మార్చే పూర్తి అవకాశం లేదా?

మేమూ, మాలాగే ఆలోచించిన యితరులూ పొరపడినట్లు చరిత్ర నిరూపించింది. అప్పట్లో యూరప్‌ఖండంలో వున్న ఆర్థికాభివృద్ధి దశ పెట్టుబడిదారీ ఉత్పత్తిని తొలగించేందుకు ఎంతమాత్రం పక్వం కాలేదని అది స్పష్టంజేసింది. 1848 దరిమిలా యావత్తు యూరప్‌నూ ఆవహించి, భారీ పరిశ్రమలు ఫ్రాన్సు, ఆస్ట్రియా, హంగరీ, పోలండులలోనూ, యిటీవలనే రష్యాలోనూ నిజంగా వేరూనుకొనేలా చేసిన ఆర్థిక విప్లవం ద్వారా యీ విషయాన్ని అది రుజువుచేసింది. అదే సమయంలో, జర్మనీని అది పూర్తి పెట్టుబడిదారీ ప్రాతిపదికపైన – ఈ కారణంగా 1848 నాటికింకా దానికి అధికతర విస్తరణావకాశం వుంది – ప్రథమశ్రేణి పారిశ్రామిక దేశాన్ని చేసింది. కాని సర్వత్రా వర్గ సంబంధాలలో స్పష్టతను చేకూర్చినదీ, కార్ఖానా ఉత్పత్తి కాలంనుండి అనుస్యూతంగా వస్తున్న పలు మధ్యంతర ఉత్పత్తి రూపాలను తొలగించినదీ, తూర్పు యూరపులో చివరకు వృత్తి సంఘపు (గిల్డు) చేతివృత్తులనుండి నికరమైన బూర్జువావర్గాన్నీ, నికరమైన భారీ పారిశ్రామిక కార్మికవర్గాన్నీ సృష్టించి, దాన్ని సామాజికాభివృద్ధి పథంలో అగ్రశ్రేణికి నెట్టినదీ సరిగా యీ పారిశ్రామిక విప్లవమే. కాని, దీని మూలంగా, యీ మహావర్గాలు రెండింటిమధ్యా యీ పోరాటం, ఇంగ్లండును మినహాయిస్తే 1848లో ఒక్క పారిస్‌లోనూ, మహా అయితే, కొద్దిపాటి పెద్ద పారిశ్రామిక కేంద్రాల్లోనూ మాత్రమే వున్న యీ పోరాటం యూరప్ అంతటా వ్యాపించి, 1848 నాటికింకా దుర్గ్రాహ్యమైన తీవ్రస్థాయిని చేరుకుంది. ఆనాడు సకల రోగ నివారణల వంటి పరిష్కార మార్గాలతో సిద్ధంగా వున్న బృందాల పలు అస్పష్ట సిద్ధాంతాలుండేవి; అందుకు భిన్నంగా యీనాడు ఒకేఒక సార్వత్రికంగా గుర్తింపబడిన – పోరాటపు అంతిమ లక్ష్యాలను సునిశితంగా సూత్రీకరించిన – స్ఫటిక స్వచ్ఛమైన మార్క్స్ సిద్ధాంతముంది. అప్పట్లో ప్రజానీకం స్థానిక, జాతీయ కారణాల మూలంగా వేరుచెయ్యబడి, పరస్పరం విభేదిస్తూ, ఉమ్మడి బాధలక్లేశం కారణంగా మాత్రమే బంధితులై, వికాసశూన్యులై, ఉత్సాహ నిరుత్సాహాలమధ్య నిస్సహాయులై ఊగిసలాడుతూండే

వారు; అందుకు భిన్నంగా యీనాడు దుర్నివారంగా ముందుకి సాగిపోతూ, సంఖ్యలో, నిర్మాణంరీత్యా, క్రమశిక్షణరీత్యా, నిశితదృష్టిరీత్యా, విజయంపట్ల అచంచల విశ్వాసంరీత్యా అనునిత్యం వృద్ధిచెందుతున్న అంతర్జాతీయ సోషలిస్టుల సమైక్య మహత్తర సైన్యం వుంది. మహాశక్తివంతమైన యీ శ్రామిక సైన్యం సైతం యింకా తన గమ్యాన్ని చేరుకోలేదంటే, మహా శక్తివంతమైన ఒకేఒక్క దెబ్బతో విజయాన్ని సాధించేందుకు బదులు పట్టుదలతో కూడిన క్లిష్టమైన పోరాటక్రమంలో అది మెల్లగా ఒక స్థానంనుండి మరో స్థానానికి ముందుకు సాగవలసివస్తున్నదంటే, 1848లో సరళమైన ఒక ఆకస్మిక దాడి ద్వారా సామాజిక పరివర్తనను సాధించడం ఎంత అసంభవమో అన్నదాన్ని మాత్రమే యిది రుజువు చేస్తుంది.

ఒకవంక రాజవంశానుగతమైన రాజరికపు రెండు విభాగాల కింద విభజితమైన బూర్జువా వర్గం,[44] అయితే, అన్నిటికన్న అధికంగా తన ఆర్థిక కార్యకలాపాలకోసం శాంతిభద్రతలను కోరుకున్న బూర్జువావర్గం, మరోవంక ఓడిపోయినప్పటికీ సదా ప్రమాదకరమైన శ్రామిక వర్గమూ, దేని చుట్టూనైతే అంతకంతకు అధికంగా పెటీబూర్జువాలూ, రైతులూ సమీకృతులయ్యారో ఆ శ్రామికవర్గమూ, అంతిమ పరిష్కారావకాశాన్ని అది ఎంతమాత్రమూ చూపకపోయినా ఏ క్షణమైనా భగ్గుమనగల హింసాత్మక తిరుగుబాటు ప్రమాదమూ – అదీ ఆనాటి పరిస్థితి మూడవ, కుహనా ప్రజాస్వామిక సింహాసన వారసత్వాభ్యర్థియైన లూయీ బోనపార్ట్ రాజకీయ కుట్ర కోసం ప్రత్యేకించి కల్పింపబడినదా అనదగిన పరిస్థితి. 1851 డిసెంబరు 2న సైన్యం ద్వారా, అతను ఉద్రిక్త పరిస్థితిని తుదముట్టించి, యూరప్‌కి – ఆంతరిక ప్రశాంతిని చేకూర్చాడు. దీనికితోడు దానికి ఒక కొత్త యుద్ధాల శకాన్ని ప్రసాదించాడు.[45] కిందినుండి విప్లవాలు వచ్చే దశ తాత్కాలికంగా ముగిసింది; పైనుండి విప్లవాలు తెచ్చే దశ ఆరంభమైంది.

1851లో సామ్రాజ్య పునరుద్ధరణ ఆనాటి శ్రామికవర్గపు ఆకాంక్షల అపరిపక్వతకు ఒక కొత్త రుజువు. అయితే, అవి పరిపక్వంచెందితీరేందుకు అనువైన పరిస్థితులను సమాజమే కల్పించవలసివుంది. ఆంతరిక ప్రశాంతి కొత్త పారిశ్రామిక సుభిక్షదశ సంపూర్ణాభివృద్ధిని సుసాధ్యంచేసింది. సైన్యానికి చేతినిండా పనికల్పించి, విప్లవ వాహినులను బయటకు మళ్లించవలసిన ఆవశ్యకత యుద్ధాలను – ఉత్పన్నంచేసింది. వీటిలో బోనపార్టు "జాతీయతా సూత్రాన్ని"[46] ఉద్ఘాటించే నెపంతో కొత్త రాజ్యాలను ఫ్రాన్సు అధికారం కిందకు తెచ్చేందుకు ప్రయత్నించాడు. అతని ఒరవడిలో బిస్మార్కు ప్రష్యా విషయంలో కూడ అదే విధానాన్ని అనుసరించాడు. అతను 1866లో జర్మన్ సమాఖ్య,[47] ఆస్ట్రియాలకు వ్యతిరేకంగానూ, అంతకు మించి అప్పట్లో ప్రభుత్వంతో ఘర్షణ పడిన ప్రష్యన్ పార్లమెంటు సభకు వ్యతిరేకంగానూ తన రాజకీయ కుట్రనూ, పైనుండి విప్లవాన్నీ నిర్వహించాడు. కాని,

యిద్దరు బోనపార్ట్‌లకు యూరప్ చాలా చిన్నదైపోయింది. చరిత్ర చమత్కారం మేరకు బిస్మార్క్ బోనపార్ట్‌ను కూలదోశాడు, ప్రష్యారాజు విల్‌హెల్మ్ చిన్న జర్మన్ సామ్రాజ్యాన్ని స్థాపించడమే కాకుండా ఫ్రెంచి రిపబ్లిక్ స్థాపనకు కూడా నిమిత్తమాత్రుడయాడు. అయితే సాధారణ ఫలితమేమిటంటే, ఒక్క పోలండును మినహాయించి యూరప్‌లోని గొప్ప దేశాల స్వాతంత్ర్యమూ, ఆంతరిక ఐక్యతా వాస్తవ రూపందాల్చాయి. ఇది సాపేక్షంగా అల్ప పరిమితులలోనే జరిగినమాట నిజమే అయినప్పటికీ, జాతీయమైన చిక్కులపరిస్థితులు యికనెంతమాత్రమూ తీవ్రమైన అవరోధం కాజాలనంత భారీ స్థాయిలో కార్మిక వర్గపు అభివృద్ధి ముందుకు సాగగల స్థాయిలో యిది జరిగింది. 1848 నాటి విప్లవం యొక్క సమాధి నిర్మాతలే యీనాడు దాని అభీష్టాన్ని అమలుజరిపినవాళ్లయ్యారు. వారి సరసన, వారికి పక్కలో బల్లెం మాదిరిగా 1848 విప్లవానికి వారసు అయిన శ్రామికవర్గం, ఇంటర్నేషనల్ రూపంలో యిప్పటికే తలెత్తింది.

1870–71 యుద్ధానంతరం రంగంనుంచి బోనపార్ట్ అదృశ్యుడవుతాడు, బిస్మార్క్ కర్తవ్యం ముగిసింది, అతను యిప్పుడిక తిరిగి సామాన్య భూస్వామి స్థాయికి దిగజారగల పరిస్థితి ఏర్పడింది. అయితే యీ దశపై పారిస్ కమ్యూన్[48]చేత యవనిక దించబడింది. పారిస్ నేషనల్ గార్డుయొక్క ఫిరంగులను కాజేసేందుకు త్యేర్ చేసిన లోపాయికారీ ప్రయత్నం విజయవంతంగా ముగిసిన తిరుగుబాటుకు దారితీసింది.[49] పారిస్‌లో శ్రామికవర్గ విప్లవమేతప్ప మరేదీ యికనెంతమాత్రమూ సాధ్యం కాదన్న విషయం మరోసారి నిరూపితమైంది. విజయానంతరం అధికారం తనకుతానుగానూ, నిర్వివాదంగానూ, కార్మిక వర్గం చేతుల్లో పడింది. అప్పుడు, అంటే మా రచనలో వర్ణింపబడిన కాలానికి యిరవై ఏళ్ల తర్వాత సైతం, కార్మికవర్గపు యీ పాలన ఎంత దుస్సాధ్యంగా ఉన్నదీ మరోమారు రుజువైంది. ఫ్రాన్సు ఒకవంక పారిస్‌ను దిక్కుమాలిన స్థితిలో వదిలిపెట్టి, మెక్ మహన్ గుళ్లకు ధారాపాతంగా అది రక్తమోడుస్తుంటే; మరోవంక కమ్యూన్ — తనను చీల్చిన రెండు పార్టీలమధ్య, బ్లాంకీయిస్టులు (అధికసంఖ్యాకవర్గం), ప్రూడనిస్టులు (అల్పసంఖ్యాకులు) — జరగ వలసినదేమిటో యీ రెండింట్లో దేనికీ తెలియదు — నిష్ఫలమైన జగడంలో యిరుక్కొని బలహీనపడింది. 1871లో ఒక వరప్రసాదం మాదిరిగా లభించిన విజయం, 1848 నాటి ఆకస్మిక దాడి ఎంత నిష్ఫలంగా ఉండిపోయిందో అంత నిష్ఫలంగానూ ఉండిపోయింది.

పారిస్ కమ్యూనుతోబాటే సమరశీల శ్రామికవర్గం అంతిమంగా పూడ్చిపెట్టబడిందని విశ్వసింపబడింది. కాని, అందుకు పూర్తి విరుద్ధంగా, శ్రామికవర్గపు అత్యంత శక్తివంతమైన పునరుజ్జీవనం కమ్యూనునుండీ, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంనుండే ఆరంభమైంది. జనాభాలో ఆయుధాలు చేబూనగల యావన్మందినీ సైన్యంలోకి చేర్చుకోవడం — యిప్పటి

నుండి అది దశలక్షలలో తప్ప తక్కువ సంఖ్యలో వుండదు — యింతకు ముందెన్నడూ కనివిని ఎరుగనంతటి వినాశక సామర్థ్యం కలిగిన తుపాకులు, చోదితాస్త్రాలు, ప్రేలుడు పదార్థాలూ యుద్ధరంగంలో ప్రవేశపెట్టబడటం మూలంగా అవి మొత్తం యుద్ధకాండలోనే పూర్తి విప్లవాన్ని తీసుకొచ్చాయి. ఈ విప్లవం ఒకవంక, బోనపార్టిస్టు యుద్ధదశకు అకస్మాత్తుగా స్వస్తిచెప్పి, యింతకు ముందెన్నడూ కనివిని ఎరుగనంతటి క్రూరమూ, అంచనాలకు అందనంతటి దారుణ పరిణామాలకు దారితీసే ప్రపంచయుద్ధాన్నే తప్ప మరే యుద్ధాన్నీ అసాధ్యంచేసి, శాంతియుతమైన పారిశ్రామికాభివృద్ధిని రూఢిపరచింది. మరోవంక, అది సైనిక వ్యయం గుణోత్తర శ్రేణిలో పెరగడానికి దారితీసి, పన్నులను విపరీత స్థాయిలకు పెంచేసి, తద్వారా ప్రజానీకంలోని పేదవర్గాలను సోషలిజం బాహువుల్లోకి నెట్టింది. ఆయుధోత్పత్తిలో ఉన్మత్తమైన పోటీకి తక్షణ కారణమైన ఆల్సేస్—లొరైన్ కలిపివేత, ఫ్రెంచి, జర్మన్ బూర్జువావర్గాలు జాతీయ దురహంకారంతో ఒకరి కుత్తుకలు మరొకరు ఉత్తరించుకొన పూనుకొనేలా చేసేందుకు సరిపోయింది. ఆ రెండు దేశాల కార్మికులకూ మాత్రం అదొక కొత్త ఐక్యతా బంధమైంది. కాగా పారిస్ కమ్యూన్ వార్షికోత్సవం యావత్తు శ్రామికవర్గానికీ తొలి సార్వత్రిక ఉత్సవదినం అయింది.

1870–71 నాటి యుద్ధమూ, పారిస్ కమ్యూన్ పరాజయమూ, యూరపియన్ కార్మికోద్యమ కేంద్రాన్ని, మార్క్స్ ముందే చెప్పినట్లు, ఫ్రాన్సునుండి జర్మనీకి బదలాయించాయి. 1871 మే నాటి రక్తపాతం తరువాత సహజంగానే ఫ్రాన్సు తేరుకోడానికి పలు సంవత్సరాలు పట్టింది. అందుకు భిన్నంగా, ఫ్రాన్సునుండి లభించిన కోట్లాది ఫ్రాంకుల నష్టపరిహారంతో[50] కృత్రిమ అనుకూల వాతావరణంలో పోషింపబడటంతోబాటు పరిశ్రమలు అంతకంతకు వేగంగా అభివృద్ధిచెందిన జర్మనీలో, సోషల్-డెమోక్రసీ మరింతవేగంగా మరింత సుస్థిరమైన అభివృద్ధిని సాధించింది. 1866లో ప్రవేశపెట్టబడిన సార్వజనిక ఓటింగు హక్కును జర్మన్ కార్మికులు తెలివిగా వినియోగించుకున్న ఫలితంగా, పార్టీ సాధించిన విభ్రమజనకమైన అభివృద్ధిని తిరుగులేని యీ దిగువ అంకెలు యావత్ప్రపంచానికీ సుస్పష్టం చేశాయి: సోషల్-డెమోక్రటిక్ ఓట్లు 1871లో 1,02,000, 1874లో 3,52,000 రాగా, 1877లో 4,93,000 వచ్చాయి. జర్మన్ సోషల్-డెమోక్రటిక్ పార్టీయొక్క యీ పురోగతిని జర్మన్ ప్రభుత్వం సోషలిస్టు వ్యతిరేక చట్టం[51] రూపంలో గుర్తించింది. పార్టీ తాత్కాలికంగా విచ్ఛిన్నం చెయ్యబడింది. 1881లో ఆ పార్టీ ఓట్లు 3,12,000కు పడిపోయాయి. అయితే యీ పరిస్థితి త్వరలోనే అధిగమింపబడింది. అటుతర్వాత, అసాధారణ చట్టం ఒత్తిడికింద, సొంత పత్రికలు లేకపోయినా, చట్టబద్ధమైన సంఘం లేకపోయినా, సంఘసమావేశ హక్కులు లేకపోయినా, వాస్తవమైన త్వరితగతి విస్తరణ ప్రారంభమైంది: 1884లో 5,50,000; 1887లో 7,63,000 వున్న ఓట్లు

1890లో 14,27,000కు పెరిగాయి. దానిమీదట ప్రభుత్వ హస్తం నిశ్చేతనమై పోయింది. సోషలిస్టు వ్యతిరేక చట్టం రద్దయింది. సోషలిస్టు ఓట్లు 17,87,000కు, అంటే పోలైన మొత్తం ఓట్లలో 25 శాతాన్ని మించాయి. ప్రభుత్వంయొక్క, పాలక వర్గాలయొక్క కుయుక్తులన్నీ ఎందుకూ పనికిరాకుండా పోయాయి, ప్రయోజన రహితంగా ముగిశాయి, అపజయం పాలయ్యాయి. తమ చేతగానితనం స్వప్రమాణంగా కచ్చితంగా బయటపడిన సంగతిని రాత్రికాపలా కాసే చప్రాసీదగ్గరనుండి ఇంపీరియల్ ఛాన్సలర్‌దాకా — అందునా యీసడింపబడి కార్మికుల చేతుల్లో ఓటమిని! — అంగీకరించాల్సివచ్చింది. యీ ప్రమాణాలు లక్షల సంఖ్యలో లెక్కించబడ్డాయి. ప్రభుత్వం తన అధికారపు పరిధికి చివర ఉండగా, కార్మికులు తమ అధికారపు పరిధి మొదట్లో వున్నారు.

అయితే, యింతేకాకుండా జర్మన్ కార్మికులు తమ ఆశయానికి తాము చేసిన మొదటి మేలుకుతోడు మరో బ్రహ్మాండమైన మేలు చేశారు. తాము కేవలం అత్యంత బలీయమూ, అత్యంత క్రమశిక్షణాయుతమూ, అతివేగంగా పెంపొందే సోషలిస్టు పార్టీగా ఉండటం ద్వారానే అది యీ సేవ చేసింది. సార్వజనిక ఓటింగు హక్కును ఎలా వినియోగించుకోవాలో చూపడం ద్వారా జర్మన్ కార్మికులు, ప్రపంచ దేశాలన్నింటిలోని తమ కామ్రేడ్సుకూ ఒక కొత్త ఆయుధాన్ని, మిక్కిలి వాడియైన ఆయుధాల్లో ఒకదాన్ని సమకూర్చిపెట్టారు.

ఫ్రాన్సులో సార్వజనిక ఓటింగు హక్కు దీర్ఘకాలంగానే వుంది. కాని, బోనపార్టిస్టు ప్రభుత్వం దాన్ని దుర్వినియోగపరచిన కారణంగా అది అపఖ్యాతి పాలైంది. కమ్యూన్ అనంతరం, దాన్ని ఉపయోగించుకోగల కార్మిక పార్టీ లేకపోయింది. రిపబ్లిక్ నాటినుండి అది స్పెయిన్‌లో కూడా వుంది. అయితే, స్పెయిన్‌లో ఎన్నికల బహిష్కరణే గంభీరమైన ప్రతిపక్ష పార్టీలన్నింటియొక్క నిత్యవిధానం. సార్వజనిక ఓటింగు హక్కు విషయంలో స్విట్జర్లండు అనుభవం కూడా కార్మిక పార్టీకి సంబంధించినంతవరకు ప్రోత్సాహకరమైనదేమీ కాదు. లాటిన్ దేశాల విప్లవకర కార్మికులు ఓటింగు హక్కును ఒక ఉచ్చుగా, ప్రభుత్వపు కుయుక్తిగా పరిగణించడానికి అలవాటుపడ్డారు. జర్మనీలో పరిస్థితి యిందుకు భిన్నంగా వుంది. సార్వజనిక ఓటింగు హక్కునూ, ప్రజాస్వామ్యాన్నీ సాధించుకోవడం సమరశీల శ్రామికవర్గపు ప్రప్రథమ, అతి ముఖ్య కర్తవ్యాల్లో ఒకటని "కమ్యూనిస్టు ప్రణాళిక" అప్పటికే ప్రకటించింది. మరి లాసాల్ యీ అంశాన్ని మళ్లీ చేబట్టాడు. కాగా, బిస్మార్కు తన పథకాల దృష్ట్యా, ప్రజానీకానికి ఆసక్తిగొలుపగల ఏకైక సాధనంగా యీ సార్వజనిక ఓటింగు హక్కును ప్రవేశపెట్టక గత్యంతరం లేని స్థితిలో పడినప్పుడు,[52] మన కార్మికులు దాన్ని మనఃస్ఫూర్తిగా అందుకొని, ఔగుస్ట్ బేబెల్‌ను తొలి రాజ్యాంగనిర్ణయ పార్లమెంటు (రైహ్‌స్టాగ్)కు సభ్యునిగా పంపారు. తదాదిగా వారు సార్వజనిక ఓటింగు హక్కును తమకు సహస్రాధికంగా ప్రయోజనం కలిగించే పద్ధతిలో వినియోగించుకొని,

అన్ని దేశాల కార్మికులకూ ఆదర్శాన్ని నెలకొల్పారు. ఫ్రెంచి మార్క్సిస్టు కార్యక్రమం మాటల్లో transformé, de moyen de duperie qu'il a été jusqu'ici en instrument d'émancipation — యింతవరదాకా దగా సాధనమైన సార్వజనిక ఓటింగు హక్కు ఒక విముక్తి సాధనంగా మార్చివెయ్యబడింది.[53] సార్వజనిక ఓటింగు హక్కు ప్రతి మూడేళ్లకూ ఒకసారి మనం మన బలాన్ని అంచనా వేసుకోవడానికి తప్ప మరే ప్రయోజనమూ కలిగించకపోయినప్పటికీ మన ఓట్ల సంఖ్యలో క్రమబద్ధమూ, సుస్థిరమూ, అనూహ్యమైనంత త్వరితమూ అయిన పెరుగుదల అదే స్థాయిలో విజయంపట్ల కార్మికుల అచంచల విశ్వాసాన్నీ, వారి ప్రత్యర్థుల విభ్రాంతినీ పెంచి, తద్వారా మన అత్యుత్తమ ప్రచార సాధనం అయింది. మన బలాన్ని గురించీ, మనకి ప్రతికూలమైన పార్టీలన్నింటి బలాన్ని గురించీ అది మనకు కచ్చితంగా తెలియజేస్తుంది, తద్వారా ఎవ్వరికీ తీసిపోకుండా మన కార్యాచరణ మితిని నిర్ణయించుకునేందుకు మనకొక కొలమానాన్ని చేకూరుస్తుంది, అకాలమైన పిరికితనంనుంచీ, అలాగే అకాలమైన దుస్సాహసికతనుంచీ మనకి రక్షణను కల్పిస్తుంది — సార్వజనిక ఓటింగు హక్కు వలన మనం సాధించుకున్న ప్రయోజనం యిదొక్కటే అయినా కూడా, అవసరమైనదానికన్న యిది కోకొల్లలే అని చెప్పాల్సివుంటుంది. ఎన్నికల ప్రచారంలో, మనం ఎవ్వరికీ తీసిపోకుండా, ప్రజా బాహుళ్యంతో — వాళ్లు మనకింకా దూరంగా వున్నచోట్ల — సంబంధం ఏర్పర్చుకునేందుకు అది మనకొక సాధనాన్ని సమకూర్చింది. ఆయా పార్టీలపై మనం చేసే విమర్శల దృష్ట్యా ప్రజలముందు తమ మాటలయొక్క, చేతలయొక్క సామంజస్యాన్ని నిరూపించుకోవలసిన తప్పనిసరి పరిస్థితిని అన్ని పార్టీలకూ అది కల్పించింది. అంతేకాకుండా, రైహ్‌స్టాగ్‌లోని మన ప్రతినిధులకు — ఏ వేదికనుంచైతే పార్లమెంటులో తమ ప్రత్యర్థులతోనూ, బయటనున్న ప్రజాబాహుళ్యంతోనూ పత్రికలలోనో, లేక బహిరంగ సమావేశాల్లోనో మాట్లాడగలిగిన దానికి పూర్తిగా భిన్నమైన ప్రామాణికతతో మాట్లాడగల — ఒక వేదికను అది సమకూర్చింది. రైహ్‌స్టాగ్‌లో ఎన్నికల ప్రచారమూ, సోషలిస్టు ప్రసంగాలూ మారుమ్రోగుతూ నిరంతరాయంగా అవి బయటకు చొరుచుకు వస్తున్నప్పుడు, ప్రభుత్వానికీ, బూర్జువావర్గానికీ వాటి సోషలిస్టు వ్యతిరేక చట్టం ఎందుకు పనికివస్తుంది?

అయితే, సార్వజనిక ఓటింగు హక్కు వినియోగంతో శ్రామికవర్గపు పూర్తిగా ఒక కొత్త పోరాట పద్ధతి అమల్లోకి వచ్చింది, మరి యీ పద్ధతి త్వరితంగా మరింత అభివృద్ధి చెందింది కూడా. ఏ ప్రభుత్వ సంస్థల్లోనైతే బూర్జువావర్గ పాలన వ్యవస్థీకరింపబడిందో ఆ ప్రభుత్వ సంస్థలు కార్మికవర్గానికి అవే ప్రభుత్వ సంస్థలపై పోరాటం జరిపేందుకు మరిన్ని అవకాశాలను కల్పిస్తాయన్న సంగతి గుర్తింపబడింది. ప్రత్యేక రాష్ట్ర శాసన సభలకూ, మునిసిపల్ కౌన్సిళ్లకూ, వృత్తి న్యాయస్థానాలకూ జరిగిన ఎన్నికల్లో కార్మికులు

పాల్గొన్నారు. ఏ పదవీ స్థానాన్ని భర్తీచేయడంలోనైతే శ్రామికవర్గంలో తగినంత భాగపు మాటకు నిర్ణాయక విలువ వుందో అటువంటి ప్రతి స్థానం కోసమూ బూర్జువావర్గంతో కార్మికులు పోటీచేశారు. దానితో బూర్జువావర్గమూ, ప్రభుత్వమూ కార్మిక పార్టీయొక్క చట్టవిరుద్ధ కార్యాచరణపట్లకన్న చట్టబద్ధ కార్యాచరణపట్ల, విప్లవంపట్లకన్న ఎన్నికల ఫలితాలపట్ల మరింత ఎక్కువ భయపడటం తటస్థించింది.

ఇక్కడ కూడా పోరాట పరిస్థితులు గణనీయంగా మారడమే యిందుకు కారణం. పాత పద్ధతిలో తిరుగుబాటు, 1848దాకా సమస్యను సర్వత్రా నిర్ణయిస్తూ వచ్చిన వీధి అవరోధాలతో పోరాటానికి చాలవరకు కాలదోషం పట్టిపోయింది.

ఈ విషయంలో మనం భ్రమలేమీ పెట్టుకోరాదు: వీధి పోరాటంలో సైన్యంపై తిరుగుబాటు నిజంగా విజయవంతం కావడమన్నది — యిది రెండు సైన్యాలమధ్య జరిగిన పోరాటంలో విజయం వంటిది — మిక్కిలి అరుదైన మినహాయింపు మాత్రమే. మరి తిరుగుబాటుదార్లు సైతం అటువంటి విజయంపట్ల బహు అరుదుగా మాత్రమే ఆశపెట్టుకుంటారు. వారికి సంబంధించినంతవరకు యిది సైన్యాలను నైతిక ప్రభావాలకు లొంగదీయడం మాత్రమే తప్ప మరేమీ కాదు. యుద్ధంలో మగ్నమైన రెండుదేశాల సేనలమధ్య పోరాటంలో యీ నైతిక ప్రభావాలు రంగంమీదకి రానేరావు, ఒకవేళ వచ్చినాకూడా చాలా తక్కువమేరకు మాత్రమే వస్తాయి. దీనిలో వారు విజయవంతులైతే, సైనికులు ప్రతీకారంగా కాల్పులు చేయడానికి నిరాకరిస్తారు, లేకుంటే సేనానాయకులు మతులు పోగొట్టుకుంటారు, తిరుగుబాటు విజయవంతమవుతుంది. వాళ్లు దీనిలో విజయం సాధించకపోయినట్లయితే, అప్పుడిక, సైన్యం అల్పసంఖ్యలో వున్నప్పటికీకూడా, వారికిగల మరింత మేలైన ఆయుధాలూ, శిక్షణా, ఒకే నాయకత్వం, పథకంమేరకు సైనిక శక్తుల వినియోగం, క్రమశిక్షణా తమ ప్రభావాన్ని బరపుతాయి. ఏ తిరుగుబాటైనా ఆచరణలో ఎత్తుగడ చర్యల రూపంలో సాధించగలిగినది మహా అయితే ఒకే ఒక వీధి అవరోధాన్ని సక్రమంగా నిర్మించడమూ, దాన్ని కాపాడటమే. పరస్పర తోడ్పాటు, నిల్వబలగాలను సముచితరీతిని నిలపడం, వినియోగించుకోవడం — నిజానికి మొత్తం ఓ పెద్ద పట్టణం రక్షణకు మాట అటుంచి పట్టణంలో ఒక పేటను కాపాడటానికి సైతం తప్పనిసరిగా అవసరమైన విడిదళాల సమీకృత సమన్విత కార్యాచరణ మిక్కిలి పరిమితమైన స్థాయికి మాత్రమే సాధ్యమవుతుంది, చాల సందర్భాల్లో సాధ్యం కానేకాదు. సైనిక శక్తులను ఒకానొక నిర్ణయాత్మక బిందువుదగ్గర కేంద్రీకరించడమన్నది యీ సందర్భంలో అసాధ్యమేనని వేరే చెప్పనక్కర్లేదు. అందుకని వాడుకలో వున్న పోరాటరూపం ఉదాసీనమైన ఆత్మరక్షణ మాత్రమే. చెదురుబదురుగా అక్కడక్కడ — అదీ కూడా మినహాయింపుగా మాత్రమే — అడపాదడపా ముందుకు చొరుచుకు వెళ్లడం రూపంలోనూ, పక్కవేటుల రూపంలోనూ యీ దాడి సాగుతుంది. మొత్తంమీద

మాత్రం అది, తిరోగమిస్తున్న సేనలచేత వదిలిపెట్టబడిన స్థావరాల ఆక్రమణకే పరిమితమవుతుంది. దీనికితోడు, ఫిరంగులూ, పూర్తిగా సుసజ్జితమైన సుశిక్షితమైన ఇంజనీర్ల దళమూ, ఏ యుద్ధవనరులైతే దాదాపు ఏ ఒక సందర్భంలోనూ తిరుగుబాటు దారులకు ఉండవో ఆ వనరులు సైన్యం చేతుల్లో వుంటాయి. మరి అలాంటప్పుడు, అత్యధిక శౌర్య సాహసాలతో నిర్వహింపబడిన వీధి అవరోధాల పోరాటం సైతం – 1848 జూన్‌లో పారిస్‌లోను, 1848 అక్టోబరులో వియన్నాలోను, 1849 మేలో డ్రెస్డెన్ లోను – దాడినాయకులు రాజకీయ యోచనల ప్రసక్తిలేకుండా పూర్తిగా సైనిక దృక్పథం నుంచే ముందుకెళ్లడంతోనూ, వాళ్ల సైనికులు విశ్వసనీయులుగా నిలవడంతోనూ తిరుగు బాటు ఓటమి చెందింది.

1848దాకా తిరుగుబాటుదారులు సాధించిన పలు విజయాలకు అనేక రకాల కారణాలున్నాయి. పారిస్‌లో 1830 జూలైలోనూ, 1848 ఫిబ్రవరిలోనూ, స్పెయిన్‌లో కొన్ని వీధి పోరాటాల్లో మాదిరిగానే తిరుగుబాటుదారులకూ సైన్యానికీ మధ్య పౌర సేన ఒకటి నిలిచింది. ఈ సేన నేరుగా తిరుగుబాటు పక్షం వహించి, లేక ఉదాసీన, అనిశ్చిత ధోరణి వహించడం ద్వారా సేనలను కూడ అదే రకంగా ఊగిసలాడేలా చేసి, దీనికితోడు తిరుగు బాటుదారులకు ఆయుధాలనుసైతం సరఫరా చేసేది. ఎక్కడైతే యీ పౌరసేన ఆదినుంచీ తిరుగుబాటును వ్యతిరేకించిందో అక్కడ, 1848 జూన్‌లో పారిస్‌లో మాదిరిగా, తిరుగు బాటు అణచివెయ్యబడింది. బెర్లిన్‌లో 1848లో, [మార్చి] 19వ తేదీ రాత్రిపూటా, ఉదయమూ కొత్త పోరాటబలగాలను గణనీయమైన సంఖ్యలో సమకూర్చుకున్న కారణంగానూ, పాక్షికంగా సేనలు అలసిపోయినందునా, వాటికి, సరైన తిండీ, ఆయుధాలూ కొరవైనందునా, చివరిసంగతి, పాక్షికంగా ఆజ్ఞలు వాటిని స్తంభింపజేస్తున్న కారణంగానూ ప్రజలు విజయం సాధించారు. కాని, యీ అన్ని సందర్భాల్లోనూ కూడా సైనికులు కాల్చ నిరాకరించినందునా, సేనానాయకులు నిర్ణయాలు తీసుకునే శక్తిని కోల్పోయినందువల్లా, లేక వాళ్ల చేతులు కట్టేసినట్లయినందువల్లనే ప్రజలకు విజయం లభ్యమైంది.

అందుకని, వీధిపోరాటాల కాలంలో సైతం, వీధి అవరోధాలు భౌతిక ఫలితాన్నికంటె యెక్కువ మానసిక ఫలితాన్నే కలిగించాయి. సైన్యపు నిబ్బరాన్ని చెదరగొట్టడానికి వీధి అవరోధం ఒక సాధనం. దాన్ని సాధించేదాకా యిది నిలబడినట్లాయెనా, విజయం సాధింపబడేది, లేకపోతే అపజయం తటస్థించేది. భవిష్యత్తులో వీధిపోరాటాల అవకాశాలను పరిశీలించేటప్పుడు కూడా, మనం దృష్టిలో పెట్టుకోవలసిన అంశం సరిగా యిదే.*

---

* "Die Neue Zeit" పత్రికలోనూ, "ఫ్రాన్సులో వర్గపోరాటాలు"యొక్క 1895 నాటి కూర్పులోనూ యీ వాక్యం వదలివేయబడింది. – సం.

1849 నాటికే యీ అవకాశాలు బాగా సన్నగిల్లాయి. ప్రతిచోటా బూర్జువావర్గం తన అదృష్టాన్ని ప్రభుత్వాలతో ముడివేసుకుంది, తిరుగుబాటుకు వ్యతిరేకంగా కదులుతున్న సైన్యాన్ని "సంస్కృతికీ, ఆస్తికీ" ప్రాతినిధ్యం వహించేవాళ్లు అభినందించి, సైనికులకు విందులు చేశారు. వీధి అవరోధాల వశీకరణ శక్తి భగ్నమొనర్చబడింది. సైనికునికి యిప్పుడిక వీధి అవరోధాల వెనుక తిరుగుబాటుదార్లు, ఆందోళనకారులు, దోపిడిగాండ్రు, సాంఘిక వ్యత్యాసాలను చదునుచేసేవాళ్లు, సమాజపు మురికి తెట్టెయే తప్ప "ప్రజలు" ఎంత మాత్రమూ కనిపించడంలేదు. ఆఫీసర్లు యీలోగా వీధిపోరాటపు ఎత్తుగడల్లో ఆరితేరారు, వారిప్పుడు యికనెంతమాత్రమూ హడావిడిగా నిర్మింపబడిన ఛాతీ ఎత్తు పిట్టగోడపైకి ఎటువంటి రక్షణా లేకుండా నేరుగా ఎదురెళ్లక, తోటలగుండా, దొడ్లగుండా, యిళ్లగుండా దాని చుట్టుతిరిగి వెళ్తున్నారు. కాగా యిప్పుడీ పద్ధతి కొద్దిపాటి నైపుణ్యంతో, పది సందర్భాల్లో తొమ్మిదింటిలో విజయవంతమవుతోంది.

కాని అటుదరిమిలా యింకా చాలా మార్పులు, అన్నీ కూడా సైన్యానికి అనుకూలంగానే, సంభవించాయి. పెద్ద పట్టణాలు గణనీయంగా పెద్దవైతే సేనలు మరింత పెద్దవయ్యాయి. పారిస్, బెర్లిన్‌లు 1848 దరిమిలా నాలుగు రెట్లకు కొంచెం తక్కువ పెరిగాయి, కాని వాటి రక్షక దళాలు అంతకంటె ఎక్కువ పెరిగాయి. రైళ్ల ద్వారా, యీ నగరరక్షక దళాలు రెండు రెట్లకు పైగా పెంచబడగలవు. 48 గంటల్లో వాటిని పెద్ద సేనలుగా పెంచవచ్చు. సంఖ్యలో బ్రహ్మాండంగా పెంచబడిన సేనలను సాయుధం చేసిన కారణంగా అవి సాటిలేనంత అధికతర శక్తిసంపన్నమయ్యాయి. 1848లో ఉన్నది స్మూత్‌బోర్, మజిల్ లోడింగ్ పెర్కషన్ గన్ కాగా, యీనాడు చిన్న కాలిబర్, బ్రీచ్‌లోడింగ్ మగజీన్ రైఫిలుంది. మొదటిదానితోకన్న దీనితో నాలుగు రెట్లు దూరమూ, పదిరెట్లు కచ్చితంగానూ, పదిరెట్లు వేగంగానూ కాల్చవచ్చు. అప్పట్లో వున్నది సాపేక్షంగా శక్తిహీనమైన రౌండ్‌షాట్, గ్రేప్ షాట్ ఫిరంగులు. ఈనాడున్నది పెర్కషన్ షెల్సు. అత్యంత కట్టుదిట్టంగా కట్టబడిన వీధి అవరోధాన్ని సైతం కూల్చివెయ్యడానికి వాటిలో ఒక్కటి చాలు. అప్పట్లో అగ్ని నిరోధక కుడ్యాలను ఛేదించుకు వెళ్లడానికి సారంగాలు తవ్వేవాళ్ల గడ్డపలుగులే సాధనంకాగా యీనాడు డైనమైట్ తూటాలున్నాయి.

మరోవంక, తిరుగుబాటుదార్ల పక్షంలో పరిస్థితులన్నీ మరింత అధ్వాన్నమయ్యాయి. ప్రజల్లోని అన్ని విభాగాలూ సానుభూతి చూపే తిరుగుబాటు తిరిగి సంభవించడం దుస్సాధ్యం. సరిపోల్చినప్పుడు బూర్జువావర్గం చుట్టూ జతగూడిన అభివృద్ధి నిరోధక పార్టీ దాదాపు అంతరించిపోయే విధంగా వర్గపోరాటంలో మధ్య శ్రేణులన్నీ శ్రామికవర్గంచుట్టూ అంతపూర్తిగా మరెన్నడూ సమీకృతం కావు. అందుచేత ఆ "ప్రజలు" ఎల్లప్పుడూకూడా చీలిపోయినట్లే కనిపిస్తారు, తన్మూలంగా 1848లో అంత అసాధారణ శక్తిసంపన్నంగా

వున్న, అత్యంత శక్తివంతమైన సాధనం శాశ్వతంగా అంతరించిపోయింది. ఇంతకుముందు కొలువుచేసిన సైనికులు తిరుగుబాటుదార్ల పక్షానికి ఎక్కువసంఖ్యలో వచ్చినకొద్దీ, వాళ్లకి ఆయుధాలను సమకూర్చడం అంతగా కష్టతరమవుతుంది. మందుగుండు అంగళ్లలో దొరికే వేటతుపాకులూ, నాజూకు తుపాకులూ — పోలీసుల ఆజ్ఞలమేరకు తుపాకి లాకుల్లో కొన్ని భాగాలు అంతకుముందే తొలగింపబడి నిరుపయోగ మొనర్చబడియుండకపోతే — అతి దగ్గరగా చేసే పోరాటంలో సైతం సైనికుని మగజీన్ రైఫిలుకు ఏవిధంగానూ దీటుకావు. 1848వరకూ ఎవరికి అవసరమైన మందుగుండు సామగ్రిని వారు తుపాకి మందునుంచీ, సీసంనుంచీ తయారుచేసుకోవడం సాధ్యమైయుండేది. ఈనాడు ప్రతిఒక్క తుపాకికీ తూటాలు వేర్వేరుగా వుంటాయి. సర్వత్రా ఒక్క విషయంలో మాత్రం అవి ఒకే విధంగా వుంటాయి — అవన్నీ కూడా భారీపరిశ్రమల్లో తయారైన సంక్లిష్ట ఉత్పాదితం కావడమే యీ ఉమ్మడి అంశం. తత్కారణంగా ఎక్కడికక్కడ వాటిని తయారుచేసుకోవడం దుస్సాధ్యం. తత్పర్యవసానంగా అత్యధిక సంఖ్యాక తుపాకులు, ప్రత్యేకించి వాటికి అమిరే తూటాలుంటేగాని ఎందుకూ పనికిరావు. ఇకపోతే చివరి సంగతేమిటంటే, 1848 దరిమిలా పెద్ద నగరాల్లో కొత్తగా నిర్మింపబడిన నివాసగృహాలు, సుదీర్ఘమైన, తిన్నని, వెడల్పాటి వీధుల్లో, కొత్త ఫిరంగులూ రైఫిళ్లూ పూర్తిగా ఉపయోగంలోకి వచ్చే విధంగా తీర్చిదిద్దబడ్డాయా అన్నట్లు అమర్చబడ్డాయి. బెర్లిన్ ఉత్తర, తూర్పుప్రాంత కార్మికవర్గ బస్తీలను వీధి అవరోధాల పోరాటానికి స్వయంగా ఎంపికచేసుకున్న విప్లవవాది మతిమాలినవాడైయుండాలి.

ఇలా అన్నంత మాత్రాన భవిష్యత్తులో వీధిపోరాటానికి యింక ఏ పాత్రా ఉండదనే అర్థమా? ఎంతమాత్రమూ కాదు. 1848 దరిమిలా పరిస్థితులు పౌర పోరాటకులకు చాలా అననుకూలమూ, సైన్యానికి చాలా అనుకూలమూ అయ్యాయని మాత్రమే దీని అర్థం. అందుచేత, భవిష్యత్తులో యీ అననుకూల పరిస్థితికి నష్టపూర్తిగా యితర అనుకూలాంశాలు ఉన్నప్పుడు మాత్రమే వీధిపోరాటం విజయవంతమవుతుంది. పై కారణాల మూలంగా, వీధిపోరాటాలు ఒక మహా విప్లవపు తదుపరి క్రమంలో కన్న ఆరంభంలో అరుదుగా సంభవిస్తాయి. బలవత్తర శక్తులు మాత్రమే వీధిపోరాటాలకు పూనుకోవలసి వుంటుంది. అయితే యీ బలవత్తర శక్తులు, మొత్తం ఫ్రెంచి విప్లవ క్రమమంతటిలో మాదిరిగానూ, లేక పారిస్‌లో సెప్టెంబరు 4న, అక్టోబరు 31న[54] చేసిన మాదిరిగానూ ఉదాసీనమైన వీధి అవరోధాల ఎత్తుగడలకు బదులుగా బహిరంగ దాడినే ఎంపికచేసుకోవచ్చు.*

---

* "Die Neue Zeit" పత్రికలోనూ, "ఫ్రాన్సులో వర్గపోరాటాలు"యొక్క 1895 నాటి కూర్పులోనూ యీ పేరా వదలివేయబడింది. — సం.

ప్రస్తుత పాలన, తుపాకులు గుళ్లను వర్షిస్తున్న చోటుకీ, విచ్చు కత్తులు కసిమసగుతున్న చోటుకీ మనల్ని ఎదురు తీసుకెళ్లాలని గాఢంగా వాంఛిస్తుందన్న సంగతిని యిప్పుడైనా పాఠకుడు అర్థంచేసుకుంటాడా? మనం పిరికిపందలమని వాళ్లు మనల్ని ఎందుకు నిందిస్తున్నారో తెలుసా? మరేమీ ఆర్భాటం లేకుండా మనం వీథుల్లోకి — ఎక్కడైతే మనం ఓడింపబడితీరుతామని ముందే మనకు తెలుసునో అక్కడికీ — రావడం లేదు కనుక. ఒక్కసారికి ఫిరంగులకు ఎరకమ్మని మనల్ని వాళ్లెందుకు హార్దికంగా ఆహ్వానిస్తున్నారో పాఠకునికి యిప్పుడు అవగతమైందా?

ఆ పెద్దమనుషులు ప్రార్థనలు కురిపిస్తున్నారన్నా, అదేపనిగా సవాళ్లు చేస్తున్నారన్నా వట్టినే, బొత్తిగా వట్టినే అలా చెయ్యడంలేదు. మనం అంత బుద్ధిహీనులం కాము. రాబోయే యుద్ధంలో తమ శత్రువు, పాత ఫ్రిట్జ్* సైనికవ్యూహాన్ని అనుసరించి, తమతో యుద్ధం చెయ్యాలనీ, లేక వాగ్రామ్,[55] వాటర్లూ[56] యుద్ధాల్లో మాదిరిగా పెద్దపెద్ద డివిజన్లను శ్రేణులుతీర్చి, అంతేకాకుండా చెకుముకి రాతిచెవి కలిగిన తుపాకులు చేతధరించి మరీ రావాలనీ వాళ్ళు డిమాండుచేసినా చెయ్యవచ్చు. దేశాలమధ్య యుద్ధాల విషయంలో పరిస్థితులు మారాయన్నట్లయితే, వర్గపోరాటం విషయంలో పరిస్థితులు మారాయనడం తక్కువ నిజమేమీకాదు. ఆకస్మిక దాడులకూ, చైతన్య శూన్యులైన ప్రజాబాహుళ్యానికి చైతన్యవంతులైన అల్పసంఖ్యాకులు నాయకత్వం వహించి నిర్వహించే విప్లవాలకూ కాలంచెల్లిపోయింది. సమస్య సామాజిక వ్యవస్థయొక్క సంపూర్ణ పరివర్తన అయినప్పుడు, ప్రజాబాహుళ్యం స్వయంగా అందులో వుండాలి, వివాదాంశమేమిటో, తాము మనసా, కర్మణా దేనికోసం త్యాగంచేయాలో వారు ముందుగా అవగతం చేసుకోవాలి.** గత అర్ధ శతాబ్దపు చరిత్ర నుంచీ మనం ఆ విషయాన్ని నేర్చుకున్నాం. కాని జరగవలసిందేమిటో ప్రజా బాహుళ్యం అర్థంచేసుకోగలిగేందుకుగాను, దీర్ఘకాలంపాటు, పట్టుదలగా పనిచెయ్యడం అవసరం. సరిగా యీపనే మనం యిప్పుడు — అందులోనూ, శత్రువును నిస్పృహకు గురిచేసేటంత విజయవంతంగా — చేస్తున్నాం.

లాటిన్ దేశాల్లో కూడా పాత ఎత్తుగడలను మార్చాలన్న సంగతి అంతకంతకు ఎక్కువగా గుర్తింపబడుతోంది. సార్వజనిక ఓటింగు హక్కును వినియోగించుకొని, అందుబాటులోకి వచ్చినన్ని స్థానాలను సంపాదించుకున్న జర్మన్ ఆదర్శం సర్వత్రా అనుకరింపబడుతోంది.

---

* రెండవ ఫ్రెడరిక్, ప్రష్యా రాజు (1740–86). — సం.

** "Die Neue Zeit" పత్రికలోనూ, "ఫ్రాన్సులో వర్గపోరాటాలు"యొక్క 1895 నాటి కూర్పులోనూ "తాము మనసా, కర్మణా దేనికోసం త్యాగంచేయాలో" అన్నమాటలకు బదులు "తాము దేనికోసం పోరాడాలో" అన్నమాటలు యివ్వబడ్డాయి. — సం.

సరైన సన్నాహంలేకుండా దాడిచెయ్యడమన్నది సర్వత్రా పరిత్యజింపబడింది.* ఎక్కడైతే నూరు సంవత్సరాలకుపైగా విప్లవాల పరంపరచేత పునాది కుళ్లగింపబడిందో ఆ ఫ్రాన్సులో, ఎక్కడైతే కుట్రలలోనూ, తిరుగుబాట్లలోనూ, తదితర విప్లవకార్యాచరణలన్నింటిలోనూ పాలు పంచుకోని ఒక్కగానొక్క పార్టీ కూడా లేదో ఆ ఫ్రాన్సులో, తత్ఫలితంగా ఎక్కడైతే ప్రభుత్వం సైన్యంపై ఏవిధంగానూ ఆధారపడజాలదో ఆ ఫ్రాన్సులో, మొత్తంమీద ఎక్కడైతే ఆకస్మికంగా జరిపే తీవ్రమైన దాడికి జర్మనీలోకన్న ఎక్కువ అనుకూల పరిస్థితులున్నాయో ఆ ఫ్రాన్సులో సైతం, విస్తృత ప్రజాబాహుళ్యాన్ని, యీ సందర్భంలో రైతులను మొట్టమొదట తమ పక్షానికి తిప్పుకుంటే తప్ప, చిరకాలం మనగలిగిన విజయాన్ని తాము సాధించడం సాధ్యం కాదన్న విషయాన్ని సోషలిస్టులు అంతకంతకు అధికంగా గ్రహిస్తున్నారు. నెమ్మదిగా ప్రచారం జరపడం, పార్లమెంటరీ కార్యకలాపాలూ — యివే పార్టీయొక్క తక్షణ కర్తవ్యాలన్న విషయం ఫ్రాన్సులో కూడా గుర్తింపబడింది. విజయాలు కూడా కొల్లలుగానే లభిస్తున్నాయి. పలు మునిసిపల్ కౌన్సిళ్లను గెల్చుకోవడమే కాకుండా, ఫ్రెంచి సోషలిస్టులు పార్లమెంటు సభలో 50మంది ప్రతినిధులను కలిగివున్నారు. వాళ్లు యిప్పటికే మూడు మంత్రివర్గాలనూ, రిపబ్లిక్ అధ్యక్షుడినొకడినీ పడగొట్టారు. బెల్జియంలో పోయిన ఏడాది కార్మికులు సార్వజనిక ఓటింగు హక్కును సాధించుకున్నారు. నాలుగోవంతు నియోజక వర్గాలలో విజయం సాధించారు. స్విట్జర్లండులో, ఇటలీలో, డెన్మార్కులో, అంతెందుకు, బల్గేరియా, రుమేనియాలలోసైతం పార్లమెంటులలో సోషలిస్టు ప్రతినిధులున్నారు. ఆస్ట్రియాలో పార్లమెంటులో మన ప్రవేశాన్ని నిరోధించడం యిహనెంత మాత్రం సాధ్యంకాదన్న విషయాన్ని అన్ని పార్టీలూ అంగీకరిస్తున్నాయి. మనం లోపల ప్రవేశించితీరుతాం, అందులో సందేహమే లేదు: ఇంకా తేలకుండావున్న వివాదాంశమల్లా ఒక్కటే: ఏ మార్గాన? రష్యాలో సైతం ప్రసిద్ధమైన జేమ్స్కీ సబోర్ సమావేశమైనప్పుడు — యువ నికోలస్ ఏ జాతీయ సభనైతే ప్రతిఘటించాలని వృథాప్రయత్నం చేస్తున్నాడో — దానిలో సైతం మన ప్రతినిధులు ఉండితీరుతారని మనం నిస్సందేహంగా అనుకోవచ్చు.

సహజంగానే, విప్లవంచేసేందుకు తమకుగల హక్కును యీ కారణంగా మన విదేశీ కామ్రేడ్లు ఎంతమాత్రమూ వదులుకోరు. ఏదేమైనప్పటికీ, విప్లవంచేసే హక్కే *నిజమైన ఏకైక "చారిత్రక హక్కు,"* మినహాయింపుల్లేకుండా ఆధునిక రాజ్యాలన్నీ — మెక్లెన్‌బుర్గ్ తోబాటు — ఆధారపడుతున్నది యీ హక్కుపైననే. ఈ మెక్లెన్‌బుర్గ్‌లోని ప్రభువర్గ

---

* "Die Neue Zeit" పత్రికలోనూ, "ఫ్రాన్సులో వర్గపోరాటాలు"యొక్క 1895 నాటి విడి కూర్పులోనూ "సరైన సన్నాహం లేకుండా దాడిచెయ్యడమన్నది సర్వత్రా పరిత్యజింపబడింది" అన్న మాటలు వదలివెయ్యబడ్డాయి. — సం.

విప్లవం 1755లో "ఆనువంశిక ఒప్పందం" – యీనాటికీ అమల్లోవున్న ఫ్యూడలిజం యొక్క హక్కుల పత్రం[57] – ద్వారా అంతంచెయ్యబడింది. సాధారణ చైతన్యంలో విప్లవంచేసే హక్కు ఎంత నిర్వివాదమైనదిగా గుర్తింపబడిందంటే, చివరకు జనరల్ ఫన్ బొగుస్లావ్స్కీ సైతం రాజకీయ కుట్ర చేసే హక్కును దీనిద్వారా పొందుతున్నాడు. ఈ రాజకీయ కుట్రను తన కైజరుకి అనుకూలంగా ప్రజానుమతి పొందిన యీ హక్కు ద్వారానే అతను విజయవంతంగా సమర్థించుకున్నాడు.

అయితే, యితర దేశాల్లో ఏమిజరిగినప్పటికీ, జర్మన్ సోషల్-డెమొక్రటిక్ పార్టీ ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తోంది. దానిమూలంగా, కనీసం తక్షణ భవిష్యత్తులోనైనా, దానికొక ప్రత్యేక కర్తవ్యముంది. అది పోలింగు బూత్‌లకు పంపే 20 లక్షలమంది ఓటర్లు, తమ వెనకవున్న ఓటర్లుకాని యువతీయువకులతో కలిసి బహుళసంఖ్యాక, ఘనిష్ఠ ప్రజా బాహుళ్యంగానూ, అంతర్జాతీయ శ్రామికవర్గ సైన్యపు నిర్ణయాత్మక "దాడి బలగం"గానూ రూపొందారు. ఈ ప్రజాబాహుళ్యం యిప్పటికే పోలైన వాటిలో నాలుగోవంతుకుపైగా ఓట్లను సమకూరుస్తోంది. రైహ్‌స్టాగ్‌కి జరిగిన ఉప ఎన్నికలూ, వివిధ రాష్ట్రాలలో జరిగిన శాసనసభల ఎన్నికలూ, మునిసిపల్ కౌన్సిళ్లకూ, వృత్తి న్యాయస్థానాలకూ జరిగిన ఎన్నికలూ నిరూపించినట్లు యీ ఓట్లసంఖ్య నిరంతరాయంగా పెరుగుతోంది. ఈ పెరుగుదల ప్రకృతిలో జరిగే క్రమమంత సద్యోజనితంగానూ, అంత నిబ్బరంగానూ, అంత అనివార్యంగానూ, అదే సమయంలో అంత ప్రశాంతంగానూ సాగుతోంది. దానికి వ్యతిరేకంగా సమస్త ప్రభుత్వ జోక్యమూ శక్తిహీనమైనదిగా నిరూపితమైంది. మనకి యీ రోజైనాకూడా యిరవై రెండున్నర లక్షల ఓట్లకు తక్కువ రావు. ఈ పెరుగుదల యిదే మాదిరిగా కొనసాగినట్లయితే, యీ శతాబ్దాంతానికి సమాజపు మధ్యశ్రేణిలో అధికభాగాన్నీ, పెటీబూర్జువా వర్గాన్నీ, సన్నకారు రైతులనూ మనవైపుకు తిప్పుకొని, దేశంలో నిర్ణయాత్మకమైన శక్తిగా పెంపొందుతాము, వారికి యిష్టమున్నా లేకపోయినా యితర శక్తులన్నీ మనముందు తలవంచవలసివుంటుంది. ఈ పెరుగుదలను అంతరాయం లేకుండా – అది తనకు తానై ప్రస్తుత ప్రభుత్వ వ్యవస్థ అదుపుకి అతీతంగా తయారయ్యేదాకా – కొనసాగేలా చూడటం, రోజురోజుకీ వృద్ధిచెందుతున్న యీ దాడిబలగాన్ని అగ్రగామి చిల్లర పోరాటాలలో వృథా చెయ్యకుండా, నిర్ణయాత్మక దినందాకా చెక్కుచెదరకుండా వుంచడం,* అదీ మన ప్రధాన

---

* "Die Neue Zeit"లోనూ, "ఫ్రాన్సులో వర్గపోరాటాలు"యొక్క 1895 నాటి కూర్పులోనూ "రోజురోజుకీ వృద్ధిచెందుతున్న యీ దాడిబలగాన్ని అగ్రగామి చిల్లర పోరాటాలలో వృథాచెయ్యకుండా, నిర్ణయాత్మక దినందాకా చెక్కుచెదరకుండా వుంచడం" అన్న మాటలు వదిలివెయ్యబడ్డాయి. – సం.

కర్తవ్యం. జర్మనీలో సోషలిస్టు పోరాట శక్తుల నిబ్బరమైన పెరుగుదలను తాత్కాలికంగా నిరోధించడానికీ, చివరకు కొంతకాలం అది వెనక్కు నెట్టబడగలగడానికీ సాధనం ఒకేఒక్క టుంది. సైన్యంతో పెద్ద ఎత్తున ఘర్షణ పడటం, 1871లో పారిస్‌లో మాదిరిగా రక్త తర్పణం చేయడం. దీర్ఘ కాల క్రమంలో అది కూడా అధిగమింపబడుతుంది. దశలక్షల సంఖ్యలో వున్న పార్టీని కాల్చివెయ్యడం యూరప్, అమెరికాలలోని మగజీన్ రైఫిల్లన్నీ ఏకమైనాకూడా వాటికి తలకుమించిన పని. కాని సాధారణమైన అభివృద్ధి కుంటుపరచబడవచ్చు, బహుశా దాడిబలగం కీలకమైన క్షణంలో చేతికి అందిరాకపోవచ్చు, అప్పుడిక నిర్ణయాత్మక పోరాటం* ఆలస్యమవుతుంది, పొడిగింపబడుతుంది, భారతరమైన త్యాగాలతో కూడివుం టుంది.

ప్రపంచ చరిత్ర వెటకారమేమిటంటే, అది అన్నింటినీ తలకిందులుచేస్తుంది. "విప్లవ వాదులమూ," "కూలదోతదారులమూ" అయిన మనం, చట్టవిరుద్ధమైన పద్ధతుల ద్వారానూ, కూలదోత ద్వారానూ కంటె చట్టబద్ధమైన పద్ధతుల ద్వారా చాలా ఎక్కువగా సాధించుతున్నాం. కాగా తమను తాము వ్యవస్థకు అంకితమైనవిగా పిలుచుకొనే పార్టీలు, అవే సృష్టించిన చట్టబద్ధమైన పరిస్థితులలో నశించిపోతున్నాయి. ఒడిలోన్ బర్రోతోబాటు అవి నిరాశా నిస్పృహలతో la légalité nous tue — చట్టబద్ధత మా చావుకే వచ్చింది అంటూ గోలపెడుతున్నాయి; కాగా మనం, యీ చట్టబద్ధతకింద, గట్టి కండ పట్టి, బుగ్గలు ఎరుపెక్కి, అజరామరులంగా కనిపిస్తున్నాం. <u>మనం</u> వాళ్లను మెప్పించేందుకు గాను వీధిపోరాటాలకు ఎగబడేటంత వెర్రివాళ్లం కాకపోతే, ప్రాణఘాతకమైన యీ చట్టబద్ధతను చివరకు స్వయంగా తామే భగ్నంచెయ్యడం తప్ప వాళ్లకు వేరే గత్యంతరం మిగలదు.

ఈలోగా కూల్చివేతలకు వ్యతిరేకంగా వాళ్లు కొత్త చట్టాలు చేస్తారు. మరోసారి అంతా తలకిందులవుతుంది. ఈనాడు కూల్చివేతకు బద్ధవ్యతిరేకులుగా ఉన్నవాళ్లు, నిన్నటి రోజున తామే కూలదోతదారులు అయివుండలేదా? 1866 నాటి అంతర్యుద్ధాన్ని లేవ గొట్టినది బహుశా <u>మనమేనేమో</u>కదా? హన్నోవర్ రాజునూ, హెస్సెన్ యువరాజునూ, నస్సౌ డ్యూకునూ వారివారి అనువంశిక చట్టబద్ధ భూములనుంచి తరిమివేసి, యీ అనువంశిక భూములను <u>మనమే</u> ఆక్రమించుకున్నామా? దేవుని దయవల్ల జర్మన్ సమా

* "Die Neue Zeit"లోనూ "ఫ్రాన్సులో వర్గపోరాటాలు"యొక్క 1895 నాటి కూర్పులోనూ "బహుశా దాడిబలగం కీలకమైన క్షణంలో చేతికి అందిరాకపోవచ్చు" అన్న మాటలు మినహాయింపబడ్డాయి, "నిర్ణయాత్మక పోరాటం" అన్న మాటలకు బదులు "నిర్ణయం" అన్నమాట యివ్వబడింది. — సం.

ఖ్యనూ, పైమూడు సింహాసనాలనూ కూల్చివేసిన వీళ్ళ కూలదోతకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేస్తున్నారు! Quis tulerit Gracchos de seditione querentes?* బిస్మార్క్ ఆరాధకులు కూల్చివేతకు వ్యతిరేకంగా దూషణలు కురిపించడాన్ని ఎవరు అనుమతించగలరు?

వాళ్లను తమ కూలదోత వ్యతిరేక బిల్లులను ప్యాసుచేయించుకోనివ్వండి, వాటిని మరింత దారుణంగా తయారుచెయ్యనివ్వండి, యావత్తు శిక్షాస్మృతినీ ఎలా కావాలంటే అలా సాగే ఇండియా రబ్బరులా మార్చుకోనివ్వండి, అలా చేసినా కూడా తమ చేతకానితనాన్ని వెల్లడించుకోవడంతప్ప వాళ్ళు సాధించగలిగినదేమీ వుండదు. సోషల్-డెమోక్రసీపై తీవ్ర మైన దెబ్బకొట్టాలంటే, దీనికితోడు వాళ్ళు పూర్తిగా వేరే చర్యలకు పూనుకోవాలి. సోషల్-డెమోక్రటిక్ కూలదోతను ఎదుర్కోగలగాలంటే — చట్టాన్ని అనుసరించడం ద్వారా యిప్పుడే అది బాగా బలంపుంజుకుంటోంది — వ్యవస్థ పార్టీలు కూలదోతకు పూనుకొన్నప్పుడే — చట్టాన్ని భగ్నంచెయ్యనిదే యిది మనజాలదు — యిది సాధ్యం. ప్రష్యన్ బ్యూరాక్రట్ ర్యోస్లరూ, ప్రష్యన్ జనరల్ ఫన్ బొగుస్లావ్‌స్కీ వీధిపోరాటాల్లోకి ఆకర్షింపబడటానికి బొత్తిగా తిరస్కరించే కార్మికులను అందుకోగలగడానికి, బహుశా వున్న ఏకైక మార్గాన్ని వాళ్లకు చూపారు. రాజ్యాంగచట్టాన్ని అతిక్రమించడం, నియంతృత్వం, తిరుగులేని అధికారానికి తిరిగివెళ్లడం, regis voluntas suprema lex!** అందుకని, పెద్ద మనుషులారా, ధైర్యం కూడగట్టుకోండి; యీ విషయంలో అరకొర పద్ధతులు పనికిరావు, దీనిలో మీరు పూర్తిగా తలదూర్చాలి!

చిన్నరాజ్యాలన్నింటి మాదిరిగానూ మొత్తంమీద అన్ని ఆధునిక రాజ్యాల మాదిరిగానూ జర్మన్ సామ్రాజ్యం కూడ ఒప్పందపు ఫలితం అన్న సంగతీ, యీ ఒప్పందం మొదట ప్రభువులు ఒకరితో మరొకరు చేసుకున్నదీ, తర్వాత ప్రభువులు ప్రజలతో చేసుకున్నదీ అన్న సంగతిని మరచిపోకండి. ఒక పక్షం యీ ఒప్పందాన్ని భగ్నంచేసినట్లయితే, మొత్తం ఒప్పందం నేలకూలిపోతుంది. మరి అప్పుడిక రెండవ పక్షంసైతం — 1866లో బిస్మార్కు మాకు చాలా చక్కగా నిరూపించినట్లు — యీ ఒప్పందానికి ఎంతమాత్రమూ కట్టుబడివుండాల్సిన అవసరంలేదు. అందుకని, మీరు సామ్రాజ్య రాజ్యాంగచట్టాన్ని భగ్నం చేసినట్లయితే, మీ విషయంలో తన చిత్తంవచ్చినట్లు చెయ్యగలిగే స్వాతంత్ర్యం సోషల్-

---

* తిరుగుబాటు ప్రబోధక ఉపన్యాసాలను గురించి గ్రాఖ్ సోదరులు ఫిర్యాదుచేస్తే ఎవరు సహిస్తారు? (యువెనాల్, వ్యంగ్యరచన II.) — సం.

** రాజు యిచ్ఛయే అంతిమ శాసనం! — సం.

డెమోక్రసీకి వుంటుంది. అప్పుడు తను చెయ్యబోయేదేమిటో యీనాడది ఎంతమాత్రమూ బయటపెట్టదు.*

దాదాపు సరిగా యిప్పటికి పదహారు శతాబ్దాలక్రితం, ప్రమాదకరమైన కూలదోత పార్టీ ఒకటి యిదేమాదిరిగా రోమన్ సామ్రాజ్యంలో కూడ చురుకుగా పనిచేసింది. అది మతంయొక్క, రాజ్యంయొక్క పునాదులను దొలిచివేసింది. సీజర్ యిచ్ఛయే అంతిమ శాసనమన్న మాటను అది పూర్తిగా తిరస్కరించింది. దానికి ప్రత్యేకమైన మాతృభూమి అంటూ లేదు, అది అంతర్జాతీయతత్వం కలిగివుంది. సామ్రాజ్యంలోని అన్ని దేశాలకూ గాల్‌నుంచి ఆసియావరకూ, సామ్రాజ్యపుటెల్లల బయటకూడా అది విస్తరించింది. అది తిరుగుబాటు ప్రబోధక కార్యకలాపాలను రహస్యంగా, చాపకింద నీరులా చాలకాలం సాగించింది. కొంత కాలానికి తనను తాను బహిరంగంగా బయటకు రావడానికి తగినంత బలంగా వున్నట్లు అది భావించింది. క్రిస్టియన్లు పేరుతో తెలియబడిన ఈ కూలదోత పార్టీకి సైన్యంలో కూడా బలమైన ప్రాతినిధ్యం వుంది. మొత్తం సైనిక దళాలకు దళాలే క్రిస్టియన్లు. క్రైస్తవేతర వ్యవస్థీకృత మతంయొక్క బలి తతంగాలకు హాజరు కావలసిందిగానూ, అక్కడ ఆరాధన జరపవలసిందిగానూ ఆజ్ఞాపింపబడినప్పుడు అందుకు నిరసనగా యీ తిరుగుబాటు సైనికులు తమ శిరస్త్రాణాలపైన విలక్షణమైన గుర్తులను — క్రాస్ (శిలువ) గుర్తులను — ధరించేటంత నిర్భయత్వాన్ని ప్రదర్శించారు. సైనిక బారకాసుల్లో అలవాటుగా సాగే ఉన్నతాధికారుల బెదరింపులు సైతం నిష్ఫలమే అయ్యాయి. తన సైన్యంలో శాంతిభద్రతలూ, వినయవిధేతలూ, క్రమశిక్షణా తొలిచివెయ్యబడుతూంటే డయోక్లెటియన్ చక్రవర్తి యికనెంతమాత్రమూ శాంతంగా చూస్తూ ఊరకుండలేకపోయాడు. సమయమింకా మించిపోకముందే అతను గట్టిగా జోక్యంచేసుకున్నాడు. అతనొక సోషలిస్టు వ్యతిరేక — క్షమించాలి, నేను చెప్పాలనుకున్నది క్రిస్టియన్ వ్యతిరేక అని — చట్టాన్ని జారీచేశాడు. కూలదోతదార్ల సమావేశాలు నిషేధింపబడ్డాయి. వాళ్ల సమావేశాలు జరిగే హాలులు మూసివెయ్యబడ్డాయి, లేక కూల్చివెయ్యబడ్డాయి. వెనక సాక్సనీలో ఎర్ర జేబురుమాళ్ల మాదిరిగా, యిప్పుడు క్రిస్టియన్ చిహ్నాలు, క్రాసులు, మొదలైనవి నిషేధింపబడ్డాయి. క్రిస్టియన్లు ప్రభుత్వోద్యోగ నిర్వహణకు పనికిరారని ప్రకటింపబడింది. చివరకు వాళ్లను కార్పొరల్సు కూడా కానివ్వరాదు. ఫన్ క్యోలర్‌యొక్క కూలదోత వ్యతిరేక బిల్లు[58] పేర్కొన్నట్లు "వ్యక్తి గౌరవం"లో అంత ఎక్కువగా శిక్షణపొందిన న్యాయాధిపతులు అప్పట్లో లేరు గనుక,

---

* "Die Neue Zeit" పత్రికలోనూ, "ఫ్రాన్సులో వర్గపోరాటాలు"యొక్క 1895 నాటి కూర్పులోనూ "బిస్మార్కు నిరూపించినట్లు" అన్న మాటలు మొదలుకొని ఆ పేరా చివరివరకూ వదిలెయ్యబడ్డాయి. — సం.

కోర్టులో న్యాయాన్ని అర్థించే విషయంలో క్రిస్టియన్లు తక్షణమే నిషేధింపబడ్డారు. ఈ అసాధారణ చట్టం కూడా నిష్ఫలమే అయింది. గోడలకు అంటించబడిన యీ చట్టపు ప్రతులను క్రిస్టియన్లు తిరస్కారపూర్వకంగా చింపిపారేశారు. నికొమేడియాలోని రాజభవనాన్ని చక్రవర్తి సమక్షంలోనే తగులబెట్టేశారనికూడా అనుకుంటూ వుంటారు. మన శకానికే చెందిన 303వ సంవత్సరంలో, క్రిస్టియన్లను దారుణంగా హింసించడం ద్వారా చక్రవర్తి తన పగతీర్చుకున్నాడు. అటువంటి ఘటనల్లో అదే ఆఖరుది. అదెంత శక్తివంతంగా పనిచేసిందంటే, అటుతర్వాత పదిహేడేళ్లకి సైన్యంలో అత్యధిక సంఖ్యాకులు క్రిస్టియన్లు అయ్యుండటం తటస్థించింది. అటు తర్వాత యావత్తు రోమన్ సామ్రాజ్య నిరంకుశాధిపతి, మతబోధకులచేత మహావీరుడని పిలువబడిన కొన్స్తంతీన్ క్రైస్తవ మతాన్నే రాజ్యమతంగా ప్రకటించాడు.

ఎఫ్. ఎంగెల్స్

లండన్, 1895, మార్చి 6.

సంగ్రహ రూపంలో
"Die Neue Zeit" పత్రిక రెండవ
సంపుటం, 27, 28 సంచికల్లో
1894–95లలోను, Karl Marx
"Die Klassenkämpfe in Frankreich
1848 bis 1850"
Berlin, 1895లోనూ
ప్రచురింపబడింది

# కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్

## లేఖలు

## పారిస్‌లోని పి. వి. ఆనెంకొవ్‌కి మార్క్స్

బ్రస్సెల్స్, [1846], డిసెంబరు 28,

ప్రియమైన ఆనెంకొవ్‌గారికి,

నా గ్రంథ విక్రేత ప్రూడన్‌గారు రచించిన "దారిద్ర్య తత్వశాస్త్రం"ను పోయిన వారమే పంపినందువల్ల కాకపోతే మీ నవంబరు 1వ తేదీ లేఖకు ఎన్నడో జవాబు రాసి యుండేవాణ్ణి. దాన్ని గురించిన నా అభిప్రాయాన్ని మీకు వెంటనే తెలుపగలిగేందుకుగాను నేను దాన్ని చదవడం రెండు రోజుల్లోనే ముగించాను. నేనా పుస్తకాన్ని చాలా తొందరగా చదివిన కారణంగా వివరాల్లోకి పోలేనుగాని, దానిపైన నాకు కలిగిన సాధారణాభిప్రాయాన్ని మాత్రమే మీకు చెప్పగలను. మీరు కావాలనుకుంటే మరో ఉత్తరంలో సవివరంగా రాయ గలను.

నేనొక విషయం నిర్మొగమాటంగా చెప్పవలసివుంది, యీ పుస్తకం దరిద్రంగా వుంది, అందులోనూ చాలా దరిద్రంగా వుంది. ప్రూడన్ చాలామూలం లేని తన యీ ఆడంబర పూర్వక రచనలో ప్రదర్శించిన "జర్మన్ తత్వశాస్త్రపు అతుకులబొంత"ను మీ ఉత్తరంలో మీరే స్వయంగా వెక్కిరించారు. కాని, ఆయన అర్థికవాదానికి తాత్విక విషం సోకలేదని మీరు అభిప్రాయపడ్డారు. అర్థికవాదంలోని దోషాలను ప్రూడన్‌గారి తాత్వికాభిప్రాయాలకు ఆపాదించడం నాకు కూడా బొత్తిగా యిష్టంలేదు. ప్రూడన్‌గారు అసంగతమైన తాత్విక సిద్ధాంతాన్ని కలిగియున్నందుననే అర్థశాస్త్రానికి తప్పుడు భాష్యం చెప్పడంలేదు. అందుకు భిన్నంగా యీనాటి సామాజిక వ్యవస్థను – దాని సమగ్రరూపంలో (engrènement) (యింకా చాలావాటితోబాటు యీమాట కూడా ప్రూడన్‌గారు ఫోరియర్‌నుండి అరువు తెచ్చుకున్నదే) – అర్థంచేసుకోవడంలో విఫలమయాడు గనుకనే ఆయన అసంగతమైన తాత్విక సిద్ధాంతాన్నొకదాన్ని మనముందుంచుతున్నాడు.

భగవంతుని గురించీ, సార్వత్రిక హేతువు గురించీ, మానవజాతియొక్క — ఎన్నడూ పొరపడనిదీ, అన్ని యుగాల్లోనూ తనకు తాను దీటుగా వుండినదీ, దేన్ని గురించిన సత్యాన్ని ఎవరైనా తెలుసుకోవాలంటే సరైన చైతన్యం కలిగియుండాలో ఆ — వ్యక్తిపరంకాని హేతు జ్ఞానాన్ని గురించీ ప్రూడన్‌గారు ఎందుకు మాట్లాడుతున్నట్లు? తనను తానొక సాహసిక చింతనాపరునిగా ప్రదర్శించుకొనేందుకుగాను దుర్బలమైన హేగెల్‌తత్వానికి ఆయన తిరిగి ఎందుకు వెళ్తున్నాడు?

ఈ చిక్కు సమస్యా పరిష్కారానికి స్వయంగా ఆయనే ఒక కీలకాన్ని మనకి సమకూరుస్తున్నాడు. ప్రూడన్‌గారు చరిత్రలో ఒక సామాజికాభివృద్ధి పరంపరను చూస్తున్నాడు; చరిత్రలో ప్రగతి సాధింపబడటాన్ని ఆయన చూస్తున్నాడు; చివరకు విడి వ్యక్తులుగా మనుషులకు, వారు ఏమి చేస్తున్నదీ తెలియదనీ, వారి చలనాన్ని గురించే వారు పొరపాటు అభిప్రాయంతో వున్నారనీ, అంటే, వారి సామాజికాభివృద్ధి మొదటి చూపుకి వారి వైయక్తికాభివృద్ధికి భిన్నమైనదిగా, ప్రత్యేకమైనదిగా, అతీతమైనదిగా కనిపిస్తుందనీ ఆయన అంటాడు. ఈ వాస్తవాలను ఆయన వివరించలేడు, అందుకని సార్వత్రిక హేతువు తనను తాను అభివ్యక్తంచేసుకుంటుందన్న సిద్ధాంత పరికల్పన ఆయనకు వాటంగా వుంది. నిగూఢమైన అస్పష్ట కారణాలను — అంటే, లోకజ్ఞానం కొరవడిన మాటలను — కల్పించడంకన్న తేలికైన పని మరొకటిలేదు.

కాని మానవజాతియొక్క చారిత్రకాభివృద్ధిని గురించి తానేమీ అర్థంచేసుకోలేదన్న సంగతిని ప్రూడన్‌గారు అంగీకరించినప్పుడు — సార్వత్రిక హేతువు, భగవంతుడు వంటి ఆడంబరపూర్వకమైన పదాలను వాడటంద్వారా ఆయన దీన్ని అంగీకరిస్తున్నాడు — ఆర్థికాభివృద్ధిని అర్థంచేసుకోగల సామర్థ్యం లేదన్న విషయాన్ని ఆయన నిర్ద్వంద్వంగానూ, అనివార్యంగానూ అంగీకరించడంలేదా?

దాని రూపమేదైనప్పటికీ, సమాజమంటే ఏమిటి? మానవుల పరస్పర చర్యల ఫలితం. ఈ సామాజిక రూపాన్నో మరో సామాజిక రూపాన్నో ఎంచుకొనేందుకు మానవులకు స్వేచ్ఛవుందా? ఎంతమాత్రం లేదు. మానవుని ఉత్పాదక శక్తుల అభివృద్ధిక్రమంలో ఒకానొక ప్రత్యేకమైన దశ ఉందని అనుకోండి: అప్పుడు ప్రత్యేకమైన ఒకానొక వాణిజ్యరూపం, వినిమయరూపం మీకు కనిపిస్తాయి. ఉత్పత్తి, వాణిజ్య, వినిమయాల అభివృద్ధియొక్క ప్రత్యేక దశలు ఉన్నాయని అనుకోండి: అప్పుడు తదనురూపమైన సామాజిక వ్యవస్థ, తదనురూపమైన కుటుంబ నిర్మితి, తరగతులు లేక వర్గాలు, ఒక్క మాటలో, తదనురూపమైన పౌర సమాజం మనకు దర్శనమిస్తుంది. ఒకానొక ప్రత్యేకమైన పౌర సమాజం ఉందని అనుకోండి: అప్పుడు పౌర సమాజంయొక్క అధికారిక వ్యక్తీకరణ మాత్రమే అయిన ప్రత్యేకమైన రాజకీయ పరిస్థితులు మనకి లభిస్తాయి. ప్రూడన్‌గారికి యిదెన్నడూ అర్థం కాదు,

ఎందుకంటే, రాజ్యంనుండి పౌర సమాజానికి దృష్టి మరల్చడం ద్వారా — అంటే, సమాజం యొక్క ఆధికారిక సారాంశంనుండి ఆధికారిక సమాజంపైకి దృష్టి మరల్చడం ద్వారా — తనేదో ఘనకార్యం చేస్తున్నట్లు ఆయన తలుస్తున్నాడు.

తమ చరిత్ర అంతటికీ మూలమైన తమ ఉత్పాదక శక్తులను ఎంచుకొనేందుకు మానవులకు స్వేచ్ఛలేదు అని ప్రత్యేకించి చెప్పడం అనావశ్యకమే. ప్రతి ఒక్క ఉత్పాదక శక్తీ సంచితమైన శక్తీ, పూర్వ కార్యకలాపాల ఫలితమూ కావడమే దీనికి కారణం. అందు చేత ఉత్పాదక శక్తులు ఆచరణలో మానవజాతి శక్తియొక్క ఉత్పాదితాలు. కాని యీ శక్తిమటుకు యీ శక్తి, మానవులు ఏ పరిస్థితులలో వున్నారో ఆ పరిస్థితులచేత, అంతకుముందే సంచితమొనర్చుకోబడిన ఉత్పాదక శక్తులచేత, తమకంటె ముందు అమల్లో వున్న సామాజిక రూపంచేత నియంత్రితం చెయ్యబడుతుంది దీన్ని తాము సృష్టించరు, ఇది అంతకు ముందరి తరంయొక్క ఉత్పాదితం. తర్వాత వచ్చే ప్రతి తరమూ అంతకు ముందరి తరంచేత సంచితమొనర్చబడిన ఉత్పాదక శక్తులను కలిగియుంటుందన్న సరళమైన యీ కారణంచేత — దానికిది కొత్త ఉత్పత్తికి ముడిపదార్థంగా వినియోగపడుతుంది — మానవ జాతి చరిత్రలో సుసంగతత్వం ఏర్పడుతుంది, మానవజాతి చరిత్ర రూపొందుతుంది. మానవుల ఉత్పాదక శక్తులూ, తన్మూలంగా వారి సామాజిక సంబంధాలూ మరింతగా అభివృద్ధిచెందిన కారణంగానే మానవజాతి చరిత్ర అనదగినది రూపొందుతుంది. దీన్నిబట్టి మానవుల సామాజిక చరిత్ర వారి వైయక్తికాభివృద్ధి చరిత్ర తప్ప — దీని విషయమై వారికి చైతన్యం ఉన్నా, లేకపోయినా — ఎన్నడూ మరేమీ కాదని తప్పనిసరిగా తేలుతోంది. వారి సంబంధాలన్నింటికీ పాదార్థికమైన యీ సంబంధాలే పునాది. వారి పాదార్థిక, వైయక్తిక కార్యకలాపం ఏ రూపాల్లో ఫలవంతమవుతుందో అవే యీ పాదార్థిక రూపాలు.

ప్రూడన్‌గారు భావాలనూ వస్తువులనూ కలగాపులగం చేస్తున్నాడు. మానవులు తాము సంపాదించుకున్నవాటిని ఎన్నడూ త్యజించరు. అన్నంత మాత్రాన, ఏ సామాజిక రూపంలో నైతే తాము కొన్ని ఉత్పాదక శక్తులను సంపాదించుకున్నారో ఆ సామాజిక రూపాన్ని వారెన్నడూ త్యజించరని దీని అర్థంకాదు. అందుకు భిన్నంగా, నాగరికత సాధించిన ఫలితాన్ని తాము పోగొట్టుకోకుండా ఉండేందుకూ, నాగరికతా ఫలాలను కోల్పోకుండా ఉండేందుకూ గాను, సంచితమొనర్చుకోబడిన ఉత్పాదక శక్తులకు తమ వాణిజ్య నిర్వహణ పద్ధతి ఏ క్షణంనుండి అయితే యికనెంతమాత్రమూ అనురూపంగా వుండదో, ఆ క్షణంనుండి తమ సాంప్రదాయిక సామాజిక రూపాలన్నింటినీ మార్చుకోవలసిన తప్పనిసరి పరిస్థితిలో వారు పడతారు. నేనిక్కడ యీ "వాణిజ్యం" అన్న మాటను అత్యంత విస్తృతమైన అర్థంలో, జర్మన్ భాషలో మనం "Verkehr" అన్న మాటను వాడినట్లు, ఉపయోగిస్తున్నాను. ఉదాహరణకు: ప్రత్యేక హక్కులు, వృత్తి సంఘాల, కార్పొరేషన్ల ఏర్పాటూ,

మధ్యయుగాల నియమాధీనమొనర్చే పాలనా (regulatory regime) సంచిత ఉత్పాదక శక్తులకూ, యీ సంస్థలు వేటినుండైతే ఉత్పన్నమయాయో ఆ పూర్వ సామాజిక పరిస్థితికీ మాత్రమే అనురూపమైనవి. సంఘాల నియమాల రక్షణకింద పెట్టుబడి సంచిత మొనర్చబడింది, సముద్రాంతర వ్యాపారం అభివృద్ధి అయింది, వలసలు నెలకొల్పబడ్డాయి. వేటి రక్షణలోనైతే యీ ఫలితాలు సక్రమయ్యాయో ఆ రూపాలను అట్టేపెట్టడానికి వాళ్ళు ప్రయత్నించినట్లయితే, దీని ఫలితాలను మనుషులు పోగొట్టుకొని వుండేవాళ్ళు. అందుకనే రెండు పిడుగుపాటు సంఘటనలు – 1640 నాటి, 1688 నాటి విప్లవాలు – భళ్ళుమన్నాయి. అన్ని పాత ఆర్థిక రూపాలూ, వాటికి అనురూపమైన సామాజిక సంబంధాలూ, పాత పౌర సమాజపు అధికారిక వ్యక్తీకరణలైన రాజకీయ పరిస్థితులూ ఇంగ్లండులో నాశనంచెయ్యబడ్డాయి. ఈవిధంగా ఏ ఆర్థిక రూపాలలోనైతే మనుషులు ఉత్పత్తి చేస్తారో, వినియోగించుకుంటారో, మార్పిడి చేసుకుంటారో ఆ ఆర్థిక రూపాలు అశాశ్వతమైనవీ, చారిత్రకమైనవీ. కొత్త ఉత్పాదక నైపుణ్యాలను సంపాదించుకోవడంతో, తమ ఉత్పత్తి విధానాన్నీ, ఉత్పత్తి విధానంతోబాటు కేవలం యీ ప్రత్యేక ఉత్పత్తి విధానపు అవసర సంబంధాలైన సకల ఆర్థిక సంబంధాలనూ మనుషులు మార్చుకుంటారు.

ప్రూడన్‌గారు అర్థంచేసుకోనిదీ, అంతేగాక, చూపించలేనిదీ సరిగా యిదే. చరిత్ర యొక్క వాస్తవిక గమనాన్ని సరిగా అవగతం చేసుకోలేక గతితార్కికమైనట్లు దుస్సాహసికంగా ప్రకటించుకొనే కనికట్టును కల్పించాడు. ఆయన చరిత్ర ఊహాలోకపు అస్పష్ట పరిధిలో సాగి, దేశకాలాలకు చాలా అతీతంగా పోతుంది కనుక, 17వ, 18వ, లేక 19వ శతాబ్దపు చరిత్రను గురించి చెప్పవలసిన అవసరముందని ఆయన అనుకోడు. ముక్తసరిగా చెప్పాలంటే పాత హేగెలియన్ చెత్తయే తప్ప అది చరిత్ర కాదు. పవిత్రమైన భావాల చరిత్రయే గాని అది అపవిత్రమైన మానవ చరిత్ర కాదు. ఆయన దృష్టిలో మనిషి అంటే, భావం లేక శాశ్వత హేతువు తనను తాను ఆవిష్కృతమొనర్చుకొనేందుకు దేనినైతే సాధనంగా చేసుకుంటుందో ఆ సాధనం మాత్రమే. ప్రూడన్‌గారు ఏ పరిణామాలను గురించి చెప్తున్నారో ఆ పరిణామాలు పరమభావపు నిగూఢ గర్భంలో సాధింపబడే పరిణామాలవంటివి మాత్రమే. ఈ నిగూఢ పరిభాషనుండి మేలిముసుగును చించివేసినప్పుడు తేలేదేమిటంటే, ప్రూడన్‌గారు ఆర్థిక భావాభివర్గాలకు సంబంధించి యిస్తున్న క్రమం ఆయన మనస్సులో ఏర్పడినది మాత్రమే. ఈ క్రమం అత్యంత అపక్రమంగా పనిచేసే మనస్సులో పుట్టినదని మీకు రుజువుచెయ్యడం నాకు పెద్ద కష్టమైన పనేమీ కాదు.

ప్రూడన్‌గారు తన పుస్తకాన్ని తనకు అభిమాన పాత్ర విషయమైన విలువను గురించిన చర్చతో ప్రారంభించాడు. ఈ చర్చ పరిశీలనకు ప్రస్తుతం నేను పూనుకోను.

శాశ్వత హేతువుయొక్క ఆర్థిక పరిణామ పరంపర శ్రమ విభజనతో ప్రారంభమవు

తుంది. ప్రూడన్‌గారికి సంబంధించినంతవరకు శ్రమ విభజన పూర్తిగా సరళమైన విషయం. కాని కుల వ్యవస్థ కూడా ఒక ప్రత్యేక రకమైన శ్రమ విభజన కాదా? వృత్తి సంఘాల వ్యవస్థ మరో రకం శ్రమ విభజన కాదా? ఇంగ్లండులో పదిహేడవ శతాబ్ది మధ్యలో ఆరంభమై పద్దెనిమిదవ శతాబ్దపు చివరి భాగంలో అంతమైన కార్ఖానా వ్యవస్థలోని శ్రమ విభజన సైతం భారీ, ఆధునిక పరిశ్రమలోని శ్రమ విభజనకు పూర్తిగా భిన్నమైనది కాదా?

ప్రూడన్‌గారు విషయ సారాంశానికి ఎంతదూరంగా ఉన్నాడంటే, లౌకిక అర్థశాస్త్రజ్ఞులు సైతం శ్రద్ధచూపే అంశాన్ని ఆయన అలక్ష్యం చేస్తున్నాడు. శ్రమ విభజనను గురించి మాట్లాడేటప్పుడు ప్రపంచ మార్కెట్‌ను గురించి ప్రస్తావించడం అవసరమని ఆయన భావించడం లేదు. సరే పోనీండి. వలసదేశాలంటూ యింకా లేనప్పుడూ, యూరప్‌కు సంబంధించినంతవరకు అమెరికా యింకా అస్తిత్వంలో లేనప్పుడూ, తూర్పు ఆసియాతో యూరప్‌కి కాన్‌స్టాంటినోపుల్ ద్వారా మాత్రమే సంబంధాలునప్పుడూ, పద్నాలుగవ, పదిహేనవ శతాబ్దాలనాటి శ్రమ విభజన, వలసదేశాలు అప్పటికే అభివృద్ధిచెందిన పదిహేడవ శతాబ్దపు శ్రమ విభజనతో మౌలికంగా విభేదించకుండా వుంటుందా?

అంతేకాదు. జాతులయొక్క సమస్త ఆంతరిక నిర్మాణమూ, వాటి సకల అంతర్జాతీయ సంబంధాలూ ఒకానొక ప్రత్యేక శ్రమ విభజనయొక్క వ్యక్తీకరణే తప్ప మరేమిటి? శ్రమ విభజన మారినప్పుడు యివి మారితీరక తప్పుతుందా?

శ్రమ విభజన సమస్య ప్రూడన్‌గారికి ఎంత తక్కువగా అర్థమైందంటే పట్టణ ప్రాంతాలకూ గ్రామీణ ప్రాంతాలకూ మధ్య సంభవించిన వేర్పాటును సైతం ఆయన ఎక్కడా ప్రస్తావించడు. అది ఉదాహరణకు జర్మనీలో, తొమ్మిదవ శతాబ్దానికీ పండ్రెండవ శతాబ్దానికీ మధ్య జరిగింది. ఈ విధంగా ప్రూడన్‌గారికి యీ వేర్పాటుయొక్క ఆరంభంగాని, అభివృద్ధిగాని తెలియదు గనుక ఆయనకు అది ఒక శాశ్వత నియమం. తన పుస్తకం అంతట్లోనూ ఆయన ఒకానొక ప్రత్యేక ఉత్పత్తి విధానం కల్పాంతం దాకా వుంటుందంటాడు. ప్రూడన్‌గారు శ్రమ విభజన గురించి చెప్పేదల్లా, ఆయనకి ముందు ఆడమ్ స్మిత్తూ, వేలాదిమంది యితరులూ చెప్పినదానియొక్క సారాంశం, అందునా ఆషామాషీ, అసమగ్ర సారాంశం మాత్రమే.

రెండవ పరిణామం యంత్రాలు. శ్రమ విభజనకూ యంత్రాలకూ మధ్య గల సంబంధం ప్రూడన్‌గారికి పూర్తిగా అగమ్యగోచరం. ప్రతి ఒక శ్రమ విభజన పద్ధతికీ దాని విశిష్టమైన ఉత్పత్తి సాధనాలుంటాయి. ఉదాహరణకు, పదిహేడవ శతాబ్ది మధ్యానికీ, పద్దెనిమిదవ శతాబ్ది మధ్యానికీ నడుమ జనం అన్నీ చేతులతోనే తయారుచేసుకోలేదు. వారికి పరికరాలు, అందులోనూ మగ్గాలు, ఓడలు, లివర్లు వంటి చాలా సంక్లిష్టమైన పరికరాలున్నాయి.

ఈ విధంగా యంత్రాల ఉత్పాదనం మొత్తంగా శ్రమ విభజన ఫలితమని చెప్పడంకన్న అధికతర అసంగత విషయం మరొకటుండదు.

ఇక్కడ సందర్భవశాత్తూ, నేను యింకోమాట కూడా చెప్తాను. అదేమిటంటే, ప్రూడన్‌గారు యంత్రాల చారిత్రక మూలాన్ని గురించి గ్రహించినది చాలా తక్కువే కాకుండా, వాటి అభివృద్ధిని గురించి గ్రహించినది అంతకన్న తక్కువ. మొదటి సార్వత్రిక సంక్షోభకాలమైన 1825 దాకా మొత్తంమీద వినిమయ గిరాకీ ఉత్పత్తికన్న వేగంగా పెరిగిందనీ, మార్కెట్ అవసరాల ఆవశ్యక పర్యవసానమే యంత్రాల అభివృద్ధియనీ మనం చెప్పకోవచ్చు. 1825 దరిమిలా, యంత్రాల ఆవిష్కరణా, అన్వయమూ అన్నది కేవలం కార్మికులకూ పారిశ్రామిక యజమానులకూ మధ్య పోరాట ఫలితం మాత్రమే. అయితే ఇది ఇంగ్లండు విషయంలో మాత్రమే నిజం. యూరపియన్ దేశాలకు సంబంధించినంత వరకు, యిటు తమ దేశీయ మార్కెట్‌లోనూ, అటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఇంగ్లండు పోటీమూలంగానే యంత్రాలను ఉపయోగించక తప్పలేదు. చిట్టచివర, ఉత్తర అమెరికాలో యంత్రాలను ప్రవేశపెట్టడానికి అటు యితర దేశాలతో పోటీ, యిటు పనివాళ్ల కొరతా, అంటే, ఉత్తర అమెరికా జనాభాకీ, దాని పారిశ్రామికావసరాలకీ మధ్య పొందిక లేకపోవడమే కారణం. ఈ వాస్తవాలనుండి పోటీభూతాన్ని మూడవ పరిణామంగా, యంత్రాలకు ప్రతికూలమైనదిగా ఆవాహనచేసినప్పుడు ప్రూడన్‌గారు ఎంతటి బుద్ధి చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నాడో మీరు గమనించగలరు.

కడపటిగానూ, మొత్తంమీదా శ్రమ విభజన, పోటీ, రుణం వగైరాలతోబాటు యంత్రాలను ఒక ఆర్థిక భావాభివర్గాన్ని చెయ్యడం పూర్తిగా అసంగతం.

నాగలిని లాగే ఎద్దు ఆర్థిక భావాభివర్గం ఎలా కాదో యంత్రం కూడా అలాగే ఆర్థిక భావాభివర్గం కాదు. ఈనాడు యంత్రాల ప్రయోగం మన ప్రస్తుత ఆర్థిక వ్యవస్థయొక్క సంబంధాల్లో ఒకటి, కాని యంత్రాల వినియోగింపబడిన తీరు — యంత్రాలుగా యంత్రాలకి పూర్తిగా భిన్నమైనది. గన్‌పౌడరు, అది ఒక మనిషిని గాయపరచడానికి వినియోగింపబడినా, లేక అతని గాయాలను నయంచేసుకునేందుకు వినియోగపడినా అది పౌడరే.

పోటీ, గుత్తాధిపత్యం, పన్నులు లేక పోలీసులు, వ్యాపార సంతులనం, రుణం, ఆస్తి అన్నవాటిని, వాటిని నేను పేర్కొన్నక్రమంలో తన బుర్రలో అభివృద్ధిచెందనివ్వడం ద్వారా ప్రూడన్‌గారు తనను తానే మించిపోతున్నాడు. 18వ శతాబ్దారంభం నాటికే, యంత్రాలు యింకా కనుగొనబడకముందే ఇంగ్లండులో దాదాపుగా రుణసంస్థలన్నీ అభివృద్ధిచెయ్యబడ్డాయి. ప్రభుత్వ రుణమన్నది పన్నులను పెంచేందుకూ, బూర్జువావర్గం గద్దెను అధిరోహించడం ద్వారా కల్పించబడిన కొత్త డిమాండ్లను తృప్తిపరచుకొనేందుకూ ఒక కొత్త పద్ధతి మాత్రమే.

చిట్టచివరి సంగతి, ప్రూడన్‌గారి ఆలోచనా విధానంలో ఆస్తి చిట్టచివరి భావాభివర్గం. అందుకు భిన్నంగా వాస్తవ ప్రపంచంలో శ్రమ విభజనా, ప్రూడన్‌గారి యితర భావాభివర్గాలన్నీ సామాజిక సంబంధాలు, మొత్తంగా అవన్నీ కలిసి యీనాడు ఆస్తి అన బడేదానిగా రూపొందాయి. ఈ సంబంధాల వెలుపల బూర్జువా ఆస్తి అధిభౌతికమైన లేక న్యాయశాస్త్ర సంబంధమైన భ్రమ తప్ప మరేమీకాదు. మరో యుగానికి చెందిన ఆస్తి, ఫ్యూడల్ ఆస్తి, పూర్తిగా భిన్నమైన సామాజిక సంబంధాల పరంపరలో అభివృద్ధిచెందు తుంది. ప్రూడన్‌గారు, ఆస్తిని ఒక స్వతంత్రమైన సంబంధంగా రూఢిపరచడం ద్వారా, పద్ధతిలో అనేక తప్పులు చేస్తున్నారు: బూర్జువా ఉత్పత్తి రూపాలన్నింటినీ కలిపివుంచే బంధమేమిటో తను అవగతం చేసుకోలేదన్న సంగతినీ, ఒకానొక ప్రత్యేక యుగంలో ఉత్పత్తి రూపాలయొక్క చారిత్రక, తాత్కాలిక స్వభావాన్ని తను అర్థంచేసుకోలేదన్న సంగతినీ ఆయన స్పష్టంగా నిరూపించుకున్నాడు. మన సామాజిక వ్యవస్థలను చారిత్రక ఉత్పా దితాలుగా పరిగణించని, వాటి మూలాన్నిగాని, అభివృద్ధినిగాని అర్థంచేసుకోజాలని ప్రూడన్ గారు వాటిని గురించి పిడివాద విమర్శన మాత్రమే చేయగలడు.

అందుకని ప్రూడన్‌గారు, అభివృద్ధిని వివరించేందుకుగాను కల్పనపై ఆధారపడక తప్పని స్థితిలో పడ్డాడు. శ్రమ విభజన, రుణం, యంత్రాలు మొదలైనవన్నీ కూడా తన సుస్థిరభావాన్ని, సమత్వ భావాన్ని బలపరచడానికి మాత్రమే కనిపెట్టబడ్డాయని ఆయన ఊహించుకుంటాడు. ఆయన వివరణ శుద్ధ అమాయకంగానే వుంది. ఈ విషయాలు సమానత్వ ప్రయోజనార్థమే కల్పింపబడ్డాయిగాని, దురదృష్టవశాత్తూ అవి సమానత్వానికి వ్యతిరేకమయాయి. వెరశి ఆయన వాదపు సారాంశమంతా యిదే. వేరే మాటల్లో చెప్పా లంటే, ఆయన ధారాళంగా ఒక ఊహను కల్పించుకుంటాడు, తర్వాత ఎప్పుడైతే వాస్తవ పరిణామం ఆయన కల్పనను అడుగడుగునా ఖండిస్తుందో, అప్పుడాయన వైరుధ్యమేదో ఉందనే నిర్ధారణకు వస్తాడు. ఆ వైరుధ్యం కేవలం తన స్థిరాభిప్రాయాలకూ, వాస్తవ గతికీ మధ్య వుందన్న యధార్థాన్ని ఆయన మీనుండి మరుగుపరుస్తాడు.

ఈ విధంగా, ప్రూడన్‌గారు, ప్రధానంగా తనకు చారిత్రక జ్ఞానం కొరవడినందున, మానవులు తమ ఉత్పాదక సామర్థ్యాలను అభివృద్ధిచేసుకున్నకొద్దీ, అంటే, తమ జీవిత క్రమంలో పరస్పరం కొన్ని సంబంధాలను నెలకొల్పుకుంటున్నారన్న సంగతినీ, ఉత్పాదక సామ ర్థ్యాల మార్పుతోనూ, పెరుగుదలతోనూ, యీ సంబంధాల స్వభావం మారితీరవలసివుంటుం దన్న సంగతినీ గ్రహించలేదు. ఆర్థిక భావాభివర్గాలన్నవి ఈ యథార్థ సంబంధాలయొక్క సాధారణీకరణలు మాత్రమే అన్న సంగతినీ, యీ సంబంధాలు అస్తిత్వంలో వున్నంతకాలమే అవి వర్తిస్తాయన్న సంగతినీ ఆయన గ్రహించలేదు. అందుకనే ఆయన బూర్జువా అర్థ శాస్త్రవేత్తలు చేసే పొరపాటునే చేశాడు — వాళ్లు యీ అర్థిక భావాభివర్గాలను చారిత్రక

నియమాలుగానూ, ఒకానొక ప్రత్యేక చారిత్రకాభివృద్ధి దశకూ ఉత్పత్తి శక్తులయొక్క ఒకానొక నిర్దిష్ట అభివృద్ధి దశకూ చెందినవిగానూకాక శాశ్వత నియమాలుగా పరిగణిస్తారు. అందుచేత, రాజకీయ-ఆర్థిక భావాభివర్గాలను వాస్తవిక, తాత్కాలిక, చారిత్రక సామాజిక సంబంధాల సాధారణీకృత వ్యక్తీకరణలుగా పరిగణించేందుకు బదులు, ప్రూడన్‌గారు, నిగూఢమైన అంతర్‌దృష్టి మూలంగా వాస్తవిక సంబంధాలలో యీ సాధారణీకృత భావరూపాలను దర్శిస్తున్నాడు. ఈ సాధారణీకృత భావాలే సృష్ట్యాదినుండీ భగవత్పిత హృదయంలో సుషుప్త్యావస్థలో వున్న సూత్రమట.

కాని యీ ఘట్టంలో మన ప్రూడన్ మహాశయుడు తీవ్రమైన మేధోపరమైన సుడిగుండంలో చిక్కుకుంటున్నాడు. ఆర్థిక భావాభివర్గాలన్నీ భగవంతుని హృదయంనుండి ఉద్గమనాలూ, మనిషియొక్క గర్భితమైన, శాశ్వత జీవితమూ అయినట్లయితే, మరి మొదటి సంగతి, అభివృద్ధివంటిది ఎందుకుంది? రెండవ సంగతి, ప్రూడన్‌గారు పూర్వాచారపరాయణుడు కాకపోవడం ఎలా తటస్థపడింది? స్పష్టంగా కనిపించే యీ వైరుధ్యాలను ఒక శత్రు వైరుధ్యాల పుట్టతో ఆయన వివరించపూనుకుంటాడు.

ఈ శత్రు వైరుధ్యాల వ్యవస్థపైన కాంతిని ప్రసరించేందుకుగాను ఒక ఉదాహరణను తీసుకుందాం.

<u>గుత్తాధిపత్యం</u>, అది ఆర్థిక భావాభివర్గమూ, తత్కారణంగా భగవంతుని హృదయంనుండి వెలువడినదీ గనుక, మంచి విషయం. పోటీ — అదికూడా ఒక ఆర్థిక భావాభివర్గమే గనుక — మంచి విషయం. కాని మంచిది కానిదేమిటయ్యా అంటే, గుత్తాధిపత్యంయొక్క వాస్తవికతా, పోటీయొక్క వాస్తవికతాను. పోటీ, గుత్తాధిపత్యం ఒకదాన్ని మరొకటి మింగివేస్తాయి — ఇది మరింత అధ్వాన్నం. అయితే మరి, ఏం చెయ్యాలి? భగవంతునియొక్క యీ శాశ్వతభావాలు ఒకదాన్ని మరొకటి ఖండించుకొంటాయి కాబట్టి, భగవంతుని హృదయంలో యీ రెండింటి సంశ్లేషణం — ఉందని ఆయన స్పష్టంగా నమ్ముతాడు. దీనిలో గుత్తాధిపత్యంయొక్క చెడుగులు పోటీచేతా, పోటీలోని చెడుగులు గుత్తాధిపత్యంచేతా పరిహరింపబడతాయి. అలాగే అందుకు ఉల్టాగానూ జరుగుతుంది. ఆ రెండు భావాలమధ్యా ఘర్షణ ఫలితంగా మాత్రమే వాటి మంచి పక్షం దృష్టిపథంలోకి వస్తుంది. భగవంతుని దగ్గర్నుంచి మనమీ రహస్య భావాన్ని లాక్కుని, తర్వాత దాన్ని అన్వయించాలి, అప్పుడిక అన్నీ అద్భుతంగా వుంటాయి. మనిషియొక్క వ్యక్తిప్రమేయంలేని హేతుజ్ఞానమనే అంధకారంలో గర్భితంగా అణిగివుండే సంశ్లేషణ సూత్రం ఆవిష్కృతం చెయ్యబడాలి. ఈ సూత్రావిష్కర్తగా ముందుకొచ్చేందుకు ప్రూడన్‌గారు ఒక క్షణం కూడా సంకోచించడు.

కాని ఒక్క క్షణకాలం వాస్తవిక జీవితం వంక చూడండి. ప్రస్తుత కాలపు ఆర్థిక జీవితంలో పోటీనీ, గుత్తాధిపత్యాన్నే కాకుండా వాటి సంశ్లేషణను కూడా మీరు చూస్తారు.

ఈ సంశ్లేషణ ఒక సూత్రం కాక గతి. గుత్తాధిపత్యం పోటీని సృష్టిస్తుంది, పోటీ గుత్తాధిపత్యాన్ని సృష్టిస్తుంది. కాని యీ సమీకరణం ప్రస్తుత పరిస్థితియొక్క కష్టాలను తొలగించడం మాట అటుంచి – బూర్జువా అర్థశాస్త్రవేత్తలు అది వాటిని తొలగిస్తుందని భావిస్తారు – యింతకంటె కష్టతరమూ, మరింత ఆయోమయమైన పరిస్థితికి దారి తీస్తుంది. అందుచేత ఏ పునాదిమీదనైతే యీనాటి ఆర్థిక సంబంధాలు ఆధారపడివున్నాయో ఆ పునాదిని మీరు మార్చినట్లయితే, ప్రస్తుత ఉత్పత్తి విధానాన్ని మీరు నాశనంచేస్తే, అప్పుడు మీరు పోటీనీ, గుత్తాధిపత్యాన్నీ, వాటి శత్రువైరుధ్యాన్నే కాకుండా, వాటి ఐక్యతనూ, వాటి సంశ్లేషణనూ, పోటీయొక్క, గుత్తాధిపత్యంయొక్క వాస్తవిక సరితూకమైన చలనాన్ని కూడా మీరు రూపుమాపుతారు.

ప్రూడన్‌గారి గతితర్కానికి నేను మీకిప్పుడొక ఉదాహరణనిస్తాను.

స్వేచ్ఛకూ, బానిసత్వానికీ శత్రువైరుధ్యముంది. స్వేచ్ఛయొక్క మంచి చెడులను గురించి నేను చెప్పనక్కర్లేదు, బానిసత్వం అన్నప్పుడు, దాని చెడును గురించి నేను వివరించనక్కర్లేదు. వివరింపబడవలసినదల్లా దాని మంచిని గురించే. పరోక్ష బానిసత్వాన్ని గురించీ, శ్రామికవర్గపు బానిసత్వాన్ని గురించీ కాక ప్రత్యక్ష బానిసత్వాన్ని గురించి, సురినామ్, బ్రెజీల్, ఉత్తర అమెరికాలోని దక్షిణ రాష్ట్రాల్లోని ప్రత్యక్ష బానిసత్వాన్ని గురించి మనం వ్యవహరిస్తున్నాం.

ఈనాడు మన పారిశ్రామిక తత్వానికి యంత్రాలూ, రుణాలూ మొదలైనవి ఎంతటి కీలకాంశాలో ప్రత్యక్ష బానిసత్వం కూడా అంతే కీలకాంశం. బానిసత్వం లేనిదే పత్తి వుండదు, పత్తి లేనిదే ఆధునిక పరిశ్రమ వుండదు. బానిసత్వం వలసదేశాలకు విలువను కల్పించింది; వలసదేశాలు అంతర్జాతీయ వ్యాపారాన్ని సృష్టించాయి; అంతర్జాతీయ వ్యాపారం భారీస్థాయి యాంత్రిక పరిశ్రమకు ఆవశ్యకమైన షరతు. ఈవిధంగా నీగ్రోల క్రయవిక్రయాలు మొదలయ్యేందుకు ముందు వలసదేశాలు పాత ప్రపంచానికి (ఇంగ్లండుకు) అతి కొద్ది వస్తువులను మాత్రమే సరఫరాచేసేవి, ప్రపంచ భూతలంపైన గమనీయమైన మార్పుల నేమీ చెయ్యలేదు. అందుకని బానిసత్వం అన్నది అత్యధిక ప్రాముఖ్యం కలిగిన ఒక ఆర్థిక భావాభివర్గం. బానిసత్వం లేనినాడు అత్యధికంగా పురోగమించిన ఉత్తర అమెరికా పితృస్వామిక దేశంగా మారిపోతుంది. ప్రపంచ దేశాల పటంనుంచి ఉత్తర అమెరికాను తుడిచిపెట్టేసి ఏమవుతుందో చూడండి, మీకు అరాజకత్వం దాపురిస్తుంది, వ్యాపారమూ, ఆధునిక నాగరికతా పూర్తిగా శిథిలమైపోతాయి. కాని బానిసత్వాన్ని అంతరించిపోనివ్వడమంటే అర్థం ఉత్తర అమెరికాను ప్రపంచ దేశాల పటంనుంచి తుడిచివెయ్యడమే అవుతుంది. మరి అందుకని, బానిసత్వం ఒక ఆర్థిక భావాభివర్గం గనుక, ప్రపంచారంభంనుంచీ, ప్రతి ఒక దేశంలోనూ మనం బానిసత్వాన్ని చూస్తాం. ఆధునిక జాతులు బానిసత్వాన్ని ఒక వంక

కొత్త ప్రపంచం (అమెరికా ఖండం)లోకి బాహాటంగా దిగుమతిచేస్తూ, మరోవంక స్వదేశాల బానిసత్వాన్ని మరుగుపరచడమెలాగో మాత్రమే తెలుసుకున్నారు. బానిసత్వాన్ని గురించి యీ వ్యాఖ్యలు చేసిన తర్వాత మన ప్రూడన్ మహాశయుడు యింకేమి చెప్తున్నాడు? స్వేచ్ఛకూ, బానిసత్వానికీ మధ్య సంశ్లేషణకోసం, బానిసత్వానికీ, స్వేచ్ఛకూ మధ్య ఒక మధ్యేమార్గం కోసం, ఒక సరితూకం కోసమూ ఆయన వెతికాడు.

ప్రూడన్‌గారు, మనుషులు నూలు, ఉన్ని, సిల్కు వస్త్రాలను ఉత్పత్తి చేస్తారన్న వాస్తవాన్ని చాలా బాగా గుర్తించారు. మరి యీ చిన్న అంశాన్ని గ్రహించడం ఆయన విషయంలో ఘనమైన నైపుణ్యమనే చెప్పాలి! ఇదే మనుషులు, తమ ఉత్పాదక శక్తుల మేరకు, ఏ సామాజిక సంబంధాల మధ్యనైతే తాము ఆ నూలు, ఉన్ని వస్త్రాలను ఉత్పత్తిచేస్తారో ఆ సామాజిక సంబంధాలను కూడా సృష్టిస్తారన్నదే ఆయన గ్రహించని సంగతి. ఏ మనుషులైతే తమ పాదార్థిక ఉత్పాదకతకు అనుగుణంగా తమ సామాజిక సంబంధాలను సృష్టిస్తారో, ఆ మనుషులే భావాలనూ, భావాభివర్గాలనూ, అంటే, యివే సామాజిక సంబంధాలయొక్క అనిర్దిష్ట, భావపర వ్యక్తీకరణలను కూడ సృష్టిస్తారన్న సంగతిని ఆయన అసలే గ్రహించలేదు. ఈవిధంగా భావాభివర్గాలు ఏ సంబంధాలను వ్యక్తంచేస్తాయో ఆ సంబంధాలెలా శాశ్వతంకావో అలాగే ఆ భావాభివర్గాలు కూడా శాశ్వతంకావు. అవి చారిత్రకమైన, తాత్కాలికమైన ఫలితాలు. ఇందుకు భిన్నంగా, ప్రూడన్‌గారికి సంబంధించినంతవరకు సాధారణీకృత భావరూపాలూ, భావాభివర్గాలే అది కారణం. ఆయన చెప్పేదాన్నిబట్టి మనుషులు కాక భావాభివర్గాలే చరిత్రను రూపొందిస్తాయి. భావాల సాధారణీకరణా, దానికదిగా అంటే, మనుషులనుండీ, వారి పాదార్థిక కార్యకలాపాలనుండీ వేరుగా తీసుకున్నప్పుడు భావాభివర్గమూ అవినాశమైనదీ, మార్పుచెందనిదీ, చలనంలేనిదీనీ; అది శుద్ధ హేతువుయొక్క అస్తిత్వపు ఏకైక రూపం; మరోలా చెప్పాలంటే భావాల సాధారణీకరణగా అది అనిర్దిష్టమైనది. అద్భుతమైన పునరుక్తి!

ఈవిధంగా, భావాభివర్గాలుగా పరిగణింపబడే ఆర్థిక సంబంధాలు, ప్రూడన్‌గారికి సంబంధించినంతవరకు ఆదిగాని, అభివృద్ధిగాని లేని శాశ్వత సూత్రాలు.

దీన్నే మరోవిధంగా చెప్పుకుందాం: బూర్జువా జీవితం శాశ్వత సత్యమని ప్రూడన్‌గారు ప్రత్యక్షంగా చెప్పడు; భావరూపంలో బూర్జువా సంబంధాలను వ్యక్తంచేసే భావాభివర్గాలను ఆరాధ్యంచేసి యీ విషయాన్ని పరోక్షంగా చెప్తాడు. బూర్జువా సమాజపు ఉత్పాదితాలను భావరూపంలో, భావాభివర్గాల రూపంలో తన మనస్సుకు తట్టగానే, ఆయన సద్యోజనితంగా ఉత్పన్నమైన సొంత జీవితాలు కలిగిన శాశ్వత ప్రాణులుగా స్వీకరిస్తాడు. అందుకనే బూర్జువా దిఙ్మండలాన్ని ఆయన అధిగమించి పైకి వెళ్లడు. బూర్జువా భావాలతో తను వ్యవహరించేటప్పుడు — వీటి శాశ్వత సత్యాన్ని ఆయన ముందే స్వీకరిస్తాడు — ఆయన ఒక

సంశ్లేషణకోసం, యీ భావాలకు సంబంధించిన ఒక సమతూకంకోసం వెదుకులాడుతాడే గాని, ఏ ప్రస్తుత పద్ధతిలోనైతే అవి సమతూకాన్ని చేరుకుంటాయో అదొక్కటే సాధ్య మైన పద్ధతి అని గమనించడు.

నిజానికి ఆయన, అందరు మంచి బూర్జువాలూ చేసే పనినే చేస్తాడు. సూత్రరీత్యా, అంటే, సాధారణీకృత భావాలుగా పరిగణనలోకి తీసుకున్నప్పుడు, పోటీ, గుత్తాధిపత్యం మొదలైనవి జీవితానికి ఏకైక ప్రాతిపదిక అనీ, కాని ఆచరణలో యింకెంతో జరగవలసి వుందనీ వాళ్ళందరూ మీకు చెప్తారు. పోటీయొక్క వినాశకర ఫలితాలు లేకుండా పోటీ వుండాలని వాళ్ళంతా కోరుతారు. వాళ్ళందరూ అసాధ్యమైనదాన్ని, అనగా, బూర్జువా పరి స్థితులయొక్క తప్పనిసరి పర్యవసానాలు లేకుండా ఆ పరిస్థితులు వుండాలని కోరుతారు. ఫ్యూడల్ ఉత్పత్తి రూపం మాదిరిగానే బూర్జువా ఉత్పత్తి రూపంకూడ చరిత్రక్రమంలో వచ్చినదనీ, తాత్కాలికమైనదనీ వారిలో ఏ ఒక్కడూ అర్థంచేసుకోడు. వాళ్ళ దృష్టిలో బూర్జువా మానవుడు మాత్రమే ప్రతి సమాజానికీ సాధ్యమైన ఏకైక ప్రాతిపదిక, మాన వులు బూర్జువాలుగా వుండని సమాజాన్ని వాళ్ళు ఊహించుకోలేరు — సరిగా యీ వాస్తవం నుంచే వాళ్ళ పొరపాటు ఉత్పన్నమవుతోంది.

ప్రూడన్‌గారు సరిగా అందుకనే తప్పనిసరిగా పిడివాది. ఆయనకు సంబంధించినంత వరకు యీనాటి ప్రపంచాన్ని తలకిందులు చేస్తున్న చారిత్రకగతి, రెండు బూర్జువా భావాల యొక్క సరైన సమతూకాన్ని, సంశ్లేషణను, కనుగొనడమే అసలు సమస్య అన్న స్థాయికి దిగజారింది. అందుకని యీ తెలివిపరుడు తన బుద్ధిచాతుర్యం సాయంతో గర్భితమైన భగవత్సంకల్పాన్ని, అన్నిటినుండీ విడదీయబడిన రెండు భావాల జోడింపును — కనుగొన్నాడు. ప్రూడన్‌గారు వీటిని ప్రత్యక్ష జీవితంనుండీ, యీనాటి ఉత్పత్తినుండీ వేరుచేసిన కారణం గానే అవి వేరయ్యాయి, అవి వేటినైతే వ్యక్తంచేస్తాయో ఆ వాస్తవాల జోడింపే యిది. మానవులు అంతకుముందే సంతరించుకున్న ఉత్పత్తి శక్తులకూ, యీ ఉత్పత్తి శక్తులకు యికనెంతమాత్రమూ అనురూపంకాని వాటి సామాజిక సంబంధాలకూ మధ్య వైరుధ్యం ఫలితంగా ఉత్పన్నమైన మహత్తర చారిత్రక ఉద్యమం స్థానంలో; ప్రతి ఒక దేశంలోనూ, భిన్న దేశాలకు నడుమా విభిన్న వర్గాలమధ్య ఏ భయంకరమైన పోరాటాలకైతే సన్నాహాలు జరుగుతున్నాయో ఆ పోరాటాల స్థానంలో; జనబాహుళ్యపు ప్రత్యక్ష, హింసాత్మక కార్యా చరణ ద్వారా మాత్రమే యీ వైరుధ్యాలు పరిష్కరింపబడగలవో వాటి స్థానంలో — విస్తృత మైన, సుదీర్ఘమైన, సంక్లిష్టమైన యీ ఉద్యమం స్థానంలో ప్రూడన్‌గారు తన పుర్రెలో పుట్టిన చపలమైన గతిని పెడుతున్నాడు. అంటే, పండితులే, అంటే భగవంతుని రహస్య భావాలను కాజెయ్యడమెలాగో తెలిసినవాళ్లే చరిత్ర నిర్మాతలన్నమాట. సామాన్య జనం చెయ్యవలసినదల్లా వారి దివ్య భావసాక్షాత్కారాలను వటివే అమలుజరపడం మాత్రమే.

ప్రూడన్‌గారు ప్రతి రాజకీయ ఉద్యమానికీ ఎందుకుగాను బద్ధ శత్రువో మీకిప్పుడు బోధపడుతుంది. ఆయన దృష్టిలో ప్రస్తుత సమస్యల పరిష్కారం ప్రజల కార్యాచరణలో గాక ఆయనగారి సొంత బుర్రయొక్క గతితార్కిక వర్తుల గతులలో వుంది. ఆయన దృష్టిలో భావాభివర్గాలే చోదక శక్తులు గనుక, ఆ భావాభివర్గాలను మార్చేందుకుగాను ప్రత్యక్ష జీవితాన్ని మార్చవలసిన అవసరంలేదు. పైగా అందుకు పూర్తిగా భిన్నం. మీరు భావాభివర్గాలను మారుస్తే చాలు, తత్పర్యవసానంగా ప్రస్తుత సమాజంలో మార్పు వచ్చేస్తుంది.

ప్రూడన్‌గారు వైరుధ్యాలను సమాధానపరచాలన్న తన కోరిక ప్రాబల్యంలో, ఆ వైరుధ్యాల ప్రాతిపదికనే కూల్చివేసితీరాలన్న సమస్యను దాటవేస్తాడు. సామాజిక జీవితంలో రాజునూ, ప్రతినిధుల సభనూ, ప్రభువుల సభనూ సమగ్ర అంతర్భాగాలుగా, శాశ్వత భావాభివర్గాలుగా ఉంచాలని కోరుకునే రాజకీయ పిడివాది మాదిరిగా వున్నాడాయన. ఆయన వెతుకుతున్నదల్లా ఒక కొత్త సూత్రంకోసం, తద్వారా యీ శక్తులమధ్య సమతూకాన్ని సాధించడంకోసం. సరిగా వీటి సమతూకం ఏ ప్రత్యక్ష గతిలోనైతే ఒక శక్తి ఒకనాడు విజేతా, ఒకనాడు మరో శక్తియొక్క బానిసా అవుతుందో, ఆ ప్రత్యక్ష గతిలో ఉంటుంది. ఈవిధంగా పద్దెనిమిదవ శతాబ్దంలో పలువురు అపరిణత మనస్కులు సామాజిక అంతస్తులను, ప్రభువర్గం, రాజు, పార్లమెంటు మొదలైనవాటిని సమతూకంలోకి తెచ్చే అసలైన సూత్రాన్ని కనుగొనేందుకోసం హడావిడిగా తంటాలుపడ్డారు. కాని ఒకానొక శుభోదయాన వారు లేచినప్పటికి వాస్తవంగానే రాజుగాని, పార్లమెంటుగాని, ప్రభువర్గంగాని లేకపోవడాన్ని వాళ్లు చూశారు. ఈ శత్రు వైరుధ్యంలో వాస్తవమైన సమతూకం ఏమిటంటే, ఈ ఫ్యూడల్ అస్తిత్వాలకూ, ఈ ఫ్యూడల్ అస్తిత్వాల శత్రువైరుధ్యాలకూ పునాదిగా పనిచేసిన సమస్త సామాజిక సంబంధాల కూల్చివేతయే.

ప్రూడన్‌గారు శాశ్వత భావాలనూ, శుద్ధ హేతువుయొక్క భావాభివర్గాలనూ ఒక వంకా, మానవులనూ, వారి ప్రత్యక్ష జీవితాన్నీ – ఆయన ప్రకారం యిది యీ భావాభివర్గాల అన్వయం మాత్రమే – మరోవంకా నిలుపుతున్న కారణంగా, ఆయనకు సంబంధించి మొదటినుండీ కూడా జీవితానికీ భావాలకూ మధ్యా, ఆత్మకీ శరీరానికీ మధ్యా పలు రూపాల్లో వ్యక్తమయ్యే ద్వైతతత్వం మనకి కనిపిస్తుంది. ఏ భావాభివర్గాలనైతే ప్రూడన్‌గారు ఆరాధ్యంచేస్తున్నారో వాటి లౌకిక మూలాన్నీ, లౌకిక చరిత్రనూ అవగతం చేసుకోవడంలో ఆయన అసమర్థతయే తప్ప యీ వైరుధ్యం మరేమీ కాదన్న సంగతిని మీరిప్పుడు చూడగలరు.

నా లేఖ యిప్పటికే చాలా దీర్ఘమైనందున కమ్యూనిజానికి వ్యతిరేకంగా ప్రూడన్‌గారు చేసిన అసంగతమైన ఆరోపణలను గురించి యిక్కడ చర్చించలేకపోతున్నాను. సమాజపు

ప్రస్తుత దశనే అర్థంచేసుకోని వ్యక్తి, దాన్ని కూలదొయ్యడానికి సాగుతున్న ఉద్యమాన్నీ, యీ విప్లవోద్యమపు సాహితీపరమైన వ్యక్తీకరణనూ అర్థంచేసుకోగలగడం బొత్తిగా సాధ్యం కాదన్న విషయంలో ప్రస్తుతానికి మీరు నాతో ఏకీభవిస్తారని నేను ఆశిస్తున్నాను.

ప్రూడన్‌గారితో నేను పూర్తిగా ఏకీభవించే ఏకైక అంశం ఏమిటంటే, భావావేగ ప్రేరితమైన సోషలిస్టు పగటికలల పట్ల ఆయన అయిష్టత. నేనెప్పుడో ఆయనకంటె ముందే, యీ రకమైన భావావేగ ప్రేరితమైన, ఊహాజనితమైన, బుద్ధిహీనమైన సోషలిజాన్ని హేళనచెయ్యడం ద్వారా ఎంతో శత్రుత్వాన్ని కొనితెచ్చుకున్నాను. తన పెటీబూర్జువా భావావేగాన్ని (స్వగృహం, దాంపత్య ప్రేమలను గురించీ, అటువంటివే అన్ని సర్వసామాన్య విషయాలను గురించీ, ఆయన చతుర భాషణలను నేనిక్కడ ఉద్దేశిస్తున్నాను) సోషలిస్టు భావావేగానికి — ఉదాహరణకు, ఫోరియర్ విషయంలో యీ భావావేగం మహాశయుడైన మన ప్రూడన్‌గారి గంభీర ప్రవచనాలలోకన్న ఎంతో ప్రగాఢంగా వుంది — పోటీపెట్టడం ద్వారా ప్రూడన్‌గారు ఆత్మవంచన చేసుకోడంలేదా? తన వాదనల్లోని నిస్సారతను గురించీ, యీ విషయాలను గురించి మాట్లాడటంలో తన పూర్తి చేతకానితనం గురించీ ఆయనకు పూర్తిగా తెలుసు, అందుకనే ఆయన కోపంతో భగ్గున మండిపడుతున్నాడు, గావుకేకలు పెడుతున్నాడు, తనదే న్యాయమన్నట్లు క్రోధం ప్రదర్శిస్తున్నాడు, నురగలు కక్కుతున్నాడు, శాపనార్థాలు పెడుతున్నాడు, తిట్టిపోస్తున్నాడు, సిగ్గు, సిగ్గు, హత్య, హత్య అంటూ అరుస్తున్నాడు, రొమ్ము బాదుకుంటున్నాడు, భగవంతుని ముందూ, మానవుని ముందూ తను సోషలిస్టు నైచ్యాలతో పంకిలం కాలేదని గప్పాలు కొట్టుకున్నాడు! సోషలిస్టు భావావేగాలనుగాని, అటువంటివాటిగా ఆయన పరిగణించేవాటినిగాని ఆయన గట్టిగా విమర్శించడు. పవిత్రుని మాదిరిగా, ఒక పీఠాధిపతి మాదిరిగా, పేదలైన పాపులను ఆయన వెలివేస్తాడు, పెటీబూర్జువావర్గంయొక్క, కుటుంబాన్ని గూర్చిన హేయమైన పితృస్వామిక ప్రేమ భ్రమల యొక్క గుణగానం చేస్తాడు. ఇది యాదృచ్ఛిక విషయమేమీ కాదు. ఆపాదమస్తకమూ ప్రూడన్‌గారు పెటీబూర్జువావర్గపు తత్వవేత్తా, అర్థశాస్త్రవేత్తాను. పురోగమించిన సమాజంలో పెటీబూర్జువా తన స్థానాన్నిబట్టి విధిగా ఒకవంక సోషలిస్టూ, మరోవంక అర్థశాస్త్రవేత్తా అవుతాడు. దీని అర్థమేమిటంటే, ఒకవంక బడా బూర్జువావర్గంయొక్క వైభవ ప్రదర్శనంచేత అతను విభ్రాంతుడవుతాడు, మరోవంక ప్రజల బాధలపట్ల సానుభూతి కలిగివుంటాడు. ఏకకాలంలో అతను బూర్జువా, ప్రజల మనిషీ కూడా. అంతరాంతరాల్లో తను నిష్పక్షపాతిననీ, మధ్యేమార్గంకన్న భిన్నమైనదిగా చెప్పుకొనే సరితూకాన్ని తను కనుగొన్నాననీ తనను తనే అతను అభినందించుకుంటాడు. ఈ బాపతు పెటీబూర్జువా — వైరుధ్యమన్నది తన అస్తిత్వానికే పునాదిగనుక — వైరుధ్యాన్ని స్తుతిస్తాడు. అతని మటుకు అతనే ఆచరణలోవున్న సామాజిక వైరుధ్యంతప్ప మరేమీ కాదు. ఆచరణలో తనే

మిటో సైద్ధాంతికంగా అతను నిరూపించితీరాలి. మరి, ఫ్రెంచి పెటీబూర్జ్వావర్గపు శాస్త్రీయ భాష్యకారుడయ్యే యోగ్యత — నికరమైన యోగ్యతే — ప్రూడన్‌గారికి వుంది. రాబోయే సామాజిక విప్లవాలన్నింటిలోనూ పెటీబూర్జ్వావర్గం పూరకభాగం కానుండటమే యిందుకు కారణం.

అర్థశాస్త్రంపై నా పుస్తకాన్ని[59] యీ లేఖతోబాటు మీకు పంపగలిగితే బాగుండునని నేను అనుకుంటున్నాను. కాని నా యీ రచననూ, జర్మన్ తత్వవేత్తలపైనా, సోషలిస్టుల పైనా* నా విమర్శనూ — దీన్ని గురించి బ్రసెల్సులో మీకు చెప్పాను — అచ్చువేయించ డం యింతవరకు సాధ్యంకాలేదు. ఈ రకమైన ప్రచురణకు జర్మనీలో — ఒకవంక పోలీసులనుండీ, మరోవంక నేను ఖండిస్తున్న ధోరణులన్నింటిలోనూ ఆసక్తి కలిగిన ప్రతి నిధులైన గ్రంథవిక్రేతలనుండీ — ఎదురయ్యే యిబ్బందులను మీరెన్నడూ నమ్మరు. పోతే మా పార్టీకి సంబంధించినంతవరకు, అది పేదదవడమే కాకుండా, జర్మన్ కమ్యూనిస్టు పార్టీలోని ఒక పెద్ద విభాగం తమ ఊహాస్వర్గాలనూ, ఆడంబర ప్రసంగాలనూ ఖండిం చినందుకు నాపై కోపంగావున్నారు కూడా....

మొట్టమొదట ఫ్రెంచి భాషలో
"ఎమ్. ఎమ్. స్తస్యులేవిచ్, ఆయన
సమకాలికులు, వాళ్ల ఉత్తరప్రత్యుత్తరాలలో,"
సంపుటం III,
సెంట్ పీటర్స్‌బుర్గ్, 1912
అనే పుస్తకంలో ప్రచురింపబడింది

## న్యూయార్క్‌లోని జె. వేడిమేయర్‌కు మార్క్స్

లండన్, 1852, మార్చి 5

...సరే యిప్పుడిక నాసంగతి, ఆధునిక సమాజంలో వర్గాల అస్తిత్వాన్నీ, లేక వాటి మధ్య పోరాటాన్నీ కనుగొన్నందుకు నాకు ఘనతను ఆపాదించవలసిన పనిలేదు. నాకంటె

* "Die deutsche Ideologie"ని మార్క్స్ ప్రస్తావిస్తున్నాడు (Marx and Engels *The German Ideology*, Moscow, 1964 చూడండి). — సం.

చాలా ముందే బూర్జువా చరిత్రకారులు యీ వర్గపోరాటపు చారిత్రకాభివృద్ధిని గురించీ, బూర్జువా అర్థశాస్త్రవేత్తలు వర్గాలయొక్క ఆర్థిక అంగనిర్మాణాన్ని గురించీ వర్ణించారు. నేను చేసిన కొత్త పనేమిటంటే: 1) వర్గాల అస్తిత్వం ఉత్పత్తి అభివృద్ధిక్రమంలో ప్రత్యేకమైన చారిత్రక దశలతో ముడివడివుందనీ, 2) వర్గపోరాటం తప్పనిసరిగా శ్రామికవర్గ నియంతృత్వానికి దారితీస్తుందనీ, 3) ఈ నియంతృత్వమైనా వర్గాలన్నింటి రద్దుకూ, ఒక వర్గ రహిత సమాజానికీ పరివర్తన దశ మాత్రమేననీ నిరూపించడం మాత్రమే....

"Jungsozialistische Blätter" పత్రికలో
1930లో పూర్తిగా
మొట్టమొదటిసారి ప్రచురింపబడింది

## హన్నోవర్‌లోని ఎల్. కూగెల్‌మన్‌కి మార్క్స్

లండన్, 1871, ఏప్రిల్ 12

...లాఫార్గ్ (లౌరా కాదు) ప్రస్తుతం పారిస్‌లో ఉన్నట్లు ఏ విధంగానూ ఉపశమన కారకం కాని వార్త నిన్ననే మాకు అందింది.

నా "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"* చివరి ప్రకరణాన్ని కనుక నువ్వు చూసినట్లయితే, రాబోయే ఫ్రెంచి విప్లవ ప్రయత్నం పూర్వంమాదిరిగా ఫ్రెంచి బ్యూరాక్రటిక్ సైనిక యంత్రాన్ని ఒక చేతినుండి మరొక చేతికి బదలాయించడానికిగాక, దాన్ని తుత్తునియలు చెయ్యడానికే జరుగుతుందనీ, యూరప్ ఖండంలో జరిగే నిజమైన ప్రతి ప్రజావిప్లవానికీ యిదే పూర్వ షరతనీ నేను బాహాటంగా ప్రకటించిన సంగతి నువ్వు గమనిస్తావు. పారిస్‌లోని మన వీరోచిత కామ్రేడ్లు చేయప్రయత్నిస్తున్నది సరిగా యిదే. ఈ పారిస్ వాసుల్లో ఎంతటి వెసులుబాటుతనం, ఎంతటి చారిత్రక చొరవ, త్యాగాలు చెయ్యగల ఎంతటి సామర్థ్యం! బాహ్య శత్రువు కారణంగా కంటె కూడా ఎక్కువగా ఆంతరిక విద్రోహ కారణంగా ఆరు నెలలపాటు ఆకలినీ, వినాశాన్నీ అనుభవించిన తర్వాత, పారిస్ బయనెట్ల ఛాయలో, ఫ్రాన్సు జర్మనీల మధ్య అసలెన్నడూ యుద్ధమే జరగలేదన్నట్లూ, శత్రువింకా పారిస్ ముఖద్వారాల దగ్గర లేనే లేడన్నట్లూ వాళ్లు తిరగబడుతున్నారు! ఇంతటి గొప్పతనం

* ఈ సంకలనంలో మొదటి భాగం 121–236వ పేజీలు చూడండి. – సం.

చరిత్రలోనే అపూర్వం! వాళ్లు ఓడింపబడ్డారంటే అందుకు వాళ్ల "ఔన్నత్యాన్ని" మాత్రమే నిందించాల్సివుంటుంది. మొదట వినువా, అటు తర్వాత పారిస్ నేషనల్ గార్డులోని అభివృద్ధి నిరోధక విభాగం సైతం తిరోగమించిన తర్వాత వాళ్లు వెంటనే వెర్సేల్స్‌మీద దాడి చేసియుండవలసింది. అంతరాత్మగతమైన నైతిక సంకోచాలతో వాళ్లు తమ అవకాశాన్ని పోగొట్టుకున్నారు. కుటిలుడైన ఆ నెలతక్కువ మరుగుజ్జు త్యేర్, పారిస్‌ను నిరాయుధంచేసే తన ప్రయత్నం ద్వారా, అంతర్యుద్ధాన్ని ఆంతకుముందే ప్రారంభించలేదన్నట్లు వాళ్లు అంతర్యుద్ధాన్ని ప్రారంభించ కోరుకోలేదు! రెండవ పొరపాటేమిటంటే, కమ్యూన్‌కు చోటుచేసేందుకుగాను కేంద్ర కమిటీ[60] చాలా తొందరపడి తన అధికారాన్ని పరిత్యజించింది. ఈసారి కూడా అతి "నిజాయితీతో కూడిన" నైతిక సంకోచాల మూలంగానే! అది ఏమైనప్పటికీ, పారిస్‌లోని ప్రస్తుత తిరుగుబాటు — పాత సమాజానికి చెందిన తోడేళ్లచేత, పందులచేత, దగుల్బాజీ ఊరకుక్కలచేత అది అణచివెయ్యబడినప్పటికీ — పారిస్‌లో జూన్ తిరుగుబాటు దరిమిలా మన పార్టీ సాధించిన అత్యంత మహత్తర కార్యం. ఆకాశాన్ని ముట్టడిస్తున్న యీ పారిస్ వాసులను బారకాసులు, చర్చి, తర్కప్రియులైన జర్మన్ భూస్వామ్యవర్గం, అన్నిటికన్న అధికంగా కూపస్థమండూకాల కంపుగొట్టే కాలం చెల్లిన వేషాల విందులతో కూడిన జర్మన్-ప్రష్యన్ పవిత్ర రోమన్ సామ్రాజ్య బానిసలతో పోల్చి చూడండి.

అన్నట్లు, లూయీ బోనపార్ట్ ఖజానానుండి నేరుగా ధనసహాయం పొందేవారి అధికారిక జాబితాలో, 1859 ఆగస్టులో ఫోగ్ట్‌కు 40,000 ఫ్రాంకులు ముట్టినట్లు ఒక గమనిక వుంది! ఇతోధిక వినియోగంకోసం నేనీ వాస్తవాన్ని లీబ్‌క్నెఖ్ట్‌కు తెలియజేశాను.

ఇటీవల జర్మనీనుంచే కాకుండా, పీటర్స్‌బుర్గ్‌నుంచి సైతం వివిధ పుస్తకాలు మొదలైనవి గల్లంతుకాకుండా నాకు అందుతున్నాయి. అందుకని నువ్వు నాకు హక్స్‌హౌసెన్ పుస్తకం[61] పంపవచ్చు.

నువ్వు పంపిన వివిధ వార్తాపత్రికలకుగాను నీకు నా కృతజ్ఞతలు. (నేను జర్మనీని గురించీ, రైహ్‌స్టాగ్ మొదలైన వాటిని గురించీ ఏదైనా కొంత రాయాలనుకుంటున్నాను, అందుకని దయచేసి మరికొన్నింటిని పంపు.)

మొట్టమొదట సంక్షిప్తరూపంలో
"Die Neue Zeit" పత్రిక,
సంపుటి 1, 23వ సంచిక, ష్టుట్‌గార్ట్,
1901–02లో ప్రచురింపబడింది

# హన్నోవర్‌లోని ఎల్. కూగెల్‌మన్‌కి మార్క్స్

[లండన్], 1871, ఏప్రిల్ 17

నీ లేఖ సక్రమంగా అందింది. సరిగా యిప్పుడు నా చేతినిండా పని వుంది. అందుకని ముక్తసరిగా నాలుగు మాటలు రాస్తాను. 1849 జూన్ 13వ తేదీ బాపతు పెటీ బూర్జువా ప్రదర్శనలు[62] మొదలైన వాటిని పారిస్‌లోని ప్రస్తుత పోరాటంతో నువ్వెలా సరి పోల్చగలవో నాకు పూర్తిగా అగమ్యగోచరంగా వుంది.

గురితప్పని అనుకూలావకాశాల షరతుపైన మాత్రమే పోరాటానికి పూనుకోవలసివస్తే ప్రపంచ చరిత్ర నిర్మాణం చాలా తేలిక అయివుండేది. మరోవంక "యాదృచ్ఛిక ఘటనలకు" పాత్రయే లేకుండాపోతే, అది అత్యంత మార్మిక స్వభావం గలదవుతుంది. ఈ యాదృచ్ఛిక ఘటనలు సహజంగానే సాధారణాభివృద్ధి క్రమంలో ఒక భాగమై, యితర యాదృచ్ఛిక ఘటనలచేత పరిహరింపబడుతాయి. కాని త్వరీకరణమూ, ఆలస్యమూ అన్నవి మాత్రం, ఉద్యమానికి మొదట నాయకత్వం వహించే వారి శీల "యాదృచ్ఛికత"తోబాటు, అటువంటి "యాదృచ్ఛిక ఘటనల"పై విశేషంగా ఆధారపడివుంటాయి.

ఈమారు నిర్ణయాత్మకమైన అనుకూల "యాదృచ్ఛిక ఘటన" కోసం ఫ్రెంచి సమాజపు సాధారణ పరిస్థితిలో కాక, ఫ్రాన్సులో ప్రష్యన్ల ఉనికిలోనూ, నేరుగా పారిస్‌ముందే వారి బైఠాయింపులో వెదకాల్సివుంటుంది. పారిస్ వాసులకు యీ విషయం బాగా తెలుసు. కాని దీన్ని గురించి వెర్సేల్స్‌కి చెందిన బూర్జువా అలగా మూకకి కూడా బాగా తెలుసు. సరిగా ఆ కారణంగానే పారిస్ వాసులముందు వాళ్లు, పోరాటానికి పూనుకోవడమో లేక పోరాటం లేకుండా లొంగిపోవడమో అన్న ప్రత్యామ్నాయాన్ని పెట్టారు. పోరాడకుండా లొంగిపోయే పక్షంలో కార్మికవర్గంలో కలిగే నిస్పృహ పలువురు "నాయకుల" లొంగుబాటు కంటె ఎంతో ఎక్కువ దురదృష్టకర విషయమై వుండేది. పారిస్‌లోని పోరాటం మూలంగా, పెట్టుబడిదారీ వర్గానికీ, దాని రాజ్యానికీ వ్యతిరేకంగా కార్మికవర్గం చేసే పోరాటం ఒక కొత్త దశలో ప్రవేశించింది. తక్షణ పర్యవసానం ఏమైనప్పటికీ, ప్రపంచ పరివ్యాపిత ప్రాముఖ్యం కలిగిన ఒక కొత్త పుంత లభించింది.

మొట్టమొదట సంక్షిప్తరూపంలో
"Die Neue Zeit" పత్రిక,
సంపుటి 1, 23వ సంచిక, స్టుట్‌గార్ట్,
1901–02లో ప్రచురింపబడింది

# న్యూయార్కులోని ఎఫ్. బోల్టెకి మార్క్స్

[లండన్], 1871, నవంబరు 23

...పోరాటం నిమిత్తం, సోషలిస్టు లేక అర్ధ సోషలిస్టు బృందాల స్థానంలో నిజమైన కార్మికవర్గ సంఘ స్థాపనోద్దేశంతో ఇంటర్నేషనల్ స్థాపింపబడింది. ఇంటర్నేషనల్‌యొక్క తొలి నిబంధనావళినీ,* ప్రారంభోత్సవ విజ్ఞప్తినీ** చూడగానే యీ విషయం బోధపడుతుంది. మరోవంక చరిత్రక్రమం అప్పటికే ఒంటెత్తువాదాన్ని భగ్నం చేసియుండకపోయినట్లయితే ఇంటర్నేషనల్ తనను తాను నిలుపుకొనియుండగలిగేది కాదు. సోషలిస్టు ఒంటెత్తువాదపు అభివృద్ధీ, అసలైన కార్మికవర్గోద్యమాభివృద్ధీ పరస్పరం సదా విలోమ నిష్పత్తిలో వుంటాయి. స్వతంత్ర చారిత్రకోద్యమాన్ని నిర్వహించగలిగినంతగా నిజమైన కార్మికవర్గోద్యమం పరిణతి చెందనంతకాలం సోషలిస్టు బృందాల అస్తిత్వం (చారిత్రకంగా) సమంజసమే అవుతుంది. అది యీ పరిణతిని పొందిన వెంటనే యీ సోషలిస్టు బృందాలన్నీ సారభూతంగా అభివృద్ధి నిరోధకం అవుతాయి. అయినప్పటికీ, చరిత్ర ప్రతిచోటా ప్రదర్శించేదే ఇంటర్నేషనల్ చరిత్రలో కూడా పునరావృతమైంది. పాతగిలిపోయినది తనను తాను పునఃస్థాపించుకొనేందుకూ కొత్తగా సంతరించుకోబడిన రూపంలోపల తన స్థానాన్ని కొనసాగించుకునేందుకూ ప్రయత్నిస్తుంది.

ఇంటర్నేషనల్ లోపల నిజమైన కార్మికవర్గోద్యమానికి వ్యతిరేకంగా తమ స్థానాన్ని పదిలపరుచుకోవాలని ప్రయత్నించిన సోషలిస్టు బృందాలకూ, అపరిణత ప్రయోగాలకూ వ్యతిరేకంగా జనరల్ కౌన్సిల్ చేసిన నిరంతరాయమైన పోరాటమే ఇంటర్నేషనల్ చరిత్ర. ఈ పోరాటం మహాసభల్లోనూ, అంతకంటె అధికంగా జనరల్ కౌన్సిలుకూ విడి విభాగాలకూ మధ్య ఆంతరంగిక సంప్రదింపుల్లోనూ సాగింపబడింది.

పారిస్‌లో, ప్రూడనిస్టులు (మ్యూచువలిస్టులు[63]) అసోసియేషన్‌యొక్క సహాయ సంస్థాపకులైన కారణంగా, మొదటి కొద్ది సంవత్సరాలపాటు సహజంగానే వాళ్లక్కడ కళ్లేలను

---

* మార్క్స్‌చేత రూపొందింపబడిన ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ ముసాయిదా నిబంధనావళి. — సం.

** మార్క్స్‌చేత రచింపబడిన ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ ప్రారంభోత్సవ విజ్ఞప్తి. — సం.

చేతుల్లో పట్టుకున్నారు. అయితే తర్వాత అంటూరా, అక్కడ వాళ్లకు వ్యతిరేకంగా సమష్టివాదులు, పాజిటివిస్టువాదులు మొదలైన బృందాలు ఏర్పడ్డాయి.

జర్మనీలో — లాసాల్ ముఠా. రోసిపోయిన ష్వేయిట్సెర్‌తో రెండేళ్లపాటు నేను స్వయంగా ఉత్తరప్రత్యుత్తరాలు జరిపి, లాసాల్ సంఘం కేవలం ఒంటెత్తువాద సంఘం మాత్రమేననీ, తన్మూలంగా, ఇంటర్నేషనల్ నిర్మించ కృషిజేస్తున్న నిజమైన కార్మికోద్యమ నిర్మాణానికి యిది ప్రతికూలమైనదనీ తిరుగులేని పద్ధతిలో అతనికి నిరూపించాను. ఈ విషయం అర్థంచేసుకోకపోవడానికి అతనికి అతని సొంత "హేతువులు" వుండినాయి.

1868 చివర, రష్యన్ బకూనిన్ ఇంటర్నేషనల్‌లో చేరాడు. అలా జేరడంలో అతని లక్ష్యం, దానిలోపల రెండవ ఇంటర్నేషనల్‌ను "సోషలిస్టు డెమోక్రసీయొక్క అలయన్స్"[64] పేర, తన నాయకత్వంలో ఏర్పాటుచెయ్యడమే. అతగాడు — ఏ రకమైన సైద్ధాంతిక జ్ఞానమూ బొత్తిగా లేని వ్యక్తి, ఆ ప్రత్యేక సంస్థలో ఇంటర్నేషనల్‌యొక్క శాస్త్రీయ ప్రచారానికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పుకున్నాడు. అటువంటి ప్రచారాన్ని ఇంటర్నేషనల్ లోపలి రెండవ ఇంటర్నేషనల్‌యొక్క ప్రత్యేక విధిగా చెయ్యాలని అతను వాంఛించాడు.

అతని కార్యక్రమం మితవాద అతివాదాలనుండి పైపైన కెలికి పోగుచేసిన కలగూరగంప — వర్గాల సమానత్వం (!), సాంఘికోద్యమపు ఆరంభ బిందువుగా వారసత్వ హక్కు రద్దు (సెంట్ సైమన్ మాదిరి చెత్త), సభ్యులకు నిర్దేశింపబడిన పిడిసూత్రంగా నాస్తికవాదం మొదలైనవి. పోతే ప్రధానమైన పిడిసూత్రం (ప్రూడనిస్టు): రాజకీయోద్యమ విముఖత్వం.

ఈ ప్రాథమిక బాల శిక్షకు, కార్మికోద్యమానికి వాస్తవిక పరిస్థితులు యింకా పరిణతి చెందని ఇటలీ స్పెయిన్లలోనూ (యిప్పటికీ దీనికి అక్కడ కొంత పట్టు వుంది) స్విట్జర్లండులోని ఫ్రెంచి భాష మాట్లాడే ప్రాంతంలోను, బెల్జియంలోను కొద్దిమంది నిరర్థకులూ, ఆశబోతులూ అయిన శుష్క సిద్ధాంతజడులలోనూ ఆదరణ లభించింది.

బకూనిన్‌గారికి సంబంధించినంతవరకు సిద్ధాంతం (ప్రూడన్, సెంట్ సైమన్‌ల నుండీ, తదితరులనుండీ ఆయన తయారుచేసిన కలగాపులగం) పూర్వమూ, యిప్పుడూ కూడా అప్రధానమైన విషయం — తన స్వీయాధిక్యతా ప్రతిష్ఠాపనకు కేవలం అదొక సాధనం మాత్రమే. సిద్ధాంతవేత్తగా అనామకుడే అయినప్పటికీ, కుట్రదారుగా మాత్రం ఆయన తన సహజోన్నత స్థాయిలో విరాజిల్లుతూవుంటాడు.

ఏళ్ల తరబడిగా యీ కుట్రకు వ్యతిరేకంగా (ఒక ఘట్టందాకా ఫ్రెంచి ప్రూడనిస్టులచేత, ప్రత్యేకించి ఫ్రాన్సు దక్షిణ ప్రాంతంలో) జనరల్ కౌన్సిలు పోరాడవలసివచ్చింది.

చిట్టచివరకు, మహాసభయొక్క 1, 2, 3, IX, XVI, XVII, తీర్మానాల ద్వారా అది తను దీర్ఘకాలంగా సన్నద్ధం చేసిన దెబ్బను కొట్టింది.[65]

జనరల్ కౌన్సిలు తను యూరప్‌లో దేనితోనైతే పోరాడుతుందో, దాన్ని అమెరికాలో బలపరచదని వేరే చెప్పనక్కర్లేదు. 1, 2, 3, IXవ తీర్మానాలు యిప్పుడు న్యూయార్కు కమిటీకి అన్ని రకాల ఒంటెత్తువాదాన్నీ, ఔత్సాహిక బృందాలనూ అణచివేసేందుకూ, అవసరమైతే వాటిని బహిష్కరించేందుకూ నియమానుసారమైన ఆయుధాలను సమకూర్చాయి.

...కార్మికవర్గపు రాజకీయోద్యమంయొక్క అంతిమ లక్ష్యం, యీ వర్గానికి రాజకీయాధికారాన్ని సంపాదించడం. సహజంగానే యిందుకు కార్మికవర్గంయొక్క నిర్మాణం అంతకుముందే ఒకానొక నిర్ణీత స్థాయికి పరిణతిచెందడం అవసరం ఇది తప్పనిసరిగా దాని ఆర్థిక పోరాటాలద్వారానే జరుగుతుంది.

కాని మరోవంక, ఏ ఉద్యమాల్లోనైతే కార్మికవర్గం ఒక వర్గంగా ముందుకు వచ్చి, బయటినుండి పాలకవర్గాలపై బలప్రయోగం చెయ్య ప్రయత్నిస్తుందో, అటువంటి ఉద్యమాల్లో ప్రతిదీ రాజకీయోద్యమమే. ఉదాహరణకు, సమ్మెలు మొదలైన వాటిద్వారా ఒకానొక ప్రత్యేక ఫ్యాక్టరీలో లేక ఒక ప్రత్యేక వృత్తిలో వైయక్తిక పెట్టుబడిదారులచేత తక్కువ పనిగంటలకు అంగీకరింపజేసే ప్రయత్నం పూర్తిగా ఆర్థికోద్యమం అవుతుంది. అందుకు భిన్నంగా 8 గంటల పనిదినం మొదలైన వాటితో కూడిన చట్టాన్ని నెగ్గించుకునేందుకు చేసే ఉద్యమం రాజకీయ ఉద్యమం అవుతుంది. ఈ విధంగా కార్మికులయొక్క విడివిడి ఆర్థికోద్యమాల ద్వారా ప్రతిచోటా ఒక రాజకీయ ఉద్యమం పెంపొందుతుంది, అంటే, ఆ వర్గంయొక్క ఉద్యమం, దాని ప్రయోజనాలను ఒక సాధారణ రూపంలో బలిమిని రాబట్టుకొనే లక్ష్యంతో, సమాజమంతటి బలప్రయోగశక్తి రూపంలో పెంపొందుతుందన్నమాట. ఈ ఉద్యమాలకు అంతకు ముందే ఒకానొక నిర్ణీత స్థాయిలో నిర్మాణం ఉండటం అవసరం. అలాగే యీ ఉద్యమాలు తిరిగి తమ వంతులో యీ నిర్మాణాభివృద్ధికి సాధనాలవుతాయి.

సాముదాయక శక్తికి, అంటే పాలకవర్గాల రాజకీయ శక్తికి వ్యతిరేకంగా నిర్ణయాత్మకమైన ఆందోళనోద్యమాన్ని చేబట్టగలిగినంతగా కార్మికవర్గం నిర్మాణరీత్యా అభివృద్ధిచెందని చోట, యిందుకుగాను దానికి, ఈ రాజ్యాధికారానికి వ్యతిరేకంగా నిరంతరాయమైన ఆందోళన ద్వారానూ, పాలకవర్గాల విధానాలపట్ల శత్రువైఖరి ద్వారానూ విధిగా తర్ఫీదు యివ్వాలి. లేకుంటే కార్మికవర్గం వాటిచేతుల్లో ఒక ఆటవస్తువుగా ఉండిపోతుంది. ఈ విషయాన్ని ఫ్రాన్సులో సెప్టెంబరు విప్లవం నిరూపించింది. అలాగే ఇంగ్లండులో, గ్లాడ్‌స్టన్ బృందం

యీనాటివరకూ విజయవంతంగా ఆడుతున్న నాటకాన్ని బట్టికూడా యీ విషయం కొంత వరకు రుజువైంది.

మొట్టమొదట సంక్షిప్తరూపంలో
"Briefe und Auszüge aus Briefen von Joh. Phil. Becker, Jos. Dietzgen, Friedrich Engels, Karl Marx u. A. an F. A. Sorge und Andere" అనే పుస్తకంలో ష్టుట్‌గార్ట్‌లో, 1906లో, ప్రచురింపబడింది

## హుబెర్ట్సబుర్గ్‌లోని ఎ. బెబెల్‌కి ఎంగెల్స్

లండన్, 1873, జూన్ 20

లీబ్‌క్నెఖ్ట్ ఉత్తరం యింకా మార్క్స్ దగ్గరే వుంది. అదెక్కడుందో ఆయన వెంటనే కనుక్కోలేకపోయినందున, ముందు నేను మీ లేఖకి జవాబు రాస్తున్నాను.

హెప్నెర్ కాక, అతనికి యార్క్ రాయగా కమిటీ సంతకంపెట్టిన ఉత్తరమే మాకి క్కడ గాభరా కలిగించింది. దురదృష్టవశాత్తూ పూర్తిగా లాసాలియన్ల చేతుల్లోవున్న పార్టీ నాయకత్వం, "Volksstaat" పత్రికను[66] "నిజాయితీయైన" "Neuer Social-Demokrat"[67]గా మార్చడానికి వినియోగించుకుంటారన్నదే మా భయం. ఈ సంకల్పాన్ని గురించి యార్క్ స్పష్టంగానే ఒప్పుకున్నాడు. సంపాదకులను నియమించే హక్కూ, తొలగించే హక్కూ తమకు వుందని కమిటీ చెప్పుకున్నందున యీ ప్రమాదం తప్పనిసరిగా పెద్దదే. ముంచుకురాబోతున్న హెప్నెర్ ప్రవాసం యీ పథకాలకు మరింత బలాన్ని చేకూర్చింది. ఈ పరిస్థితులలో, అసలు సందర్భమేమిటో తెలుసు కోవడం మాకు తప్పనిసరి అవసరమైంది; అందుకనే యీ ఉత్తరప్రత్యుత్తరాలు....

లాసాలియనిజంపట్ల పార్టీ వైఖరికి సంబంధించి, విశేషించి ప్రత్యేక సందర్భాల్లో ఏ యెత్తుగడలను అవలంబించాలన్న విషయాన్ని మాకంటె మీరే బాగా నిర్ణయించ గలరు. అయితే, యీ దిగువ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవలసివుంటుంది. మీ విషయంలోలాగ, ఎవరైనా అఖిల జర్మన్ కార్మిక సంఘానికి[68] పోటీదారు స్థితిలో వున్నప్పుడు, అతను తన పోటీదారు విషయంలో తేలికగానే చాలా ఎక్కువగా అంచనావేస్తాడు, ముందుగా ఎప్పుడూ పోటీదారును గురించే ఆలోచించే అలవాటులో పడతాడు. కాని, అఖిల జర్మన్ కార్మిక సంఘమూ, సోషల్-డెమోక్రటిక్ కార్మిక పార్టీ—యీ రెండూ కలిసినా

కూడా, అప్పటికీ జర్మన్ కార్మికవర్గంలో అత్యల్పభాగం మాత్రమే అవుతాయి. ప్రచార కార్యక్రమంలో కొద్దిమంది వ్యక్తులనూ, సభ్యులనూ యిక్కడా, అక్కడా తన ప్రత్యర్థి నుండి ఆకర్షించడం సరైన ఎత్తుగడ కాదనీ, యింతవరకింకా ఉద్యమంలో పాల్గొనకుండా వున్న బహుళ ప్రజానీకంలో పనిచెయ్యడమే సరైన పని అనీ మా అభిప్రాయం. మా యీ అభిప్రాయం సరైనదని సుదీర్ఘ ఆచరణ క్రమంలో నిరూపితమైంది కూడా. ముడిసరుకు నుంచి మనం స్వయంగా అభివృద్ధిచేసిన ఒక విడివ్యక్తియొక్క అపరిణతశక్తి పదిమంది లాసాలియన్ రంగుఫిరాయింపుదార్లకన్న — వీళ్లెప్పుడూ తమతోబాటు తమ కృత్రిమ ధోరణుల బీజాలను పార్టీలోకి తీసుకువస్తారు — ఎక్కువ విలువైనది. జనసామాన్యాన్ని మాత్రమే, వాళ్ల స్థానిక నాయకులు లేకుండా పార్టీలోకి తీసుకురాగలిగితే, అది కూడా మంచిదే. కాని ఎప్పుడూ జరిగేదేమిటంటే, తొంబతొంబగా నాయకులను మనం పార్టీలోకి తీసుకోవలసి రావడం. ఈ నాయకులు ఎలాంటివాళ్లు? తమ పూర్వాభిప్రాయాలకు కాకున్నా పూర్వం తాము బహిరంగంగా చేసిన ప్రకటనలచేత బంధితులు వీళ్లు. మనమిప్పుడు మన సూత్రాలకు తిలోదకాలివ్వలేదనీ, అందుకు భిన్నంగా అన్నిటికన్న ముఖ్యంగా సోషల్-డెమోక్రటిక్ కార్మిక పార్టీ సిసలైన లాసాలియనిజం బోధిస్తున్నదనీ రుజువుచెయ్యాల్సివుంది. ఐసెనాఖ్‌లో జరిగిన దురదృష్టకర విషయం యిదే.[69] అప్పట్లో అది బహుశా అనివార్యమే కూడా. కాని యీ శక్తులవల్ల పార్టీకి హాని కలిగిందనడంలో సందేహమేలేదు. ఆ కలయిక జరగకుండావుంటే పార్టీ కనీసం యీనాడున్నంత బలంగా ఉండియుండకపోనన్న విషయంలో నాకు కచ్చితమైన నమ్మకంలేదు. అయితే, ఏది ఏమైనప్పటికీ, యీ శక్తులకు అదనపు శక్తులు చేరి యివి మరింత బలపడినట్లయితే, నేను దాన్ని దురదృష్టంగానే పరిగణించాల్సి వుంటుంది.

"ఐక్యత"కోసం కేకల ద్వారా యితరులు తనను పక్కదారి పట్టించకుండా చూసుకోవడం అవసరం. ఈ మాటను అతి తరచుగా జపించేవారే అతి ఎక్కువగా జగడాలను రేపుతూవుంటారు. ప్రస్తుతం స్విట్జర్లండులోని జూరా బకూనినిస్టులు చేస్తున్న పని సరిగా యిదే. అన్ని చీలికలను రెచ్చగొట్టినదీ వాళ్లే, ఐక్యతకోసం — అంతకు మరేమీ తక్కువ కాదు — కోలాహలం చేసేదీ వాళ్లే. ఈ ఐక్యతా దురభిమానులు నామ రూప రహితమైన ఒకేఒక పంచకూళ్ల కషాయాన్ని — యీ కషాయం తేరుకున్న మరుక్షణమే విభేదాలను మళ్లీ పైకి లేపుతుంది — అయితే యీమారు మరింత తీవ్ర వైరుధ్యాలతో అది పైకొస్తుంది, అవన్నీ యిప్పుడు ఒకే భాండంలో వుండటమే యిందుకు కారణం (జర్మనీలో కార్మికులకూ, పెటీబూర్జువావర్గానికీ మధ్య సయోధ్య కావాలని కోరేవాళ్లే యిందుకు చక్కని ఉదాహరణ) — తయారుచెయ్యగోరే పరిమితమైన తెలివితేటలు కలిగినవాళ్లైనా అవుతారు — లేకుంటే, తమకు తెలియకుండానే (ఉదాహరణకు, మూల్‌బెర్గర్ మాదిరిగా),

లేక తెలిసే ఉద్యమాన్ని కల్తీచెయ్యాలని కోరేవాళ్లైనా అవుతారు. ఈ కారణంగానే పరమ ఒంటెత్తువాదులూ, అతిపెద్ద జగడాలమారులూ, వంచకులే ఒక్కొక్కమారు ఐక్యతకోసం అతిబిగ్గరగా గావుకేకలు పెడుతూవుంటారు. మన కాలంలో ఐక్యతకోసం అరిచేవాళ్లకన్న ఎక్కువ యిబ్బందులు కలిగించినవాళ్ళూ, ఎక్కువ వంచకులూ మరెవరూ లేరు.

సహజంగానే ప్రతి పార్టీ నాయకత్వమూ విజయాలు సాధించాలనుకుంటుంది, యిది చాలా మంచి విషయమే కూడా. కాని కొన్ని ప్రత్యేక పరిస్థితులుంటాయి, అటువంటి పరిస్థితుల్లో మరింత ముఖ్యమైన విషయాలకోసం క్షణిక విజయాన్ని త్యాగంచెయ్యగల ధైర్యం వుండాలి. ప్రత్యేకించి మన పార్టీలాంటి పార్టీకి — దేని అంతిమ విజయమైతే పూర్తిగా నిశ్చయమో అటువంటి పార్టీకి — మన జీవితకాలంలోనే మన కళ్లముందే బ్రహ్మాండంగా అభివృద్ధిచెందిన పార్టీకి తాత్కాలిక విజయం అన్నప్పుడూ విధిగా ఏమాత్రమూ అవసరంలేదు. ఉదాహరణకు, ఇంటర్నేషనల్‌నే[70] తీసుకోండి. కమ్యూన్ తర్వాత యింత పెద్ద ఎత్తున ప్రజాభిమానాన్ని చూరగొన్నది మరొకటి లేదు. ఇంటర్నేషనల్‌కు నిరాశతో కుప్పకూలిపోయిన బూర్జువావర్గం సర్వశక్తిమత్వాన్ని ఆపాదించింది. సభ్యుల్లో అత్యధిక సంఖ్యాకులు కల్పాంతందాకా పరిస్థితులు అలాగే వుండిపోతాయని విశ్వసించారు. కాని, యీ నీటిబుడగ పేలిపోక తప్పదన్న సంగతి మనకి చాలా బాగా తెలుసు. తుక్కోజీ రకమంతా దానితో అంటుళ్లా అయిపోయారు. దానిలోని ఒంటెత్తువాదులు అహంభావులుగా తయారై, తాము ఎంతటి దగుల్బాజీ పనులూ, మిక్కిలి బుద్ధిహీనమైన పనులూ చేసినాకూడా సాగుతుందన్న దిలాసాతో, ఇంటర్నేషనల్‌ను దుర్వినియోగపరచారు. దీన్ని మనం సాగనివ్వలేదు. ఈ బుడగ ఎప్పుడో ఒకప్పుడు పగిలితీరవలసిందేనన్న సంగతి బాగా తెలిసిన మనం, ప్రళయాన్ని వాయిదావెయ్యడాన్ని గాక, దానిలోనుండి ఇంటర్నేషనల్ పరిశుద్ధంగానూ, కల్తీలేకుండానూ బయటపడేలా చూడటాన్నే మన లక్ష్యంగా పెట్టుకున్నాం. హేగ్ మహాసభలో[71] యీ బుడగ బద్దలైంది, మహాసభ సభ్యుల్లో అధికసంఖ్యాకులు ఘోర నిరాశతో యిళ్లకు తిరిగి వెళ్లారన్న సంగతి మీకు తెలుసు. అయినాకూడా యిలా నిరాశోపహతులైన — ఇంటర్నేషనల్‌లో సర్వమానవ సోదరత్వాదర్శమూ, సయోధ్యా వెల్లడవుతాయని ఊహించుకున్నవారిలో దాదాపు అందరూ కూడా, హేగ్‌లో చెలరేగిన వాటికన్న ఎంతో తీవ్రతరమైన కలహాలను తమ తమ దేశాల్లో ఎదుర్కోవలసివచ్చింది. మరి యిప్పుడు, ఒంటెత్తువాద కలహప్రియులు సయోధ్యను ప్రబోధిస్తూ, మనం పేచీకోరులుగానూ, నియంతలుగానూ వ్యవహరిస్తున్నామని మనల్ని నిందిస్తున్నారు. మనమేకనుక హేగ్ మహాసభలో రాజీపద్ధతిలో వ్యవహరించియుంటే, చీలిక సంభవించకుండా అణచివేసియుంటే — పర్యవసానం ఏమైయుండేది? ఒంటెత్తువాదులకూ, ముఖ్యంగా బకూనినిస్టులకూ, ఇంటర్నేషనల్ పేరుతో, మరింత మూర్ఖపు పనులూ, మరింత అప్రతిష్ఠాకరమైన పనులూ చేసేందుకు మరొక సంవత్సరకాలం వ్యవధి లభిం

చియుండేది; మిక్కిలి బాగా అభివృద్ధిచెందిన దేశాల కార్మికులు విసుగుచెంది విముఖులుగా తయారై యుండేవాళ్లు; బుడగ ఠపేలున బద్దలవకుండా, సూదిపోట్లతో గాలి కోల్పోయి క్రమంగా కుప్పకూలిపోయేది. ఎటుతిరిగీ యీ సంక్షోభాన్ని తేకతప్పని తర్వాతి మహాసభ, హేగ్ మహాసభలోనే సూత్రాలకు నీళ్లొదులుకోవడం జరిగియుండేది గనుక, అత్యంత హీనమైన వ్యక్తిగత కీచులాటగా పరిణమించియుండేది. ఆ పరిస్థితుల్లో ఇంటర్నేషనల్ నిజంగానే ముక్కచెక్కలై యుండేది — "ఐక్యత" ద్వారా ముక్కముక్కలై యుండేది! దీనికి బదులు మన మిప్పుడు, మనకి గౌరవనీయమైన పద్ధతిలో తుక్కోజీ రకాన్ని వదిలించుకున్నాం — ఇటీవలి నిర్ణయాత్మక సమావేశానికి హాజరైన కమ్యూన్ సభ్యులు, యూరపియన్ శ్రామిక వర్గానికి ద్రోహంచేసిన వారిపై తీర్పుచెప్పిన న్యాయస్థానం వంటి యీ సమావేశం తమపై కలిగించినంతటి మహత్తర ప్రభావాన్ని కమ్యూన్‌యొక్క మరే సమావేశమూ తమపైన కలిగించలేదని చెప్పారు. పది నెలలపాటు తమ శక్తులన్నింటినీ అబద్ధాలనూ, అభాండాలనూ ప్రచారంచెయ్యడంలోనూ, కుట్రలు పన్నడంలోనూ వ్యయంచేసుకునేలా వాళ్లకి మనం అవకాశమిచ్చాం — మరి వాళ్లిప్పుడు ఎక్కడున్నారు? వాళ్లు, ఇంటర్నేషనల్ సభ్యుల్లో అత్యధిక సంఖ్యాకులకు తామే ప్రతినిధులమని చెప్పుకునేవాళ్లే, రాబోయే మహాసభకు వచ్చేందుకు తమకు దమ్ములు చాలవని యీనాడు చెప్పుకుంటున్నారు. ("Volksstaat"*కి దీనితోబాటు పంపుతున్న వ్యాసంలో యింకా ఎక్కువ వివరాలిస్తున్నాను.) ఈపనినే మనం మరోసారి చెయ్యవలసివచ్చినా కూడా, పై అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నప్పుడు, మనం మరో మాదిరిగా వ్యవహరించకూడదు. ఎత్తుగడలకు సంబంధించిన పొరపాట్లంటారా, అవెప్పుడూ జరిగేవే.

ఏదేమైనప్పటికీ, లాసాలియన్లలో సమర్థులు కాలక్రమేణా తమంతటతాము ఎలాగూ మనవంక తిరుగుతారు, అందుకని ఐక్యతాగుంపు కోరే మాదిరిగా, పక్వం కానిదే పండును చిదమడం తెలివితక్కువే అవుతుంది.

అంతేకాదు పితామహుడు హేగెల్ ఎన్నడో చెప్పాడు: చీలిపోవడం ద్వారానూ, ఆ చీలికను తట్టుకోగలగడం ద్వారానూ ఏ పార్టీఅయినా తనను తాను విజయవంతమైనదిగా రుజువు చేసుకుంటుంది.[72] శ్రామికవర్గోద్యమం విధిగా భిన్నభిన్న దశల్లో ముందుకు సాగుతుంది; ప్రతి ఒక్క దశలోనూ జనంలో కొందరు వేరుపడిపోయి, అటుతర్వాతి పురోగతిలో చేరరు. రోమన్ సామ్రాజ్యకాలంలో అత్యంత దారుణమైన హింసాకాండల మధ్య క్రిస్టియన్ తెగలు చేసిన మాదిరిగా, పరస్పరం జీవన్మరణ పోరాటం సాగించే విభిన్న పార్టీ గ్రూపులమధ్య

* F. Engels, "Aus der Internationalen" (Marx/Engels, "Werke," Bd. 18, Dietz Verlag, Berlin, 1962, S. 472–75). — సం.

సర్వత్రా "శ్రామికవర్గ సంఘీభావం" ఆచరణలో ఎందుకు సాధింపబడుతున్నదో అన్న విషయం యీ ఒక్క అంశాన్నిబట్టే విశదమవుతుంది.

ఉదాహరణకు, "Neuer Social-Demokrat" పత్రికకు "Volksstaat" పత్రికకన్న ఎక్కువమంది చందాదారులు ఉన్నారంటే, ప్రతిఒక్క బృందమూ విధిగా దురభిమానపూరితమై యుంటుందనీ, యీ దురభిమానం కారణంగా, ప్రత్యేకించి తను కొత్తగా రంగప్రవేశం చేసిన ప్రాంతాల్లో (ఉదాహరణకు ష్లెస్విగ్ – హోల్‌ష్టైన్‌లో అఖిల జర్మన్ కార్మిక సంఘం మాదిరిగా), నిజమైన ఉద్యమానికి, ఎటువంటి ఒంటెత్తు చాపల్యాలూ లేకుండా పట్టినే ప్రాతినిధ్యం వహించే పార్టీకన్న, తాత్కాలికమైన చాలా పెద్ద విజయాలను అది సాధిస్తుందనీ మీరు మరచిపోరాదు. మరోవంక, ఉన్మత్తావేశం ఎక్కువకాలం వుండదు.

టపా కట్టేసే టైమైనందున నేనిక నా లేఖను ముగించాలి. ముగించేముందు హడావిడిగా యింకొక్క విషయాన్ని ప్రస్తావించనియ్యండి: ఫ్రెంచి అనువాదం* పూర్తయ్యేదాకా (సుమారు జూలై నెలాఖరుకు పూర్తికావచ్చు), లాసాల్ వ్యవహారాన్ని[73] మార్క్స్ పరిష్కరించ లేదు, అపరిమితమైన శ్రమచేసి అలసిపోయిన కారణంగా ఆయన విధిగా విశ్రాంతి తీసుకోవడం అవసరం....

మొట్టమొదట సంక్షిప్త రూపంలో
F. Engels, "Politisches Vermächtnis.
Aus unveröffentlichten Briefen"
అనే పుస్తకంలో బెర్లిన్‌లో
1920లోనూ ప్రచురింపబడింది

# హాంబుర్గ్‌లోని డబ్లియు. బ్లోస్‌కు మార్క్స్

లండన్, 1877, నవంబరు 10

...నేను (హైనె అన్నట్లు) "కోపంగాలేను," అలాగే ఎంగెల్సూ కోపంగా లేడు.[74] మా యిద్దరిలో ఏ ఒక్కరమూ కూడా కీర్తి సంపాదనకు గడ్డిపరక ఎత్తు విలువకూడా యివ్వం. దీనికి రుజువేమిటంటే, ఉదాహరణకు అన్నిరకాల వ్యక్తి పూజపట్లా నాకున్న

* "పెట్టుబడి" గ్రంథపు మొదటి సంపుటపు అనువాదం. – సం.

అసహ్యత మూలంగా వివిధ దేశాలనుండి వస్తూవుండిన అభినందనపూర్వకమైన పలు వ్యక్తీకరణలను — ఇంటర్నేషనల్ అస్తిత్వకాలంలో వాటితో నన్ను వేధిస్తూండేవారు — నేనెన్నడూ పైకి పొక్కనివ్వలేదు. అడపా దడపా చీవాట్లు పెడుతూ తప్ప నేను ఎన్నడూ వాటికి జవాబు రాయనూలేదు. ఎంగెల్సూ, నేనూ రహస్య కమ్యూనిస్టు సొసైటీలో* మొట్టమొదట చేరినప్పుడు, నాయకత్వంపట్ల మూఢ నమ్మకాన్ని ప్రోత్సహించే ప్రతిదాన్నీ నిబంధనావళి నుండి[75] తొలగించాలన్న షరతునొకదాన్ని మేము పెట్టాం. (తర్వాత లాసాల్ సరిగా యిందుకు భిన్నమైన దిశలో తన పలుకుబడిని వినియోగించాడు.)

మొట్టమొదట
"Der wahre Jacob" పత్రిక
565 సంచిక (6)లో
1908 మార్చి 17న
ప్రచురింపబడింది

## వియన్నాలోని కె. కౌట్స్కీకి ఎంగెల్స్

లండన్, 1882, సెప్టెంబరు 12

...ఆంగ్ల కార్మికులు వలస విధానం గురించి ఏమనుకుంటారని మీరు అడుగుతారు. అయ్యా, మొత్తంగా రాజకీయాలను గురించి వాళ్లేమనుకుంటారో సరిగా దీన్ని గురించీ అదే అనుకుంటారు: అంటే బూర్జువాలు దీన్ని గురించి ఏమనుకుంటున్నారో సరిగా అదే. మీకు తెలిసిందేకదా, యిక్కడ కార్మిక పార్టీ ఏదీ లేదు. ఇక్కడ వున్నదల్లా కన్సర్వేటివ్‌లూ, లిబరల్ రాడికల్సూ మాత్రమే. మరి కార్మికులు, ప్రపంచ మార్కెట్‌పైనా, వలసదేశాలపైనా ఇంగ్లండుయొక్క గుత్తాధిపత్య ఫలితాలలో ఆ కార్మికులు నముల్లాసంగా పాలు పంచుకుంటున్నారు. నా అభిప్రాయంలో, నేరుగా వలసదేశాలు, అంటే ఏదోఒక యూరపియన్ జనంచేత ఆక్రమించుకోబడిన దేశాలు — కెనడా, కేప్, ఆస్ట్రేలియా — అన్నీ కూడా స్వతంత్రమౌతాయి. మరోవంక, కేవలం లొంగదీసుకోబడిన స్థానిక జనాభా నివసిస్తున్న దేశాలను — ఇండియా, ఆల్జీరియా, డచ్చి, పోర్చుగీసు, స్పానిష్ వలసదేశాలు —

* కమ్యూనిస్టు లీగు. — సం.

తాత్కాలికంగా శ్రామికవర్గం వశంచేసుకొని, స్వాతంత్ర్యం దిశగా ఎంత వేగంగా సాధ్యమైతే అంత వేగంగా నడిపించాలి. ఈ క్రమం ఏవిధంగా అభివృద్ధి చెందుతుందో చెప్పడం కష్టం. ఇండియా బహుశా, నిజానికి అత్యంత ప్రాయికంగా, విప్లవం జరపవచ్చు. స్వయం విముక్తి క్రమంలో వున్న శ్రామికవర్గం వలసవాద యుద్ధాలను నిర్వహించలేదు కనుక, తన క్రమాన్ని అది అనుసరించేందుకు దాన్ని వదిలెయ్యాలి. అయితే అది అన్నిరకాల విధ్వంసమూ లేకుండా జరగదన్నమాట నిజమేగాని, ఆమాదిరి వ్యవహారం విప్లవాలన్నింటితోనూ అవిభాజ్యంగా ఉండేదే. ఇదే యితర చోట్లకూడా, ఉదాహరణకు, ఆల్జీరియాలోనూ, ఈజిప్టులోనూ కూడా జరగవచ్చు. ఇది నిశ్చితంగా మనకి మిక్కిలి మేలైన విషయం. మనకి స్వదేశంలో చేతినిండా పనివుంటుంది. యూరపూ, అలాగే ఉత్తర అమెరికా పునర్నిర్మింపబడినప్పుడు, అది ఎటువంటి బ్రహ్మాండమైన శక్తినీ, ఎటువంటి ఆదర్శాన్నీ సమకూరుస్తుందంటే, అప్పుడిక అర్ధనాగరిక దేశాలు తమకు తామై వాటి అడుగుజాడల్లో నడుస్తాయి, మరేది ఎలావున్నా ఆర్థిక అవసరాలు యిది జరిగేలా చేస్తాయి. కాని యీ దేశాలు కూడా సోషలిస్టు నిర్మాణాన్ని చేరుకునేలోగా, ఏ సామాజిక, రాజకీయ దశలను దాటవలసివుంటుందన్న విషయంలో యీనాడు మనం చెప్పాలంటే, అది నిరర్థకమైన ఊహాగానం మాత్రమే అవుతుందని నేను భావిస్తున్నాను. ఒక్క విషయం మాత్రం ఖచ్చితం: విజయం సాధించిన శ్రామికవర్గం ఏ విదేశంపైనా కూడా ఎటువంటి మేళ్లూ రుద్దరాదు, అలా చెయ్యడమంటే అది తను సాధించిన విజయానికి ఎసరుపెట్టుకున్నట్టే. అయితే అంతమాత్రాన రకరకాల ఆత్మ రక్షణయుద్ధాల అవసరం తొలగిపోతుందని ఎంతమాత్రమూ అర్థం కాదు....

మొట్టమొదటిసారి పూర్తిపాఠం
రష్యన్ భాషలో "మార్క్స్ – ఎంగెల్స్
పత్రభాండారం," సంపుటం I (VI),
1932లో ప్రచురింపబడింది

## బెర్లిన్‌లోని సి. ష్మిడ్ట్‌కి ఎంగెల్స్

లండన్, 1890, ఆగస్టు 5

...పాల్ బార్త్ పుస్తకంపైన[76] శకునపక్షి మోరిట్జ్ వీర్త్ వియెన్నా పత్రిక "Deutsche Worte"[77]లో రాసిన ఒక సమీక్షను చూశాను. ఈ సమీక్ష చదివినప్పుడు, దానిపైననే కాకుండా, అసలు ఆ పుస్తకంపైననే నాకు అననుకూల భావం ఏర్పడింది. నేనా పుస్తకం

చూస్తాను. కాని, మార్క్స్ రచనలన్నింటిలోనూ జీవితంయొక్క పాదార్థిక పరిస్థితులపై తత్వశాస్త్రం మొదలైనవాటి పరాధీనత అనేదానికి సరిపోలిన అంశం డెకార్ట్‌లో మాత్రమే కనిపిస్తుందని, అంటే డెకార్ట్ జంతువులను యంత్రాలుగా నిర్ధరించాడని బార్త్ రాసినట్లు "చిన్న మోరిట్జ్" ఉల్లేఖించాడు. మరి యిటువంటి విషయం రాయగలిగిన మనిషిపట్ల నేను జాలిపడుతున్నాను. భౌతిక జీవిత పరిస్థితులు Primum agens* అనీ, అయితే అంతమాత్రాన, అప్రధాన ప్రభావాన్నే అయినా భావజాలాత్మక రంగాలు వాటి క్రమంలో భౌతిక జీవిత పరిస్థితులపై ప్రభావాన్ని బరపే అవకాశాన్ని యిది నివారించదనీ యీ మనిషి యింకా తెలుసుకోలేదంటే, తను ఏ విషయంపై రాస్తున్నాడో ఆ విషయాన్ని ఆయన అర్థంచేసుకొని వుండటం సాధ్యంకాదు. కాని, నేనింతకు ముందే చెప్పినట్లు, యిదంతా ప్రత్యక్షంగాకాక పరోక్షంగా లభ్యమైన సమాచారం, "చిన్న మోరిట్జ్" ప్రమాదకర మిత్రుడు. చారిత్రక భౌతికవాదాన్ని అనుసరించేవాళ్ల యీమధ్య దండిగా కనిపిస్తున్నారు, వాళ్లకి చరిత్రను అధ్యయనం చెయ్యకుండా వుండేందుకు అదొక సాకుగా ఉపయోగపడుతోంది. 1870 దశకపు చివరి సంవత్సరాలకు చెందిన ఫ్రెంచి "మార్క్సిస్టులను" గురించి వ్యాఖ్యానిస్తూ మార్క్స్ యిలా అంటూండేవాడు: "నాకు తెలిసిందల్లా నేను మార్క్సిస్టును కానన్నదే."

"Volkstribüne" పత్రిక[78]లో భవిష్యత్సమాజంలో ఉత్పాదితాల పంపిణీని గురించి, యిది చేసిన పని పరిమాణాన్నిబట్టి వుంటుందా లేక మరోవిధంగానా అంటూ, ఒక చర్చావేదిక నిర్వహింపబడింది. న్యాయాన్ని గురించిన ఒకరకమైన భావవాద పదజాలానికి భిన్నంగా యీ సమస్య అతి "భౌతికవాద" వైఖరిలో పరిశీలింపబడింది. అసలింతకీ పంపిణీ విధానం సారభూతంగా పంపిణీ చేసుకునేందుకు అసలక్కడ ఎంత వుందన్నదానిపై ఆధారపడివుంటుందనీ, యిది తప్పనిసరిగా ఉత్పత్తిలో సంభవించే పురోగతిపైనా, సామాజిక నిర్మాణంపైనా ఆధారపడివుంటుందనీ, కాగా పంపిణీ విధానం కూడా మారవచ్చునన్న సంగతి ఏ ఒక్కరికీ తట్టలేదు. కాని ఆ చర్చలో పాల్గొన్న ఏ ఒక్కరికీ కూడా "సోషలిస్టు సమాజం" నిరంతరాయమైన మార్పునూ, వికాసాన్నీ పొందేదిగా కాక, శాశ్వతంగా నిర్ధారితం చెయ్యబడిన స్థిరమైన వ్యవహారంగానూ, అందుకని తప్పనిసరిగా దానికి శాశ్వతంగా నిర్ధారితం చెయ్యబడిన పంపిణీ విధానం ఉండాలన్నట్లుగానూ తోచింది. కాని ఎవరైనా హేతుబద్ధంగా చెయ్యగలిగినదల్లా ఏమిటంటే, 1) మొదట్లో ఉపయోగించాల్సిన పంపిణీ పద్ధతిని కనుక్కునేందుకు ప్రయత్నించడం, కనుక్కోవడం, 2) యితోధికాభివృద్ధియొక్క సాధారణ

* మూలసాధనమూ, మూలకారణమూ. – సం.

ధోరణిని కనుక్కునేందుకు ప్రయత్నించడం, కనుక్కోవడమూను. కాని దీన్ని గురించి ఆ మొత్తం చర్చలో నాకెక్కడా ఒక్క మాటకూడా కానరాలేదు.

మొత్తంమీద, జర్మనీలో పలువురు రచయితలకు ''భౌతికవాద'' అన్న పదం ఒక నినాదప్రాయమైపోయింది. ఇతోధికమైన అధ్యయనం లేకుండా వాళ్లీ పదాన్ని ప్రతి ఒక్క దానికీ తగిలిస్తారు, అంటే, ఈ పదాన్ని తగిలించి, దానితో ఆ సమస్య పరిష్కారమైపోయినట్లు పరిగణిస్తారు. కాని మన చారిత్రక భౌతికవాదం అన్నిటికన్న ముఖ్యంగా అధ్యయనానికి ఒక మార్గదర్శియేగాని, హేగెలియన్ల మాదిరిగా నిర్మాణానికొక కిటుకు కాదు. సమస్త చరిత్రనూ సరికొత్తగా అధ్యయనం చెయ్యాలి. సమాజంయొక్క విభిన్న నిర్మాణరూపాల ఉనికి పరిస్థితులను — వాటినుండి వాటికి అనురూపమైన రాజకీయ, పౌరచట్ట, సౌందర్యతత్వ నిర్ణాయక, తాత్విక, మతాది అభిప్రాయాలను సిద్ధాంతీకరించేందుకు ప్రయత్నించడానికి ముందు — విడివిడిగా తప్పనిసరిగా పరిశీలించాలి. ఇంతవరదాకా యీదిశగా బహుకొద్ది మాత్రమే జరిగింది, ఇందుకు బహు కొద్దిమంది మాత్రమే గట్టిగా పూనుకోవడమే కారణం. ఈ రంగంలో మనం బోలెడంత సహాయక సామగ్రిని వినియోగించుకోవచ్చు, అది కొల్లలుగా వుంది, గట్టిగా శ్రమించి పనిచేసే ఎవరైనా ఎంతో సాధించి, పదిమందిలోనూ రాణించవచ్చు. కాని యిందుకు బదులు జర్మన్ యువకులలో చాలా ఎక్కువమంది, తమకు సాపేక్షంగా తక్కువైన చారిత్రక పరిజ్ఞానానికి — ఆర్థిక చరిత్ర యింకా తన పురిటి పొత్తుల్లోనే వుంది మరి! — ఎంత త్వరితంగా సాధ్యమైతే అంత త్వరితంగా చక్కని ఒక భావరూపాన్ని చ్చేందుకుగాను చారిత్రక భౌతికవాదం అన్న పదబంధాన్ని (మరి ప్రతిదాన్నీ పదబంధంగా మార్చవచ్చు) వాడేస్తారంతే, అప్పుడిక తమను తాము అద్భుతమైనవాళ్లుగా పరిగణించుకుంటారు. అప్పుడిక ఏముంది, ఏ బార్త్‌గారో ముందుకువచ్చి అసలు ఆ భావాన్నే — అది ఆయన పరిచిత బృందంలో కేవలం ఒక పదబంధంగా దిగజార్చబడింది — ఖండిస్తాడు.

కాని, యిదంతా తనకు తానే సర్దుకుంటుంది. జర్మనీలో మనమిప్పుడు ఢక్కామొక్కీలను తట్టుకోగలంత బలంగా వున్నాం. సోషలిస్టు రంగు పులుముకున్న జర్మన్ మేధావి యొక్క జడత్వంనుండి మనల్ని విముక్తం చెయ్యడమే సోషలిస్టు వ్యతిరేక చట్టం[79] చేసిన అతిగొప్ప సేవల్లో ఒకటి. తిరిగి యిప్పుడు స్వాతిశయంతో పోజులు పెడుతున్న జర్మన్ మేధావిని సైతం విశ్లేషించగలంత బలంగా వున్నాం. పార్టీకి అంటిపెట్టుకొనివున్న యువ సాహిత్యవేత్తల్లో ఎంత తక్కువమంది అర్థశాస్త్రాన్ని, అర్థశాస్త్ర చరిత్రను, వర్తకం, పరిశ్రమ, వ్యవసాయాల చరిత్రనూ, సామాజిక నిర్మాణరూపాల చరిత్రనూ అధ్యయనం చేసేందుకు శ్రద్ధవహిస్తున్నారో, యీ రంగంలో కొంత సాధించిన మీరు స్వయంగా అర్థం చేసుకోగలరు. మౌరెర్ పేరే తప్ప ఆయన్ని గురించి ఏమైనా తెలిసినవాళ్లెంతమంది వున్నారు! పత్రికా రచయిత సర్వతోముఖ పరిజ్ఞానం కలిగివుండాలి, కాని ఫలితమేమో యిలా

వుంది. ఈ పెద్దమనుషులు, కార్మికులకు ఏదైనా ఫరవాలేదనుకుంటున్నట్లు కనిపిస్తుంది. తన రచనల్లో అత్యుత్తమమైనవి సైతం కార్మికులకు తగినవి కావని మార్క్స్ పరిగణించే వాడన్న సంగతినీ, అత్యుత్తమమైనవి తప్ప మరి దేన్నైనా కార్మికులకు సమర్పించడాన్ని ఆయన ఒక నేరంగా పరిగణించేవాడన్న సంగతినీ యీ పెద్దమనుషులు తెలుసుకోగలిగితేనా!...

మొట్టమొదటి సారిగా పూర్తిపాఠం 1920లో
"Sozialistische Monatshefte"
పత్రిక 18–19 సంచికల్లో
ప్రచురింపబడింది

# బ్రెస్లౌలోని ఒట్టో ఫన్ బ్యోనిగ్క్‌కు ఎంగెల్స్

ఫోక్‌స్టోన్, డోవర్ సమీపంలో,
1890, ఆగస్టు 21

...మీరు అడిగిన విషయాలకు[80] కేవలం క్లుప్తంగానూ, స్థూలంగానూ మాత్రమే నేను జవాబివ్వగలను, లేకుంటే మొదటి ప్రశ్నకు సంబంధించి నేనొక పుస్తకమే రాయవలసివుంటుంది.

I. నా అభిప్రాయంలో "సోషలిస్టు సమాజం" అనబడేదేమీ మారని విషయంకాదు. తదితర అన్ని సామాజిక నిర్మాణరూపాల మాదిరిగానే, నిరంతరాయమైన మార్పు రూపాంతరీకరణలు పొందేదిగా దాన్ని పరిగణించాల్సివుంటుంది. ప్రస్తుత వ్యవస్థకూ దానికీ మధ్య కీలకమైన తేడా ఏమిటంటే, అన్ని ఉత్పత్తి సాధనాలపైనా జాతియొక్క ఉమ్మడి స్వామ్య ప్రాతిపదికపై నిర్వహింపబడే ఉత్పత్తి. ఈ పునర్నిర్మాణాన్ని రేపే మొదలుపెట్టడమూ, అయితే దాన్ని క్రమంగా నిర్వహించడమూ అన్నది పూర్తిగా సాధ్యమైనదిగా నాకు కనిపిస్తుంది. మన కార్మికులు యిందుకు సమర్థులన్న విషయాన్ని వారు నిర్వహిస్తున్న పలు ఉత్పత్తి, వినిమయ సహకార సంఘాలు రుజువుచేస్తున్నాయి. ఎక్కడైతే ఉద్దేశపూర్వకంగా పోలీసులచేత అవి విచ్ఛిన్నంచెయ్యబడలేదో అక్కడల్లా అవి బూర్జువా జాయింట్ స్టాక్ కంపెనీలంత చక్కగానూ, అంతకంటె నిజాయితీగానూ నిర్వహింపబడ్డాయి. సోషలిస్టు వ్యతిరేక చట్టానికి వ్యతిరేకంగా తాము జరిపిన విజయవంతమైన పోరాటంలో కార్మికులు ప్రదర్శించిన అద్భుతమైన రాజకీయ పరిణతిని చూసిన తర్వాతకూడా జర్మనీలో ప్రజాబాహుళ్యపు అజ్ఞానాన్ని గురించి మీరెలా మాట్లాడగలుగుతున్నారో నాకు అర్థంకాలేదు. మన

మేధావులనబడేవాళ్ళ కుహనా పాండిత్యంతో యిచ్చే పొరపాటు ఉపన్యాసాలే మరింత పెద్ద అవరోధంగా నాకు కనిపిస్తోంది. టెక్నీషియన్లు, వ్యవసాయ శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, రసాయన శాస్త్రజ్ఞులు, వాస్తు శాస్త్రజ్ఞులు మొదలైనవాళ్ళ మనకింకా అవసరమున్నమాట నిజమే, కాని వాళ్లకు ఘోరమైన కొరత ఏర్పడినాకూడా, సరిగా పెట్టుబడిదారులు వాళ్లను కొన్నట్లే మనంకూడా వాళ్లనెప్పుడైనా కొనవచ్చు. వాళ్లలోని ద్రోహుల్లో కొంతమందిని తీవ్రంగా శిక్షించినట్లయితే — ద్రోహులు వుండే తీరుతారు — మనతో సక్రమంగా వ్యవహరించడం తమకే మేలని వాళ్ళ గ్రహిస్తారు. కాని యీ నిపుణులమాట అటుంచితే — పాఠశాల ఉపాధ్యాయులను కూడా నేను వీళ్లలో చేర్చాను — యితర మేధావులు లేకపోయినా మనం సలక్షణంగా గడుపుకోవచ్చు. ఉదాహరణకు, పార్టీలోకి సాహితీపరుల, విద్యార్థుల ప్రవాహం, యీ పెద్దమనుషులను సరైన అదుపులో ఉంచకపోయినట్లయితే, నష్టదాయకంకావచ్చు.

ఎల్బ్ నదికి తూర్పునగల ప్రష్యన్ భూస్వాముల ఎస్టేట్లను సముచితమైన సాంకేతిక యాజమాన్యంకింద కౌలుకు తీసుకొని, యీనాటి రోజువారీ కూలీలకూ, తదితర పరివారానికీ అప్పగించవచ్చు. ఆ ఎస్టేట్లను వాళ్ళ సంయుక్తంగా సాగుచేస్తారు. ఏవైనా గలాటాలు జరిగినట్లయితే, అమల్లోవున్న స్కూలు చట్టాన్ని నిర్లక్ష్యంచేసి అతిక్రమించడం ద్వారా జనంపట్ల పాశవికంగా ప్రవర్తించిన ప్రష్యన్ భూస్వాములను మాత్రమే నిందించవలసివుంటుంది.

సన్నకారు రైతులూ, వేధించుకుతినే అతి తెలివిమంతులైన మేధావులే అతిపెద్ద అవరోధాలు. తమకు తెలిసినది తక్కువైనకొద్దీ యీ మేధావులు అన్ని విషయాలూ తమకే చాలా బాగా తెలుసునని ఎప్పుడూ అనుకుంటూవుంటారు.

ప్రజాబాహుళ్యంలో తగినంత సంఖ్యలో మనకు అనుచరులున్నప్పుడు, రాజకీయాధికారం మనచేతుల్లో ఉన్నట్లయితే పెద్ద పరిశ్రమలనూ, బడా ఎస్టేట్ల వ్యవసాయాన్నీ శీఘ్రంగా సమాజపరం చెయ్యవచ్చు. ముందు వెనుకల్లో మిగిలినదంతా త్వరలోనే జరుగుతుంది. భారీస్థాయి ఉత్పత్తిలో అంతా మనం కోరుకున్నట్లే జరుగుతుంది.

అందరిలోనూ తగినంత చైతన్యం లేదని మీరు పేర్కొన్నారు. ఈ లోపం వున్నమాట నిజమే, అయితే యిది ప్రభువర్గాలనుంచీ, భూస్వామ్య వర్గాలనుంచీ వచ్చిన — కార్మికుల నుండి తామింకా ఎంత ఎక్కువగా నేర్చుకోవాలో గ్రహించని — మేధావులలోనే వుంది.

మొట్టమొదట పూర్తిపాఠం
"Beiträge zur Geschichte der
deutschen Arbeiterbewegung" పత్రిక
సంచిక 2, 1964లో ప్రచురింపబడింది

# క్యోనిగ్స్‌బెర్గ్‌లోని జె. బ్లోహ్‌కి ఎంగెల్స్

లండన్, 1890, సెప్టెంబరు 21 [–22]

...చారిత్రక భౌతికవాదం దృష్ట్యా, వాస్తవిక జీవితంయొక్క ఉత్పత్తి పునరుత్పత్తులే చరిత్రలో అంతిమ నిర్ణయాత్మక అంశం. ఇంతకు మించి మార్క్సుగాని, నేనుగాని ఎన్నడూ వక్కాణించి చెప్పలేదు. అందుచేత ఎవరైనా ఆర్థిక అంశం మాత్రమే నిర్ణయాత్మకమైన దని చెప్పి దీన్ని వక్రీకరించినట్లయితే, అతనా సూత్రీకరణను అర్థరహితమైనదిగా, అనిర్దిష్టమైనదిగా, పసలేని పదబంధంగా మార్చివేస్తున్నాడన్నమాట. ఆర్థిక పరిస్థితి పునాది అన్నమాట నిజమే, కాని ఉపరినిర్మాణపు వివిధాంశాలు – వర్గపోరాటపు రాజకీయ రూపాలూ, వాటి ఫలితాలూ, యింకా చెప్పాలంటే: విజయవంతమైన పోరాటానంతరం, విజయం సాధించిన వర్గంచేత నెలకొల్పబడిన రాజ్యాంగచట్టాలూ మొదలైనవీ, న్యాయశాస్త్ర రూపాలూ, చివరకు ఆయా పోరాటాలలో పాల్గొన్నవారి మనస్సులలో ప్రతిబింబించే యీ వాస్తవ పోరాటాలన్నింటియొక్క ప్రతిబింబాలూ, రాజకీయ, న్యాయశాస్త్రీయ, తాత్విక సిద్ధాంతాలూ, మతభావాలూ, దరిమిలా పిడివాదాలుగా వాటి పరిణామం – కూడా తమ ప్రభావాన్ని చారిత్రక పోరాటాల క్రమంపైన నెరపుతాయి. పలు సందర్భాల్లో వాటి రూపాన్ని నిర్ణయించడంలో అవి ప్రాబల్యం వహిస్తాయి. ఈ అంశాలన్నీ పరస్పరం ఒకదానిపై మరొకటి పని చెయ్యడమన్నది ఒకటుంది. దానిలో, అనంతమైన యాదృచ్ఛిక ఘటనలమధ్య (అంటే, వస్తువుల, ఘటనల పరస్పర ప్రతివర్తన మధ్య వీటి అంతస్సంబంధం ఎంత సుదూరమైనదీ, లేక రుజువుకు ఎంతటి అసాధ్యమైనదీ అంటే, అది లేనేలేదనో, లేక ఉపేక్షింపదగినదనో మనం పరిగణించవచ్చు), చివరకు ఆర్థిక గతి అవసరమైనదిగా తనను తాను స్థిరీకరించుకుంటుంది. అలా కాకుంటే, చరిత్రయొక్క ఏ దశకైనా యీ సిద్ధాంతాన్ని అన్వయించడం మొదటి రకపు సరళ సమీకరణ పరిష్కారంకన్న సులభతరమౌతుంది.

మన చరిత్రను మనమే నిర్మిస్తాం, కాని, ప్రథమంగా అతి నిర్దిష్టమైన ప్రమేయాల మేరకు, నిర్దిష్టమైన పరిస్థితులకింద మనం ఆ పని చేస్తాం. వీటిలో ఆర్థిక ప్రమేయాలు, పరిస్థితులు చివరకు నిర్ణయాత్మకమైనవి. కాని రాజకీయాది భావాలూ, పరిస్థితులూ, నిజానికి మానవుల మనస్సులను వెన్నాడే సంప్రదాయాలు సైతం – నిర్ణయాత్మకమైన పాత్ర కాకపోయినా – కొంత పాత్రను వహిస్తాయి. ప్రష్యన్ రాజ్యం కూడా చారిత్రక కారణాల పర్యవసానంగానూ, చివరకు ఆర్థిక కారణాల మూలంగానే ఆవిర్భవించి, అభివృద్ధి చెందింది. కాని, ఉత్తర జర్మనీలోని పలు చిన్న రాజ్యాల నడుమ బ్రాండెన్‌బర్గ్ ఉత్తరాదికీ,

దక్షిణాదికీ మధ్య కేవలం ఆర్థికమూ, భాషాపరమూ, అంతేకాకుండా రిఫర్మేషన్ ఉద్యమానంతరం* మతపరమైన విభేదం వ్యక్తం అవడంగానూ యితర అంశాలవలన కూడా అగ్రరాజ్యంగా ప్రత్యేకించి ఎంచుకోబడిందే తప్ప, కేవలం ఒక్క ఆర్థిక ఆవశ్యకత ద్వారా మాత్రమే అలా ఎంచుకోబడలేదన్న అంశం శుష్క పాండిత్యమవుతుంది. (ఇదెలా సాధ్యమైందంటే, అన్నిటికన్న ముఖ్యంగా, అది ప్రష్యా స్వాధీనంలోవున్న కారణంగా, పోలండుతో వ్యవహారాల్లో చిక్కి వుండడం మూలంగా, తత్కారణంగా – నిజానికి, ఆస్ట్రియన్ రాజవంశానుగత అధికారం రూపొందడంలోకూడా నిర్ణయాత్మక పాత్ర వహించిన అంతర్జాతీయ రాజకీయ సంబంధాల మూలంగానే అది అగ్రరాజ్యమైంది.) జర్మనీలో పూర్వమూ, ప్రస్తుతమూ వున్న ప్రతి చిన్నరాజ్యపు అస్తిత్వాన్నీ, లేక సూడెటిక్ పర్వత శ్రేణినుంచి టౌనస్‌దాకా, మొత్తం జర్మనీలో యీ చివరినుంచి ఆ చివరిదాకా వ్యాపించియున్న పర్వతాల కారణంగా పెద్ద అగాధం మాదిరిగా ఏర్పడిన భౌగోళికమైన విభజన కుడ్యాన్ని మరింత విస్తృతంచేసిన ఎగువ జర్మన్ భాషా నిర్మాణంలో అచ్చులతో కలిసే హల్లులలో వచ్చే ఉచ్చారణ మార్పులను సైతం ఆర్థిక కారణాల రీత్యానే వివరించబూనడమంటే తనను తాను హాస్యాస్పదుణ్ణి చేసుకోడం తప్ప వేరేమీకాదు.

అయితే రెండో సంగతి ఏమిటంటే, అంతిమ ఫలితం ఎప్పుడూ కూడా పలు వైయక్తిక మైన యిచ్ఛలమధ్య – వీటిలో తిరిగి ఒక్కొక్కటి జీవితానికి సంబంధించిన పలు ప్రత్యేక పరిస్థితుల మూలంగా ఆవిధంగా తయారుచెయ్యబడింది – ఘర్షణలనుండి ఉత్పన్నమవుతుంది, చరిత్ర నిర్మితమయ్యే పద్ధతి యిదీ. ఈవిధంగా అసంఖ్యాకమైన పరస్పర ఛేదక శక్తులు న్నాయి, ఒకే ఫలితాన్ని – చారిత్రక ఘటనను – ఉత్పన్నంచేసే అసంఖ్యాకమైన సమాంతర చతుర్భుజ శక్తుల శ్రేణులున్నాయి. దీన్నిమటుకు దీన్ని తిరిగి, మొత్తంమీద చైతన్యరహితంగానూ, సంకల్పశక్తి లేకుండానూ పనిజేసే ఒకానొక శక్తియొక్క ఉత్పాదితంగా పరిగణించ వచ్చు. ప్రతిఒక వ్యక్తీ కోరుకునేది ప్రతియితరుని వల్లా నిరోధింపబడుతుంది, తత్పర్య వసానంగా ఏ ఒక్కడూ కోరుకోనిది ఉత్పన్నమవుతుంది. ఈ విధంగా చరిత్ర యింత వరదాకా ఒకానొక ప్రకృతి సిద్ధమైన క్రమంగా సాగి, సారభూతంగా అవే చలన సూత్రాలకు గురి అయింది. కాని వ్యక్తుల – వీరిలో ప్రతి ఒక్కడూ తన శారీరక నిర్మాణాన్నిబట్టీ, శారీరక పరిస్థితులనుబట్టీ, చివరిసంగతి ఆర్థిక పరిస్థితులను బట్టీ (అవి అతని సొంత వ్యక్తిగత పరిస్థితులైనా కావచ్చు లేక సాధారణ సామాజిక పరిస్థితులైనా కావచ్చు) – యిచ్ఛలు తాము కోరుకునేవాటిని పొందవు, మొత్తంమీద ఒక సరాసరిలో, ఉమ్మడి ఫలితంలో సంలీనమవుతాయన్న వాస్తవాన్నిబట్టి అవి శూన్యంతో సమానమన్న నిర్ధారణకు రాకూడదు.

* ఈ పుస్తకంలో 53–54 పేజీలు చూడండి. – సం.

అందుకు భిన్నంగా, ప్రతి ఒక్కటీ ఫలితానికి తోడ్పడుతుంది, యీ మేరకు దానిలో చేరి వుంటుంది.

నేను మీకు మరో విషయంకూడా చెప్పదలుచుకున్నాను. మీరీ సిద్ధాంతాన్ని, దాని మూలాధారాలనుంచే అధ్యయనం చెయ్యండి గాని, పరోక్షాధారాలనుంచి చెయ్యబోకండి; నిజానికది చాలా సులభతరం కూడా. మార్క్సు రచనల్లో మూలాధారాల పరిశీలన పాత్ర వహించని రచన దాదాపు లేదని చెప్పవచ్చు. అయితే ప్రత్యేకించి "లూయీ బోనపార్ట్ బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ" మూల సమాచార అన్వయానికి అత్యుత్తమోదాహరణల్లో ఒకటి. "పెట్టుబడి" గ్రంథంలో కూడా దీనికి పలు పరోక్ష ప్రస్తావనలున్నాయి. ఇప్పుడిక నా యీ దిగువ రచనలను చూడమని మిమ్మల్ని కోరుతున్నాను. "మిస్టర్ ఎజేన్ ద్యూరింగ్ విజ్ఞాన శాస్త్రంలోకి తెచ్చిన విప్లవమూ," "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి." వాటిలో నేను చారిత్రక భౌతికవాదాన్ని గూర్చి — నాకు తెలిసినంత వరకు అది ఉంది — అత్యంత విపులమైన వివరణను యిచ్చాను.

యువకులు ఒక్కొక్కసారి ఆర్థిక పార్శ్వానికి — దానికి యోగ్యమైనదానికన్న — ఎక్కువ ప్రాధాన్యాన్ని యిస్తున్నారంటే, యీ దోషంలో స్వయంగా మార్క్సుకూ, నాకూ కూడా పాక్షికంగా కొంత బాధ్యతవుంది. ఆర్థిక అంశాన్ని తిరస్కరించిన మా ప్రత్యర్థులకు వ్యతిరేకంగా, ఆ ప్రధాన సూత్రాన్ని మేము నొక్కి చెప్పాల్సివచ్చింది. పరస్పర వర్తనలో యిమిడివున్న యితర అంశాలకు సముచితమైన స్థానాన్నిచ్చే వ్యవధిగాని, స్థలంగాని, అవకాశంగాని మాకు అన్నప్పుడూ లభ్యంకాలేదు. కాని, చరిత్రలో ఒక విభాగాన్ని చిత్రించవలసి వచ్చినప్పుడు, అంటే, ఆచరణరీత్యా అన్వయించవలసివచ్చినప్పుడు అది వేరే విషయం, అక్కడ ఏ పొరపాటూ కూడా అంగీకారయోగ్యం కాదు. అయితే దురదృష్టవశాత్తూ కొంతమంది ఓ కొత్త సిద్ధాంతాన్ని తాము బాగా అర్థంచేసుకున్నామనీ — వాటినైనా అన్నప్పుడూ సరిగా కాదు — దాని ప్రధాన సూత్రాలను జీర్ణంచేసుకొన్న మరుక్షణంనుంచీ మరే కృషీలేకుండా వాటిని అన్వయించగలమనీ అనుకోవడం చాలా తరచుగా సంభవిస్తోంది. కాగా యిటీవలి "మార్క్సిస్టులను" సైతం నేనీ ఆరోపణనుంచి మినహాయించలేను. ఎందుకంటే, యీ విషయంలో కూడా చాలా గందరగోళం సృష్టింపబడింది....

మొట్టమొదట
"Der sozialistische
Akademiker" పత్రిక
19వ సంచికలో, 1895లో
ప్రచురింపబడింది

# బెర్లిన్‌లోని సి. ష్మిడ్ట్‌కి ఎంగెల్స్

లండన్, 1890, అక్టోబరు 27

ప్రియమైన ష్మిడ్ట్,

నాకు లభ్యమైన తొలి విరామ క్షణాలను మీకు జవాబు రాసేందుకు వినియోగించుకుంటున్నాను. "Züricher Post"[81] పత్రికవారి ఉద్యోగాన్ని మీరు స్వీకరించడం మంచిదని నేను భావిస్తున్నాను. మీరు అక్కడెప్పుడూ కూడా అర్థశాస్త్రం గురించి బోలెడంత నేర్చుకోవచ్చు. అయితే జూరిహ్ కేవలం మూడోరకం డబ్బు, చట్టావ్యాపారాల మార్కెట్ మాత్రమేననీ, కాగా అక్కడ ప్రస్ఫుటమయ్యే అభిప్రాయాలు రెండింతలూ, మూడింతలూ జివచచ్చివుంటాయనీ, లేక ఉద్దేశపూర్వకంగా వక్రీకరించబడివుంటాయన్న విషయాన్ని మీరు గుర్తులో ఉంచుకోవాలి. కాని మీకు మార్కెట్ యంత్రాంగానికి సంబంధించిన ఆచరణాత్మక పరిజ్ఞానం లభిస్తుంది. లండన్, న్యూయార్క్, బెర్లిన్, వియన్నాల చట్టావ్యాపార కేంద్రాలనుండి వచ్చే నివేదికల మూలప్రతులను మీరు చదవాల్సివుంటుంది. తద్వారా, ప్రపంచ మార్కెట్ – డబ్బు, చట్టావ్యాపారాల ప్రతిరూపంలో – మీకు ఆవిష్కృతమవుతుంది. ఆర్థిక, రాజకీయాది ప్రతిబింబాలు కూడా మానవ నేత్రంలో మాదిరిగానే వుంటాయి: అవొక సంక్షేపక కటకంగుండా ప్రసరిస్తాయి, అందుకని తలక్రిందులుగా శీర్షాసనంలో కనిపిస్తాయి. తలక్రిందులు ప్రతిబింబాన్ని తిరిగి వాటి పాదాలపై నిలబెట్టి మనకు చూపే నాడీవ్యవస్థ మాత్రమే లేదు. డబ్బు మార్కెట్ మనిషి పరిశ్రమ గతినీ, ప్రపంచ మార్కెట్ గతినీ డబ్బు, స్టాక్ ఎక్స్‌చేంజి ఉల్టా ప్రతిబింబాలుగా మాత్రమే చూస్తాడు. అందుకని పర్యవసానమే అతని దృష్టిలో కారణమవుతుంది. 1840 దశకం లోనే మాంచెస్టర్‌లో నేనా విషయాన్ని గమనించాను: పరిశ్రమక్రమాన్నీ, దాని నియమిత కాల గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలనూ అర్థంచేసుకోడంలో లండన్ స్టాక్ ఎక్స్‌చేంజి నివేదికలు బొత్తిగా ఎందుకూ పనికిరావు. ఈ పెద్దమనుషులు అన్నింటినీ డబ్బు మార్కెట్లో వచ్చే సంక్షోభాలనుబట్టే – సాధారణంగా అవి సూచనలు మాత్రమే – వివరించ ప్రయత్నించారు. పారిశ్రామిక సంక్షోభాలకు అత్యుత్పత్తియే మూలం కాదని నిరూపించడమే అప్పట్లో వాళ్ల లక్ష్యం. కాగా వాళ్ల యీ లక్ష్యానికి అంతర్గర్భితమైన, వక్రీకరణను ప్రోత్సహించే, ప్రయోజనం వుంది. ఈ లక్ష్యం యిప్పుడులేదు – కనీసం, మనవరకైనా, శాశ్వతంగా – దానికితోడు, డబ్బు మార్కెట్‌కు కూడా దాని సొంత సంక్షోభాలు ఉండవచ్చు. వాటిలో పరిశ్రమయొక్క ప్రత్యక్ష వ్యతిక్రమాలు తక్కువ పాత్రను కలిగివుంటాయి, లేక అసలు పాత్రనే కలిగివుండవు.

ఈ సందర్భంగా నిరూపించవలసినదీ, పరిశీలించవలసినదీ — ప్రత్యేకించి గత యిరవైయేళ్ల చరిత్రలో — యింకా చాలావుంది.

ఎక్కడైతే సామాజిక ప్రమాణంలో శ్రమవిభజన వుంటుందో అక్కడ విడి శ్రమ క్రమాలు ఒకదానినుండి మరొకటి స్వతంత్రమవుతాయి. ఉత్పత్తియే నిర్ణయాత్మక అంశం. కాని ఉత్పాదితాలలో వ్యాపారం ఎప్పుడైతే అసలు ఉత్పత్తికి సంబంధంలేకుండా స్వతంత్ర మవుతుందో, అది తన సొంత చలనాన్ని — మొత్తంమీద ఉత్పత్తిచేతనే శాసింపబడినప్పటికీ, ప్రత్యేక విషయాల్లోనూ, యీ సాధారణ పరాధీనతలోపలా తిరిగి యీకొత్త అంశపు స్వభావంలో యిమిడివున్న తన సొంత నియమాలను అనుసరిస్తుంది. ఈ చలనానికి దాని సొంత దశలు వున్నాయి, దాని వరుసలో అది తిరిగి ఉత్పత్తి గతిపైన ప్రతివర్తిస్తుంది. అమెరికాను కనుగొనడానికి స్వర్ణదాహమే కారణం. ఈ స్వర్ణదాహమే యింతకుముందు పోర్చుగీసు వారిని ఆఫ్రికాకు తరిమింది (ఉదాహరణకు సోట్‌బెర్ రచించిన "విలువైన లోహాల ఉత్పత్తి"). విశేషంగా విస్తరించిన 14, 15 శతాబ్దాల నాటి యూరపియన్ పరిశ్రమా, దానికి అనురూపమైన వ్యాపారమూ 1450నుండి 1550వరకు గొప్ప వెండిదేశమైన జర్మనీ కల్పించగలదానికన్న అధికతర మార్పిడి సాధనాలను డిమాండుచేయడమే దీనికి కారణం. 1500–1800 సంవత్సరాలకు మధ్య పోర్చుగీసు, డచ్చి, ఇంగ్లీషువాళ్లచేత ఇండియా ఆక్రమణకు ఇండియా నుండి దిగుమతులే లక్ష్యం — ఎవరూ కూడా అక్కడికి ఏమైనా ఎగుమతిచెయ్యగలమని కలలోకూడా ఆశించలేదు. అయితేనేం, కేవలం వ్యాపార ప్రయోజనార్థమే జరిగిన యీ ఆవిష్కరణలకూ, దాడులకూ పరిశ్రమలపైన ఎంతో బృహత్తర ప్రభావం వుంది: ఈ దేశాలకు ఎగుమతులు చెయ్యవలసిన ఆవశ్యకత మాత్రమే ఆధునిక భారీపరిశ్రమల ఆవిర్భావానికీ, అభివృద్ధికీ కారణభూతమైంది.

డబ్బుమార్కెట్‌కు కూడా సరిగా యిదే వర్తిస్తుంది. డబ్బువర్తకం సరుకుల వర్తకంనుంచి వేరుపడగానే, అది — ఉత్పత్తిచేతా, సరుకుల వర్తకంచేతా విధింపబడిన కొన్ని షరతుల కిందా, యీ పరిమితుల లోపలా — తన సొంత అభివృద్ధినీ, తన సొంత ప్రభావంచేతా, వేర్వేరు దశలచేతా నిర్ణయింపబడిన ప్రత్యేక నియమాలనూ కలిగియుంటుంది. డబ్బువ్యాపారం, మరింతగా అభివృద్ధిచెంది సెక్యూరిటీలలో వ్యాపారాన్నికూడ తనలో యిముడ్చుకున్నదనీ, యీ సెక్యూరిటీలు ప్రభుత్వ పత్రాలు మాత్రమేకాక పారిశ్రామిక, రవాణా వాటాలు కూడాననీ, యీ కారణంగా డబ్బువ్యాపారం ఉత్పత్తిలో కొంతభాగంపైన ప్రత్యక్షమైన అదుపును సంపాదించుకుంటుందనీ, దీనిమూలంగా మొత్తంమీద తీసుకున్నప్పుడు, దానికి అదే అదుపుచెయ్యబడుతుందన్న సంగతిని పైదానికి జోడించినట్లయితే, అప్పుడిక ఉత్పత్తిపైన డబ్బువ్యాపారంయొక్క ప్రతివర్తన మరింత బలవత్తరమూ, మరింత సంక్లిష్టమూ అవుతుంది. ఆ డబ్బువ్యాపారులే రైల్వేలు, గనులు, ఇనుప కర్మాగారాలు,

మొదలైనవాటి సొంతదారులు. ఈ ఉత్పత్తి సాధనాలు రెండు పార్శ్వాలను సంతరించుకుంటాయి: వాటి పని కొన్ని సందర్భాల్లో ప్రత్యక్ష ఉత్పత్తి ప్రయోజనాలకు అనుకూలంగానూ, మరికొన్ని సందర్భాల్లో వాటాదార్లయొక్క — వారు డబ్బువ్యాపారులైన మేరకు — అవసరాలకు అనుకూలంగానూ మళ్ళింపబడాల్సివుంటుంది. దీనికి మిక్కిలి కొట్టవచ్చినట్లు కనిపించే ఉదాహరణ మనకి ఉత్తర అమెరికన్ రైల్వేలలో కనిపిస్తుంది. వీటి పని ఏ జే గుల్డ్ కంపెనీ, లేక వాండెర్‌బిల్ట్ వంటి మరొక కంపెనీయొక్క రోజువారీ స్టాక్ ఎక్స్‌చేంజి లావాదేవీలపైనవో — పూర్తిగా ఆధారపడివుంటుంది. ఈ కంపెనీలకు ఆ ప్రత్యేక రైల్వేతోగాని, రవాణా సాధనంగా దాని ప్రయోజనాలతోగాని ఎటువంటి సంబంధమూ వుండదు. మరి యిక్కడ ఇంగ్లండులో సైతం, తమతమ భూప్రాంతాల సరిహద్దుల విషయంలో వివిధ రైల్వే కంపెనీలమధ్య దశాబ్దాల తరబడిగా సాగే పోరాటాలను మనం ఎరుగుదుం. ఈ పోరాటంపైన బృహత్తరమైన మొత్తాలలో డబ్బు వెదజల్లబడుతుంది. దాని ఉద్దేశం ఉత్పత్తి లేక రవాణా ప్రయోజనాలు కాదు, వట్టినే పోటీ. మామూలుగా యీ పోటీకి ఏకైక లక్ష్యం వాటాదారులైన డబ్బువ్యాపారుల స్టాక్ ఎక్స్‌చేంజి లావాదేవీలను సుగమంచెయ్యడం మాత్రమే.

సరుకుల వ్యాపారానికీ ఉత్పత్తికీ, యీ రెండింటితోనూ డబ్బు వ్యాపారానికీ గల సంబంధాన్ని గూర్చిన నా అభిప్రాయాలను తెలపడం ద్వారా, సాధారణంగా "చారిత్రక భౌతిక వాదాన్ని" గురించిన మీ ప్రశ్నలకు సారాంశరూపంలో మొత్తంమీద జవాబుచెప్పాను. శ్రమవిభజన దృష్ట్యా యీ విషయాన్ని గ్రహించడం అత్యంత సులభసాధ్యం. సమాజం కొన్ని ఉమ్మడి విధులను ఉత్పన్నం చేస్తుంది. అవి లేనిదే దానికి సాగదు. ఇందునిమిత్తం నిర్దేశింపబడిన వ్యక్తులు, సమాజం లోపల, శ్రమవిభజనయొక్క ఒక నూతన శాఖగా ఏర్పడుతారు. ఇది వాళ్లకు ప్రత్యేకమైన ప్రయోజనాలను — వాళ్లకు అధికారాన్ని కట్టబెట్టినవారి ప్రయోజనాలకు సైతం భిన్నమైన ప్రయోజనాలను — కల్పిస్తుంది. వాళ్లు తమకు అధికారాన్ని కట్టబెట్టినవారికి అతీతులవుతారు — అదిగో సరిగా అప్పుడు రాజ్యం ఉనికిలోకి వస్తుంది. మరి యిప్పుడిక వ్యవహారాలు సరిగా సరుకుల వర్తకంలోనూ, తర్వాత డబ్బువర్తకంలోనూ సాగే మాదిరిగా సాగుతాయి: ఆ కొత్త స్వతంత్ర అధికారం — ప్రధానంగా ఉత్పత్తి గతినే అనుసరించవలసివున్నప్పటికీ — తన వరుసలో తాను, తనలో అంతర్గతంగా వున్న స్వాతంత్ర్యం — అంటే, ఒకప్పుడు దానికి బదలాయింపబడిన, క్రమంగా మరింత అభివృద్ధిచెయ్యబడిన సాపేక్ష స్వాతంత్ర్యం — కారణంగా తిరిగి తాను ఉత్పత్తి పరిస్థితుల పైనా, క్రమంపైనా ప్రతివర్తిస్తుంది. అది రెండు అసమ శక్తుల పరస్పర ప్రతివర్తన: ఒకవంక ఆర్థిక కార్యకలాపం, రెండోవంక ఆ కొత్త రాజకీయాధికారం — యిది సాధ్యమైనంత స్వేచ్ఛకోసం తంటాలుపడుతుంది, ఆ స్వేచ్ఛ ఎప్పుడైతే స్థిరపడుతుందో, అప్పుడిక

దానికి దానిసొంత చలనం సమకూడుతుంది — మొత్తంమీద, ఆర్థిక చలనం తాను కోరు కున్నది సాధిస్తుంది, కాని అది, రాజకీయ చలనంనుంచి — దాన్ని అదే నెలకొల్పి, దానికి సాపేక్షమైన స్వేచ్ఛను కట్టబెట్టింది — ఆ రాజ్యాధికారంనుంచి ఒకవంకా, దానితోబాటే ఉత్పన్నమైన వ్యతిరేకతనుంచి మరోవంకా తాకిళ్లను తట్టుకోవలసివుంటుంది. సరిగా ఏవిధంగానైతే పారిశ్రామిక మార్కెట్ గతి, ప్రధానంగానూ, యింతకుముందే పేర్కొనబడిన మినహాయింపుతోనూ, తల్లకిందులు రూపంలోనే అనుకోండి డబ్బుమార్కెట్‌లో ప్రతిబింబి స్తుందో, యింతకుముందే అస్తిత్వంలో వుండి, పరస్పరం సంఘర్షిస్తున్న వర్గాలమధ్య పోరాటం కూడా, సరిగా అదేవిధంగా ప్రభుత్వానికీ ప్రతిపక్షానికీ మధ్య — అదేమాదిరిగా తల్లకిందులు రూపంలోనే జరిగే — పోరాటంలో ప్రతిబింబిస్తుంది. అయితే యీ పోరాటం యికనెంతమాత్రమూ ప్రత్యక్షంగా కాక పరోక్షంగా, వర్గపోరాటంగా కాక రాజకీయ సూత్రాల కోసం పోరాటంగా వుంటుంది. అదెంత విరూపంచెయ్యబడుతుందంటే దాన్ని గ్రహించడా నికి మనకి వేలాది సంవత్సరాలు పట్టింది.

ఆర్థికాభివృద్ధిపైన రాజ్యాధికారపు ప్రతివర్తన మూడురకాలుగా ఉండగలదు: 1) రాజ్యా ధికారం ఆర్థికాభివృద్ధి దిశగానే సాగవచ్చు, అప్పుడు అభివృద్ధి మరింత వేగంగా వుంటుంది; 2) అది అభివృద్ధి పంథాను ప్రతిఘటించవచ్చు, యీనాడు ఆవిధంగా జరిగినట్లయితే, ప్రతి గొప్ప జాతిలోనూ కొంతకాలక్రమంలో అది విచ్ఛిన్నమైపోతుంది; లేకుంటే 3) రాజ్యాధికారం ఆర్థికాభివృద్ధిని కొన్ని నిర్దిష్ట మార్గాలలో జరగకుండా నిరోధించి, దానికి వేరే మార్గాలను నిర్దేశించవచ్చు. ఈ సందర్భం ఇది చిట్టచివరకు మొదటి రెండు సందర్భాల్లోనూ ఏదో ఒకదానిలోకి దిగజారుతుంది. కాని రెండవ, మూడవ పద్ధతుల్లో రాజ్యాధికారం ఆర్థి కాభివృద్ధికి గొప్ప హానిచేసి, మానవశక్తీ, పదార్థాలూ పెద్దఎత్తున వృథాఅయ్యేందుకు దారి తియ్యగలదు.

పరే యిక ఆక్రమణ, ఆర్థిక వనరుల పాశవిక విధ్వంస సందర్భం కూడా వుంది. దీనిమూలంగా, కొన్ని పరిస్థితుల్లో మొత్తం స్థానిక లేక జాతీయ ఆర్థికాభివృద్ధి మొదట నాశనం చెయ్యబడవచ్చు. ఈరోజుల్లో అటువంటి వ్యవహారానికి కనీసం గొప్ప జాతుల విష యంలో సాధారణంగా వ్యతిరేక ఫలితం వుంటుంది: దీర్ఘకాలక్రమంలో పరాజితులు తరచుగా విజేతలకన్న ఆర్థికంగాను, రాజకీయంగాను, నైతికంగాను ఎక్కువ ప్రయోజనం పొందుతారు.

న్యాయశాస్త్రానికి కూడా యిదే వర్తిస్తుంది. వృత్తిపరమైన న్యాయవాదులను సృష్టించే కొత్త శ్రమవిభజన అవసరంకాగానే, మరో కొత్త, స్వతంత్ర రంగం ఆవిష్కృతమవుతుంది. అది మొత్తంమీద ఉత్పత్తి వ్యాపారాలపైన ఎంతగా ఆధారపడినప్పటికీ, యీ రంగాలపై ప్రభావంబరపే ప్రత్యేకత కూడా దానికి వుంది. ఆధునిక రాజ్యంలో న్యాయవ్యవస్థ సాధా రణ ఆర్థిక పరిస్థితికి అనురూపంగా ఉండి దాని వ్యక్తీకరణగా ఉండి తీరడమేగాక, అంతర్వై

రుధ్యాల కారణంగా తననుతాను శూన్యంగా దిగజార్చుకోని, సహజ సుసంగత వ్యక్తీకరణగా కూడా ఉండాలి. దీన్ని సాధించేందుకుగాను, ఆర్థిక పరిస్థితులయొక్క వాస్తవిక ప్రతిబింబం అంతకంతకు ఎక్కువ దెబ్బతింటుంది. న్యాయవ్యవస్థ అన్నది ఒకానొక వర్గపు పెత్తనం యొక్క మొరటైన, ఉపశమన రహితమైన, కల్తీలేని వ్యక్తీకరణగా ఉండటమన్నది మరింత సకృత్తుగా జరిగే కొద్దీ యిలా దెబ్బతినడమన్నది మరింత ఎక్కువగా జరుగుతుంది — మరి దీనికి యిదే "హక్కును గురించిన భావానికి" విరుద్ధమవుతుంది. నెపోలియన్ శిక్షాస్మృతిలోనే, హక్కులకు సంబంధించి 1792–1796 నాటి విప్లవాత్మక బూర్జువావర్గం కలిగియున్న శుద్ధమైన, సుసంబద్ధమైన భావం అనేకవిధాలుగా కల్తీచెయ్యబడింది. అది ఆ శిక్షాస్మృతిలోవున్న రూపంలో శ్రామికవర్గశక్తి నానాటికీ పెరుగుతున్న కారణంగా నిత్యం రకరకాల కత్తిరింపులు పొందాల్సివస్తోంది. అయినాకూడా యీ నెపోలియన్ శిక్షాస్మృతి ప్రపంచంలో అన్ని భాగాల్లోనూ, ప్రతి ఒక కొత్త శిక్షాస్మృతికీ ప్రాతిపదిక అయిన చట్ట సంపుటి కాకుండా పోలేదు. ఈవిధంగా చాలమటుకు "హక్కుయొక్క అభివృద్ధి" క్రమం మొదట, ఆర్థిక సంబంధాలను ప్రత్యక్షంగా న్యాయశాస్త్ర సూత్రాలలోకి పరివర్తితం చెయ్యడంలో ఉత్పన్నమయ్యే వైరుధ్యాలను రూపుమాపి, పొందికైన న్యాయవ్యవస్థను నెలకొల్పే ప్రయత్నంలోను, అటుతర్వాత యితోధిక ఆర్థికాభివృద్ధియొక్క ప్రభావంవలనా, ఒత్తిడి మూలంగానూ యీ వ్యవస్థలో మరల మరల ఏర్పడే బీటలలోను — యిది దాన్ని మరిన్ని వైరుధ్యాలలోకి నెట్టుతుంది — యిమిడి వుంటుంది. (ప్రస్తుతానికి నేనిక్కడ సివిల్ లాని గురించే ప్రస్తావిస్తున్నాను.)

న్యాయశాస్త్ర సూత్రాలుగా ఆర్థిక సంబంధాల ప్రతిబింబం కూడా విధిగా తలకిందులైనదే: వ్యవహారం నిర్వహిస్తున్న వ్యక్తికి దాన్ని గూర్చిన చైతన్యం లేకుండానే అది కొనసాగుతుంది. న్యాయశాస్త్రవేత్త తాను పూర్వ నిరూపిత సూత్రాల ప్రకారం — కాని నిజానికి అవి ఆర్థిక విషయాల ప్రతిబింబాలు మాత్రమే — వ్యవహరిస్తున్నానని ఊహించుకుంటాడు. కాగా అన్నీ తలకిందులుగా ఉన్నాయన్నమాట. నాకు స్పష్టంగా అనిపించేదేమిటంటే, యీ తారుమారు, అది గుర్తింపబడకుండా ఉన్నంతకాలం, మనం సైద్ధాంతిక దృక్పథం అని పిలిచేదిగా రూపొంది, తన వరుసలో తిరిగి తను ఆర్థిక పునాదిపైన పనిచేస్తుంది, కొన్ని పరిమితులలో దాన్ని అది కొంతవరకు మార్చవచ్చుకూడా. వారసత్వ హక్కుయొక్క ప్రాతిపదిక — కుటుంబ వ్యవస్థ అభివృద్ధి సాధించిన స్థాయిలు ఒక్కటే అనుకుంటే — ఆర్థికమైనదే. అయినాకూడా, ఉదాహరణకు, ఇంగ్లండులో వీలునామా కర్తకుగల పరమ స్వేచ్ఛకూ, ఫ్రాన్సులో అతనిపైన ప్రతి వివరంలోనూ విధింపబడే తీవ్రమైన నిర్బంధాలకూ కూడా ఆర్థిక కారణాలు మాత్రమే మూలం. అయితే, అవి ఆస్తిసంపిణీని ప్రభావితం

చేస్తాయి కనుక, ఆ రెండూ కూడా ఆర్థికరంగంపైన చాలా గణనీయమైన పరిమితిమేరకు ప్రభావాన్ని కలుగజేస్తాయి.

ఆకాశంలోకి మరింత ఎత్తుగా విహరించే భావజాలాత్మక రంగాలకు — మతం, తత్వశాస్త్రం వగైరాలకు — సంబంధించినంతవరకు, వీటికి చరిత్ర పూర్వకాలంలోనే మాతృక వుంది. చారిత్రక దశనాటికే అస్తిత్వంలోవున్న అది — దాన్ని యీరోజున మనం చెత్త అనవచ్చు — చారిత్రకదశలో స్వీకరింపబడింది. ప్రకృతికి, మానవుని అస్తిత్వానికి, దయ్యాలకు, ఇంద్రజాలిక శక్తులు మొదలైన వాటికి సంబంధించిన రకరకాల యీ తప్పుడు అభిప్రాయాలకు ప్రాతిపదిక చాలవరకు ప్రతికూల ఆర్థిక అంశమే. చరిత్ర పూర్వదశయొక్క హీన ఆర్థికాభివృద్ధి ప్రకృతిపట్ల తప్పుడు అభిప్రాయాలతో అనుబంధితమై వుంది. అంతేకాదు పాక్షికంగా వాటిచేత నియంత్రితంచెయ్యబడింది, ఒక విధంగా వాటిచేత ఉత్పన్నం చేయబడింది కూడా. మరి ప్రకృతికి సంబంధించి అంతకంతకు పెంపొందుతున్న జ్ఞానానికి ప్రధానమైన చోదకశక్తి ఆర్థిక ఆవశ్యకతే అయినప్పటికీ, అర్థరహితమైన ప్రాచీనమైన యీ చెత్తకంతటికీ ఆర్థికకారణాలను శోధించ ప్రయత్నించి, కనుగొనడం శుష్క పాండిత్య ప్రకర్షే అవుతుంది. అర్థరహితమైన యీ చెత్తను క్రమంగా తుడిచిపారెయ్యడం, లేక దాని స్థానంలో సరికొత్త — కాని ఎప్పుడూ కూడా అంతకంటె తక్కువ అర్థరహితమైన — చెత్తను పెట్టడమే, విజ్ఞానశాస్త్ర చరిత్ర. ఈ పనిలో నిమగ్నులయ్యే మనుషులు, వారి వరుసలో వారు శ్రమవిభజనలో ప్రత్యేక రంగాలకు చెందివుండి, తమకు తాము ఒక స్వతంత్ర రంగంలో పనిచేస్తున్నవాళ్ల మాదిరిగా కనిపిస్తారు. సామాజిక శ్రమవిభజనలోపల వారు ఏమేరకైతే ఒక స్వతంత్ర బృందంగా ఏర్పడుతారో ఆమేరకు, వారి పొరపాట్లతోబాటు వారు తయారుచేసినవి సమాజపు ఆర్థికాభివృద్ధితోబాటు, దాని యావత్తు అభివృద్ధిపైనా ప్రతివర్తిస్తాయి. అయితేనేం వాటిమటుకు అవి తిరిగి ఆర్థికాభివృద్ధియొక్క ప్రబల ప్రభావానికి గురిఅవుతాయి. ఉదాహరణకు తత్వశాస్త్రంలో, బూర్జువా దశకు సంబంధించి, దీన్ని వెంటనే రుజువుచేయవచ్చు. (18వ శతాబ్దపు అర్థంలో) హాబ్స్ తొలి ఆధునిక భౌతికవాది, కాని యూరప్ అంతట్లోనూ, ఇంగ్లండులోనూ నిరంకుశ రాజరికం దాని ఉచ్చదశలో ఉన్నప్పుడు ఆయన నిరంకుశత్వపు రాజరికవాది. తత్కారణంగా ఆయన పేరు ప్రజావ్యతిరేకుల జాబితాలో చేరింది. లోక్, మతంలోనూ రాజకీయాల్లోనూ కూడా 1688 నాటి వర్గరాజీయొక్క సంతానం. ఆంగ్ల డేయిస్టులూ వారి సంప్రదాయాన్ని మరింత సుసంబద్ధంగా కొనసాగించిన ఫ్రెంచి భౌతికవాదులూ బూర్జువావర్గంయొక్క నిజమైన తత్వవేత్తలు. ఫ్రెంచి భౌతికవాదులైతే ఫ్రెంచి విప్లవ తత్వవేత్తలుకూడా. కాంట్‌నుండి హేగెల్‌దాకా జర్మన్ తత్వశాస్త్రాన్ని జర్మన్ కూపస్థమండూకం ఒకోసారి అనుకూలంగానూ, మరోసారి ప్రతికూలంగానూ విహంగావలోకనం చేస్తాడు. కాని శ్రమవిభజనలో ఒక నిర్దిష్ట

రంగంగా, ప్రతి యుగానికి చెందిన తత్వశాస్త్రమూ, తనకు తన పూర్వమున్న తత్వశాస్త్రాలనుండి వారసత్వంగా లభించిన కొంత నిర్దిష్ట ఆలోచనా సామగ్రిని స్వీకరించి, దాన్నుండి బయల్దేరుతుంది. అందుకనే ఆర్థికంగా వెనుకబడిన దేశాలు సైతం తత్వశాస్త్ర రంగంలో యిప్పటికీ ప్రధాన పాత్రను వహించగలుగుతున్నాయి. ఇంగ్లండుతో పోల్చినప్పుడు — ఇంగ్లీషు తత్వశాస్త్రాన్నే ఫ్రాన్సు ప్రాతిపదికగా స్వీకరించింది — 18వ శతాబ్దంలో ఫ్రాన్సు, దరిమిలా ఆ రెండింటితో పోల్చినప్పుడు జర్మనీ యిందుకు ఉదాహరణలు. కాని ఫ్రాన్సులోనూ, అలాగే జర్మనీలోనూ ఆ కాలంలో తత్వశాస్త్రమూ, సాహితీరంగంలో సాధారణ వికాసమూ ప్రవృద్ధమవుతున్న ఆర్థికాభివృద్ధి ఫలితాలే. ఆర్థికాభివృద్ధియొక్క అంతిమాధిపత్యం యీ రంగాల్లో కూడ నెలకొల్పబడిందని నేను తలుస్తాను. కాని అది ఆ ప్రత్యేక రంగమే విధించిన పరిమితుల లోపల సంభవిస్తుంది: ఉదాహరణకు తత్వశాస్త్రంలో ఆర్థిక ప్రభావాలు (సాధారణంగా అవి తిరిగి రాజకీయాది ముసుగుల కిందనే పనిచేస్తాయి) పూర్వులనుండి వారసత్వంగా వచ్చి, అస్తిత్వంలోవున్న తాత్విక సమాచారంపైన పనిచేస్తాయి. ఇక్కడ ఆర్థిక వ్యవస్థ కొత్తగా దేన్నీ సృష్టించదు, కాని అస్తిత్వంలోవున్న ఆలోచనా సామగ్రి ఏవిధంగా మార్చబడేదీ, యితోధికంగా అభివృద్ధిచెయ్యబడేదీ — అదైనా అత్యధికభాగం పరోక్షంగా — ఆ పద్ధతిని అది నిర్ణయిస్తుంది. తత్వశాస్త్రంపై అత్యధికమైన ప్రత్యక్ష ప్రభావాన్ని నెరపేది రాజకీయ, న్యాయశాస్త్రపర, నైతిక ప్రతిబింబాలు కావడమే యిందుకు కారణం.

మతాన్ని గురించి అత్యవసరమైన విషయాలను ఫాయెర్‌బాఖ్‌పై నేను రాసిన పుస్తకంలోని చివరిభాగంలో చెప్పాను.*

అందుకని, ఆర్థిక చలనంయొక్క రాజకీయాది ప్రతిబింబాలు ఉద్యమం పైన అసలెటువంటి ప్రభావమూ కలిగించనే కలిగించవని మనం అంటున్నట్లు బార్త్ అభిప్రాయపడుతున్నట్లయితే, అతను వట్టినే గాలితో పోట్లాడుతున్నాడన్నమాట. అతను మార్క్స్ రచించిన "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"** ఒక్కటి చూస్తేనే చాలు. ఆ పుస్తకంలో దాదాపు ప్రత్యేకంగా రాజకీయ పోరాటాలూ, ఘటనలూ — అయితే ఆర్థిక పరిస్థితులపై వాటి సాధారణ పరాధీనతా పరిధిలోనే అనుకోండి — వహించే ప్రత్యేక పాత్ర చిత్రింపబడింది. లేకుంటే "పెట్టుబడి" గ్రంథం, ఉదాహరణకు పనిదినాన్ని గురించి చర్చించిన విభాగం చూడవచ్చు. ఉదాహరణకు, దానిలో శాసన నిర్మాణానికి — యిది నిశ్చయంగా రాజకీయ చర్యయే — ఎంతటి ప్రబలమైన ప్రభావముందో చిత్రింపబడింది. లేకుంటే బూర్జువా

---

* ఈ పుస్తకంలో 37–56 పేజీలు చూడండి. — సం.

** ఈ సంకలనంలోని మొదటి భాగంలో 121–236 పేజీలు చూడండి. — సం.

వర్గ చరిత్రపైన రాయబడిన విభాగాన్ని చూడవచ్చు (ప్రకరణం XXIV). లేక రాజకీయాధికారం ఆర్థికంగా శక్తిహీనమైనదైనట్లయితే, శ్రామికవర్గ నియంతృత్వంకోసం మనం ఎందుకు పోరాడుతాం? బలప్రయోగం (అంటే, రాజ్యాధికారం) కూడా ఒక రాజకీయ శక్తియే!

కాని ఆ పుస్తకాన్ని సమీక్షించేందుకు నాకు యిప్పుడు వ్యవధిలేదు. నేను మొట్టమొదట 3వ సంపుటాన్ని వెలువరచవలసివుంది, పైగా, ఉదాహరణకు బెర్న్‌స్టైన్ యీ అంశంపై చాలా శక్తివంతంగా రాయగలడని నేను అభిప్రాయపడుతున్నాను.

ఈ పెద్దమనుషులందరిలోనూ లోపమేమిటంటే గతితర్క అభావం. వాళ్లెప్పుడూ కూడా కారణాన్ని ఒకచోటా, పర్యవసానాన్ని ఎక్కడో మరోచోటా చూస్తారు. ఇక శుష్క అమూర్తభావన అనీ, అటువంటి అధిభౌతిక పరమ భిన్న విషయాలు వాస్తవ ప్రపంచంలో సంక్షోభకాలాల్లో మాత్రమే ఉంటాయనీ, అదే సమయంలో విస్తారమైన యావత్తు ప్రక్రియా పరస్పరవర్తన రూపంలో జరుగుతూవుంటుందనీ – యీ పరస్పరవర్తన అత్యంత అసమ శక్తుల మధ్యనే అయినప్పటికీ, ఆర్థిక చలనమే చాలవరకు మిక్కిలి బలీయమైన, మిక్కిలి మౌలికమైన, మిక్కిలి నిర్ణయాత్మకమైన పతివర్తన అనీ – యిక్కడ ప్రతీదీ సాపేక్షమైనదనీ, ఏదీకూడా పరమమైనదికాదనీ – దీన్ని వాళ్లెన్నడూ చూడనారంభించరు. వాళ్లకు సంబంధించినంతవరకు హేగెల్ అసలెన్నడూ అస్తిత్వంలోనే లేడు....

మొట్టమొదటిసారి పూర్తిపాఠం
"Sozialistische
Monatshefte" పత్రిక
20–21 సంచికలలో
1920లో ప్రచురింపబడింది

# బెర్లిన్‌లోని ఎఫ్. మేరింగ్‌కి ఎంగెల్స్

లండన్, 1893, జూలై 14

ప్రియమైన మేరింగ్‌గారూ,

దయతో మీరు పంపిన "లెస్సింగ్ గాథ" పుస్తకానికిగాను మీకు కృతజ్ఞతలు చెప్పకొనే తొట్టతొలి అవకాశం నాకీరోజుననే దొరికింది. ఆ పుస్తకం అందిందంటూ లాంఛన

ప్రాయంగా నాలుగు పొడి మాటలు రాయడం కాక దాన్నిగురించీ, దాని విషయాంశాలను గురించీ మీకేమైనా కొంత రాయాలనిపించింది. అందుకే యీ ఆలస్యం.

చిట్టచివరి అంశం — "చారిత్రక భౌతికవాదాన్ని గూర్చిన" అనుబంధం[82] — నుంచి నేను మొదలుపెడతాను. దానిలో విషయాలను చాల చక్కగా, నిష్పక్షపాతి అయిన ఏ వ్యక్తినైనా ఒప్పించే విధంగా మీరు వివరించారు. అందులో నాకేదైనా అభ్యంతరకరమైనది కనిపించిందంటే, నాకు యోగ్యమైన దానికన్న అధికతర ఆధిక్యతను మీరు నాకు ఆపాదించడమే అది. నాకు నేనుగా కనిపెట్టియుండగలిగిన వాటన్నింటినీ నేను లెక్కలోకి తీసుకున్నాకూడా — కాలక్రమం రీత్యా — మార్క్స్ తన శీఘ్రతర సమ్యగ్దర్శన శక్తితోనూ, మరింత విశాల దృష్టితోనూ యింకా చాలా శీఘ్రంగా వాటిని ఆవిష్కరించాడు. మార్క్స్ వంటి వానితో నలభై యేళ్లపాటు కలిసి పనిచేసే గొప్ప అదృష్టం ఎవనికైనా కలిగినప్పుడు, అతను తనకు యోగ్యమైనదనుకున్న గుర్తింపు, ఆయన జీవితకాలంలో సర్వసామాన్యంగా అతనికి లభించదు. మరి, ఆ యిద్దరిలోనూ గొప్పవ్యక్తి చనిపోయినప్పుడు, తక్కువవాడైన రెండో వ్యక్తికి అసలు ఉన్నదానికన్న తేలికగా ఎక్కువ విలువ ఆపాదింపబడుతుంది. మరి, నావిషయంలో యిప్పుడు సరిగా యిదే జరుగుతున్నట్లు కనిపిస్తోంది. చివరకు దీన్నంతనీ చరిత్ర సరిదిద్దుతుంది, మరైతే అప్పటికి అతను అయోమయంలో పడిపోతాడు, అప్పుడిక అతను తెలుసుకునేదేమీ వుండదు, దేన్ని గురించి తెలుసుకునేందుకూ ఏమీ వుండదు.

కాకపోతే, యింకొక్క అంశం మాత్రమే లోటు. అయితే మార్క్స్, నేనూ ఎప్పుడూ కూడా మా రచనల్లో దాన్ని నొక్కిచెప్పడంలో విఫలమయ్యాం. ఆ విషయంలో మనమంతా కూడా సమానంగా దోషులమే. నేను చెప్పదలుచుకున్నదేమిటంటే, రాజకీయ, న్యాయశాస్త్రపర, తదితర సైద్ధాంతిక భావాలన్నింటికీ, యీ భావాల సాధనం ద్వారా ఉత్పన్నమయ్యే కార్యాచరణలకూ మూలం ప్రప్రథమంగానూ, ప్రధానంగానూ మౌలికమైన ఆర్థిక వాస్తవాలలో ఉన్నదని మనమంతా నిర్ధారణచేసి చెప్పాం — అలా చెయ్యక తప్పదు కూడా. కాని అలా చెయ్యడంలో విషయ వస్తువుకే ప్రాధాన్యమిచ్చి, రీతి పార్శ్వాన్ని, అంటే యీ అభిప్రాయాలూ మొదలైనవి రూపొందే పద్ధతులను మనం నిర్లక్ష్యం చేశాం. దీని మూలంగా మన ప్రత్యర్థులకు దురభిప్రాయాలను కలిగించేందుకూ, వక్రీకరించేందుకూ చక్కని అవకాశం లభించింది. ఇందుకు కొట్టవచ్చేలా కనిపించే ఉదాహరణ పౌల్ బార్త్.

భావజాలం, చింతనాపరుడన్నవాడు చైతన్యయుతంగా సాధించిన ఒక ఆలోచనాక్రమం అన్నమాట నిజమే, కాని ఆ చైతన్యం నిజమైనది కాదు. నిజమైన ఏ ప్రేరేపక శక్తులైతే అతనిని ఆ ఆలోచనాక్రమానికి నెట్టాయో అవి అతనికి తెలియకుండానే ఉండిపోతాయి; లేకుంటే అది అసలొక భావజాలాత్మకమైన క్రమం అయ్యుండేదే కాదు. అందుకని అవాస్తవికమైన, లేక కుహనా ప్రేరేపక శక్తులను అతను ఊహించుకుంటాడు.

అదొక ఆలోచనాక్రమం గనుక, అతను దాని రీతినీ, విషయ వస్తువునూ కూడా కేవలం ఆలోచననుండే — ఆ ఆలోచన అతని సొంతదైనా కావచ్చు, లేక అతని పూర్వీకులదైనా కావచ్చు — నిర్ధారణ చేసుకుంటాడు. కేవలం ఆలోచన అన్న పదార్థంతోనే అతను పని చేస్తాడు. దాన్ని అతను పరిశీలించకుండా ఆలోచనోత్పాదితంగా స్వీకరిస్తాడు. ఆలోచనపై ఆధారపడని స్వతంత్రమైన, మరింత సుదూరమైన మూలాధారం ఏదైనా దానికి ఉందేమోనని అతను మరింతగా పరిశీలన జరపడు. అతనికి సంబంధించినంతవరకు నిజానికిది, సహజక్రమంలో యిలా జరుగుతుందని ఊహించిన విషయమే. సకల కార్యాచరణకూ ఆలోచనే మాధ్యమంగా ఉంటుందిగనుక, కార్యాచరణ చివరకు ఆలోచనపై ఆధారపడివుంటుందన్నట్లు అతనికి కనిపిస్తుంది.

ఈవిధంగా చారిత్రక సైద్ధాంతికుడు (చారిత్రక అన్న పదం యిక్కడ కేవలం రాజకీయ, న్యాయశాస్త్రపర, తాత్విక, మతశాస్త్రపర విషయాలన్నిటితో కూడిన — క్లుప్తంగా చెప్పాలంటే, ఒక్క ప్రకృతికే కాకుండా సమాజానికి సంబంధించిన అన్ని రంగాలతో కూడిన పదం) ప్రతి ఒక్క విజ్ఞానశాస్త్ర రంగంలోనూ పూర్వతరాల ఆలోచనలోనుండి స్వతంత్రంగా తనకు తానుగా రూపొంది, పరంపరాగతమైన యీ తరాల మెదళ్లలో తన సొంత స్వతంత్ర అభివృద్ధి క్రమాన్ని పొందిన సమాచారాన్ని కలిగియుంటాడు. ఒక రంగానికో, లేక మరో రంగానికో సంబంధించిన బాహ్య వాస్తవాలు యీ అభివృద్ధిపైన సహ నిర్ణాయక ప్రభావాన్ని బరపియుండవచ్చునన్నమాట నిజమే, కాని ప్రకటముగా చెప్పకపోయినా పూర్వగ్రాహ్యాంశం ఏమిటంటే, యీ వాస్తవాలమటుకు అవి సైతం ఆలోచనాక్రమ ఫలితాలే, అందుకని మనం యింకా కేవల ఆలోచనా రంగంలోనే — అత్యంత కటిక వాస్తవాలను సైతం అది విజయవంతంగా జీర్ణంచేసుకున్నదన్న సంగతి సుస్పష్టమే — ఉండిపోతాం.

ప్రతి ఒక విడి రాజ్యంలోని రాజ్యాంగచట్టాలయొక్క, న్యాయ వ్యవస్థలయొక్క, సైద్ధాంతిక భావనలయొక్క స్వతంత్ర చరిత్ర బాహ్య స్వరూపమే పలువురి కళ్లను మిరుమిట్లుగొలుపుతుంది. లూథర్, కాల్విన్‌లు అధికారిక కేథలిక్ మతాన్ని "అధిగమిస్తే," లేక హేగెల్, కాంట్ ఫీహ్టెలనూ లేక రూసో తన రిపబ్లికన్ "సోషల్ కాంట్రాక్టు"[83]తో పరోక్షంగా రాజ్యాంగచట్టవాది మాంటెస్క్యూనూ "అధిగమిస్తే," మతశాస్త్రంలోనూ, తత్వశాస్త్రంలోనూ లేక రాజకీయ విజ్ఞానశాస్త్రంలోనూ వుండే ఒక క్రమం యిది, యీ ప్రత్యేక ఆలోచనా రంగాల చరిత్రలో యిదొక దశకు ప్రాతినిధ్యం వహిస్తుంది, అంతేగాని యిదెన్నడూ ఆలోచనా రంగాన్ని దాటిపోదు. బూర్జువా ఉత్పత్తియొక్క నిత్యత్వ అంతిమత్వాలకు సంబంధించిన బూర్జువా భ్రమ కూడా తోడై, వాణిజ్యవాదులను ఫిజియోక్రాట్లూ,[84] ఆడమ్ స్మిత్తూ అధిగమించడం సైతం కేవలం ఆలోచనయొక్క విజయంగా పరిగణింపబడింది. మారిన ఆర్థిక వాస్తవ పరిస్థితులకు ఆలోచనా ప్రతిబింబంగా కాక సదా, సర్వత్రా

అస్తిత్వంలో వున్న వాస్తవ పరిస్థితులకు సంబంధించి చివరకు సాధింపబడిన సరైన అవగాహనగా పరిగణింపబడింది — నిజానికి, సింహ హృదయుడు రిచర్డ్, ఫిలిప్ ఔగుస్ట్‌లు దురాక్రమణపర దండయాత్రల్లో[85] యిరుక్కునేందుకు బదులు స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రవేశపెట్టివుంటే ఐదు శతాబ్దాల దైన్యమూ, మౌఢ్యమూ మనకు తప్పిపోయివుండేవి.

విషయంయొక్క యీ పార్శ్వాన్ని — దీన్ని నేనిక్కడ సూచనప్రాయంగా మాత్రమే ప్రస్తావించగలను — మనమందరం సముచితమైన దానికన్న ఎక్కువ నిర్లక్ష్యంచేశామని నేను భావిస్తున్నాను. ఇది పాత కథే: రూపం ఎప్పుడూకూడా మొట్టమొదట వస్తువుకోసం నిర్లక్ష్యంచెయ్యబడుతూ వుంటుంది. నేను చెప్పున్నాకదా, ఈ పొరపాటు నేనూ చేశాను, యీ పొరపాటు సంగతి నాకెప్పుడూ తర్వాత మాత్రమే స్ఫురించేది. అందుకని యీ అంశంపై మిమ్మల్ని నేనెంతమాత్రమూ తప్పు పట్టకపోవడమే కాకుండా — యీ తప్పు చేసిన వాళ్లలో మీకంటె ముందరి వాడినైన నాకు అలా దోషారోపణ చేసే హక్కు ఎంతమాత్రం లేదు — అందుకు భిన్నంగా నేనే దోషినిగా భావించుకుంటున్నాను. కాని అదే సమయంలో భవిష్యదుపయోగార్థం మీదృష్టిని యీ అంశంపైకి తెస్తున్నాను.

దీనితోబాటు సైద్ధాంతికులలో బుద్ధిహీనమైన మరో అభిప్రాయం ప్రచలితంగా వుంది. చరిత్రలో పాత్రవహించే వివిధ భావజాలాత్మక రంగాలకు స్వతంత్రమైన చారిత్రకాభివృద్ధి ఉందనడాన్ని మనం నిరాకరిస్తాం. కాబట్టి వాటికి చరిత్రపై ఎటువంటి ప్రభావమూ ఉండదనికూడా మనం అంటామన్నదే యీ అభిప్రాయం. కారణ పర్యవసానాలు రెండూ రెండు భిన్న ధృవాలన్న సాధారణ గతితర్కవిరుద్ధమైన భావనా, వీటిమధ్య పరస్పర ప్రతిచర్య బొత్తిగా ఉండదన్న భావనే యీ దురవగాహనకు ప్రాతిపదిక. ఈ పెద్దమనుషులు ఎప్పుడైతే ఒక చారిత్రకాంశం మరొక చారిత్రకాంశంచేతా, అంతిమంగా ఆర్థిక కారణాలచేతా ప్రపంచంలోకి తీసుకురాబడుతుందో, అది తన పరిసరాలపైనా, దాన్ని ఉత్పన్నం చేసిన కారణాలపైనా సైతం ప్రతివర్తిస్తుంది, ప్రతివర్తించగలదన్న సంగతిని తరచుగానూ, దాదాపు బుద్ధిపూర్వకంగానూ విస్మరిస్తూవుంటారు. ఉదాహరణకు, మతగురువ్యవస్థను గురించీ, మతాన్ని గురించీ బార్త్ రాసిన — మీ పుస్తకంలో 475వ పేజి — విషయాలు. ఇతగాడిని — అందరి ఊహలకూ మించిపోయిన నిస్సారత ఇతనిది — మీరు చిత్తుచేసిన తీరుచూసి నాకు చాలా సంతోషం కలిగింది; మరి వాళ్ళు లైప్జిగ్‌లో చరిత్ర ఆచార్యుణ్ణి చేసినది యితగాడినే! ఆ ముసిలాయన వాక్స్‌మత్ ఉన్నాడు చూడండి — అతను కూడా మందబుద్ధే అయినా వాస్తవాలపట్ల అతనికి విశేషమైన మన్ననభావం వుంది — అతను పూర్తిగా మరో రకం మనిషి.

మిగిలిన విషయాలకు సంబంధించినంతవరకు, యీ వ్యాసాలు "Neue Zeit" పత్రికలో వెలువడినప్పుడు వాటిని గురించి నేనేమి చెప్పానో యిప్పుడీ పుస్తకాన్ని గురించి

కూడ అదే తిరిగి చెప్పగలను: ప్రష్యన్ రాజ్యావిర్భావానికి సంబంధించి చాలవరకు యిది అత్యుత్తమ రచన. నిజానికిది, అత్యధిక విషయాల్లో వాటి అంతస్సంబంధాలను అతి సూక్ష్మ వివరాలదాకా నిర్దుష్టంగా విస్తరింపజేసిన ఒకేఒక మంచి రచన అనికూడా నేను చెప్ప వచ్చునేమో. బిస్మార్కు దాకా తదుపరి పరిణామమంతటినీ మీరు చేర్చలేకపోయారే అనే ఎవరికైనా విచారం కలుగుతుంది. అసంకల్పితంగానే మీరీ పనిని ఫ్రెడరిక్ విల్‌హెల్మ్ ఎలె క్టార్ (యువరాజు)నుండి వృద్ధ విల్‌హెల్మ్* దాకా సంపూర్ణమూ, సమగ్రమూ అయిన చిత్రణను – మరోమారు చేస్తారని సహజంగానే ఎవరైనా ఆశిస్తారు, మీరింతకు ముందే ప్రాథమిక పరిశోధనలు జరిపారు, కనీసం ప్రధానాంశాల్లోనైనా, అవి దాదాపుగా పూర్తి అయినట్లే. ఊగిసలాడే యీ పాత గుడిసె కుప్పకూలిపోయేందుకు ముందే, ఎటుతిరిగీ ఎప్పుడో ఒకప్పుడు యీ పనిని చెయ్యాల్సివుంది. వర్గపెత్తనాన్ని మరుగుపరచే రాజరికపు రద్దుకు ప్రత్యక్ష పూర్వావసరం కాకపోయినా, రాజరిక దేశభక్తియుత వీరగాథల శైథిల్యం (జర్మనీలో పరిస్థితుల కారణంగా శుద్ధ, బూర్జువా రిపబ్లిక్‌కి పురిట్లోనే సంధి కొట్టింది). అందుకు ఎలాగైనా అత్యంత శక్తివంతమైన మీటగానే పనిచేస్తుంది.

జర్మనీ సాధారణ దైన్యంలో ఒక భాగంగా ప్రష్యాయొక్క స్థానిక చరిత్రను చిత్రించేందుకు అప్పుడిక మీకు మరింత చోటూ, అవకాశమూ దొరుకుతాయి. ఇదిగో సరిగా యీ ఘట్టంలోనే మీ దృక్పథంతో, ప్రత్యేకించి జర్మనీ విచ్ఛిత్తికి గల ప్రాథమిక షరతులకూ, 16వ శతాబ్దంలో జర్మనీలో బూర్జువా విప్లవ వైఫల్యానికీ సంబంధించిన మీ అభిప్రాయంతో అక్కడక్కడ నేను విభేదిస్తాను. నా "రైతు యుద్ధం"** గ్రంథానికి చారిత్రకమైన ముందుమాట – రచనకు నేను తిరిగి పూనుకున్నప్పుడు – నేనీ పనిని రాబోయే శీతాకాలంలో చెయ్యగలనని ఆశిస్తున్నాను – పరిశీలనలో వున్న యీ అంశాలను నేను అందులో వివరించగలను. మీరు పేర్కొన్న విషయాలను నేను తప్పుగా పరిగణిస్తున్నానని కాక యితర అంశాలను వాటికి జోడిస్తాననీ, మరికొంత భిన్నంగా వాటిని సమకూరుస్తాననీ మాత్రమే దీని అర్థం.

జర్మన్ చరిత్రను – నిరంతర దుర్భరస్థితి కథను – అధ్యయనంచేసే క్రమంలో తత్కాలానుగుణమైన ఫ్రెంచి చారిత్రక దశలను సరిపోల్చినప్పుడు మాత్రమే, తులనాత్మక నిష్పత్తులకు సంబంధించిన సరైన అవగాహన ఏర్పడుతుంది. మన దేశంలో జరిగేదానికి అక్కడ జరిగేది పూర్తి విరుద్ధమైనది కావడమే దీనికి కారణం. సరిగా మనమిక్కడ

---

* మొదటి విల్‌హెల్మ్. – సం.

** Friedrich Engels, "Der deutsche Bauernkrieg" (ఫ్రెడరిక్ ఎంగెల్స్, "జర్మనీలో రైతు యుద్ధం"), మాస్కో. – సం.

అత్యంత దారుణ పతన దశలో ఉన్నప్పుడు, అక్కడ, చెల్లాచెదరుగా వున్న ఫ్యూడల్ రాజ్య భాగాలనుండి జాతీయ రాజ్యం సంస్థాపింపబడింది. మనకిక్కడ అంతకంతకు ఘోరమైన అవ్యవస్థ వుండగా, అక్కడ, యీ దశ అంతట్లోనూ అరుదైన వాస్తవిక హేతువాదం ప్రచలితంగా వుంది. అక్కడ, మధ్యయుగంలో, విదేశీ జోక్యానికి, ఉత్తరాది ఫ్రెంచి జాతీయతకూ వ్యతిరేకంగానూ ప్రొవాన్స్ రాష్ట్ర జాతీయతకు అనుకూలంగానూ జోక్యం చేసుకొనే ఆంగ్ల విజేత ప్రాతినిధ్యం వహించాడు. ఇంగ్లండుతో యుద్ధాలు, ఒకవిధంగా, విదేశీ ఆక్రమణదారులను వెళ్లగొట్టడంలోనూ, దక్షిణాదిని ఉత్తరాదివారు ఆక్రమించుకోడంలోనూ ముగిసిన ముప్పుయ్యేళ్ల యుద్ధానికి[86] ప్రాతినిధ్యం వహిస్తాయి. అటుతర్వాత కేంద్రాధికారానికీ, సామంత బుర్గుండికీ — తన విదేశీ వలసల సహాయం కలిగి, బ్రాండెన్ బుర్గ్ — ప్రష్యా పాత్ర వహించే బుర్గుండికీ — మధ్య పోరాటం ఆరంభమైంది. అయితే యీ పోరాటం కేంద్రాధికారపు విజయంతో ముగిసి, జాతీయ రాజ్యం నిర్ణయాత్మకంగా నెలకొల్పబడింది. సరిగా ఆ క్షణంలో మన దేశంలో జాతీయప్రభుత్వం (పవిత్ర రోమన్ సామ్రాజ్యంలోపల "జర్మన్ రాజ్యం"[87] జాతీయ రాజ్యంగా పిలవబడగలిగిన మేరకు) కూలిపోతుంది, భారీ ఎత్తున జర్మన్ భూభాగపు దోపిడి ప్రారంభమైంది. ఈ ఉపమానం జర్మన్లకు అత్యంత అవమానకరమైనది, కాని సరిగా అదే కారణంగా మరింత జ్ఞాన బోధకమైంది; మన కార్మికులు జర్మనీని చారిత్రకోద్యమ అగ్రభాగంలోకి తిరిగి తీసుకొచ్చారు గనుక గతానికి సంబంధించిన తలవంపులను దిగమింగడం మనకి మరికొంత తేలిక అవుతుంది.

జర్మనీ అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ప్రాముఖ్యం కలిగిన మరో లక్షణం ఏమిటంటే, చిట్టచివర జర్మనీని తమ మధ్య పంచుకున్న పాక్షిక రాజ్యాలు రెండింటిలోనూ ఏ ఒక్కటీ కూడా శుద్ధ జర్మన్ రాజ్యం కాదు — రెండూ కూడా ఆక్రమిత స్లావ్ భూభాగంపైననే వున్నాయి. ఆస్ట్రియా బవేరియన్ వలసా, బ్రాండెన్‌బుర్గ్ సాక్సన్ వలసా — మరి అవి జర్మనీ లోపల, విదేశ, జర్మనీయేతర రాజ్యభాగాల తోడ్పాటుపైన — ఆస్ట్రియా హంగరీ (బొహీమియా సంగతి చెప్పనే అక్కర్లేదు) తోడ్పాటుపైనా, బ్రాండెన్‌బుర్గ్ ప్రష్యా తోడ్పాటుపైనా — ఆధారపడి మాత్రమే అధికారాన్ని సంపాదించుకున్నాయి. అత్యధిక ప్రమాదంలో వున్న పశ్చిమ సరిహద్దుపైన ఆ రకమైన దేమీ సంభవించలేదు; ఉత్తర సరిహద్దుపైన డేన్‌లకు వ్యతిరేకంగా జర్మనీని కాపాడే భారం డేన్‌లకే వదలబడింది; ఇక దక్షిణాన కాపాడుకొనేందుకు ఎంత తక్కువ మిగిలిందంటే సరిహద్దు గస్తీ సైనికులైన స్విస్ వారు జర్మనీనుండి తెంపుకొని బయటపడటంలో సైతం సఫలురయ్యారు!

కాని నేను సవాలక్ష విషయేతరాంశాల్లోకి కొట్టుకుపోయినట్లుంది. నా యీ అధిక

ప్రసంగం, మీ రచన నాపైన ఎంత ఉత్తేజకరమైన ప్రభావాన్ని కలిగించిందో కనీసం మీరు తెలుసుకోడానికి రుజువుగా ఉపయోగపడుతుందని ఆశిస్తాను.

మరోమారు మీకు నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలతోనూ, అభివందనాలతోనూ

భవదీయుడు

ఎఫ్. ఎంగెల్స్

మొదటిసారిగా సంక్షిప్తరూపంలో
F. Mehring, "Geschichte der
Deutschen Sozialdemokratie"
Bd. III, Th. II, Stuttgart, 1898
అనే పుస్తకంలో ప్రచురింపబడింది

# బ్రెస్లోలోని డబ్ల్యు. బోర్గియుస్‌కి[88] ఎంగెల్స్

లండన్, 1894, జనవరి 25

మహాశయా,

మీ ప్రశ్నలకు యీకింద సమాధానాలిస్తున్నాను:

1. వేటినైతే సమాజ చరిత్రయొక్క పునాదిని నిర్ధారణచేసేవిగా మనం పరిగణిస్తున్నామో ఆ ఆర్థిక సంబంధాలను ఒకానొక సమాజంలో మనుషులు తమ జీవితావసర వస్తువులను ఎలా, ఏ పద్ధతిలో ఉత్పత్తిచేసుకుంటారు, ఆ ఉత్పాదితాలను (శ్రమవిభజన అస్తిత్వంలో ఉన్నమేరకు) తమమధ్య ఎలా, ఏ పద్ధతిలో మార్పిడిచేసుకుంటారు అన్నదాన్నిబట్టి, మనం అర్థంచేసుకుంటాం. ఈవిధంగా, ఉత్పత్తి రవాణాలయొక్క యావత్తు సాంకేతిక విజ్ఞానం యిక్కడ యిమిడివుంది. మన అవగాహనమేరకు మార్పిడి విధానాన్నీ పద్ధతినీ, అంతేకాకుండా ఉత్పాదితాల పంపిణీనీ, దానితోబాటు, గణ సమాజ విచ్ఛిత్తి అనంతరం, వర్గాలలోకి సమాజ విభజనను సైతమూ, తత్కారణంగా ప్రభుతత్వ బానిసత్వాల మధ్యా, వాటితోబాటే రాజ్యం, రాజకీయాలు, న్యాయవ్యవస్థ మొదలైనవాటి మధ్యా సంబంధాలనూ కూడా యీ సాంకేతిక విజ్ఞానమే నిర్ణయిస్తుంది. ఈ ఆర్థిక సంబంధాలలో, దేనిమీదనైతే అవి ప్రభావాన్ని బరపుతాయో ఆ భౌగోళిక పునాదీ, — ఏ దశలైతే వాస్తవానికి సంక్రమింపజెయ్యబడి, మిగిలివున్నాయో ఆ పూర్వ ఆర్థికాభివృద్ధి దశల అవశేషాలూ — తరచుగా

సంప్రదాయం ద్వారానూ లేక జడత్వం మూలంగానూ యివి మిగులుతాయి, యీ సమాజాన్ని ఆవరించియుండే బాహ్య వాతావరణమూ కూడా విధిగా యిమిడివుంటాయి.

మీరు చెప్పినట్లుగా, సాంకేతిక విజ్ఞానం ఎక్కువగా విజ్ఞానశాస్త్ర స్థాయిపైన ఆధారపడేమాటైతే, విజ్ఞానశాస్త్రం మరింత అధికంగా సాంకేతిక విజ్ఞానపు స్థాయి అవసరాలపైనా ఆధారపడివుంటుంది. సమాజానికి ఒక సాంకేతిక అవసరం వున్నట్లయితే, ఆ అవసరం విజ్ఞానశాస్త్ర పురోగతికి పది విశ్వవిద్యాలయాలకన్న ఎక్కువగా తోడ్పడుతుంది. 16, 17వ శతాబ్దాల్లో యావత్తు జలస్థితి విజ్ఞానమూ (టోరిచెల్లీ మొదలైనవారు) ఇటలీలో పర్వత ప్రవాహాలను నియంత్రితంచెయ్యవలసిన ఆవశ్యకతచేతనే ఆవిర్భవించి, అభివృద్ధిచెందింది. విద్యుత్తుయొక్క సాంకేతిక అన్వయయోగ్యత కనుగొనబడిన తర్వాతనుండి మాత్రమే విద్యుత్తును గురించి తగుమాత్రంగా మనకేమైనా తెలిసింది. కాని దురదృష్టవశాత్తూ జర్మనీలో విజ్ఞానశాస్త్రాల చరిత్రను, అవెక్కడో ఆకాశంలోంచి ఊడిపడినట్లు రాయడం ఆచారమైపోయింది.

2. ఆర్థిక పరిస్థితులను, చారిత్రకాభివృద్ధిని అంతిమంగా నియంత్రితం చేసేవిగా మనం పరిగణిస్తాం. కాని దానికి అదిగా నరజాతియే ఒక ఆర్థిక అంశం. అయితే యిక్కడ రెండు అంశాలను మనం విస్మరించకూడదు:

అ) రాజకీయ, న్యాయశాస్త్రపర, తాత్విక, మత, సాహిత్య, కళాదుల అభివృద్ధి ఆర్థికాభివృద్ధిపై ఆధారపడివుంది. కాని యివన్నీ పరస్పరం ఒకదానిమీద మరొకటీ, మరి అలాగే యివి ఆర్థిక పునాదిపైనా ప్రతివర్తిస్తాయి. మిగిలిన ప్రతీదీ క్రియారహిత పర్యవసానం మాత్రమే కాగా ఆర్థిక పరిస్థితే కారణమనీ, క్రియాశీలమైన ఏకైక అంశమనీ దీని అర్థం కాదు. వాస్తవానికి ఆర్థికావశ్యకత ప్రాతిపదికపైన పరస్పరవర్తన వుంటుంది, చివరకు యిదే తనను తాను సదా సమర్థించుకొంటుంది. ఉదాహరణకు రక్షణసుంకాల ద్వారా, స్వేచ్ఛావాణిజ్యం ద్వారా, మంచో చెడో పన్నుల విధానం ద్వారా రాజ్యం ప్రభావాన్ని బరపుతుంది. 1648కీ 1830కీ మధ్య జర్మనీయొక్క హీన ఆర్థిక పరిస్థితినుండి ఉత్పన్నమై, మొదట ధర్మనిష్ఠ[89] పునరుద్ధరణోద్యమంలోనూ, అటుతర్వాత భావావేగ ధోరణిలోనూ, రాజులకూ, ప్రభువులకూ అధమ దాస్యవృత్తిలోనూ వ్యక్తమైన జర్మన్ కూపస్థమండూకపు ప్రాణాంతకమైన విషస్వభావానికీ, చేతకానితనానికీ ఆర్థిక పర్యవసానం లేకుండా పోలేదు. కోలుకోడానికిగల అతిపెద్ద అవరోధాలలో అదొకటై, విప్లవాత్మక, నెపోలియన్ యుద్ధాలు దీర్ఘకాల దైన్యాన్ని మరింత నిశితం చేసేదాకా తొలగింపబడలేదు. కాగా, అక్కడక్కడ జనం వాటంగా ఊహించుకొన ప్రయత్నిస్తున్నట్లు, ఆర్థిక పరిస్థితి తనకు తనే ఫలితాన్ని కలిగించదు. ఎంతమాత్రం కలిగించదు. మానవులు తమ చరిత్రను తామే నిర్మించుకుంటారు, అయితే చరిత్రను నిబంధించే ఒకానొక నిర్దిష్ట పరిసరాల్లోనూ,

అంతకుముందే వున్న వాస్తవ సంబంధాల ప్రాతిపదికపైనా మాత్రమే వారలా చేస్తారు — వీటిలో ఆర్థిక సంబంధాలు — అవెంతగా రాజకీయ, భావజాలాత్మక సంబంధాలచేత ప్రభావితం చెయ్యబడినప్పటికీకూడా — అంతిమంగా నిర్ణయాత్మకమైనవిగా వుంటాయి, వాటన్నింటికీ మధ్య పూసల్లో దారంలా వుండి, అవి మాత్రమే అవగాహనకు దారితీస్తాయి.

ఆ) మానవులు తమ చరిత్రను తామే నిర్మించుకుంటారు, కాని ఒకానొక సమష్టి పథకానికో లేక ఒక నిర్దిష్టమైన, హద్దులు నియమించబడిన సమాజానికో అనుగుణమైన సమష్టి సంకల్పంతో మాత్రం వారీ పని చెయ్యరు. వారి ఆకాంక్షలు విభేదిస్తాయి, మరి సరిగా ఆకారణంగానే అటువంటి సమాజాలన్నీ ఆవశ్యకతచేత — దీని పూరకాంశమూ, యిది ప్రత్యక్షమయ్యే రూపమూ యాదృచ్ఛిక ఘటనయే — శాసింపబడుతాయి. సమస్త యాదృచ్ఛికతకూ విరుద్ధంగా తనను తాను స్థిరంగా ప్రకటించుకొనే యీ ఆవశ్యకత తిరిగి చివరకు ఆర్థిక ఆవశ్యకతయే. ఇదిగో సరిగా యిక్కడే మహావ్యక్తుల విషయం పరిశీలనాంశమవుతుంది. అదిగో ఆ ఫలానా వ్యక్తి, సరిగా ఆ వ్యక్తి మాత్రమే ఒకానొక ప్రత్యేక దేశంలో, ఒకానొక ప్రత్యేక కాలంలో ఉద్భవించడమన్నది కేవలం యాదృచ్ఛికాంశం మాత్రమేననడం స్పష్టం. కాని అతన్ని వేరుచేసి చూడండి, అక్కడొక ప్రత్యామ్నాయపు అవసరం కనిపిస్తుంది. మరి యీ ప్రత్యామ్నాయ వ్యక్తి — మంచికో, చెడుకో — ఉద్భవిస్తాడు, చిట్టచివరకు ఉద్భవించితీరుతాడు. ఆ నెపోలియన్ — తన సొంత యుద్ధకాండతో నిస్త్రాణమైన ఫ్రెంచి రిపబ్లిక్‌చేత ఆవశ్యకమొనర్చబడిన సరిగా ప్రత్యేకమైన ఆ కార్సికనే సైనిక నియంత కావడమన్నది యాదృచ్ఛిక విషయం. కాని, ఒక నెపోలియన్ లేకపోయివుంటే, అతని స్థానాన్ని మరొకడు ఆక్రమించియుండేవాడన్న విషయం, ఒకానొక వ్యక్తి అతను సీజరు, ఆగస్టస్, క్రామ్వెల్ వగైరా ఎవరైనాకూడా — ఎప్పుడైనాసరే అవసరమైన వెంటనే సదా ఆవిర్భవిస్తూవుంటాడన్న వాస్తవాన్నిబట్టి రుజువవుతుంది. మార్క్స్ చారిత్రక భౌతికవాదాన్ని కనుగొన్నాడు, అయితే త్యెరీ, మిన్యే, గిజోలూ, 1850దాకా సకల ఆంగ్ల చరిత్రకారులూ దీనికోసం కృషిచేస్తున్నారన్న సంగతే యిందుకు రుజువు. సరిగా యిదే భావనను మోర్గన్ కనుగొనడమన్నది దీనికి సమయం పక్వమైనదనీ, యిది కనుగొనబడి తీరవలసివుందనే విషయాన్ని నిరూపిస్తోంది.

చరిత్రయొక్క ప్రకటిత యాదృచ్ఛిక ఘటనలతోబాటు తదితర యాదృచ్ఛిక ఘటనలన్నింటికీ, యిది వర్తిస్తుంది. మనం పరిశీలిస్తున్న ప్రత్యేక రంగం ఆర్థిక రంగంనుంచి మరింత దూరంచెయ్యబడి శుద్ధ అమూర్త భావజాలానికి దగ్గరయ్యేకొద్దీ, తన అభివృద్ధి క్రమంలో అది యాదృచ్ఛికాంశాలను ప్రదర్శించడాన్ని మనం మరింత అధికంగా చూస్తాం, దాని వక్రరేఖ మరింత ఎగుడుదిగుడుగా సాగడాన్ని మనం చూస్తాం. కాని ఆ వక్రరేఖయొక్క కొసలను కలిపే సగటు అక్షరేఖను మీరు గీసినట్లయితే, యీ అక్షరేఖ అంతకంతకు అధి

కంగా ఆర్థికాభివృద్ధి రేఖకు దాదాపు సమానాంతరంగా వున్నట్లు — మనం పరిగణనలోకి తీసుకునే కాలం దీర్ఘతరమయ్యేకొద్దీ, మనం పరిశీలించే రంగం మరింత విస్తృతమయ్యే కొద్దీ — మీరు కనుగొంటారు.

జర్మనీలో సరైన అవగాహనకు అతి పెద్ద అవరోధం ఏమిటంటే ఆర్థిక చరిత్రను సాహిత్యం బాధ్యతారహితంగా అలక్ష్యంచెయ్యడం. ఎవరికైనా స్కూల్లో చరిత్రకు సంబంధించి తన బుర్రలోకి చొప్పించబడిన భావాలను ఉపయోగించే అలవాటునుండి తప్పుకోవడం ఒక్కటి మాత్రమే కష్టంకాదు, అలా చేసేందుకు అవసరమైన సమాచారాన్ని జీర్ణించుకోవడం కూడ అత్యంత కష్టతరమే. ఉదాహరణకు, వృద్ధ జి. ఫన్ గ్యూలిహ్ రచనను — అది సమాచారపు శుష్కమైన కూర్పే[90] అయినప్పటికీ దానిలో అసంఖ్యాకమైన రాజకీయ వాస్తవాల స్పష్టీకరణకు అవసరమైన బోలెడంత సామగ్రి వుంది — ఎవరు చదివారు!

మిగిలిన విషయాలకు సంబంధించి, "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"*లో మార్క్స్ యిచ్చిన చక్కని ఉదాహరణ — అది వాస్తవికమైన ఉదాహరణ కనుక — మీ ప్రశ్నలకు సమాధానంగా చాలవరకు సమాచారాన్ని సమకూరుస్తుంది. ఈ అంశాల్లో చాలవాటిని గురించి "యాంటీ-డ్యూరింగ్," భాగం I, 9–11 ప్రకరణాలలోను, భాగం II, 2–4 ప్రకరణాల్లోను, భాగం III, 1వ ప్రకరణంలోను లేక ముందు మాటలోను, అంతేకాకుండా "ఫాయెర్‌బాఖ్**యొక్క చివరి భాగంలోను నేను కూడ ప్రస్తావించాననుకుంటాను.

దయచేసి నేను పైన రాసిన ప్రతిమాటనూ తు.చ తప్పకుండా గణనలోకి తీసుకోక సాధారణ సారాంశాన్ని మాత్రమే మనసులో పెట్టుకోవలసిందిగా కోరుతున్నాను. నేను మీకిప్పుడు రాసిన విషయాన్ని ప్రచురణకైతే ఎలా రాసివుందునో అంత కచ్చితమైన మాటల్లో రాసేందుకు నాకు వ్యవధి చిక్కనందుకు విచారిస్తున్నాను....

మొట్టమొదటిసారి
"Der sozialistische Akademiker" పత్రిక
20వ సంచికలో, 1895లో
ప్రచురింపబడింది

---

* ఈ సంకలనంలో మొదటి భాగంలో 121–236 పేజీలు చూడండి. — సం.

** ఈ పుస్తకంలో 7–56 పేజీలు చూడండి. — సం.

# వివరణలు

[1] ఎంగెల్స్ రచించిన "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి" మార్క్సిస్టు ప్రపంచ దృక్పథం ఏవిధంగా ఆవిర్భవించిందో, దాని సారమేమిటో తెలియజేస్తుంది. గతితార్కిక, చారిత్రక భౌతికవాద మౌలిక సూత్రాలను అది క్రమబద్ధంగా విశదీకరించి, మార్క్సిజానికీ, తాత్వికరంగంలో మార్క్సిజానికి పూర్వ ధోరణులకూ — వీటికి జర్మన్ సాంప్రదాయిక తత్వశాస్త్రపు ప్రముఖ ప్రతినిధులైన హేగెల్, ఫాయెర్‌బాఖ్‌లు ప్రతినిధులు — మధ్యగల సంబంధాన్ని వెల్లడిస్తుంది.

తత్వశాస్త్రపు చరిత్ర అంతటిలోనూ దానికిగల అతి ముఖ్యమైన లక్షణాన్ని — భౌతికవాదం, భావవాదం అనే రెండు శిబిరాలమధ్య పోరాటాన్ని — ఎంగెల్స్ యీ పుస్తకంలో చూపాడు. మొట్టమొదటిసారిగా ఎంగెల్స్ తత్వశాస్త్ర మౌలిక సమస్య — ఆలోచనకూ, అస్తిత్వానికీ మధ్య, ఆత్మకూ ప్రకృతికీ మధ్య సంబంధం — యొక్క ప్రామాణికమైన నిర్వచనాన్ని దీనిలో యిచ్చాడు.

ఏ తత్వవేత్త అయినా తత్వశాస్త్ర మౌలిక సమస్యపట్ల ఎటువంటి వైఖరి తీసుకుంటాడన్న దాన్నిబట్టి, అతను ఏ తాత్విక శిబిరానికి చెందుతాడన్నది నిర్ధారితమవుతుంది.

భౌతికవాదానికీ, భావవాదానికీ మధ్య రాజీ కుదిర్చి, తద్వారా ఒక మధ్యంతర తత్వశాస్త్రాన్ని [ద్వంద్వవాదం (dualism), లేక అజ్ఞేయతావాదాన్ని (agnosticism)] సృష్టించాలన్న ప్రయత్నాలన్నీ వృధాయేనని నొక్కి వక్కాణిస్తూ, అజ్ఞేయతావాదాన్ని, దాని అన్ని రూపాల్లోనూ ఖండించి, యీ అజ్ఞేయతావాదాన్నీ, "తదితర తాత్వికమైన వైరితలలన్నింటినీ చిత్తుగా ఖండించేది ఆచరణ, అనగా ప్రయోగమూ, పరిశ్రమే" అని ఎంగెల్స్ పేర్కొన్నాడు. (పేజి 21 చూడండి.)

తన గతితార్కిక భౌతికవాద సూత్రీకరణద్వారా తత్వశాస్త్రంలో మార్క్స్ తెచ్చిన విప్లవ సారాంశాన్ని ఎంగెల్స్ విపులీకరించాడు. మానవ సమాజంలో పనిచేసే సాధారణ

అభివృద్ధి సూత్రాల నిర్వచనకు తోడ్పడిన చారిత్రక భౌతికవాద సంగ్రహ సారాంశాన్ని ఆయన కూలంకషంగా పరిశీలించాడు. ఆర్థిక సంబంధాలు చారిత్రక క్రమాన్నీ, రాజకీయ వ్యవస్థయొక్క మత, తత్వశాస్త్రాలతోబాటు సామాజిక చైతన్యంయొక్క సమస్త రూపాల, రకాల స్వభావాన్నీ నిర్ధరిస్తాయన్న వాస్తవాన్ని ఎంగెల్స్ గమనిస్తాడు. అదే సమయంలో ఆయన భావజాలాత్మక ఉపరి నిర్మాణాలు వహించే క్రియాశీలమైన పాత్రను గురించీ, స్వతంత్రంగా అభివృద్ధిచెంది ఆర్థిక ప్రాతిపదికపై పరస్పర ప్రభావాన్ని బరపే వాటి సామర్థ్యాన్ని గురించీ నొక్కిచెప్తాడు.

వర్గ సమాజాల చరిత్రక్రమమంతట్లోనూ తాత్విక ధోరణులమధ్య సాగిన పోరాట పూర్వరంగంలో తత్వశాస్త్రపు పార్టీతత్వ సూత్రాన్ని నిదర్శనపూర్వకంగా స్థాపించినందుకూ, వర్గాలయొక్క, పార్టీలయొక్క పోరాటాన్ని ప్రతిబింబించినందుకూ ఎంగెల్స్ బహుధా ప్రశంసనీయుడు. ఎంగెల్స్ రచించిన యీ పుస్తకం శ్రామికవర్గ సిద్ధాంత బద్ధతకూ, సూత్రబద్ధమైన తాత్విక ఆలోచనకూ ఒక నిదర్శన. – 7.

2 "Die Neue Zeit" ("నూతన కాలం") – జర్మన్ సోషల్-డెమోక్రటిక్ ఉద్యమంయొక్క సిద్ధాంత పత్రిక. ఇది 1883నుండి 1923వరకు ష్టుట్‌గార్ట్ నుండి ప్రచురింపబడింది. 1885–1894 మధ్య ఎంగెల్స్ రచించిన పలు వ్యాసాలను యీ పత్రిక వరుసగా ప్రచురించింది. – 8.

3 1833–34లో హైన్‌రిఖ్ హైనె రచించిన "Die romantische Schule" ("రొమాంటిక్ ధోరణి" – Romantic School), "Zur Geschichte der Religion und Philosophie in Deutschland" ("జర్మనీలో మతం, తత్వశాస్త్రాల చరిత్ర") అనే పుస్తకాలు ప్రచురింపబడ్డాయి. జర్మనీలో రాబోయే ప్రజాతంత్ర విప్లవానికి జర్మన్ తాత్విక విప్లవమూ, దాని ఉచ్ఛదశ అయిన హెగెల్ తత్వశాస్త్రమూ భూమిక అనే భావాన్ని హైనె యీ పుస్తకాల్లో ప్రతిపాదించాడు. – 10.

4 హెగెల్ రచించిన "న్యాయశాస్త్ర తత్వం. ముందుమాట"నుంచి ఉల్లేఖన. – 10.

5 ధర్మనిష్ఠ పునరుద్ధరణోద్యమం – 17వ శతాబ్దాంతంలోనూ, 18వ శతాబ్దపు ప్రథమార్ధంలోనూ పశ్చిమ యూరపియన్ దేశాల ప్రొటెస్టెంటులలో ప్రబలంగా వ్యాపించిన మత, గూఢతాంత్రిక సంస్కర్తల ఉద్యమానికి పెట్టబడిన పేరు. ఈ ఉద్యమం నెదర్లాండ్స్, జర్మనీలలో ప్రారంభింపబడింది. ఈ ధర్మనిష్ఠ పునరుద్ధరణోద్యమం ఒక మతశాఖ కాదు, హేతువాదానికీ, పునర్వికాస యుగ తత్వశాస్త్రానికీ వ్యతిరేకంగా ఉద్దేశింపబడిన ఉద్యమం. – 16.

6 "Deutsche Jahrbücher für Wissenschaft und Kunst" ("విజ్ఞానశాస్త్ర, కళా జర్మన్ వార్షిక సంచికలు") – లైప్జిగ్‌లో 1841 జూలైనుండి, 1843 జనవరి వరకు ప్రచురింపబడిన యువ హేగెలియన్ల సాహిత్య, తాత్విక పత్రిక. – 16.

7 "Rheinische Zeitung für Politik, Handel und Gewerbe" ("రాజకీయాలకు, వాణిజ్య, పరిశ్రమలకు సంబంధించిన రైనిషె పత్రిక") – జర్మన్ దినపత్రిక. దీని ప్రచురణ కొలోన్‌లో 1842 జనవరి 1నుంచి 1843 మార్చి 31 వరకు జరిగింది. 1842 ఏప్రిల్‌నుంచి మార్క్స్ దానికి వ్యాసాలు రాశాడు, అక్టోబరు నుంచి దాని సంపాదకవర్గంలో చేరాడు. – 16.

8 మాక్స్ ష్టిర్నెర్ రచించిన "Der Einzige und sein Eigenthum" ("సాటి లేనివాడూ, అతని ఆస్తీ")కి యిది ప్రస్తావన. ఈ పుస్తకం లైప్జిగ్‌లో 1845లో ప్రచురింపబడింది. – 17.

9 జర్మన్, లేక "అసలైన" సోషలిజానికి యిది ప్రస్తావన. ఈ అభివృద్ధినిరోధక ధోరణి, 1840 దశకంలో, జర్మనీలో ప్రధానంగా పెటీబూర్జువా మేధావుల మధ్య విస్తృతంగా వ్యాపించింది. మార్క్స్ ఎంగెల్స్‌లు "కమ్యూనిస్టు ప్రణాళిక"లో యీ ధోరణిని గురించి వర్ణించారు (మొదటి భాగంలో 72–74 పేజీలు చూడండి). – 18.

10 శుష్కతార్కికవాదం – మధ్యయుగపు మత సిద్ధాంతమైన తాత్విక ధోరణి. అత్యంత అనిర్దిష్టీకరణ, వాస్తవ జీవితంనుండి పూర్తిగా వేరుపడటం ఈ ధోరణి లక్షణాలు. క్రైస్తవ చర్చియొక్క మూఢ విశ్వాసాలన్నిటినీ, అనేకమైన తార్కిక కుయుక్తులతో యిది సమర్థించ యత్నిస్తుంది. – 20.

11 ఇక్కడ ఉదహరింపబడిన గ్రహం నెప్ట్యూన్ (వరుణ గ్రహం). ఈ గ్రహాన్ని 1846లో జర్మన్ ఖగోళ శాస్త్రజ్ఞుడు యోహన్ గాలే కనుగొన్నాడు. – 22.

12 అజ్ఞేయతావాదం – ఇది ఒక భావవాద సిద్ధాంతం. దాని ననుసరించి ప్రపంచం అజ్ఞేయం, మానవుని తర్కజ్ఞానం పరిమితం, మానవేంద్రియానుభూతులను మించి ఏమీ తెలుసుకోలేము. కొందరు అజ్ఞేయతావాదులు భౌతిక ప్రపంచపు వాస్తవిక ఉనికిని గుర్తిస్తారు. కాని దానిని గ్రహించగలమనే విషయాన్ని నిరాకరిస్తారు. మరికొందరు భౌతిక ప్రపంచం ఉనికినే నిరాకరిస్తారు. తన ఇంద్రియానుభూతిని మించి అదనంగా ఏదైనా ఉన్నదీ లేనిదీ మానవుడు తెలుసుకోలేడని వారి వాదన. – 22.

13 పాంథీయిజం — ప్రకృతికి దైవత్వం ఆరోపించే తాత్విక సిద్ధాంతం; భగవంతుణ్ణి ప్రకృతి సృష్టికర్తగా భావించే భావవాదానికి భిన్నంగా పాంథీయిజం ప్రకృతీ, భగవంతుడూ అభేద్యమని వాదిస్తుంది. — 22.

14 18వ శతాబ్దం అన్నమాట. — 24.

15 18వ శతాబ్దంలో రసాయనశాస్త్రానికి సంబంధించి వ్యాప్తిలో వున్న అభిప్రాయాల ప్రకారం ఫ్లోజిస్టన్ దాహ్య పదార్థాలలోని జ్వలన తత్వమనీ, దహనక్రమంలో అది విముక్తమవుతుందనీ తలచబడింది. విఖ్యాత ఫ్రెంచి రసాయనశాస్త్రవేత్త లావుయిజ్యే దహన ప్రక్రియకు సంబంధించి సరైన వివరణనిచ్చి, అది ఆక్సిజనుతో దాహ్య పదార్థాల రసాయనిక సంయోగమేనని నిరూపించి, ఫ్లోజిస్టన్ సిద్ధాంతంయొక్క అసంగతత్వాన్ని బహిర్గతంచేశాడు. — 24.

16 నిశ్చిత ఆజ్ఞార్థకం (categorical imperative) — కాంట్ భావవాద నీతిశాస్త్రంలో నీతి ధర్మంయొక్క భావం. ఈ నీతి సిద్ధాంతం ప్రకారం సాధారణ నీతి నియమాలు ఉంటాయి. దానికి సార్వత్రిక, అత్యావశ్యక, అనుభవంతో నిమిత్తం లేని స్వభావం వుంది. తమ ఆచారాలలో మనుషులు ఆ నియమాన్ని పాటించాలి. — 27.

17 డేయిజం — ఒక మతతాత్విక ధోరణి. దాని ప్రకారం దృష్టిలో దేవుడు నిరాకారుడు, కాని విశ్వానికి హేతుపూర్వకమైన ప్రాథమిక కారకుడు. అయితే ఇతడు ప్రకృతిలోను, మానవ జీవితంలోను జోక్యం కలిగించుకోడు. — 28.

18 "సడోవా ఉపాధ్యాయుడు" — 1866 నాటి సడోవా యుద్ధంలో ప్రష్యన్లు విజయం సాధించినమీదట, జర్మన్ బూర్జువా పత్రికా రచయితలు తరుచుగా వాడుతున్న పదం యిది. ప్రష్యన్ విజయానికి ప్రష్యన్ పౌర విద్యావిధానపు ఆధిక్యతయే కారణమన్నదే దీనిలో సూచ్యార్థం. — 35.

19 జర్మనీలో 1848–49 నాటి బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి ప్రస్తావన యిది. —37.

20 మొదటి నెపోలియన్ సామ్రాజ్య పతనానంతరం 1815లో యూరపియన్ దేశాలు కుదుర్చుకున్న అంతర్జాతీయ దౌత్య ఒప్పందాలకూ, వియన్నా కాంగ్రెస్ (1814–15) నిర్ణయాలకూ ప్రస్తావన ఇది. — 46.

21 1814–30 నాటి పునరుద్ధరణ — ఫ్రాన్సులో బూర్బన్ రాజవంశపు రెండవ

పాలన కాలం. కులీన ప్రభువుల, మతగురువుల ప్రయోజనాలను బలపరచిన బూర్బన్ల అభివృద్ధి నిరోధక పాలన 1830 జూలై విప్లవంచేత కూల్చివెయ్యబడింది. – 46.

22 ఇక్కడా, ఆ తర్వాత "Code civil" (కోడ్ నెపోలియన్) అను ప్రస్తావన వచ్చిన ప్రతి సందర్భంలోనూ, ఎంగెల్స్ మొత్తం బూర్జువా న్యాయవ్యవస్థనంతా ప్రస్తావిస్తున్నాడు. ఇందులో అయిదు న్యాయసంహితలున్నాయి (సివిల్, సివిల్ ప్రొసీజర్, కమెర్షియల్, క్రిమినల్, క్రిమినల్ ప్రొసీజరు). వీటిని 1804–10 సంవత్సరాల మధ్య నెపోలియన్ బోనపార్ట్ జారీచేశాడు. ఈ న్యాయసంహితలు నెపోలియన్ ఫ్రాన్సుచే స్వాధీనంచేసుకోబడిన పశ్చిమ, వాయవ్య జర్మనీ ప్రాంతాలలో అమలు జరిగాయి. 1815లో ఈ ప్రాంతాలు ప్రష్యాకు దత్తంచేయబడిన తర్వాత కూడా ఈ న్యాయ సంహితలు కొనసాగాయి. – 49.

23 పునర్వికాస కాలం – పశ్చిమ, మధ్య యూరప్‌కు చెందిన పలు దేశాలలో పెట్టుబడిదారీ సంబంధాల ఆవిర్భావ కారణంగా వచ్చిన సాంస్కృతిక, భావజాలాత్మక అభివృద్ధి దశ. 15వ శతాబ్ది మధ్యనుండి 16వ శతాబ్దం చివరి దాకా విస్తరించిన దశ యిది. మొత్తం మీద యీ దశలో కళలూ, విజ్ఞానశాస్త్రాలూ సత్వరాభివృద్ధి చెందాయి, ప్రామాణిక గ్రీకు, రోమన్ సంస్కృతిపట్ల ఆసక్తి పునర్జాగృతం అయింది. పునర్వికాస దశను గూర్చిన అభివర్ణనను ఎంగెల్స్ "ప్రకృతి గతితర్కం" అనే పుస్తకానికి తన ఉపోద్ఘాతంలో ఇచ్చాడు. – 51.

24 స్టోయిక్ తత్వశాస్త్రం – ప్రాచీన గ్రీసులో క్రీ. పూ. 4వ శతాబ్దిలో ఆవిర్భవించి క్రీ. శ. 6వ శతాబ్దివరకు సాగిన ఒక తాత్విక ధోరణి. స్టోయిక్‌లు భౌతికవాదానికీ భావవాదానికీ మధ్య ఊగిసలాడారు; వారు ఆత్మ అమరమనీ, మానవుడు విధికి దాసుడనీ, దుర్మార్గాన్ని వ్యతిరేకించకూడదనీ ప్రచారం చేశారు. వారి సిద్ధాంతం క్రైస్తవ మతం రూపొందడంలో గణనీయమైన ప్రభావాన్ని బరపింది. – 52.

25 నికే సమితి – రోమన్ సామ్రాజ్యంలోని క్రైస్తవ మతగురువుల మొదటి మత సమావేశం. మొదటి కొంస్తంతీన్ చక్రవర్తిచే ఆసియా మైనర్‌లోని నికేలో క్రీ. శ. 325లో ఏర్పరచబడ్డది. ఈ సమితి నికేనే నిబంధనలనబడేవాటిని ఆమోదించింది. క్రైస్తవులందరూ యీ నిబంధనలను ఆమోదించితీరాలి. – 52.

26 ఆల్బిగెన్స్ (అల్బి పట్టణంనుంచి యీ పేరు వచ్చింది) – దక్షిణ ఫ్రాన్సు, ఉత్తర ఇటలీ పట్టణాలలో 12, 13 శతాబ్దాలలో వ్యాపారస్తులు, చేతివృత్తులవారిలో వ్యాప్తి చెందిన ఒక మత శాఖ. దాని ప్రధాన కేంద్రం అల్బి. ఇది దక్షిణ ఫ్రాన్సులోని

ఒక నగరం. ఆడంబరాలతో కూడిన కేథలిక్ మత కర్మకాండను, చర్చిలోని అధికార దొంతరలను, ఆల్బిగెన్స్‌లు వ్యతిరేకించారు. ఫ్యూడల్ వ్యవస్థలోని భూస్వామ్య పద్ధతికి వ్యతిరేకంగా పట్టణాల్లోని వ్యాపారస్తులు, చేతివృత్తులవారి నిరసనకు యీ ఉద్యమం మత రూపాన్నిచ్చింది. – 52.

[27] 1477–1555 మధ్య హాలండు జర్మన్ జాతియొక్క పవిత్ర రోమన్ సామ్రాజ్యంలో ఒక భాగంగా వుంది (87వ వివరణ చూడండి). ఆ సామ్రాజ్యం విచ్ఛిన్నమయ్యాక ఆ దేశం స్పెయిన్‌లో కలిపివేసుకోబడింది. 16వ శతాబ్దపు బూర్జువా విప్లవపు చివరి కాలంలో హాలండు స్పానిష్ పాలననుండి తనను తాను విముక్తం చేసుకొని స్వతంత్ర బూర్జువా రిపబ్లిక్ అయింది. – 53.

[28] 1688 ఇంగ్లీషు విప్లవం, బ్రిటిష్ బూర్జువా చరిత్ర రచనలో, మహత్తర విప్లవంగా ప్రస్తావించబడ్డది. 1688 రాజకీయ కుట్ర ఫలితంగా స్టూవర్టు వంశం పదవీభ్రష్టమైంది. ఆరెంజ్ వంశస్తుడైన విలియం అధిపతిగా, చట్టబద్ధ రాచరికం (1689) ఏర్పడ్డది. ఈ రాచరికం, భూస్వామ్య ప్రభువుల అధికారానికీ, బడా బూర్జువావర్గానికీ మధ్య కుదిరిన రాజీకి ప్రతిబింబం. – 53.

[29] 1620లో ప్రారంభమైన రాజకీయ, మత దౌర్జన్యకాండ 1685లో ప్రొటెస్టెంటు కాల్వినిస్టుల (హ్యూగెనోట్ల)పై తీవ్రంగా సాగింది. అప్పుడు, 1598లో జారీయైన నాంట్ ఉత్తర్వును, పద్నాల్గవ లూయీ రద్దుచేశాడు. హ్యూగెనోట్లకు మత విశ్వాస, ఆచరణలలో స్వేచ్ఛను కలిగించిన ఆ ఉత్తర్వు రద్దుకావడంతో, లక్షలాదిమంది హ్యూగెనోట్లు ఫ్రాన్సును వదలి వెళ్లిపోయారు. – 54.

[30] హేతువాదం – నిజమైన జ్ఞానానికి మూలం తర్క జ్ఞానమే అనే ఒక తాత్విక ధోరణి. – 54.

[31] నూతనమైన చిన్న జర్మన్ సామ్రాజ్యం – 1870–71 నాటి ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో ఫ్రాన్సుపై ప్రష్యా విజయ ఫలితంగా ఆస్ట్రియా లేకుండా ఏర్పడిన జర్మన్ సామ్రాజ్యానికి అన్వయింపబడిన పేరు. – 55.

[32] ఎంగెల్సు రచించిన "ఫ్రాన్సు, జర్మనీలలో రైతు సమస్య" అనే పుస్తకం రైతు సమస్యపై వెలువడిన ప్రధాన మార్క్సిస్టు రచనల్లో ఒకటి. ఈ పుస్తక రచనకు తక్షణ కారణం వుంది: 1894లో ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన జర్మన్ సోషల్-డెమొక్రట్ల మహాసభలో వ్యవసాయ రంగానికి సంబంధించిన ముసాయిదా కార్యక్రమంపై జరగబోయే చర్చను

వినియోగించుకొని, ధనిక రైతుల సోషలిస్టు పరివర్తనను గురించి మార్క్సిస్టు వ్యతిరేక సిద్ధాంతాన్ని చొప్పించాలని ఫోల్మరూ, తదితర అవకాశవాదులూ చేసిన ప్రయత్నమే అది. ఫ్రెంచి సోషలిస్టులు 1892లో, మార్సేల్స్‌లో తాము ఆమోదించిన వ్యవసాయ కార్యక్రమంలోనూ, 1894లో నాంట్‌లో చేసిన చేర్పులలోనూ మార్క్సిజంనుండి పెడదారిబట్టి, అవకాశవాదానికి రాయితీలిచ్చారు. వారి ఆ పొరపాట్లను సరిదిద్దేందుకు ఎంగెల్సు చేసిన ప్రయత్నం కూడా ఆయనను యీ రచనకు పురిగొల్పింది.

దీనితోబాటు, వివిధ రైతుబృందాలపట్ల శ్రామికవర్గ విధానపు విప్లవాత్మక సూత్రాలను వివరించి, కార్మికవర్గానికీ, శ్రామిక రైతాంగానికీ మధ్య పొత్తుకు సంబంధించిన భావాన్ని ఎంగెల్స్ యీ పుస్తకంలో విపులీకరించాడు. – 57.

33 1852 డిసెంబరు 2వ తేదీ – 1870 సెప్టెంబరు 4వ తేదీ మధ్య మూడవ నెపోలియన్ పాలన కాలానికి ప్రస్తావన యిది. – 58.

34 ఫ్రెంచి కార్మిక పార్టీ 10వ మహాసభ 1892 సెప్టెంబరు 24నుండి 28వరకు మార్సేల్స్‌లో జరిగింది. పార్టీ ఆంతరిక పరిస్థితి, మేడే ప్రదర్శనల నిర్వహణ, జూరిచ్‌లో (1893) జరిగే అంతర్జాతీయ సోషలిస్టు కార్యకర్తల మహాసభలో పాల్గొనే విషయం, రాబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొనే విషయం, తదితర సమస్యలను ఆ మహాసభ సమీక్షించింది.

దేశమంతటా రైతు ఉద్యమ శీఘ్రవ్యాప్తి కారణంగానూ, పార్లమెంటరీ ఎన్నికల్లో రైతుల తోడ్పాటును సంపాదించుకోవాలన్న పార్టీయొక్క కాంక్ష మూలంగానూ గ్రామీణ ప్రాంతంలో పార్టీ పని అన్నది ఆ మహాసభ చర్చనీయాంశాల్లో ఒక ప్రధానాంశమైంది. ఆ మహాసభ వ్యవసాయ కార్యక్రమాన్ని ఆమోదించింది. దానిలో అది వ్యవసాయ కార్మికుల, చిన్న రైతుల ప్రయోజనాలకు అనుగుణమైన కచ్చితమైన పలు డిమాండ్లను ముందుంచింది. కాని, యీ కార్యక్రమం కొన్ని అంశాల్లో సోషలిస్టు సూత్రాలనుండి పెడతోవపట్టి, పెటీబూర్జువా ఊహాజనితత్వంలో, గ్రామీణ జనాభాలోని మరింత సంపన్న విభాగాలకు కొన్ని రాయితీలనిచ్చింది. అవకాశవాద ప్రభావాలను ప్రతిబింబించే యీ పొరపాట్లు ఆ కార్యక్రమంలోనూ, దరిమిలా నాంట్ మహాసభలో దానికి ఆమోదింపబడిన సవరణలలోనూ మరింత ప్రముఖంగా ముందుకొచ్చాయి. – 62.

35 "Sozialdemokrat" ("సోషల్-డెమొక్రట్") – జర్మన్ సోషల్-డెమొక్రటిక్ పార్టీ వారపత్రిక. అది బెర్లిన్‌లో 1894–95 సంవత్సరాల్లో వెలువడింది. ఎంగెల్స్‌చేత యిక్కడ ప్రస్తావింపబడిన పాల్ లాఫార్గ్ నివేదిక "రైతు ఆస్తి, ఆర్థిక

ప్రగతి" ఈ పత్రికయొక్క 1894 అక్టోబరు 19వ తేదీ అనుబంధ సంచికలో ప్రచురింపబడింది. – 77.

36 యుంకర్లు – తూర్పు ప్రష్యాలో (జర్మనీలో కూడా) పెద్ద భూస్వాములు. – 80.

37 ఎంగెల్స్ ఇక్కడ "ప్రష్యన్ జాతియొక్క జర్మన్ సామ్రాజ్యం" అన్న దాన్ని మధ్య యుగంనాటి జర్మన్ జాతియొక్క పవిత్ర రోమన్ సామ్రాజ్యానికి ఆపాదించి చెప్తున్నాడు. జర్మనీ ఏకీకరణ, అంటే ఫ్రాన్సుపై విజయం ఫలితంగా 1871లో జర్మన్ సామ్రాజ్య స్థాపనా, దానితోబాటే జర్మన్ రాజ్యాలన్నింటి ప్రష్యనీకరణ కూడా ప్రష్యా అధినాయకత్వం కింద జరిగిందని నొక్కిచెప్పాడు. – 80.

38 "ఫ్రాన్సులో వర్గపోరాటాలు (1848–1850)" అన్న కార్ల్ మార్క్స్ రచనకు ఎంగెల్సు రచించిన యీ ముందుమాట, 1895లో బెర్లిన్‌లో ఈ రచన విడి ప్రచురణగా వెలువడిన సందర్భంగా రచింపబడింది.

మార్క్సు రచనలో యివ్వబడిన 1848–1849 నాటి విప్లవంయొక్క విశ్లేషణకూ, దాని గుణపాఠాలకూ గల విస్తృత ప్రాధాన్యాన్ని చూపడం ద్వారా, ఎంగెల్స్ తన ముందుమాటలో అధికభాగాన్ని శ్రామికవర్గపు పోరాటంలో, ప్రత్యేకించి జర్మనీలో లభించిన అనుభవ సమన్వయానికి వినియోగించాడు. శ్రామికవర్గాన్ని సోషలిస్టు విప్లవానికి సన్నద్ధం చేసేందుకుగాను చట్టపరమైన సకల సాధనాలనూ వినియోగించుకోవలసిన ఆవశ్యకతను గురించీ, ప్రజాస్వామ్యంకోసం జరిపే పోరాటాన్ని సోషలిస్టు విప్లవంకోసం జరిపే పోరాటంతో నేర్పుగా జతచేసేందుకూ, యీ రెండింటిలో మొదటి కర్తవ్యాన్ని రెండవ కర్తవ్యానికి లోబరచవలసిన ఆవశ్యకతను గురించీ ఎంగెల్స్ నొక్కిచెప్పాడు. నిర్దిష్టమైన చారిత్రక పరిస్థితులనుబట్టి పోరాట రూపాలను వినియోగించేందుకూ, విప్లవపోరాటపు శాంతియుత రూపాల – శ్రామికవర్గం వీటిని అభిమానిస్తుంది – స్థానంలో, పాలక అభివృద్ధి నిరోధక వర్గాలు హింసాత్మక పద్ధతులకు తలపడిన సందర్భాల్లో బలప్రయోగ రూపాలను ప్రవేశపెట్టేందుకూ సంబంధించిన మార్క్సిస్టు మౌలిక సూత్రాలను ఎంగెల్స్ తన యీ ముందుమాటలో మరోమారు నిరూపించాడు.

ఈ ముందుమాట ప్రచురింపబడేందుకు ముందు, దీనిలోని "ఉగ్ర విప్లవవాద" ధోరణిని మందగింపజేసి, మరింత సౌమ్యంగా తయారుచెయ్యమని జర్మన్ సోషల్-డెమోక్రటిక్ పార్టీ కార్యవర్గం ఎంగెల్సుపై పదేపదే ఒత్తిడిచేసింది. పార్టీ నాయకత్వపు ఊగిసలాట వైఖరినీ, "పూర్తిగా చట్టబద్ధ పరిధిలోనే పనిచెయ్యాలన్న" దాని ప్రయత్నాలనూ ఎంగెల్సు నిశితంగా విమర్శించాడు. కాని, కార్యవర్గం ఒత్తిడి మూలంగా

ఎంగెల్స్ ప్రూఫులదశలో కొన్ని భాగాలను తొలగించక తప్పలేదు. కొన్ని సూత్రీకరణలను మార్చక తప్పలేదు. (ఈ మార్పులూ, మినహాయింపులూ పాద పీఠికలలో చేర్చబడ్డాయి. మాకు అందజెయ్యబడిన ప్రూఫుల సాయంతోనూ, అసలు రాతప్రతితో సరిచూడటంతోనూ తొలిపాఠాన్ని పునరుద్ధరించడం సాధ్యమైంది.)

అయితే అదే సమయంలో, కత్తిరింపబడిన యీ ముందుమాటను ఆధారం చేసుకొని, సోషల్-డెమొక్రటిక్ పార్టీ నాయకుల్లో కొందరు, ఎంగెల్సును, ఏదేమైనాకూడా కార్మికవర్గం అధికారాన్ని శాంతియుత పద్ధతుల్లో మాత్రమే కైవసం చేసుకోవడాన్ని బలపరచినవాడు గానూ, (ఏదేమైనా కూడా) "చట్టబద్ధ పద్ధతులను ఆరాధించినవాడు" గానూ చిత్రించేందుకు ప్రయత్నించారు. ఎంగెల్సు కోపాతిరేకంతో యీ ముందుమాట పూర్తిపాఠాన్ని "Neue Zeit"లో ప్రచురించాల్సిందిగా పట్టుబట్టాడు. అయినాకూడా, పైన పేర్కొనబడిన విడి ప్రచురణకోసం ఎంగెల్సు గత్యంతరం లేక చెయ్యవలసివచ్చిన ఆ కోతలతోనే ఆ పత్రికలో అది ప్రచురింపబడింది. కాని, ఆ ముందుమాటయొక్క సంగ్రహ పాఠం సైతం తన విప్లవాత్మక స్వభావాన్ని నిలుపుకుంది.

ఎంగెల్సు ముందుమాట పూర్తిపాఠం తొట్టతొలిసారిగా సోవియట్ యూనియనులో, "ఫ్రాన్సులో వర్గపోరాటాలు (1848–1850)" అన్న కార్ల్ మార్క్స రచనయొక్క 1930 నాటి కూర్పులో ప్రచురింపబడింది. – 83.

39 "Neue Rheinische Zeitung. Organ der Demokratie" ("నూతన రైనిషె పత్రిక. డెమొక్రసీ పత్రిక") – ఈ దినపత్రిక 1848 జూన్ 1నుండి 1849 మే 19దాకా కొలోన్‌లో వెలువడింది. మార్క్స దాని ప్రధాన సంపాదకుడు. ఎంగెల్స్ సంపాదకవర్గంలో పనిచేశాడు. – 83.

40 "Neue Rheinische Zeitung. Politisch-ökonomische Revue" ("కొత్త రైనిషె పత్రిక. రాజకీయ ఆర్థిక సమీక్ష") – కమ్యూనిస్టు లీగుయొక్క యీ సిద్ధాంత పత్రిక మార్క్స ఎంగెల్సులచేత స్థాపింపబడింది. 1849 డిసెంబరు – 1850 నవంబరు మధ్య యీ పత్రిక సంచికలు మొత్తం ఆరు వెలువడ్డాయి. – 85.

41 1851 డిసెంబరు 2వ తేదీన ఫ్రాన్సులో లూయీ బోనపార్టు, అతని అనుచరులూ విప్లవ ప్రతీఘాత రాజకీయ కుట్రనొకదాన్ని జరిపారు. – 85.

42 సక్సెన్‌వాల్డ్ – ఇది మొదటి విల్‌హెల్మ్ చక్రవర్తిచేత బిస్మార్కుకి మంజూరుచెయ్యబడిన ఒక ఎస్టేటు (హాంబుర్గ్‌దగ్గర – సక్సెన్ అడవిలో). ఆ ఎస్టేటు పేరున ప్రభుత్వ సబ్సిడీలను ఎంగెల్స్ వ్యంగ్యంగా యిక్కడ ప్రస్తావిస్తున్నాడు. – 86.

43 In partibus infidelium (శబ్దార్థం ప్రకారం: "క్రీస్తు మతంలో విశ్వాసంలేనివారి దేశంలో") — క్రైస్తవేతర దేశాల్లో కేవలం నామమాత్రపు పదవులకు నియమితులైన కేథలిక్ బిషప్‌ల హోదాకి ఒక చేర్పు. ఒక దేశంలోని వాస్తవ పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా విదేశాల్లో ఏర్పాటుచెయ్యబడిన ప్రవాస ప్రభుత్వాలను వర్ణించడానికి మార్క్స్ ఎంగెల్స్‌ల రచనల్లో యీ నానుడి తరచుగా ప్రయోగింపబడింది. — 87.

44 లెజిటిమిస్టులకు, ఆర్లియనిస్టులకు ప్రస్తావన ఇది.

లెజిటిమిస్టులు (చట్టబద్ధతావాదులు) — 1830లో కూల్చివెయ్యబడిన "చట్టబద్ధ" బూర్బన్ రాజవంశానుచరులు. ఈ రాజవంశం పెద్దపెద్ద జమీందార్ల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తూవుండేది. ధనిక ప్రభువర్గంపైనా, బడా బూర్జువావర్గంపైనా ఆధారపడి పాలన సాగిస్తున్న ఆర్లియన్స్ రాజవంశానికి (1830–48) వ్యతిరేకంగా తాము జరిపిన పోరాటంలో, లెజిటిమిస్టులలో కొందరు సామాజిక వక్తృత్వానికీ నినాదాలకూ పూనుకొని, బూర్జువావర్గపు దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక ప్రజల పరిరక్షకులుగా కనిపించేందుకు ప్రయత్నించారు.

ఆర్లియనిస్టులు — ఆర్లియన్ రాజవంశ సమర్థకులు. ఇది బూర్బన్ రాజవంశానికి చెందిన ఒక శాఖ. 1830 జూలై విప్లవంలో అధికారానికి వచ్చిన యీ శాఖ 1848 విప్లవంలో కూలదొయ్యబడింది. ఆర్లియనిస్టులు ధనిక ప్రభువర్గంయొక్క, బడా బూర్జువావర్గంయొక్క ప్రయోజనాలను వ్యక్తంచేశారు. — 91.

45 మూడవ నెపోలియన్ పాలన కాలంలో, ఫ్రాన్సు క్రైమియన్ యుద్ధం (1854–55)లో పాల్గొంది. ఇటలీకోసం ఆస్ట్రియాతో యుద్ధం చేసింది (1859). బ్రిటన్‌తో కలిసి చైనాకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధాల్లో (1856–58, 1860) పాల్గొంది. ఇండోచైనా ఆక్రమణను మొదలుపెట్టింది (1860–61). సిరియాపైన (1860–61), మెక్సికోపైన (1862–67) దండయాత్ర సాగించింది. చివరకు 1870–71లో ప్రష్యాకు వ్యతిరేకంగా పోరాడింది. — 91.

46 ఎంగెల్స్ ప్రయోగించిన "జాతీయతా సూత్రం" అన్న యీ పదబంధం లూయీ బోనపార్ట్‌యొక్క రెండవ సామ్రాజ్య (1852–70) పాలకవర్గాలు అనుసరించిన విదేశాంగ విధాన సూత్రాల్లో ఒకటి. జాతీయత అనబడే యీ సూత్రం పెద్ద దేశాల పాలకవర్గాలచేత విదేశాలపై తమ దండయాత్రా పథకాలకూ, విదేశాలలో తమ దుస్సాహసిక చర్యలకూ సైద్ధాంతికమైన ముసుగుగా వినియోగించుకోబడింది. జాతుల స్వయంనిర్ణయ హక్కుతో యీ సూత్రానికి ఎటువంటి పొంతనా లేదు. జాతులపట్ల

ద్వేషాన్ని రెచ్చగొట్టడానికీ, జాతీయోద్యమాలను – ప్రత్యేకించి చిన్న జాతుల ఉద్యమాలను – దురాక్రమణ విషయంలో పోటీపడుతున్న సామ్రాజ్యవాద దేశాల విప్లవ ప్రతీఘాత విధానాలకు ఒక పనిముట్టుగా వినియోగించుకోడానికీ మాత్రమే యీ సూత్రం వినియోగపడింది. – 91.

47 ప్రష్యా విజయంతో ముగిసిన 1866 నాటి ఆస్ట్రియా-ప్రష్యా యుద్ధం ఈ రెండు రాజ్యాలకూ మధ్య చిరకాలంగా ఉన్న వైరాన్ని పరిష్కరించి, పూర్వ నిర్ణయం మేరకు ప్రష్యా పెత్తనం కింద జర్మనీ ఏకీకరణను సాధించింది. ప్రష్యా ఇటలీతో మైత్రి నెరపగా, పలు జర్మన్ రాష్ట్రాలు ఆస్ట్రియా పక్షం వహించాయి. ప్రాగ్ శాంతి ఒడంబడిక కింద, ష్లెస్విగ్, హోల్‌ష్టైన్‌లనే ఉత్తర జర్మన్ డచీల (సంస్థానాల)పై తనకు గల హక్కును ఆస్ట్రియా విడిచిపెట్టి, ప్రష్యాకు కట్టపెట్టింది. దానికొక చిన్న మొత్తం నష్టపరిహారం చెల్లించడానికి సిద్ధపడింది. వెనిస్ ప్రాంతాన్ని ఇటలీ రాజ్యానికి అప్పగించింది. వెనక 1815లో వియన్నా కాంగ్రెస్‌చేత ఏర్పాటుచెయ్యబడిన 30 కన్న ఎక్కువ జర్మన్ రాష్ట్రాలను ఐక్యపరచిన జర్మన్ సమాఖ్య రద్దుచెయ్యబడింది. దాని స్థానంలో, ఆస్ట్రియా భాగస్వామ్యం లేకుండా, ప్రష్యా నాయకత్వంలో ఉత్తర జర్మన్ సమాఖ్య (కాన్‌ఫెడరేషన్) ఏర్పడింది. హన్నోవర్ రాజ్యాన్నీ, హెస్సెన్-కాస్సెల్ ఎలెక్టొరేట్‌నీ, నాస్సౌ గ్రాండ్ డచీనీ, ఫ్రాంక్‌ఫుర్ట్-ఆమ్-మెయిన్ స్వేచ్ఛా నగరాన్నీ కూడా ప్రష్యా కలిపేసుకుంది. పరాజయానంతరం రాజకీయ సంక్షోభం తీవ్రమై, జాతీయ విముక్తి ఉద్యమం పెంపొందిన ఫలితంగా ఆస్ట్రియా అభివృద్ధి నిరోధక వర్గాలు హంగరీతో రాజీపడవలసి వచ్చింది – రెండు పక్షాల రాజరికం – ఆస్ట్రియా హంగరీ నెలకొంది. మరోవైపున బూర్జువావర్గానికి కొన్ని రాజకీయ రాయితీలు ఇవ్వవలసివచ్చింది. 1867లో ఆమోదింపబడిన రాజ్యాంగచట్టం రైహ్‌స్రాట్ (పూర్వపు ఆస్ట్రియన్ సామ్రాజ్యంలో పార్లమెంటు ఎగువ సభ) అధికారాన్ని విస్తరించింది: మంత్రుల బాధ్యతలను నిర్వచించింది, సార్వత్రిక సైనిక కొలువు, పరిపాలన కేంద్రీకరణ ప్రవేశపెట్టింది. ప్రభుత్వంలో కులీన ప్రభువులతో సహా బూర్జువా ఉదారవాదులు చేరుకున్నారు. – 91.

48 1871 నాటి పారిస్ కమ్యూన్ – కార్మికవర్గపు విప్లవాత్మక ప్రభుత్వం, 1871 మార్చి 28నుంచి మే 28వరకు యిది అధికారంలో వుంది. శ్రామికవర్గ నియంతృత్వానికి సంబంధించిన తొలి చారిత్రకానుభవాన్ని కార్మికవర్గానికి యిది సమకూర్చింది. 1871 మార్చి 18 నాటి శ్రామికవర్గ విప్లవానికీ, తదనంతర దశయైన శ్రామికవర్గ నియంతృత్వానికి ఈ పదం విస్తృత రూపంలో వాడబడుతోంది. కార్ల్ మార్క్స్ రాసిన

"ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లో పారిస్ కమ్యూన్ చరిత్రా, దాని సారభూత లక్షణాలూ సవివరంగా విశ్లేషింపబడ్డాయి (ఈ సంకలనంలో రెండవ భాగం పేజీలు 99–186 చూడండి). – 92.

49 1871 మార్చి 18 నాటి తిరుగుబాటుకు నాంది పలికిన యీ ఉపాఖ్యానాన్ని తెలుసుకునేందుకుగాను యీ సంపుటంలోని "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" చూడండి. (రెండవ భాగం పేజీలు 99–186.) – 92.

50 మే 10 తేదీన 1871లో ఫ్రాంక్‌ఫుర్ట్-ఆమ్-మెయిన్‌లో సంతకాలు జరిగిన శాంతి సంధి ప్రకారం ఫ్రాన్సు జర్మనీకి చెల్లించవలసిన 500 కోట్ల ఫ్రాంకుల నష్టపరిహారానికి ప్రస్తావన ఇది. – 93.

51 సోషలిస్టు వ్యతిరేక చట్టం (అసాధారణ చట్టం) – 1878 జర్మనీలో బిస్మార్కు ప్రభుత్వంచేత ప్రవేశపెట్టబడింది. కార్మిక సోషలిస్టు ఉద్యమాన్ని వ్యతిరేకించడం యీ చట్టానికి లక్ష్యం. దీని ప్రకారం సోషల్-డెమోక్రట్ల పార్టీ శాఖలన్నీ, కార్మిక సంఘాలన్నీ, కార్మికుల పత్రికలన్నీ నిషేధించబడ్డాయి, సోషలిస్టు సాహిత్యం స్వాధీనం చేసుకోబడింది; సోషల్-డెమోక్రట్లు అన్ని విధాల హింసలకూ గురిఅయారు, దేశంనుండి బహిష్కరించబడ్డారు. 1890లో కార్మికోద్యమం ఒత్తిడివల్లనే సోషలిస్టు వ్యతిరేక చట్టం రద్దుచేయబడింది. – 93.

52 1866లో ఉత్తర జర్మన్ రైహ్‌స్టాగ్ (పార్లమెంటు)కి ఎన్నికలు జరిగినప్పుడూ, మరల 1871లో సమైక్య జర్మన్ సామ్రాజ్య రైహ్‌స్టాగ్ (పార్లమెంటుకు) ఎన్నికలు జరిగినప్పుడూ బిస్మార్కు సార్వజనిక ఓటింగు హక్కును ప్రవేశపెట్టాడు. – 94.

53 ఎంగెల్సు యీ మాటలను ఫ్రెంచి కార్మిక పార్టీ కార్యక్రమానికి మార్క్సు రాసిన ముందుమాటనుండి ఉటంకిస్తున్నాడు. ఆ కార్యక్రమం, 1880లో హావర్‌లో జరిగిన పార్టీ మహాసభలో ఆమోదింపబడింది. – 95.

54 1870 సెప్టెంబరు 4న సెడాన్‌వద్ద ఫ్రెంచి సైన్యం పరాజయం పొందిన వార్త పారిస్ చేరగానే, ప్రజా సామూహిక విప్లవాత్మక తిరుగుబాటు జరిగింది. దాని ఫలితంగా రెండవ సామ్రాజ్య వ్యవస్థ కూలిపోయి, జాతీయ రక్షణ ప్రభుత్వ నాయకత్వాన రిపబ్లిక్ ప్రకటించబడింది.

1870 అక్టోబరు 31న, జాతీయ రక్షణ ప్రభుత్వం తరపున ప్రష్యన్లతో త్యేర్ ప్రారంభించిన సంప్రదింపులకు సంబంధించిన వార్తలు వెలువడిన మీదట,

పారిస్ కార్మికులూ, నేషనల్ గార్డులోని విప్లవాత్మక విభాగమూ ఒక తిరుగుబాటును లేవదీసి నగర పాలక కార్యాలయం పట్టుకున్నారు, బ్లాంకీ నాయకత్వాన ప్రజా భద్రతా కమిటీ అనే విప్లవాధికార సాధనాన్నొకదాన్ని నెలకొల్పారు. కార్మికులనుండి ఒత్తిడి కారణంగా, జాతీయ రక్షణ ప్రభుత్వం రాజీనామా చేస్తాననీ, కమ్యూన్‌కి నవంబరు 1న ఎన్నికలు నిర్వహిస్తాననీ వాగ్దానం చెయ్యాల్సివచ్చింది. కానైతే పారిస్‌లోని విప్లవ శక్తుల ఒదులొదులు నిర్మాణమూ, తిరుగుబాటును నడిపిన బ్లాంకీస్టులకూ పెటీబూర్జువా జాకొబిన్ డెమోక్రట్లకూ మధ్య విభేదాలూ – వీటి ఫలితంగా, రాజీనామా చేస్తానన్న తన వాగ్దానాన్ని ప్రభుత్వం భగ్నంచేసి, నేషనల్ గార్డుకు చెందిన విధేయ దళాలను నగర పాలక కార్యాలయంపైకి ఎగతోలి తన అధికారాన్ని పునరుద్ధరించుకుంది. – 99.

55 వాగ్రామ్ యుద్ధం 1809 నాటి ఆస్ట్రియా-ఫ్రాన్సు యుద్ధ కాలంలో, 1809 జూలై 5–6 తేదీలలో జరిగింది. ఇందులో నెపోలియన్ బోనపార్ట్ నాయకత్వాన ఫ్రెంచి సేనలు ఆర్చ్‌డ్యూక్ చార్ల్స్‌యొక్క ఆస్ట్రియన్ సైన్యాన్ని ఓడించాయి. – 100.

56 వాటర్లూ – బ్రస్సెల్స్ సమీపంలోని ఒక స్థలం. ఇక్కడ 1815 జూన్ 18న, మొదటి నెపోలియన్ అంతిమ పరాజయానికి గురయ్యాడు. ఆ యుద్ధంలో ఆంగ్లో డచ్చి సైన్యాలకు వెల్లింగ్‌టన్, ప్రష్యన్ సైన్యాలకు బ్లూహెర్ నాయకత్వం వహించారు. – 100.

57 మెక్లెన్‌బుర్గ్ – ష్వెరిన్, మెక్లెన్‌బుర్గ్ స్ట్రెలిట్జ్‌లలో డ్యూక్‌లకూ ప్రభువర్గానికీ మధ్య సాగిన పోరాటాన్ని గురించి ఎంగెల్స్ యిక్కడ ప్రస్తావిస్తున్నాడు. ఈ పోరాటం 1755లో రోస్టాక్‌లో రాజ్యాంగచట్టబద్ధమైన సంధిపై సంతకాలు పెట్టడంతో ముగిసింది. ఈ సంధి, ప్రభువర్గపు స్వేచ్ఛలనూ, ఆనువంశిక హక్కులనూ, విశేషాధికారాలనూ, సామాజిక శ్రేణీ సూత్రంపై ఏర్పాటుచెయ్యబడిన జర్మన్ రాష్ట్ర శాసన సభల్లో వాళ్లకు నాయకత్వ పాత్రనూ రూఢిపరచింది. అది వాళ్ల భూముల్లో సగాన్ని పన్నుల నుండి మినహాయించింది. వర్తకంపైనా, చేతి వృత్తులపైనా పన్నులను విధించింది. ప్రభుత్వ వ్యయంలో వాటి వాటాను నిర్ధారణచేసింది. – 102.

58 జర్మన్ రైహ్‌స్టాగ్ (పార్లమెంటు)లో 1894 డిసెంబరు 5న ప్రవేశపెట్టబడిన ఒక కొత్త సోషలిస్టు వ్యతిరేక బిల్లు. ఇది పార్లమెంటుచేత 1895 మే 11న తిరస్కరింపబడింది. – 105.

59 "రాజకీయాల, అర్థశాస్త్రాల విమర్శ" పేరున మార్క్స్ రాయతలబెట్టిన పుస్తకానికిది ప్రస్తావన. – 120.

60 పారిస్ నేషనల్ గార్డుయొక్క కేంద్ర కమిటీ 1871 ఫిబ్రవరిలో ఏర్పాటుచెయ్యబడింది. 1870–71 నాటి ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పారిస్ ముట్టడి కాలంలో ప్రజాస్వామిక భావాలు కలిగిన విస్తృత ప్రజానీకం నేషనల్ గార్డులో చేరింది. దాని కమిటీ 1871 మార్చి 18 నాటి తిరుగుబాటుకు నాయకత్వం వహించి, మార్చి 28న పారిస్ కమ్యూన్ ఏర్పడేదాకా చరిత్రలో తొట్టతొలి శ్రామికవర్గ ప్రభుత్వ విధులను నిర్వహించింది. – 122.

61 ఎ. హక్స్తహౌసెన్ రచించిన "Über den Ursprung und die Grundlagen der Verfassung in den ehemals slavischen Ländern Deutschlands im allgemeinen und des Herzoghthums Pommern im besondern" ("మొత్తంమీద జర్మనీయొక్క పూర్వ స్లావ్ రాజ్యాలలోనూ, ప్రత్యేకించి పామెరేనియా జమీలోనూ కమ్యూనల్ వ్యవస్థ ఆవిర్భావమూ, ప్రాతిపదికా") అన్న పుస్తకానికి యిది ప్రస్తావన. ఈ పుస్తకం 1842లో బెర్లిన్‌లో ప్రచురింపబడింది. – 122.

62 1849 జూన్ 13న, మహీధరం పార్టీ అనే ఒక పెటీబూర్జువా పార్టీ, విప్లవాన్ని అణచివేసేందుకుగాను ఇటలీకి ఫ్రెంచి సేనలను పంపడానికి వ్యతిరేకంగా, పారిస్‌లో ఒక శాంతియుత ప్రదర్శనను ఏర్పాటుచేసింది. ఆ ప్రదర్శన సైన్యంచేత చెదరగొట్ట బడింది. మహీధరం పార్టీ నాయకులు పలువురు అరెస్టుచెయ్యబడి దేశంనుండి వెళ్ల గొట్టబడ్డారు లేక ఫ్రాన్సునుండి ప్రవాసులుగా వెళ్లిపోవలసిన పరిస్థితిలో పడ్డారు. – 123.

63 మ్యూచువలిస్టులు (పరస్పర సహాయవాదులు) – ప్రూడనిస్టులు 1860వ దశకంలో తమను యీపేరున పిలుచుకున్నారు. పరస్పర సహాయాన్ని (సహకార సంఘాలు, పరస్పర సహాయక సమితులు మొదలైన వాటిని) ఏర్పాటు చెయ్యడంద్వారా కార్మిక జనాన్ని విముక్తంచేసే పెటీబూర్జువా పథకమొకదాన్ని ప్రతిపాదించడమే వారికి యీపేరు రావడానికి కారణం. – 124.

64 సోషలిస్టు డెమోక్రసీయొక్క అలయన్స్ – జెనీవాలో 1868లో బకూనిన్‌చేత స్థాపించ బడిన సంఘం. వర్గాలను సమానం చెయ్యాలనీ, రాజ్యాన్ని రద్దుచెయ్యాలనీ అది కోరింది. అది కార్మికవర్గ రాజకీయ పోరాటావసరాన్ని తిరస్కరించింది. దాని పెటీబూర్జువా అరాజకవాద కార్యక్రమానికి ఇటలీ, స్విట్జర్లండ్, స్పెయిన్ మొదలైన దేశాల్లోని అంత బాగా పారిశ్రామికం కాని ప్రాంతాల్లో మద్దతు లభించింది. 1869లో, ఇంటర్నేష నల్‌లో చేర్చుకొమ్మని అలయన్సు జనరల్ కౌన్సిలుకు దరఖాస్తు పెట్టుకుంది. అలయన్సు కనుక ప్రత్యేక సంఘంగా తనను తనే రద్దుచేసుకుంటే, దాని విభాగాలను చేర్చుకోవడానికి

జనరల్ కౌన్సిలు అంగీకరించింది. అయితే, ఆచరణలో మాత్రం, అలయన్సు సభ్యులు ఇంటర్నేషనల్‌లో చేరిన తర్వాత సైతం ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌లో తమ రహస్య సంఘాన్ని నిలుపుకున్నారు. జనరల్ కౌన్సిలుకు వ్యతిరేకంగా వాళ్ళు సాగించిన పోరాటానికి బకూనిన్ నాయకత్వం వహించాడు. పారిస్ కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత యీ పోరాటం తీవ్రతరం చెయ్యబడింది, అప్పుడు బకూనినూ, అతని మద్దతుదార్లూ శ్రామికవర్గ నియంతృత్వ భావానికీ, ప్రజాస్వామ్యకరణ సూత్రాల ప్రాతిపదికపై ఏర్పడే కార్మికవర్గపు స్వతంత్ర రాజకీయ పార్టీ ఏర్పాటుకీ వ్యతిరేకంగా ప్రత్యేకించి తీవ్రమైన అభ్యంతరాలతో ముందుకొచ్చారు. హేగ్‌లో 1872 సెప్టెంబరులో జరిగిన మొదటి ఇంటర్నేషనల్ మహాసభ అత్యధిక మెజారిటీతో, అలయన్సు నాయకులను – బకూనిన్, గిల్యోంలను – ఇంటర్నేషనల్‌నుండి బహిష్కరించాలని తీర్మానించింది. –125.

65 1871, సెప్టెంబరు 17–23 తేదీలమధ్య లండనులో జరిగిన మొదటి ఇంటర్నేషనల్ మహాసభ ఆమోదించిన తీర్మానాలకు యిది ప్రస్తావన. "జాతీయ సమితుల హోదా, మొదలైనవి" (తీర్మానం II), "కార్మికవర్గ రాజకీయ కార్యాచరణ" (తీర్మానం IX), "సోషలిస్టు డెమోక్రసీయొక్క అలయన్సు" (తీర్మానం XVI), "స్విట్జర్లండులోని ఫ్రెంచి భాష మాట్లాడే ప్రాంతంలో చీలిక" (తీర్మానం XVII). – 126.

66 "Der Volksstaat" ("ప్రజా రాజ్యం") – జర్మన్ సోషల్-డెమోక్రటిక్ పార్టీ (ఐసెనాఖర్ల) కేంద్ర పత్రిక, 1869–1876 మధ్య లైప్జిగ్‌లో ప్రచురింపబడింది. విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్ ప్రధాన సంపాదకుడుగా వున్నాడు; ఔగుస్ట్ బేబెల్ మేనేజరుగా ఉన్నాడు. దానికి రచనలు పంపినవారిలో మార్క్సూ, ఎంగెల్సూ వున్నారు. 1869వరకు ఆ పత్రిక "Demokratisches Wochenblatt" అనే పేరుతో వెలువరింపబడింది. – 127.

67 "Neuer Sozial-Demokrat" ("కొత్త సోషల్-డెమోక్రట్") – బెర్లిన్‌లో 1871–1876 మధ్య ప్రచురింపబడిన జర్మన్ వార్తా పత్రిక. ఇది లాసాల్ నాయకత్వానగల అఖిల జర్మన్ కార్మిక సంఘపు అధికార పత్రిక. ఈ సంఘం మొదటి ఇంటర్నేషనల్, జర్మన్ సోషల్-డెమోక్రటిక్ కార్మిక పార్టీల మార్క్సిస్టు నాయకత్వాన్ని, వ్యతిరేకించి, బకూనినిస్టులనూ, కార్మికోద్యమంలో తదితర శ్రామికవర్గ వ్యతిరేక వాహినుల ప్రతినిధులనూ బలపరచింది. – 127.

68 అఖిల జర్మన్ కార్మిక సంఘం – లాసాల్ క్రియాశీల భాగస్వామ్యంతో 1863లో

నెలకొల్పబడిన జర్మన్ కార్మికుల రాజకీయ సంఘం. ఇది 1875వరకు పనిచేసింది. 1875లో గోతా మహాసభలో లాసాలియన్లూ, ఐసెనాఖర్లూ (లీబ్‌క్నెహ్ట్, బెబెల్‌ల నాయకత్వాన గల పార్టీ) సమైక్యమై జర్మన్ సోషలిస్టు కార్మిక పార్టీని ఏర్పాటుచేశారు. — 127.

69 1869 ఆగస్టు 7–9 తేదీల మధ్య ఐసెనాఖ్‌లో జరిగిన జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండులకు చెందిన సోషల్-డెమోక్రట్ల మహాసభలో ఏర్పడిన జర్మన్ సోషల్-డెమోక్రటిక్ కార్మిక పార్టీ తరువాత ఐసెనాఖర్లుగా వ్యవహరింపబడింది. ఆ మహాసభలో ఆమోదింపబడిన కార్యక్రమం ప్రధానంగా మొదటి ఇంటర్నేషనల్ ప్రతిపాదించిన సూత్రాలకు అనుగుణంగా వుంది. — 128.

70 మొదటి ఇంటర్నేషనల్ (అంతర్జాతీయ కార్మికుల సంఘం) — మార్క్స్ ఎంగెల్సులు మార్గదర్శకత్వం వహించిన తొట్టతొలి అంతర్జాతీయ కార్మిక సంఘం (1864–1876), ప్రధానమైన పెట్టుబడిదారీ దేశాలకు చెందిన చైతన్యవంతులైన కార్మికులలో ఈ సంఘం శాస్త్రీయ సోషలిజానికి సంబంధించిన భావాలను వ్యాపింపజేసి, "పెట్టుబడిపై విప్లవాత్మక దాడికి వారిని సన్నద్ధంచేసేందుకుగాను ఒక అంతర్జాతీయ కార్మిక సంఘానికి పునాదిని ఏర్పరచింది" (వి. ఐ. లెనిన్). ఈ సంకలనంలో ఇంటర్నేషనల్ గురించిన వివరణ "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" 1890 నాటి జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ రాసిన ముందుమాటలోనూ, 1871 నవంబర్ 23 తేదీన ఎఫ్. బోల్టెకు మార్క్స్ రాసిన లేఖలోనూ చూడండి (మొదటి భాగంలో పేజీలు 40–44, నాల్గవ భాగంలో పేజీలు 124–126). — 129.

71 ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌యొక్క హేగ్ మహాసభ 1872 సెప్టెంబరు 2–7 తేదీల మధ్య జరిగింది. ఆ మహాసభకు మార్క్స్ ఎంగెల్సులతోబాటు 15 దేశాల కేంద్ర సంఘాలనుండి 65 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆ మహాసభయొక్క యావత్తు కార్యకలాపాలకూ మార్క్స్ ఎంగెల్సులు మార్గదర్శకత్వం వహించారు. కార్మిక వర్గోద్యమంలోని అన్ని రకాల పెటీబూర్జువా ఒంటెత్తువాదానికీ వ్యతిరేకంగా అనేక సంవత్సరాలుగా మార్క్స్ ఎంగెల్సులు, వారి అనుచరులు సాగించిన పోరాటం ఆ మహాసభలో శిఖరస్థాయిని చేరుకుంది. అరాజకవాదుల ఒంటెత్తువాద కార్యకలాపాలు నిరసింపబడ్డాయి, వారి నాయకులు ఇంటర్నేషనల్‌నుండి బహిష్కరింపబడ్డారు. హేగ్ మహాసభ నిర్ణయాలు వివిధ దేశాల్లో కార్మికవర్గపు స్వతంత్ర రాజకీయ పార్టీల స్థాపనకు మార్గాన్ని సుగమం చేశాయి. — 129.

72 హేగెల్ రచించిన "Phänomenologie des Geistes" ("మానసిక ప్రత్యక్ష

ప్రమాణవాదం") అన్న పుస్తకంలో "విద్యకు సంబంధించిన వాస్తవం" అన్న ప్రకరణం. – 130.

73 1872, 1873 సంవత్సరాల్లో పలు సందర్భాల్లో లాసాల్‌వాదాన్ని ఖండిస్తూ ఒక చిన్న పుస్తకాన్నిగాని, "Volksstaat" పత్రికకు ఒక వ్యాసాన్నిగాని రచించమని మార్క్స్‌ను కోరుతూ లీబ్‌క్నెఖ్టూ, హెప్నెరూ జాబులు రాశారు. – 131.

74 1877లో జరిగిన గోతా మహాసభలో డ్యూరింగ్ వత్తాసుదారుల కోపోద్రేకాన్ని గురించి ప్రస్తావిస్తూ, 1877 అక్టోబరు 30 – నవంబరు 6 తేదీలలో తను రాసిన లేఖలో, జర్మనీలోని పార్టీ కార్యమేడ్లపట్ల మార్క్స్ ఎంగెల్సులు కోపంగా వున్నారా అని బ్లోస్ అడిగాడు. మార్క్స్ ఎంగెల్సుల వ్యాసాలపట్ల జర్మన్ కార్మికులు అధికతర శ్రద్ధను కనబరుస్తున్నారన్న విషయాన్ని గమనికలోనికి తీసుకొని, సోషల్-డెమోక్రట్లు నిర్వహిస్తున్న ఆందోళనోద్యమ పర్యవసానంగా మార్క్స్ ఎంగెల్సులు తాము స్వయంగా ఊహించగలిగినదానికన్న ఎక్కువ కీర్తివంతులయ్యారని బ్లోస్ రాశాడు. – 131.

75 న్యాయాత్ముల లీగుయొక్క నిబంధనావళికి ప్రస్తావన. 1847 జూన్‌లో జరిగిన ప్రథమ మహాసభలో కమ్యూనిస్టు లీగు నిబంధనావళిని రూపొందించడంలో మార్క్స్ ఎంగెల్సులు చురుకైన పాత్ర వహించారు. లీగు సంఘాలచేత చర్చింపబడి, రెండవ మహాసభలో నిశితంగా పరిశీలింపబడిన తర్వాత, చివరకు 1847 డిసెంబరు 8న అది ఆమోదింపబడింది. – 132.

76 ఇక్కడ ప్రస్తావింపబడిన పుస్తకం "Die Geschichtsphilosophie Hegels und der Hegelianer bis auf Marx und Hartmann" ("మార్క్స్, హార్ట్‌మన్‌ల దాకా హెగెల్‌యొక్కా, హేగెలియన్లయొక్కా చరిత్ర తత్వశాస్త్రం"). అది లైప్జిగ్‌లో 1890లో ప్రచురింపబడింది. – 133.

77 "Deutsche Worte" ("జర్మన్ మాట") – ఆస్ట్రియన్ ఆర్థిక, సామాజిక రాజకీయ పత్రిక. ఇది 1881–1904 మధ్య వియెన్నాలో ప్రచురింపబడింది.

"హెగెల్‌పై దారుణమైన అభాండాలు, సమకాలీన జర్మనీలో ఆయన్ను పెట్టిన హింసలు" అన్న పేరున ఎమ్. వీర్త్ రాసిన వ్యాసం 1890లో యీ పత్రిక 5వ సంచికలో ప్రచురింపబడింది. – 133.

78 "Berliner Volkstribüne" ("బెర్లిన్ ప్రజా వేదిక") – సోషల్-డెమోక్రట్ల వారపత్రిక. "యువత"యొక్క అర్ధ అరాజకవాద గ్రూపు వంకకు మొగ్గిన యీ పత్రిక 1887–1892 మధ్య ప్రచురింపబడింది.

"ప్రతి ఒక్కనికీ వాడి శ్రమయొక్క పూర్తి ఉత్పాదితం" అన్న అంశంపై చర్చా వేదికలో వచ్చిన వ్యాసాలను యీ పత్రిక 1890 జూన్ 14 – జులై 12 మధ్య ప్రచురించింది. – 134.

79 51వ వివరణ చూడండి. – 135.

80 బ్యోనిగ్క 1890 ఆగస్టు 16న ఎంగెల్సుకి ఒక లేఖ రాశాడు. అందులో అతను సోషలిజం ప్రస్తావన తెచ్చి, సమాజంలోని వివిధ వర్గాల విద్యా, చైతన్య స్థాయిలో తేడాలు ఉన్న కారణంగా, సోషలిస్టు మార్పులు తేవడం సముచితమా, సాధ్యమా అని ఎంగెల్స్‌ని ప్రశ్నించాడు. – 136.

81 "Züricher Post" ("జూరిహ్ పోస్టు") – ప్రజాస్వామిక భావాలపట్ల మొగ్గుగల స్విస్ దినపత్రిక. ఇది 1879–1936 మధ్య వెలువడింది. – 141.

82 ఫ్రాంజ్ మేరింగ్ రాసిన "చారిత్రక భౌతికవాదాన్ని గూర్చి" అన్న వ్యాసం "లెస్సింగ్ గాథ" పేర ఆయన రాసిన పుస్తకానికి అనుబంధంగా 1893లో అచ్చయింది. – 149.

83 "సోషల్ కాంట్రాక్టు" అనే తన సుప్రసిద్ధ గ్రంథంలో రూసో వివరించిన సూత్రం ప్రకారం, ఆదిమ సమాజంలో మనుషులు సహజ పరిస్థితులలో నివసించేవారు. అప్పుడు వారందరూ సమానంగా ఉండేవారు. వ్యక్తిగత ఆస్తి ఏర్పడటం, భౌతిక అసమానతల పెరుగుదల ఫలితంగా, ప్రజలు, సహజ పరిస్థితులనుండి పౌరుల పరిస్థితులకు మారారు. సామాజిక ఒప్పందం ఆధారంగా రాజ్యం రూపొందింది. అయితే ఆ తర్వాత రాజకీయ అసమానతలు పెరిగి, సామాజిక ఒప్పందం భగ్నమైంది. ఎట్టి హక్కులూ లేని ఒక కొత్త పరిస్థితి తలఎత్తింది. నూతన సామాజిక ఒప్పందంపై ఆధారపడిన హేతుపూర్వక రాజ్యం ద్వారా ఈ పరిస్థితిని అంతం చేయవచ్చునని రూసో వాదించాడు. – 150.

84 వాణిజ్యవాద అనుచరులకు (mercantilists) – యిది ప్రస్తావన. ఇది ఆదిమ సంచయన శకంలో ప్రచలితంగావున్న ఆర్థిక ఆలోచనా ధోరణి. వాణిజ్య పెట్టుబడికి ప్రతినిధులైన వాణిజ్యవాద సిద్ధాంతవేత్తలు జాతీయ సంపదను పెట్టుబడి సంచయనంతో మమేకంచేసి, దానికి విదేశీ వాణిజ్యాన్నే ఏకైక మూలాధారంగా పరిగణించారు. 17వ, 18వ శతాబ్దాల్లో వాణిజ్యవాదం నిరంకుశ రాజ్యాల ఆర్థిక విధానాల పైన విశేషమైన ప్రభావాన్ని బరపింది.

ఫిజియోక్రాట్లు – 1850 దశకంలో ఫ్రాన్సులో తలెత్తిన, బూర్జువా సాంప్రదాయిక అర్థశాస్త్ర ధోరణుల్లో ఒకటి. ఫిజియోక్రాట్లు భారీ పెట్టుబడిదారీ వ్యవసాయం

కావాలనీ, ప్రత్యేక వర్గహక్కులు రద్దుకావాలనీ, దిగుమతులపై సుంకాలు విధింపబడాలనీ గట్టిగా వాదించారు. ఫ్యూడల్ వ్యవస్థను రద్దుచెయ్యాల్సిన ఆవశ్యకతనైతే వారు గుర్తించారు కాని, పాలక వర్గాలకూ, నిరంకుశ అధికారానికీ భంగకరంకాని శాంతియుత సంస్కరణవాద పద్ధతిలో ఆ మార్పును తేవాలని వారు కోరారు. ఫిజియోక్రాట్ల తాత్త్వికాభిప్రాయాలు 18వ శతాబ్దపు ఫ్రెంచి బూర్జువా వైతాళికుల తాత్త్వికాభిప్రాయాలకు సన్నిహితంగా వున్నాయి. ఫిజియోక్రాట్లచేత ప్రతిపాదింపబడిన పలు ఆర్థిక సంస్కరణలు ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో అమలుజరుపబడ్డాయి. – 150.

85 11–13 శతాబ్దాల మధ్య కాలంలో, పశ్చిమ యూరప్‌కి చెందిన బడా ఫ్యూడల్ ప్రభువులు, నైట్‌లు (వీర యోధులు), ఇటాలియన్ వర్తకులు జెరూసలెంలోని దేవాలయాలను, తదితర "పుణ్య క్షేత్రాలను" మహమ్మదీయులనుండి పునరాక్రమించుకొనేందుకు గాను జరపబడిన సైనిక వలసవాద దండయాత్రలకు యిది ప్రస్తావన. ఈ మత యుద్ధాలు ప్రపంచ పెత్తనాన్ని కోరుకున్న కేథలిక్ చర్చిచేతా, పోప్‌చేతా ప్రోత్సహింపబడ్డాయి, సముచితమైనవిగా సమర్థింపబడ్డాయి. ఫ్యూడల్ నిగళాలనుండి విమోచనాన్ని కోరుకున్న రైతులు కూడా యీ మతయుద్ధాల్లో పాల్గొన్నారు. మతవీర యోధులు తాము ఏయే దేశాలను గడిచి వెళ్లారో వాటిలోని మహమ్మదీయ జనాభానే కాకుండా క్రిస్టియన్ జనాభాను కూడా లూటీచేశారు, వారికి వ్యతిరేకంగా బలప్రయోగం జరిపారు. సిరియా, పాలస్తీనా, ఈజిప్టు, ట్యునీసియా దేశాలలోని మహమ్మదీయ రాజ్యాలే కాకుండా క్రిస్టియన్ మతాన్ని అనుసరించే బైజాంటైన్ సామ్రాజ్యం కూడా వారి లూటీకి గురైంది. కానైతే తూర్పు మెడిటరేనియన్ ప్రాంతంలో వారి విజయాలు ఎక్కువ కాలం నిలవలేదు, వారు ఆక్రమించుకొన్న భూభాగాలు మహమ్మదీయులచేత పునరాక్రమించుకోబడ్డాయి. – 151.

86 <u>ముప్ఫయ్యేళ్ల యుద్ధం</u> (1618–1648) – ఇది ప్రొటెస్టెంటులకూ కేథలిక్కులకూ మధ్య కలహకారణంగా సంభవించిన సార్వత్రిక యూరపియన్ యుద్ధం. పోరాటపు ప్రధాన రంగమైన జర్మనీ విస్తారమైన సైనికదోపిడికీ, విదేశరాజ్యాల దురాక్రమణపర ఆకాంక్షలకూ గురిచెయ్యబడింది. జర్మనీయొక్క రాజకీయ విచ్ఛిత్తిని ఖరారుచేసిన వెస్ట్ ఫాలియా శాంతి సంధిపై సంతకాలు జరిగాక, ఈ యుద్ధం ముగిసింది. – 153.

87 <u>జర్మన్ జాతియొక్క పవిత్ర రోమన్ సామ్రాజ్యానికి</u> యిది ప్రస్తావన. 962లో స్థాపింపబడిన యీ మధ్యయుగ సామ్రాజ్యం జర్మనీ భూభాగాన్నీ, ఇటలీలో కొంత భాగాన్ని కలిగివుంది. దరిమిలా ఆ సామ్రాజ్యం కొన్ని ఫ్రెంచి భూప్రాంతాలనూ, బొహీమియా,

ఆస్ట్రియా, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్‌లనూ, తదితర దేశాలనూ కూడా తనలో కలుపుకుంది. ఆ సామ్రాజ్యం కేంద్రీకృతమైన రాజ్యం కాదు. చక్రవర్తియొక్క అత్యున్నతాధికారాన్ని ఆమోదించిన ఫ్యూడల్ సామంత రాజ్యాలతోనూ, స్వతంత్ర నగరాలతోనూ కూడిన ఒదులొదులు యూనియన్. ఫ్రాన్సుకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో ఓటమి అనంతరం హాప్స్‌బుర్గ్‌లు పవిత్ర రోమన్ సామ్రాజ్యపు చక్రవర్తి హోదాను వదిలివేయవలసి వచ్చినప్పుడు 1806లో ఆ సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. – 153.

88 చిరునామాదారు ప్రసక్తిలేకుండా, "Der Sozialistische Akademiker" ("సోషలిస్టు శాస్త్రవేత్త") పత్రిక 20వ సంచికలో, 1895లో హెచ్. ష్టార్కెన్‌బుర్గ్‌చే ఈ లేఖ మొట్టమొదట ప్రచురింపబడింది. తత్పర్యవసానంగా, యింతకు ముందరి అన్ని కూర్పులలోనూ పొరపాటుగా ష్టార్కెన్‌బుర్గే చిరునామాదారుడుగా పేర్కొనబడ్డాడు. – 154.

89 వివరణ 5 చూడండి. – 155.

90 జి. గ్యూలిహ్ రచించిన యీ కింద పేర్కొనబడిన పలు సంపుటాల పుస్తకానికి ప్రస్తావన ఇది. "Geschichtliche Darstellung des Handels, der Gewerbe und des Ackerbaus der bedeutendsten handeltreibenden Staaten unserer Zeit" ("మన కాలపు అత్యంత ముఖ్యమైన వాణిజ్య దేశాల వర్తకం, పరిశ్రమ, వ్యవసాయాల చారిత్రక వర్ణన") ఈ పుస్తకం యేనాలో 1830–1845 మధ్య ప్రచురింపబడింది. – 157.

# పేర్లసూచి

అప్పియన్ (Appian) (1వ శతాబ్ది చివరి – 2వ శతాబ్ది డెబ్బదవ దశకం) – ప్రాచీన రోమన్ చరిత్రకారుడు. – 50.

ఆగస్టస్ (Augustus) (క్రీ. పూ. 13 – క్రీ. శ. 14) – రోమన్ చక్రవర్తి (క్రీ. పూ. 27 – క్రీ. శ. 14). – 156.

అనెంకొవ్, పి. వి. (Annenkov) (1812–1887) – రష్యన్ లిబరల్ భూస్వామి, రచయిత. – 107.

ఇమ్ థుర్న్ (Im Thurn), ఎవెరార్డ్ ఫెర్డినాండ్ (1852–1932) – ఇంగ్లీషు వలసవాద ఉద్యోగి, భూగోళశాస్త్రవేత్త, మానుషశాస్త్రవేత్త. – 19.

ఎంగెల్స్ (Engels), ఫ్రెడరిక్ (1820–1895). – 7, 8, 19, 39, 40, 57, 83, 85, 107, 120, 127, 130–133, 136, 138, 141, 148, 149, 154, 156.

కాంట్ (Kant), ఇమ్మానుయెల్ (1724–1804) – సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర సంస్థాపకుడు, భావవాది. – 11, 21, 22, 27, 146, 150.

కానిట్జ్ (Kanitz), హన్స్ విల్‌హెల్మ్ అలెక్సాండ్ర్, కౌంట్ (1841–1913) – జర్మన్ రాజనీతిజ్ఞుడు, కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు, ప్రష్యన్ లాండ్‌టాగ్, జర్మన్ రైహ్‌స్టాగ్ (పార్లమెంటు)ల సభ్యుడు. – 68.

కాల్విన్ (Calvin), జాన్ (1509–1564) – రిఫర్మేషన్ (మత సంస్కరణోద్యమ) నాయకుల్లో ఒకడు, ప్రొటెస్టెంటిజంయొక్క ఒక శాఖ – కాల్వినిజం – సంస్థాపకుడు.

పెట్టుబడియొక్క ఆదిమ సంచయన దశలో కాల్వినిజం బూర్జువావర్గ ప్రయోజనాలను వ్యక్తంచేసింది. – 53, 150.

కూగెల్‌మన్ (Kugelman), లుడ్విగ్ (1830–1902) – జర్మన్ వైద్యుడు, సోషల్-డెమొక్రట్, కార్ల్ మార్క్స్ మిత్రుడు, 1848–1849 నాటి జర్మన్ విప్లవంలో పాల్గొన్నాడు, మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు, దాని మహాసభల్లో కొన్నింటికి ప్రతినిధి. – 121, 123.

కొన్‌స్తంతీన్ (Constantine) (సుమారు 274–337) – రోమన్ చక్రవర్తి (306–337). – 106.

కొప్ (Kopp), హెర్మన్ ఫ్రాంట్స్ మోరిట్స్ (1817–1892) – జర్మన్ రసాయన శాస్త్రవేత్త. – 31.

కొపెర్నికస్ (Copernicus), నికొలస్ (1473–1543) – గొప్ప పోలిష్ ఖగోళ శాస్త్రవేత్త, సూర్య కేంద్ర విశ్వ వ్యవస్థా సిద్ధాంత సంస్థాపకుడు. – 21, 22.

కౌట్స్కీ (Kautsky), కార్ల్ (1854–1938) – జర్మన్ సోషల్-డెమొక్రట్, పత్రికా రచయిత, "Neue Zeit" అనే పత్రిక సంపాదకుడు (1883–1917); మొదట్లో మార్క్సిస్టు, తరువాత మార్క్సిజంను పరిత్యజించి, జర్మన్ సోషల్-డెమొక్రసీలోనూ, రెండవ ఇంటర్నేషనల్‌లోనూ సెంట్రిజం (కౌట్స్కీవాదం)కు సిద్ధాంతవేత్త అయ్యాడు. – 132.

క్యోలర్ (Köller), ఎర్న్‌స్ట్ మటీయన్ (1841–1928) – జర్మన్ అభివృద్ధి నిరోధక రాజనీతిజ్ఞుడు, రైహ్‌స్టాగ్ సభ్యుడు (1881–1888), 1894–1895లో ప్రష్యా ఆంతరంగిక వ్యవహారాల మంత్రి, సోషల్-డెమొక్రటిక్ పార్టీ సభ్యులను హింసల పాల్జేశాడు. – 105.

క్రామ్‌వెల్ (Cromwell), ఆలివర్ (1599–1658) – 17వ శతాబ్దపు ఆంగ్ల బూర్జువా విప్లవంలో బూర్జువావర్గ శ్రేణులతో కలిసిన బూర్జువా ప్రభువర్గాల నాయకుడు. 1653నుండి ఇంగ్లండు, స్కాట్లండు, ఐర్లండులతో కూడిన లార్డ్ ప్రొటెక్టరు. – 156.

క్రుప్ (Krupp), ఫ్రెడరిక్ అల్ఫ్రేడ్ (1854–1902) – జర్మన్ లోహ అయుధ పరిశ్రమలలో బడా పారిశ్రామికవేత్త. – 80.

గాలే (Galle), యోహన్ గోట్‌ఫ్రిడ్ (1812–1910) – జర్మన్ ఖగోళశాస్త్రవేత్త, లెవెర్యే లెక్కల ప్రాతిపదికపైన 1846లో నెప్ట్యూన్ (వరుణ) గ్రహాన్ని కనుగొన్నాడు. – 22.

గిజో (Guizot), ఫ్రాన్సువా ప్యేర్ గియోమ్ (1787–1874) – ఫ్రెంచి బూర్జువా చరిత్రకారుడు, రాజనీతిజ్ఞుడు, 1840–1848 దశలో ఫ్రెంచి దేశాంగ, విదేశాంగ విధానాన్ని నిర్దేశించినవాడు. – 46, 156.

గుల్డ్ (Gould), జే (1836–1892) – అమెరికన్ కోటీశ్వరుడు, రైల్వే వ్యాపారి, బ్యాంకరు. – 43.

గ్యూలిహ్ (Gülich), గుస్టావ్ (1791–1847) – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త, చరిత్రకారుడు; జాతీయ ఆర్థిక వ్యవస్థ చరిత్రపై పలు రచనలు చేశాడు. – 157.

గ్యోతే (Goethe), యోహన్ వోల్ఫ్‌గాంగ్ (1749–1832) – జర్మన్ మహా రచయిత, చింతనాపరుడు. – 11, 14, 25.

గ్రాఖ్‌లు (Gracchi) (సోదరులు), గాయుస్ సెంప్రోనియస్ (క్రీ. పూ. 153–121), టిబెరియుస్ సెంప్రోనియస్ (క్రీ. పూ. 163–133) – ప్రాచీన రోములో ప్రజా ట్రిబ్యూన్లు, రైతుల ప్రయోజనార్థం వ్యవసాయ సంస్కరణ చట్టాల అమలు కోసం పోరాడారు. – 104.

గ్ర్యూన్ (Grün), కార్ల్ (1817–1887) – జర్మన్ పెటీబూర్జువా పబ్లిసిస్టు, 1840 దశకం మధ్యసంవత్సరాల్లో "అసలైన సోషలిజం" ప్రధాన ప్రతినిధుల్లో ఒకడు. – 18.

గ్లాడ్‌స్టన్ (Gladstone), విలియం ఎవర్ట్ (1809–1898) – ఆంగ్ల రాజనీతిజ్ఞుడు, 19వ శతాబ్దపు రెండవ అర్ధభాగంలో లిబరల్ పార్టీ నాయకులలో ఒకడు, ఆర్థికశాఖా మంత్రి (1852–55, 1859–66), ప్రధానమంత్రి (1868–74, 1880–85, 1886, 1892–94). – 126.

జిఫెన్ (Giffen), రాబర్ట్ (1837–1910) – ఆంగ్ల బూర్జువా ఆర్థికశాస్త్రవేత్త, గణాంకశాస్త్రవేత్త, ద్రవ్య విషయాల్లో నిపుణుడు, వర్తక మంత్రిత్వశాఖలో గణాంక విభాగాధిపతి (1876–1897). – 70.

టోరిచెల్లి (Torricelli), ఇవంజెలీస్ట (1608–1647) – ప్రముఖ ఇటాలియన్ భౌతికశాస్త్రవేత్త, గణితశాస్త్రజ్ఞుడు. – 155.

డార్విన్ (Darwin), ఛార్లెస్ రాబర్ట్ (1809–1882) – గొప్ప ఆంగ్ల ప్రకృతి అధ్యయనవేత్త, శాస్త్రీయ పరిణామవాద జీవశాస్త్ర జనకుడు. – 26, 42.

డిడ్రో (Diderot), డెని (1713–1784) – గొప్ప ఫ్రెంచి నిరీశ్వరవాద తత్వవేత్త, యాంత్రిక భౌతికవాది, ఫ్రెంచి విప్లవ బూర్జువా సైద్ధాంతికుల్లో ఒకడు, విజ్ఞాన సర్వస్వవాదుల నాయకుడు. – 28.

డియోక్లెటియన్ (Diocletian) (సుమారు 245–303) – రోమన్ చక్రవర్తి (284–305). – 105.

డీట్సగెన్ (Dietzgen), యోసెఫ్ (1828–1888) – జర్మన్ చర్మకార్మికుడు, సోషల్-డెమోక్రట్, స్వయం కృషితో చదువుకున్న తత్వవేత్త, స్వతంత్రంగా గతితార్కిక భౌతికవాదాన్ని చేరుకున్నాడు. – 40.

డెకార్ట్ (Descartes), రెనే (1596–1650) – సుప్రసిద్ధ ఫ్రెంచి ద్వంద్వవాద తత్వవేత్త (dualist), గణితశాస్త్రవేత్త, ప్రకృతి అధ్యయనవేత్త. – 22, 24, 134.

త్యెరీ (Thierry), ఒగుస్టేన్ (1795–1856) – ఫ్రెంచి లిబరల్ బూర్జువా చరిత్రకారుడు. – 46, 156.

త్యేర్ (Thiers), అడోల్ఫ్ (1797–1877) – ఫ్రెంచి బూర్జువా చరిత్రకారుడు, రాజనీతిజ్ఞుడు, శాసననిర్ణయ సభా సభ్యుడు (1849–51), ఆర్లియనిస్టు, రిపబ్లిక్ అధ్యక్షుడు (1871–73), పారిస్ కమ్యూన్ ఘాతకుల్లో ఒకడు. – 46, 122.

నీకొలస్, రెండవ (రొమానొవ్) (రక్తపిపాసి) (Nicholas II – Romanov) (1868–1918) – రష్యా చివరి చక్రవర్తి (1894–1917). – 101.

నెపోలియన్, మూడవ (Napoleon III) (లూయీ నెపోలియన్ బోనపార్ట్) (1808–1873) – మొదటి నెపోలియన్ భ్రాతీయుడు, రెండవ రిపబ్లిక్ అధ్యక్షుడు (1848–51), ఫ్రెంచి చక్రవర్తి (1852–70). – 85, 92, 122, 140.

నెపోలియన్, మొదటి (Napoleon I), బోనపార్ట్ (1769–1821) – ఫ్రెంచి చక్రవర్తి (1804–1814, 1815). – 30, 58, 92, 154, 156.

ప్రూడన్ (Proudhon), ప్యేర్ జోసెఫ్ (1809–1865) – ఫ్రెంచి పబ్లిసిస్టు, అర్థశాస్త్రవేత్త, సామాజిక శాస్త్రవేత్త, పెటీబూర్జువావర్గ సిద్ధాంతకారుడు, అరాజకవాద సిద్ధాంత స్థాపకులలో ఒకడు. – 38, 107–120.

ఫిలిప్, రెండవ (Philip II), ఆగుస్ట్ (1165–1223) – ఫ్రెంచి రాజు (1180–1223). – 151.

ఫీహ్టె (Fichte), యోహన్ గోట్లిబ్ (1762–1814) – జర్మన్ సాంప్రదాయిక తత్వశాస్త్రానికి ప్రతినిధి, ఆత్మపర భావవాది. – 150.

ఫాయెర్‌బాఖ్ (Feuerbach), లుడ్విగ్ (1804–1872) – మార్క్సు పూర్వపు దశకు చెందిన గొప్ప జర్మన్ భౌతికవాద తత్వవేత్త. – 7–9, 18, 19, 21–23, 26, 27, 29, 30–38, 140, 147, 157.

ఫోగ్ట్ (Vogt), కార్ల్ (1817–1895) – జర్మన్ ప్రకృతి అధ్యయనవేత్త; అపభ్రంశ భౌతికవాది; పెటీబూర్జువా ప్రజాస్వామికవాది; 1848–49లో జర్మనీలో జరిగిన విప్లవంలో పాల్గొన్నాడు. 1849లో జర్మనీని విడిచిపెట్టాడు; 1850 దశకంలోను, 1860 దశకంలోను లూయీ బోనపార్ట్‌కి కిరాయి ఏజెంటుగా పనిచేశాడు. – 24, 122.

ఫోరియర్ (Fourier), చార్ల్స్ (1772–1837) – గొప్ప ఫ్రెంచి ఊహాజనిత సోషలిస్టు. – 107, 119.

ఫ్రెడెరిక్, రెండవ (Frederick II, మారుపేరు మహా ఫ్రెడెరిక్) (1712–1786) – ప్రష్యా రాజు (1740–86). – 81, 100.

ఫ్రెడెరిక్ విల్‌హెల్మ్ (Frederick Wilhelm) (1620–1688) – బ్రాండెన్‌బుర్గ్ యొక్క కుర్‌ఫుర్స్ట్ (1640–88). – 152.

ఫ్రెడెరిక్ విల్‌హెల్మ్, మూడవ (Frederick Wilhelm III) (1770–1840) – ప్రష్యా రాజు (1797–1840). – 10, 14, 92.

ఫ్రెడెరిక్ విల్‌హెల్మ్, నాల్గవ (Frederick Wilhelm IV) (1795–1861) – ప్రష్యా రాజు (1840–61). – 16.

బకూనిన్, ఎమ్. ఎ. (Bakunin) (1814–1876) – రష్యన్ ప్రజాస్వామ్యవాది, పబ్లిసిస్టు, అరాజకవాద సిద్ధాంతకర్తల్లో ఒకడు. జర్మనీలో 1848–49 నాటి విప్ల

వంలో పాల్గొన్నాడు. మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడైన యితగాడు మార్క్సిజానికి ఒక గర్వ శత్రువుగా రుజువుచేసుకున్నాడు. తన ముఠాదారీ కార్యకలాపాలకుగాను యితను హేగ్ మహాసభచేత మొదటి ఇంటర్నేషనల్‌నుండి తొలగింపబడ్డాడు. – 17, 38, 125.

బ్రో (Barrot), ఒడిలోన్ (1791–1873) – ఫ్రెంచి బూర్జువా రాజకీయవేత్త. 1848 ఫిబ్రవరివరకు లిబరల్ రాజవంశ ప్రతిపక్ష నాయకుడు. 1848 డిసెంబరు నుండి 1849 అక్టోబరుదాకా పార్టీ ఆఫ్ ఆర్డర్ తోడ్పాటు కలిగిన మంత్రివర్గానికి నాయకత్వం వహించాడు. – 11.

బార్త్ (Barth), పాల్ (1858–1922) – జర్మన్ బూర్జువా తత్వవేత్త, సామాజిక శాస్త్రవేత, లైప్జిగ్ విశ్వవిద్యాలయంలోని లెక్చరర్. – 133, 135, 147, 149.

బిస్మార్క్ (Bismark), ఒట్టో, ప్రిన్స్ (1815–1898) – ప్రష్యన్ రాజనీతిజ్ఞుడు, దౌత్యవ్యవహర్త, ప్రష్యన్ బడా భూస్వాముల ప్రయోజనాలను బలపరచాడు; ప్రష్యా మంత్రి-అధ్యక్షుడు (1862–71), జర్మన్ సామ్రాజ్యపు రైహ్-ఛాన్సలర్ (1871–90). – 88, 92, 94, 104, 152.

బూర్బన్లు (Bourbons) – ఫ్రెంచి రాజవంశం (1589–1792, 1814–1815, 1815–1830). – 46.

బెర్తలో (Berthelot), ప్యేర్ ఎజేన్ మర్సెలేన్ (1827–1907) – సుప్రసిద్ధ ఫ్రెంచి రసాయనశాస్త్రవేత్త, బూర్జువా రాజకీయవేత్త. – 31.

బెర్న్‌స్టైన్ (Bernstein), ఎడువార్డ్ (1850–1932) – జర్మన్ సోషల్-డెమొక్రట్, పబ్లిసిస్టు, "Sozialdemokrat" పత్రిక సంపాదకుడు (1881–1890); 1889, 1893 నాటి అంతర్జాతీయ సోషలిస్టు కాంగ్రెస్‌లకు ప్రతినిధి. ఎంగెల్స్ మరణానంతరం మార్క్సిజాన్ని సంస్కరించాలని బహిరంగంగా ముందుకు వచ్చాడు. – 148.

బేబెల్ (Bebel), ఔగుస్ట్ (1840–1913) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి; వృత్తిరీత్యా టర్నరు; 1867నుంచి జర్మన్ కార్మిక సంఘాల యూనియన్ నాయకుడు; మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; రైహ్‌స్టాగ్‌కి (1867నుండి) సభ్యుడు, జర్మన్ సోషల్-డెమొక్రసీ సంస్థాపకుల్లోను, నాయకుల్లోను

ఒకడు, మార్క్సు ఎంగెల్సుల మిత్రుడు, సహచరుడు; రెండవ ఇంటర్నేషనల్లో చురుకుగా పనిచేశాడు. – 94, 127.

బేయిల్ (Bayle), ప్యేర్ (1647–1706) ఫ్రెంచి సంశయాత్మక తత్వశాస్త్రవేత్త.– 54.

బొగుస్లావ్‌స్కి (Boguslawski), అల్‌బెర్ట్ (1834–1905) – జర్మన్ జనరల్; యుద్ధ విషయాలమీద రచనలు చేశాడు. – 104.

బోనపార్ట్ – చూ: నెపోలియన్, మూడవ.

బోర్గియుస్, డబ్లియు. (Borgius). – 154.

బోల్టె (Bolte), ఫ్రెడెరిక్ – అమెరికన్ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి; జర్మన్; మొదటి ఇంటర్నేషనల్ (1872)కి చెందిన ఉత్తర అమెరికన్ శాఖల ఫెడరల్ కౌన్సిలు కార్యదర్శి; జనరల్ కౌన్సిలు సభ్యుడు (1872–1874); 1874లో జనరల్ కౌన్సిల్‌నుండి బహిష్కరింపబడ్డాడు. – 124.

బౌవర్ (Bauer), బ్రూనో (1809–1882) – జర్మన్ భావవాద తత్వవేత్త, ప్రముఖ యువ హేగెలియన్, బూర్జువా రాడికల్; 1866 దరిమిలా జాతీయ ఉదారవాది. – 17, 18, 37, 38.

బ్యూఖ్నర్ (Büchner), లుడ్విగ్ (1824–1899) – జర్మన్ బూర్జువా శరీర శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త, అపభ్రంశ భౌతికవాద ప్రతినిధి. – 24.

బ్లాంక్ (Blanc), లూయీ (1811–1882) – ఫ్రెంచి పెటీబూర్జువా సోషలిస్టు, చరిత్రకారుడు; 1848లో తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు; లక్సెంబుర్గ్ కమిషన్ అధ్యక్షుడు; 1848 ఆగస్టునుండి లండన్‌లోని పెటీబూర్జువా ప్రవాసుల నాయకుల్లో ఒకడు. – 30.

బ్యోనిగ్క్ (Boenigk), ఒట్టో, బారన్ ఫన్ – జర్మన్ పౌర ప్రముఖుడు, బ్రెస్లౌ విశ్వవిద్యాలయంలో సోషలిజంపై లెక్చర్లు యిచ్చాడు. – 136.

బ్లోస్ (Blos), విల్‌హెల్మ్ (1849–1927) – జర్మన్ సోషల్-డెమొక్రట్; పత్రికా రచయితా, చరిత్రకారుడూ; 1872–74లలో "Volksstaat" పత్రిక సంపాదకుల్లో ఒకడు, రైహ్‌స్టాగ్ సభ్యుడు, మొదటి ప్రపంచ యుద్ధకాలంలో (1914–

18) యితను సోషల్ జాతీయ దురహంకార వైఖరిని చేపట్టాడు. – 131.

బ్లోహ్ (Bloch), యోసెఫ్ – "Sozialistische Monatshefte" పత్రిక సంపాదకుడు. – 138.

మాంటెస్క్యూ (Montesquieu), చార్లెస్ (1689–1755) – ప్రముఖ ఫ్రెంచి బూర్జువా సామాజిక శాస్త్రజ్ఞుడు, అర్థశాస్త్రజ్ఞుడు, రచయిత, 18వ శతాబ్ది బూర్జువా విజ్ఞాన ప్రబోధానికి ప్రతినిధి, రాజ్యాంగబద్ధ రాజరిక వ్యవస్థకు సిద్ధాంతకారుడు. –150.

మార్క్స్ (Marx), కార్ల్ (1818–1883) – 7, 8, 18, 37–39, 83–86, 89, 90, 93, 107, 120–124, 127, 130, 131, 133, 134, 136, 138, 140, 147, 149, 156, 157.

మిన్యే (Mignet), ఫ్రాంసువా ఒగూస్ట్ మరీ (1796–1884) – ఫ్రెంచి ఉదారవాద బూర్జువా చరిత్రకారుడు, బూర్జువా సమాజ చరిత్రలో వర్గపోరాట పాత్ర ప్రాముఖ్యాన్ని గ్రహించనారంభించాడు. – 46, 156.

మూల్‌బెర్గర్ (Mühlberger), ఆర్థర్ (1847–1907) – జర్మన్ పెటీ బూర్జువా పబ్లిసిస్టు, ప్రూడనిస్టు, వృత్తిరీత్యా వైద్యుడు. – 128.

మెక్ మహన్ (MacMahon), మెరీ ఎడ్మె పట్రీస్ మొరిస్ (1808–1893) – ఫ్రెంచి అభివృద్ధినిరోధక సైనిక వ్యక్తి, రాజకీయవేత్త, బోనపార్టిస్టు; పారిస్ కమ్యూన్ కసాయి హంతకుల్లో ఒకడు; మూడవ రిపబ్లిక్ అధ్యక్షుడు (1873–79). – 92.

మేరింగ్ (Mehring), ఫ్రాన్జ్ (1846–1919) – జర్మనీ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, చరిత్రకారుడు, పత్రికారచయిత; 1880లలో మార్క్సిస్టు అయ్యాడు; జర్మనీ, జర్మన్ సోషల్-డెమోక్రసీ చరిత్రపై పలు రచనలు చేశాడు, "Neue Zeit" పత్రిక సంపాదకుల్లో ఒకడు, జర్మన్ సోషల్-డెమోక్రటిక్ పార్టీ వామపక్షానికి ఒక అగ్ర నాయకుడు, సిద్ధాంతవేత్త; జర్మన్ కమ్యూనిస్టు పార్టీ స్థాపనలో ప్రముఖ పాత్ర వహించాడు. – 148.

మైస్నెర్ (Meissner), ఒట్టో కార్ల్ (1819–1902) – హాంబుర్గ్‌లోని గ్రంథ ప్రచురణకర్త. మార్క్స్ "పెట్టుబడి"ని మార్క్స్ ఎంగెల్స్‌ల తదితర రచనలనూ ప్రచురించాడు. – 148.

మోలెషాట్ (Moleschott), యాకొబ్ (1822–1893) – బూర్జువా శాస్త్రజ్ఞుడు,

తత్వవేత్త, అపభ్రంశ భౌతికవాదానికి ప్రముఖ ప్రతినిధుల్లో ఒకడు. జర్మనీ, స్విట్జర్లండ్, ఇటలీలలోని విద్యాలయాలలో బోధించాడు. – 24.

మోర్గన్ (Morgan), ల్యూయిస్ హెన్రీ (1818–1881) – ప్రసిద్ధ అమెరికన్ విజ్ఞానశాస్త్రవేత్త, ఆదిమ సమాజ చరిత్రకారుడు, సద్యోజనిత భౌతికవాది. – 156.

మౌరెర్ (Maurer), గెయోర్గ్ లుడ్విగ్ (1790–1872) – ప్రముఖ జర్మన్ బూర్జువా చరిత్రకారుడు, ప్రాచీన, మధ్య యుగాలనాటి జర్మనీ సామాజిక వ్యవస్థపై పరిశోధన చేశాడు. – 135.

యార్క్ (York), థెయొడోర్ (మరణం 1875) – జర్మన్ కార్మికోద్యమ కార్యకర్త, లాసాల్ అనుచరుడు; 1871–74లలో జర్మనీ సోషల్-డెమొక్రటిక్ కార్మిక పార్టీ కార్యదర్శి. – 127.

యువెనాల్ (డెసిమస్ యునియస్ యువెనాలిస్) (Juvenal) (జననం సుమారు క్రీ. శ. 60 – మరణం క్రీ. శ. 127 తరువాత) – సుప్రసిద్ధ రోమన్ వ్యంగ్య కవి. – 104.

రిచర్డ్, మొదటి (సింహ సదృశుడు రిచర్డ్) (Richard I–Lion's Heart) (1157–1199) – ఇంగ్లీషు రాజు (1189–1199). – 151.

రూసో (Rousseau), జాన్ జాక్ (1712–1778) – ప్రముఖ ఫ్రెంచి వైతాళికుడు, ప్రజాస్వామ్యవాది, పెటీబూర్జువావర్గ సైద్ధాంతికుడు, ద్వైత తత్వవేత్త (deist). – 28.

రెనాన్ (Renan), ఎర్నెస్ట్ (1823–1892) – ఫ్రెంచి భాషాశాస్త్రవేత్త, క్రిస్టియన్ మత చరిత్రకారుడు, భావవాద తత్వవేత్త. – 38.

రోబెస్పేర్ (Robespierre), మాక్సిమిలియన్ (1758–1794) – 18వ శతాబ్ది చివర జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవ ప్రముఖ నాయకుడు, జాకొబిన్ నాయకుడు, విప్లవ ప్రభుత్వాధిపతి (1793–94). – 32.

ర్యోస్లర్ (Rössler), కొంస్తంతీన్ (1820–1896) – జర్మన్ పత్రికా రచయిత, బెర్లిన్‌లోని అధికారిక సాహిత్య కార్యాలయం నాయకుడుగా వున్నప్పుడు (1877–1892) బిస్మార్క్ విధానాన్ని బలపరచాడు. – 104.

లాఫార్గ్ (Lafargue), పాల్ (1842–1911) – అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ నాయకుడు, మార్క్సిజం ప్రచారకుడు. ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్

సభ్యుడు, స్పెయిన్‌కి ఉత్తరప్రత్యుత్తరాలు జరిపే కార్యదర్శి (1866–69). ఇంటర్నేషనల్ శాఖల ఏర్పాటులో ఫ్రాన్సులో (1869–70లోనూ), స్పెయిన్, పోర్చుగల్‌లలో (1871–72లోనూ) పాల్గొన్నాడు, హేగ్ మహాసభకు ప్రతినిధి (1872). ఫ్రాన్సులో కార్మిక పార్టీ స్థాపకుల్లో ఒకడు. మార్క్స్ ఎంగెల్సుల సహచరుడు. – 77, 121.

లాఫార్గ్ (Lafargue), లౌరా (1845–1911) – ఫ్రెంచి కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, పాల్ లాఫార్గ్ భార్య, మార్క్స్ కూతురు. – 121.

లామార్క్ (Lamarck), జాన్ బాప్టిస్ట్ ప్యేర్ అంటువాన్ (1744–1829) – గొప్ప ఫ్రెంచి ప్రకృతి అధ్యయనవేత్త, జీవశాస్త్రంలో పరిణామవాద ప్రథమ సిద్ధాంత సంస్థాపకుడు, ఈ సిద్ధాంత కర్తృత్వంలో డార్విన్ కంటే ముందరివాడు. – 25.

లాసాల్ (Lassalle), ఫెర్డినాండ్ (1825–1864) – జర్మన్ పెటీబూర్జువా పబ్లిసిస్టు, న్యాయవాది. 1848–1849లో రేనిష్ రాష్ట్రంలో ప్రజాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నాడు. 1860 దశకం మొదట్లో జర్మన్ కార్మికోద్యమంలో చేరాడు. జర్మన్ కార్మిక యూనియన్ (1863) సంస్థాపకుల్లో ఒకడు. ప్రష్యా అధినాయకత్వంలో "పైనుండి" జర్మనీ ఏకీకరణను బలపరచాడు. జర్మన్ కార్మికోద్యమంలో అవకాశవాద ధోరణికి పునాది వేశాడు. – 94, 125, 127, 132.

లీబ్‌క్నెఖ్ట్ (Liebknecht), విల్‌హెల్మ్ (1826–1900) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, 1848–49 విప్లవంలో పాల్గొన్నాడు; కమ్యూనిస్టు లీగ్ సభ్యుడు, మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; జర్మన్ సోషల్-డెమోక్రసీ స్థాపకుల్లోనూ, నాయకుల్లోనూ ఒకడు; మార్క్స్ ఎంగెల్సుల మిత్రుడు, సహచరుడు. – 122, 127.

లూతర్ (Luther), మార్టిన్ (1483–1546) – రిఫర్మేషన్ (మతసంస్కరణ) దశకు చెందిన ప్రముఖ వ్యక్తి. జర్మనీలో ప్రొటెస్టెంటిజం (లూతరానిజం) స్థాపకుడు. జర్మన్ బర్గర్ల (పట్టణవాసుల) సిద్ధాంతకారుడు. – 53, 150.

లూయీ నెపోలియన్ (Louis Napoleon) – చూ. నెపోలియన్, మూడవ.

లూయీ, పధ్నాల్గవ (Louis XIV) (1638–1715) – ఫ్రాన్సు రాజు (1643–1715). – 54.

లూయీ బోనపార్ట్ (Louis Bonaparte) – చూ. నెపోలియన్, మూడవ.

లెవెర్యే (Leverrier), ఉర్బేన్ జాన్ జోసెఫ్ (1811–1877) – ప్రఖ్యాత ఫ్రెంచి ఖగోళశాస్త్రవేత్త, గణితశాస్త్రజ్ఞుడు. – 22.

లోక్ (Locke), జాన్ (1632–1704) – గొప్ప ఆంగ్ల ద్వైత తత్వవేత్త, ఇంద్రియానుభూతి ప్రాధాన్యవాది. – 146.

వాండెర్‌బిల్ట్‌లు (Vanderbilts) – అమెరికన్ బడా బ్యాంకర్ల, పారిశ్రామికవేత్తల వంశ పరంపర. – 143.

వాక్స్మత్ (Wachsmuth), విల్‌హెల్మ్ (1784–1866) – జర్మన్ బూర్జువా చరిత్రకారుడు, ప్రాచీనాచార సంప్రదాయాలపైనా, యూరపియన్ చరిత్రపైనా పలు రచనలు చేశాడు. – 151.

వినువా (Vinoy), జోసెఫ్ (1800–1880) – ఫ్రెంచి జనరల్, బోనపార్టిస్టు, 1851 డిసెంబరు నాటి రాజకీయ కుట్రలో పాల్గొన్నాడు; పారిస్ కమ్యూన్ హంతకుల్లో ఒకడు; వెర్సేల్స్ రిజర్వు సైన్యం కమాండరు. – 122.

విల్‌హెల్మ్, మొదటి (Wilhelm I) (1797–1888) – ప్రష్యా రాజు (1861–88), జర్మన్ చక్రవర్తి (1871–88). – 152.

వీర్త్ (Wirth), మోరిత్స్ (1849–1916 తర్వాత మరణం ) – జర్మన్ పాత్రికేయుడు, అర్థశాస్త్రవేత్త. – 133.

వేడిమేయర్ (Weydemeyer), యోసెఫ్ (1818–1866) – జర్మన్, అమెరికన్ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, కమ్యూనిస్టు లీగ్ సభ్యుడు, జర్మనీలో 1848–1849 నాటి విప్లవంలోనూ, అమెరికాలో అంతర్యుద్ధంలోనూ పాల్గొన్నాడు, అమెరికాలో మార్క్సిస్టు ప్రచారాన్ని ప్రారంభించాడు; మార్క్స్ ఎంగెల్స్‌ల మిత్రుడు, సహచరుడు. – 120.

వోల్టేర్ (Voltaire), ఫ్రాంసువా మరీ (అసలు పేరు అరుయే) (1694–1778) – గొప్ప ఫ్రెంచి వైతాళికుడు, ద్వైత తత్వవేత్త (deist), వ్యంగ్య రచయిత, చరిత్రకారుడు. – 28, 54.

షిల్లర్ (Schiller), ఫ్రీడిఖ్ (1759–1805) – గొప్ప జర్మన్ రచయిత. – 27.

స్టార్కె (Starke), కార్ల్ – డచ్చి బూర్జువా తత్వశాస్త్రవేత్త, సాంఘిక శాస్త్రవేత్త. – 9, 22, 27, 29, 33, 34, 37.

స్టిర్నెర్ (Stirner), మాక్స్ (కస్పార్ ష్మిడ్ట్ సాహిత్య మారుపేరు) (1806–1856) – జర్మన్ తత్వశాస్త్రవేత్త, యువ హెగెలియన్‌వాది, బూర్జువా వ్యక్తిప్రాధాన్యతావాద, అరాజకవాదాల సైద్ధాంతిక నాయకుడు. – 17, 37, 38.

ష్టుమ్ (Stumm), కార్ల్ (1836–1901) – జర్మన్ బడా పారిశ్రామికవేత్త, కన్సర్వేటివ్, కార్మికోద్యమ బద్ధశత్రువు. – 80.

స్ట్రౌస్ (Strauss), డేవిడ్ ఫ్రీడ్రిఖ్ (1808–1874) – జర్మన్ తత్వశాస్త్రవేత్త, పబ్లిసిస్టు, సుప్రసిద్ధ యువ హెగెలియన్‌వాది; 1866 తరువాత జాతీయ లిబరల్. – 16, 18, 38.

ష్మిడ్ట్ (Schmidt), కోన్రాడ్ (1863–1932) – జర్మన్ ఆర్థికవేత్తా, తత్వ శాస్త్రవేత్తా, రివిజనిజానికి మూలం అయిన పుస్తకాలు రచించాడు. – 133, 141.

ష్వెయిత్సెర్ (Schweitzer), యోహన్ బప్టీస్ట్ (1833–1875) – జర్మనీలో లాసాల్‌వాద ప్రముఖ ప్రతినిధులలో ఒకడు. అఖిల జర్మన్ కార్మిక సంఘం (1867–1871) అధ్యక్షుడు: జర్మన్ కార్మిక పార్టీ మొదటి ఇంటర్నేషనల్‌కు అనుబంధింప బడటాన్ని వ్యతిరేకించాడు. సోషల్-డెమోక్రటిక్ కార్మిక పార్టీకి వ్యతిరేకంగా పోరాటం సాగించాడు; ప్రష్యన్ అధికారులతో అతనికి సంబంధాలున్నట్లు బయటపడటంతో 1872లో సంఘంనుంచి వెళ్లగొట్టబడ్డాడు. – 125.

సీజర్ (Ceasar), గాయున్ యూలియస్ (సుమారు క్రీ. పూ. 100–44) – సుప్రసిద్ధ రోమన్ సేనాధిపతి, రాజనీతిజ్ఞుడు. – 105, 156.

సెంట్ సైమన్ (Saint-Simon), ఆన్రీ (1760–1825) – గొప్ప ఫ్రెంచి ఊహాజనిత సోషలిస్టు. – 125.

సోట్‌బెర్ (Soetbeer), గెయోర్గ్ అడోల్ఫ్ (1814–1892) – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త, గణాంకశాస్త్రవేత్త. – 142.

స్మిత్ (Smith), ఆడమ్ (1723–1790) – ఆంగ్ల అర్థశాస్త్రవేత్త, సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రపు గొప్ప ప్రతినిధుల్లో ఒకడు. – 111, 150.

హక్స్‌హౌసెన్ (Haxthausen), ఒగూస్ట్ (1792–1866) – ప్రష్యన్ అధికారి, రచయిత, రష్యన్ భూ సంబంధాలలో ఆదిమ సమష్టి వ్యవస్థ అవశేషాలను గురించి ఒక గ్రంథం రచించాడు. – 122.

హాబ్స్ (Hobbes), థామస్ (1588–1679) – ప్రముఖ ఆంగ్ల తత్వవేత్త, యాంత్రిక భౌతికవాద ప్రతినిధి. – 22, 146.

హెప్నెర్ (Hepner), అడోల్ఫ్ (1846–1923) – జర్మన్ సోషల్-డెమోక్రట్, "Volksstaat" పత్రిక సంపాదకుల్లో ఒకడు, ఇంటర్నేషనల్ హేగ్ మహాసభకు (1872) ప్రతినిధి, తదనంతరం సోషల్ జాతీయ దురహంకార వైఖరిని చేపట్టాడు. – 127.

హేగెల్ (Hegel), గియోర్గ్ విల్‌హెల్మ్ ఫ్రీడ్రిఖ్ (1770–1831) – గొప్ప జర్మన్ సాంప్రదాయిక తత్వవేత్త, వస్తుపర భావవాది. – 7–8, 10–16, 19–23, 25, 27, 32–34, 38–41, 43, 45, 48, 108, 130, 146, 150.

హైనె (Heine), హైన్‌రిఖ్ (1797–1856) – ప్రఖ్యాత జర్మన్ విప్లవ కవి. – 10.

హ్యూమ్ (Hume), డేవిడ్ (1711–1776) – ఇంగ్లీషు తత్వవేత్త, ఆత్మపరమైన భావవాది, అజ్ఞేయతావాది; బూర్జువా చరిత్రకారుడు, అర్థశాస్త్రవేత్త. – 21, 22.

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ – 520004

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1–37 గాంధీ రోడ్డు
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం – 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజారు
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
హనుమకొండ
వరంగల్ – 506011

విశాలాంధ్ర బుక్ హౌస్
కాలేజి రోడ్డు
అనంతపురం – 515004



విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు – 522002

## పాఠకులకు మనవి

ఈ పుస్తకం అనువాదాన్ని గురించీ, కూర్పును గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:


Progress Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR

# మార్క్స ఎంగెల్స్

## సంకలిత రచనలు